24-03Pg1exHMNWJQEV.qxd:24-03Pg1exHMNWJQEV.qxd 01/01/01 10:02 AM Page 1

సమీక్ష
గత వారం రోజుల్లో ఓ విజ్ఞాన్
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
విజయవాడ
: fb.com/vaartha Digital
Published from Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
24-3-2025 సోమవారం సంపుటి: 31 సంచిక: 51 పేజీలు: 12 వెల: 6.50

మతి స్థితమితం లేని బీహార్ సిఎం: ప్రశాంత్ కిశోర్
సరిహద్దుల్లో భద్రతకు రోబో డ్రోన్లు
9లో

## ప్లానింగ్ నిబంధనలు సరళతరం



### రాష్ట్రంలో టౌన్ ప్లానింగ్ సంస్కరణలు అమలు చేస్తున్నాం

### నాలుగు నెలల్లో విశాఖ మాస్టర్ ప్లాన్ సిద్ధం: మంత్రి నారాయణ

**విజయవాడ,మార్చి23,ప్రభాతవార్తప్రతినిధి:** దేశ వ్యాప్తంగా ఇతర రాష్ట్రాలతో పోలిస్తే రాష్ట్రంలో ప్లానింగ్ నిబంధనలు సరళతరంగా ఉన్నాయని పట్టణాభివృద్ధిశాఖ మంత్రి నారాయణ తెలిపారు. ప్లానింగ్ తదితర అంశాలపై మంత్రి నారాయణ కార్యాలయం నుంచి ఒక ప్రకటన వెలువడింది.. రాష్ట్రంలో టౌన్‌ప్లానింగ్ సంస్కరణలు అమలు చేస్తున్నామని వివరించారు. నాన్ హైరైజ్ భవనాల సెట్‌బ్యాక్స్ గురించి వివిధ నిర్మాణ అసోసియేషన్లు కొన్ని మినహాయింపులు కావాలని కోరారని, వాటిని సాధ్యం కాదని తేల్చి చెప్పినట్లు మంత్రి పేర్కొన్నారు. ఎక్కడ నిర్మాణం చేసినా ఆహ్లాదంగా ఉండాలని, పాత నగరాల్లో సర్క్యులర్ పాట్రన్ కొనసాగుతుందని వివరించారు. లైసెన్సు సర్వేయర్ల ఫీజు ఒక రూపాయి మాత్రమే పెట్టామని, దీనివల్ల యువతకు ఉపాధి సులువుగా దొరుకుతుందని వివరించారు.

**4 నెలల్లో విశాఖ మాస్టర్‌ప్లాను సిద్ధం**

విశాఖ అభివృద్ధికి సంబంధించి నాలుగు నెలల్లో మాస్టర్‌ప్లాను సిద్ధం చేస్తామని పట్టణాభివృద్ధిశాఖ మంత్రి నారాయణ తెలిపారు. వైజాగ్‌లో రోడ్ల విస్తరణ, ట్రాఫిక్ సమస్యలు, మెట్రోరైల్ ప్రాజెక్టు, భూముల ఆక్రమణ, తాగునీటి సమస్య, టిడిఆర్ బాండ్లు, అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ వంటి అంశాలను సమావేశంలో ఎమ్మెల్యేలు ప్రస్తావించారు. దీనిపై నారాయణ మాట్లాడుతూ.. గతంలో స్వార్థం కోసం విశాఖ మాస్టర్‌ప్లాను రూపొందించారని, దీన్ని మార్పులు చేసి ఆన్‌లైన్లో ఉంచుతామని తెలిపారు. ప్రజల నుండి అభిప్రాయాలు తీసుకుని నాలుగు నెలల్లో ఫైనల్ చేస్తామని చెప్పారు. కొన్నిచోట్ల రోడ్లు వెడల్పు చేయాల్సి ఉందని, మెట్రోరైల్ కూడా మాస్టర్‌ప్లానులో భాగమేనని అన్నారు. టిడిఆర్ >>2

# ఉగాది నుంచి పి-4 అమలు

### • పేదరిక నిర్మూలనే పథకం లక్ష్యం • 10 శాతం మంది సంపన్నులు 20 శాతం మంది పేదలను దత్తత తీసుకోవాలి
### • రాష్ట్రవ్యాప్తంగా 40 లక్షల కుటుంబాలు అర్హులు: సిఎం చంద్రబాబు



**విజయవాడ,మార్చి23,ప్రభాతవార్తప్రతినిధి:** అట్టడుగున ఉన్న పేదల సాధికారతకు ఉద్దేశించిన పి4 కార్యక్రమాన్ని ప్రభుత్వం ఉగాదినుంచి అమలు చేయనుందని సిఎం చంద్రబాబునాయుడు వెల్లడించారు.'ఎక్స్' వేదికగా ఆయన మొదట ఎంపిక చేసిన 4 గ్రామాల్లో పైలట్ ప్రాజెక్టుగా అమలు చేయనున్నట్లు చంద్రబాబు వివరిచారు. ఇందులో 5 వేల 869 కుటుంబాలు ఉంటాయన్న సిఎం చెప్పారు. అట్టడుగున ఉన్న పేదలను ఆదుకోవడమే పథకం తమ ఆశయమన్నారు స్పష్టం చేశారు.

పబ్లిక్ ప్రైవేట్ పీపుల్ పార్టనర్‌షిప్ (పి4), ఫ్యామిలీ ఎంపవర్‌మెంట్ బెనిఫిట్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ గుకించి సిఎం చంద్రబాబు వివరించారు. సమాజంలో ఉన్నత స్థితిలో ఉన్న 10 శాతం మంది, అట్టడుగున ఉన్న 20 శాతం మంది పేదలను దత్తత తీసుకోవడం సహా సాయం చేయడం ద్వారా పేదరిక నిర్మూలనే ఈ పథకం లక్ష్యామని ఆయన స్పష్టం చేశారు. ఈ సందర్భంగా పి4 అమలు తీరును అధికారులు సిఎంకు వివరించారు. పి4 విధానం ద్వారా లబ్ధి పొందేందుకు అర్హత ఉన్న కుటుంబాలను గ్రామ, వార్డు సచివాలయాల వద్ద ఉన్న సమాచారం, హౌస్‌హోల్డ్ సర్వే, గ్రామసభల ధ్రువీకరణ ద్వారా గుర్తిస్తున్నట్లు తెలిపారు.

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించనున్న పి4 కార్యక్రమానికి రాజధాని అమరావతి వేదిక కానుంది. తెలుగు నూతన సంవత్సరాది ఉగాది రోజు సాయంత్రం ఈ విధానాన్ని ప్రారంభించేందుకు భారీ ఎత్తున సర్కార్ కసరత్తు చేస్తోంది. ప్రభుత్వం, ప్రైవేట్, ప్రజల భాగస్వామ్యంతో (పిపిపి) పేదరికాన్ని నిర్మూలించడమే దీని లక్ష్యమని ముఖ్యమంత్రి చంద్రబాబు ఇప్పటికే ప్రకటించారు. ఈ విధానం ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని అమరావతిలోని సచివాలయం ఒకటో బ్లాక్ వెనుక ఎన్9 రహదారికి పశ్చిమాన వేదికను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గం నుంచి 50 మంది పేదల చొప్పున దాదాపు 10,000ల మంది ఈ కార్యక్రమానికి హాజరుకానున్నారు. అందుకు తగ్గట్లు 50 ఎకరాల విస్తీర్ణంలో యుద్ధ ప్రాతిపదికన ఏర్పాట్లు చేస్తున్నారు. అక్కడ కంప తొలగింపు పనులను శనివారం సాయంత్రం ప్రారంభించారు. గుంటూరు జిల్లా యంత్రాంగం, సిఆర్‌డిఎ అధికారులు పర్యవేక్షిస్తున్నారు. అట్టడుగున ఉన్న పేదల సాధికారతకు ప్రభుత్వం పి4 కార్యక్రమాన్ని రూపొందించింది. సమాజంలో ఉన్నత స్థితిలో ఉన్న 10 శాతం మంది, అట్టడుగున ఉన్న 20 శాతం మంది పేదలను దత్తత తీసుకోవడం సహా సాయం చేయడం ద్వారా పేదరిక నిర్మూలనే ఈ పథకం ఉద్దేశం. మొదట ఎంపికచేసిన 4 గ్రామాల్లో పైలట్ ప్రాజెక్టుగా దీనిని అమలు చేయనుంది. ఇందులో 5869 కుటుంబాలు ఉండనున్నాయి.

రాష్ట్రవ్యాప్తంగా 40 లక్షల కుటుంబాలు ఇందు కోసం అర్హులని అధికారులు ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. అదేవిధంగా పి4 పాలసీపై ప్రజల నుంచి ప్రభుత్వం సలహాలుసేకరిస్తోంది.

స్వర్ణాంధ్ర 2047 సాకారంలో భాగంగా సంబంధిత వెబ్ సైట్‌తో పాటు ఓ క్యూఆర్ కోడ్‌ను సైతం సర్కార్ అందుబాటులోకి తెచ్చింది. >>2

## ఉల్లి ఎగుమతులపై 20% సుంకం రద్దు

**న్యూఢిల్లీ, మార్చి 23:** కేంద్ర ప్రభుత్వం ఉల్లి ఎగుమతులపై ఉన్న 20శాతం ఎగుమతి సుంకాన్ని రద్దుచేస్తున్నట్లు ప్రకటించింది. వచ్చేఏప్రిల్ ఒకటవ తేదీనుంచి ఈనిర్ణయం అమలులోకి వస్తుందని రైతుల ప్రయోజనాలను పరిగణనలోనికి తీసుకుని సుంకాలు రద్దుచేస్తున్నట్లు తెలిపింది. ఆర్థికశాఖలోని రెవెన్యూ విభాగానికి కేంద్ర వినియోగదారుల వ్యవహారాల శాఖ చేసినసిఫారసులమేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు కేంద్రం వెల్లడించింది. రైతులు తాము పండించిన పంటలకు గిట్టుబాటుధరలు అందించాలన్న లక్ష్యంతో >>2

# అమరావతిలో భూ కేటాయింపులు



### బిట్స్‌కు 70 ఎకరాలు, ఐటి టవర్స్‌కు 10 ఎకరాలు
### ఎంప్లాయిస్ స్టేట్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్‌కు 25 ఎకరాలు
### గత ప్రభుత్వం చేసిన కొన్ని కేటాయింపుల రద్దు

**విజయవాడ,మార్చి23,ప్రభాతవార్తప్రతినిధి:** ఎపి రాజధాని అమరావతిలో బిర్లా ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్‌కు 70 ఎకరాలు కేటాయించింది. ఐటీ టవర్ నిర్మాణానికి ఎల్ అండ్ టీ సంస్థకు 10 ఎకరాలు కేటాయిస్తూ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు సిఆర్‌డిఎ కమిషనర్ కూనపరెడ్డి కన్నబాబు సమాచారం వెల్లడించారు. నగరంలో ఆస్పత్రి, మెడికల్ కాలేజీ నిర్మాణం కోసం ఎంప్లాయిస్ స్టేట్ ఇన్సూరెన్సు కార్పొరేషన్ కోసం 25 ఎకరాల భూమి కేటాయించింది. హడ్కో హ్యాబిటాట్ సెంటర్ ఏర్పాటు కోసం 8 ఎకరాల భూమి కేటాయిస్తూ నిర్ణయం తీసుకుంది. గతంలో భూముల కోసం దరఖాస్తు చేసిన 13 సంస్థలకు ప్రభుత్వం కేటాయింపులు రద్దుచేసింది. అమరావతిలో భవనాల నిర్మాణం కోసం భూములు అడిగిన 16 సంస్థలకు చోటు మార్పు చేస్తూ భూమి కేటాయింపులు జరిపింది. మైస్ హబ్ కోసం ఇచ్చిన 42 ఎకరాలను రద్దు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. ఉపసంఘం నిర్ణయాలకు సంబంధించి పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ జీవో జారీ చేసింది. అమరావతిలో ప్రభుత్వ రంగసంస్థ ఐఆర్‌సిటిసి బడ్జెట్ హోటల్ ఏర్పాటు ప్రతిపాదనను పరిశీలించిన మంత్రివర్గ ఉపసంఘం, తదుపరి చర్యల కోసం ప్రభుత్వానికి సిపారసు చేసింది. భూములు కేటాయించిన సంస్థలకు ప్రభుత్వం నిర్దేశిత గడువు విధించింది.

భవన అనుమతులు, డిపిఆర్‌లు సమర్పించాలని ప్రభుత్వంసూచించింది. రాజధానిలో స్థలాలు పొందిన సంస్థలు నిర్దేశించిన గడువులోగా నిర్మాణాలు పూర్తి చేయకపోతే కఠినంగా వ్యవహరించాలని, జరిమానాలు విధించాలని జీఓఎం సిఫారసు చేసింది. ఈ మేరకు పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేశారు. రాజధాని అమరావతిలో సిఆర్‌డిఎ పిలిచిన 22,607 కోట్ల విలువైన 22 పనులు చేపట్టేందుకు కాంట్రాక్టు ఏజెన్సీలకు అనుమతినిస్తూ నిర్ణయం తీసుకుంది. వారికి లెటర్ ఆఫ్ అగ్రిమెంట్లు జారీ చేసేలా సిఆర్‌డిఎ ఆథరైజ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఎన్సీసీ, బీఎస్ఆర్ ఇన్ఫ్రా టెక్ ఇండియా లిమిటెడ్, కేఎంవీ ప్రాజెక్ట్స్, మేఘా ఇంజనీరింగ్, ఆర్వీఆర్ ప్రాజెక్ట్స్, ఎల్ అండ్ టీ సంస్థలకు సీఆర్డీఏ లెటర్ ఆఫ్ అగ్రిమెంట్లను జారీ చేయనుంది. ప్రపంచ బ్యాంకు, ఏడీబీ సహా, హడ్కో, కెఎఫ్ డబ్ల్యూ సంస్థలు ఇచ్చిన రుణాలతో ఎడిసి, సిఆర్‌డిఎలు ఈ ప్రాజెక్టులను చేపట్టనున్నాయి. సీడ్ యాక్సెస్ రహదారిని మంగళగిరికి సమీపంలో జాతీయ రహదారికి అనుసంధానించేలా ఇ13, 15 రహదారిని నిర్మించేలా మరో రెండు టెండర్లకూ అనుమతినిచ్చింది. ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ నివాసాలు, ఎన్జీఓ అవాసాలు, జడ్జిలు, మంత్రుల బంగ్లాలు, వరద నీటి డ్రెయిన్లు, హ్యాపీనెస్ట్ సహా వివిధ ప్రాజెక్టులను కాంట్రాక్టు ఏజెన్సీలు చేపట్టనున్నాయి. రాజధాని పరిధిలో అమరావతి డెవలప్మెంట్ కార్పొరేషన్ ఎడిసి పిలిచిన 15095 కోట్ల విలువైన 37 ప్యాకేజీ పనులకుకూడా ప్రభుత్వ అనుమతినిచ్చింది. రాజధాని పరిధిలో ప్రధానమైన ట్రంక్ రోడ్లు, ఎల్పీఎస్ లేఆవుట్ రహదారులు, పాలవాగు, కొండవీటి వాగు, గ్రావిటేషనల్ కెనాల్ నిర్మాణం సహా వివిధ ప్రాజెక్టులు చేపట్టేందుకు కాంట్రాక్టు ఏజెన్సీలకు ఎడిసి పనులు అప్పగించనుంది. అమరావతి నిర్మాణం కోసం భూములిచ్చిన రైతులకు ఇవాళ్టి నుంచి రిటర్నబుల్ ప్లాట్లను కేటాయించనున్నారు. భూసమీకరణ పథకంలో భూములను అప్పగించిన మెట్ట భూమి రైతులకు ఈ ఉదయం 10 గంటల నుంచి రిటర్నబుల్ ప్లాట్లు కేటాయిస్తామని సిఆర్‌డిఎ కమిషనర్ కూనపరెడ్డికన్నబాబు వెల్లడించారు. విజయవాడ లెనిన్ సెంటరులోని సిఆర్‌డిఎ ప్రధాన కార్యాలయం ఆవరణలో ఈలాటరీ ప్రక్రియ నిర్వహించనున్నారు. అర్హులైన 529 మంది రైతులకు 13 వందల 93 రిటర్నబుల్ ప్లాట్లను కేటాయించనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ లాటరీకి హాజరయ్యే రైతులు ప్రొవిజనల్ అలాట్‌మెంట్ సర్టిఫికెట్ పొందడానికి ఆధార్ కార్డు తప్పనిసరిగా తీసుకురావాలని సీఆర్ డీఏ కమిషనర్ స్పష్టం చేశారు.

## 27న పోలవరానికి సిఎం చంద్రబాబు

**విజయవాడ,మార్చి23,ప్రభాతవార్తప్రతినిధి:** సిఎం చంద్రబాబు పోలవరం ప్రాజెక్టును మరోసారి సందర్శించనున్నారు. మార్చి 27వ తేదీ ఉదయం 10 గంటలకు ఉండవల్లిలోని తన నివాసం నుంచి హెలికాప్టర్‌లో సిఎం చంద్రబాబు పోలవరం చేరుకుంటారు. ఆ రోజు ఉదయం 11.00 గంటలకు ఆయన ప్రాజెక్ట్ సైట్‌కు చేరుకుంటారు. అనంతరం పోలవరం ప్రాజెక్టును పరిశీలించి.. ప్రాజెక్ట్ కార్యాలయంలో ఉన్నతాధికారులతో సిఎం చంద్రబాబు సమీక్ష నిర్వహించనున్నారు. ఆ తర్వాత మధ్యాహ్నం 3.00 గంటలకు ఆయన పోలవరం ప్రాజెక్ట్ సైటును సందర్శించనున్నారు. అనంతరం మధ్యాహ్నం 3.15 గంటకు విజయవాడకు తిరుగు ప్రయాణం కానున్నారు.

ఇక అదే రోజు.. అంటే గురువారం సాయంత్రం ఏ కన్వెన్షన్ సెంటర్‌లో ముస్లిం సోదరులకు ప్రభుత్వం ఇఫ్తార్ విందు ఇవ్వనుంది. ఈ కార్యక్రమంలో సీఎం చంద్రబాబు నాయుడు పాల్గొంటారు. కూటమి ప్రభుత్వం కొలువు తీరిన తర్వాత.. రాజధాని అమరావతి, పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణం కోసం వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. అందులోభాగంగా ఇప్పటికే రాష్ట్ర జీవనాడి పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణం కోసం కేంద్రం సైతం ఇతోధికంగా సాయం అందిస్తుంది. ఈ నేపథ్యంలో ప్రాజెక్ట్ పురోగతిపై జలవనరుల శాఖ ఉన్నతాధికారులతో సీఎం చంద్రబాబు సమీక్ష నిర్వహించనున్నారు.

## భద్రతా బలగాలపై మావోయిస్టుల మెరుపుదాడి

### నలుగురు జవాన్లకు తీవ్రగాయాలు

**చర్ల, మార్చి 23, ప్రభాతవార్త :** ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా భూపాలపట్నం జాతీయ ప్రధాన రహదారిపై గొర్లనల్ల గ్రామ సమీపంలో భద్రతా బలగాల వాహనాన్ని లక్ష్యంగా చేసుకుని మావోయిస్టులు మందు పాతర పేల్చారు. భద్రతా బలగాల రాకపై నిఘా పెట్టిన నక్సల్స్ ప్రధాన రహదారిపై ముందస్తుగానే మందుపాతరను అమర్చి ఆదివారం మధ్యాహ్నం ఈ దాడి ఘటనకు పాల్పడ్డారు. ఆ మందుపాతర పేల్చిన అనంతరం భద్రతా బలగాలపై కాల్పులు జరిపారు. ఇరువురి మధ్య కొద్దిసేపు కాల్పులు జరిగాయి. అనంతరం ఆ ప్రాంతం నుంచి మావోయిస్టులు వెను తిరిగారు. దాడి ఘటన తెలుసుకున్న బస్తర్ ఐజి పీ.సుందర్‌రాజ్, బీజాపూర్ ఎస్పీ జితేంద్రయాదవ్, అదనపు బలగాలను ఘటన స్థలానికిపంపించారు. మావో యిస్టులకోసం గాలింపుచర్యలు ముమ్మరం చేశారు.

## మావోయిస్టుల భారీ డంప్ స్వాధీనం

**చర్ల,మార్చి 23, ప్రభాతవార్త:** ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రం సుక్మా జిల్లాలోని మర్కన్‌గూడ, మెట్టగూడ అటవీ ప్రాంతంలో మావోయిస్టులు దాచిఉంచిన భారీ ఆయుధాలు, పేలుడు పదార్థాలను భద్రతా బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. డ్యూలెడ్ క్యాంపు పరిధిలోని మార్కన్‌గూడ అటవీ ప్రాంతంలో నక్సల్స్ ఆయుధ సంపతిని నిల్వ చేశారని సమాచారం అందుకున్న భద్రతా బలగాలు ఆ ప్రాంతంలో విస్తృత గాలింపు చర్యలు చేపట్టారు. ఎట్టకేలకు మావోల డంప్‌ను గుర్తించి వెలికి తీశారు. ఈ సోదాల్లో ఆరు తుపాకులు, 18 బీజీఎల్ (బారెల్ గ్రెనేడ్ లాంచర్) సెల్లు, సెల్‌ఫోన్లు, డిటోనేటర్లు, సెమీకండక్టర్ సర్క్యూట్లు, ఇనుప ఊసలు, నక్సల్స్ సాహిత్యాలు, యూనిఫాంలు, కిట్ బ్యాగులు, ఇతర పేలుడుపదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. మరియు మెట్టగూడ అడవుల్లో మరో డంప్ స్వాధీనమైంది. వీటిలో 3 తుపాకులు, 2బీజీఎల్‌రౌండ్లు, 6కంట్రీమేడ్ రైఫిల్‌లు, 6 డిటోనేటర్‌లు, 100 గ్రాముల గన్‌పౌడర్, స్టీల్ పైపులు, నక్సలైట్ జెండాలు, కంట్రీమేడ్ బాంబు,మిక్సర్‌జార్, ఇతరవస్తువులను భద్రతా బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. ఆ ప్రాంతంలో మావోయిస్టులు డంప్‌ను ఏర్పాటు చేయడం వెనుక పెద్ద పన్నాగమే పన్నినట్లు తెలుస్తుంది.

## మాజీమంత్రి విడదల రజని, ఐపిఎస్ అధికారి జాషువాపై ఎసిబి కేసు

### వ్యాపార సంస్థను బెదరించి కోట్లు వసూలు చేసినట్లు అభియోగం



**విజయవాడ,మార్చి23,ప్రభాతవార్తప్రతినిధి:** మాజీ సిఎం జగన్ ప్రభుత్వహయాంలో పల్నాడు జిల్లా యడ్లపాడులోని శ్రీలక్ష్మీబాలాజీ స్టోన్‌క్రషర్ యజమాన్యాన్ని బెడిరించి రూ.కోట్లు వసూలు చేసారనే అభియోగంపై పూర్వపు మంత్రి విడదల రజినీపై ఎసిబి కేసు నమోదు చేసింది.ఎసిబి అధికారులు ఈ కేసుకు సంబంధించి ఆదివారం విజయవాడలో పూర్తి వివరాలు తెలిపారు.విజిలెన్స్ తనిఖీల ముసుగులో బెదిరించి వారి నుంచి రూ.2.20 కోట్లు అక్రమంగా వసూలు చేశారనే అభియోగంపై వైఎస్సార్సీ నేత, మాజీ మంత్రి విడదల రజిని, అప్పటి గుంటూరు ఆర్‌విఇఒ, ఐపిఎస్ అధికారి పల్లె జాషువాతో పాటు మరికొందరిపై ఎసిబి ఈ కేసు నమోదు చేసింది. 2020 సెప్టెంబర్ 4న పల్నాడు జిల్లా యడ్లపాడు మండలం విశ్వనాథుని కండ్రిక గ్రామంలోని శ్రీ లక్ష్మీ బాలాజీ స్టోన్‌క్రషర్‌ను అప్పటి చిలకలూరిపేట ఎమ్మెల్యే విడదల రజిని పిఎ దొడ్డ రామకృష్ణ సందర్శించారు. స్టోన్‌క్రషర్‌పై దాడులు చేయకుండా, మూయించకుండా ఉండాలంటే ఎమ్మెల్యేని కలవాలని హుకుం జారీ చేశారు. దీంతో దాని యజమానులు నల్లపనేని చలపతిరావు, నంబూరి శ్రీనివాసరావు రజిని కార్యాలయానికి వెళ్లి కలిశారు. తన నియోజకవర్గ పరిధిలో వ్యాపారం నడవాలంటే అడిగినంత డబ్బులివ్వాల్సిందేనని, మిగతా విషయాలు తన పిఎ రామకృష్ణతో మాట్లాడాలని రజిని వారితో చెప్పారు. వారిద్దరూ రామకృష్ణను కలవగా ఆయన రూ.5 కోట్లు డిమాండ్ చేశారు. ఆ తర్వాత ఆరు రోజులకే సెప్టెంబర్ 10న అప్పటి గుంటూరు రీజనల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి ఆర్‌విఇఓగా ఉన్న ఐపిఎస్ అధికారి పల్లె జాషువా భారీ బృందంతో శ్రీ లక్ష్మీబాలాజీ స్టోన్‌క్రషర్‌లో తనిఖీలకు వెళ్లి హడావుడి చేశారు.

ఏ1గా విడదల రజిని, ఏ2గా ఐపిఎస్ అధికారి పల్లె జాషువా, ఏ3గా విడదలరజిని మరిది విడదల గోపి, ఏ4గా రజిని పిఎ దొడ్డ రామకృష్ణలను నిందితులుగా చేర్చింది. ఎసిబి డైరెక్టర్ జనరల్ అతుల్ సింగ్ ప్రాథమిక దర్యాప్తు చేయించారు. ఆధారాలు లభించడంతో నిన్ననే కేసు నమోదు చేశారు. అప్పట్లో ఈ సోదాల్లో పాల్గొన్న మిగతా అధికారులను ఎసిబి విచారించగా జాషువా ఆదేశాలతోనే తామంతా తనిఖీల్లో పాల్గొన్నామని ఆ తర్వాత ఏమైందోకూడా తెలియదని వాంగ్మూలాలిచ్చారు. నెల రోజుల తర్వాత జాషువా దాని యజమానులకు ఫోన్‌చేసి వెంటనే విడదల రజినిని కలవాలని లేకపోతే రూ.50కోట్లు జరిమానా విధించడంతో పాటు క్రషర్‌ను మూయించేస్తానని బెదిరించారు. దీంతో వారు రజినిని కలిశారు. ఆమె ఆదేశాలమేరకు పిఎ రామకృష్ణతో భేటీకాగా ఆయన రూ.5 కోట్లు ఇవ్వాల్సిందేనని డిమాండ్ చేశారు. కొన్నాళ్ల తర్వాత జాషువామరోసారి క్రషర్ యజమానులను తన కార్యాలయానికి పిలిపించుకుని త్వరగా సెటిల్ చేసుకోవాలని హెచ్చరించారు.

# మగ్గాలకు ఉచిత విద్యుత్

### చేనేతకు 200, మరమగ్గాలకు 500 యూనిట్లు- నేత కార్మికులకు ప్రభుత్వం ఆసరా



**విజయవాడ,మార్చి23,ప్రభాతవార్తప్రతినిధి:** కూటమి ప్రభుత్వం చేనేత మగ్గాలకు 200 యూనిట్లు, మర మగ్గాలకు 500 యూనిట్ల వరకూ ఉచిత విద్యుత్ అందించేలా కీలక నిర్ణయం తీసుకుంది. వైఎస్సార్సీ పాలనలో కుంటుపడిన చేనేత రంగానికి కూటమి ప్రభుత్వం ఊతం అందిస్తోంది. ఎన్నికల హామీమేరకు నేతన్నల సంక్షేమం, చేనేత పరిశ్రమ ప్రగతిపై దృష్టి సారిస్తూ ఉచిత విద్యుత్ అమలు నిర్ణయం తీసుకుంది. చేనేత మగ్గాలకు 200 యూనిట్లు, మర మగ్గాలకు 500 యూనిట్ల వరకూ ఉచిత విద్యుత్ అందించడంపై నేతన్నలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో సుమారు 7,555 మంది చేనేత కార్మికులున్నారు. వీరితోపాటు అనుబంధంగా మరో పదివేలమంది కార్మికులు పని చేస్తున్నట్లు అంచనా. ఒక్క మంగళగిరిలోనే 3,020 మంది చేనేత అనుబంధ ఉపాధి కార్మికులు ఉన్నారు. వీరిలో సొంత మగ్గాలు ఉన్న కార్మికులకు విద్యుత్ రాయితీ అందనుంది. ఫిరంగిపురం, పొన్నూరు, కొత్తరెడ్డి పాలెం, తెనాలి, భట్టిప్రోలు, రేపల్లె,బాపట్ల, ఈపూరు, నరసరావుపేట, మాచవరం, సత్తెనపల్లి, అమరావతి, పెదకూరపాడు, అచ్చంపేట, చిలకలూరిపేట, నాదెండ్ల, మాచర్ల, వెల్దుర్తి, రెంటచింతల ప్రాంతాల్లోనూ చేనేత కుటుంబాలున్నాయి. వీరిలో కొంతమంది సొసైటీల తరపున పని చేస్తున్నారు.

మరికొంత మంది ఇళ్లల్లో మగ్గాలు పెట్టుకుని వస్త్రాలు నేస్తున్నారు. వీరందరికీ విద్యుత్తు రాయితీ ప్రయోజనాలు దక్కనున్నాయి. నేత కార్మికులకు చేయూత అందించేందుకు కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి కేబినెట్ ఇటీవల ఆమోదముద్రవేసింది. మగ్గాలున్న కార్మి కుల ఇళ్లకు 200 యూనిట్లు, పవర్ లూమ్స్‌కు 500 యూనిట్ల వరకూ ఉచిత విద్యుత్ అంద నుంది. ఈ నిర్ణయంతో వేలాదిచేనేత కుటుంబాలకు విద్యుత్ భారం తగ్గుతుందని చేనేత కార్మికులు చెబున్నారు. జీఎస్టీ భారం లేకుండా చర్యలు: ఉమ్మడి గుంటూరు జిల్లాలో 2019లో చేసిన సర్వే ఆధారంగా చేనేత కుటుంబాల లెక్కలున్నాయి. ఈ నెల 25 నాటికి ఈ ప్రక్రియ పూర్తిచేసి అర్హులైన చేనేతలకు విద్యుత్ రాయితీ అందించేందుకు అధికారులు కార్యాచరణ రూపొందిస్తున్నారు.

## 27న విజయవాడలో ప్రభుత్వ 'ఇఫ్తార్'


### • జిల్లా కేంద్రాల్లోనూ ఏర్పాట్లు • రూ. 1.50 కోట్లు విడుదల

**విజయవాడ, మార్చి23, ప్రభాతవార్త ప్రతినిధి:** పవిత్ర రంజాన్ మాసంలో రాష్ట్రవ్యాప్తంగా జిల్లాల స్థాయిలో ఇఫ్తార్ ఏర్పాట్లు చేయడానికి ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం రూ.1.50 కోట్లు నిధులను విడుదల చేసింది. ఈ మేరకు మైనారిటీ మంత్రిత్వ శాఖ కార్యదర్శి కే హర్షవర్ధన్ ఉత్తరులు జారీ చేశారు.ముస్లిం మైనార్టీలకు అత్యంత భక్తిశ్రద్ధలతో కూడిన రంజాన్ మాసంలో సాయంకాలం ఉపవాస దీక్ష విరమణ కార్యక్రమంలో భాగంగా ఈనెల 27వ తేదీన రాష్ట్ర స్థాయి ప్రభుత్వ ఇఫ్తార్ కార్యక్రమాన్ని విజయవాడలో ఎంజీ రోడ్డులో ఏ ప్లస్ కన్వెన్షన్ సెంటర్లో నిర్వహించేందుకు నిర్ణయించారు. రాష్ట్రంలోని ఆయా జిల్లాల కలెక్టర్లు రానున్న 4, 5 రోజులలో జిల్లా స్థాయి ఇఫ్తార్ కార్యక్రమాన్ని వారికి అనువైన రోజున నిర్వహిస్తారు. ఇఫ్తార్‌ను జిల్లాస్థాయిలో ఆయా జిల్లాల కలెక్టర్లు ప్రణాళికాబద్ధంగా పకడ్బందీగా నిర్వహించాలని మైనార్టీ మంత్రిత్వ శాఖ కార్యదర్శి కే. హర్షవర్ధన్ ఉత్తర్వులు జారీ చేశారు.

విజయవాడ ఎంజీ రోడ్డు ఏ ప్లస్ కన్వెన్షన్ సెంటర్లోసెంటర్‌లో సిఎం చంద్రబాబు నాయుడు అధ్యక్షతన ఏర్పాటు చేయబోయే రాష్ట్రస్థాయి ఇఫ్తార్ కార్యక్రమానికి రూ. 75 లక్షలు మొత్తాన్ని ప్రభుత్వం కేటాయించింది. ప్రభుత్వం విడుదల రూ.1.50కోట్లులో రాష్ట్రస్దాయి ఇఫ్తార్‌కు పోను,మిగిలిన రూ. 75 లక్షలు మొత్తాన్ని జిల్లాల వారీగా కేటాయించి ఆయా జిల్లాల కలెక్టర్ల నేతృత్వంలో జిల్లాస్థాయిలో ఇఫ్తార్ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు కార్యాచరణ రూపొందించారు. జిల్లాలలో ముస్లిం మైనారిటీల జనాభా ప్రాతిపదికన ఇఫ్తార్ కోసం నిధుల కేటాయింపు జరిగింది.

24-3pg2exHMNWJQEV.qxd:24-3pg2exHMNWJQEV.qxd 01/01/01 10:00 AM Page 1





ఆదివారం సేవ్ టెంపుల్స్ భారత్ చైర్మన్ డా. గజల్ శ్రీనివాస్ అధ్యక్షతలో జరిగిన కార్యక్రమంలో ఉగాది పురస్కారాలను అందజేస్తున్న కళాప్రపూర్ణ, డాక్టర్ మండలి బుద్ధప్రసాద్

# ఉగాదితో తెలుగు వెలుగులు నింపాలి

## అధికార భాషా సంఘం పూర్వాధ్యక్షుడు, ఎంఎల్ఏ డాక్టర్ మండలి బుద్ధ ప్రసాద్

**విజయవాడ,మార్చి23,ప్రభాతవార్తప్రతినిధి:** ఈ ఉగాది నుండి ఆంధ్ర రాష్ట్ర మంతా తెలుగు భాష వెలుగులు నిండాలని, ఆంధ్ర రాష్ట్రం ప్రపంచానికి ప్రగతి గమ్యస్థానం కావాలని అందుకు ప్రతి తెలుగు వారు కృషి చేయాలని కళా ప్రపూర్ణ,డాక్టర్ మండలి బుద్ధ ప్రసాద్ పిలుపు నిచ్చారు. ఎంతో మంది సేవా తత్పరులను ఉగాది పురస్కారాలతో సత్కరించిన సేవ్ టెంపుల్స్ భారత్ చైర్మన్ డా. గజల్ శ్రీనివాస్‌ను అభినందించాలని ఆయన అన్నారు. తెలుగు రెడ్డప్ప ధవళే ఆహూతులను స్వాగతం పలికారు. సభకు డా. గజల్ శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. ఉగాది పురస్కారాల కార్యక్రమంలో ఆత్మీయ అతిథులుగా ఎమ్.సి.దాస్ , గోళ్ల నారాయణ రావు, చలసాని ఆంజనేయులు , గొట్టిపాటి రామకృష్ణ, వేమూల హజరత్తయ్య గుప్తా, చలపాటి వెంకటేశ్వర రావు, దోగుపర్తి శంకర రావు, రసరాజు , జయంత్ ,నాగ మల్లేశ్వర రావు, కలిమి ,మెడికొండ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. ఉగాది పురస్కారాలలో భాగంగా, సామాజిక సేవా రంగంలో గుళ్ళపల్లి నాగసాయి, శాస్త్రీయ సంగీతంలో మార్తూరు హరిబాబు, విద్యా సేవా రంగంలో చిట్టూరి ఆనంద రామ సుధాకర్, సాహిత్యం లో వంతల వేంకటేశ్వర రావు, ఆధ్యాత్మిక రంగంలో మండవల్లి సత్య శ్రీహరి, సంస్కృత భాషా సేవలో డా. మరుమూరి నరసింహాచార్యులు, ప్రకృతి వైద్య సేవలోసంబాల సుబ్రహ్మణ్య శాస్త్రి, చిత్రలేఖనంలో ఉప్పలపల్లి వేణుగోపాల్, పౌరాణిక నాటక రంగ సేవలో షణ్ముఖ విజయ్, శాస్త్రీయ నృత్యం లో డా. భాగవతుల సౌమ్య, యోగాలో కొల్లుల శ్రీనివాస్, న్యాయ సేవలో గుండుపు రాజేష్ కుమార్, సాంస్కృతిక సేవలో పోలాకి వెంకట రమణ మూర్తి లు ముఖ్య అతిథి నుండి విశ్వావసు ఉగాది ప్రతిభా సేవా పురస్కారాలు స్వీకరించారు. కలిమి శ్రీ సంపాదకత్వంలో నిర్వహించిన జాతీయ కవి సమ్మేళనంలో ప్రసిద్ధకవులు అమూల్య చంద్, సరికొండ నరసింహ రాజు తదితరులు పాల్గొని ఉగాదికి తమ కవితలతో అపూర్వ స్వాగతం పలికారు. సత్యశ్రీ హరి బృందం విష్ణు సహస్ర నామ పారాయణం నిర్వహించారు, క్రొత్త గూడెం రాజేష్ వందన సమర్పణ చేశారు. కార్యక్రమ సంచాలకులు మనోజ్ కమల్, వక్రి , క్రోదూరి సుశీల గార్లను ముఖ్య అతిథిని సత్కరించారు. కార్యక్రమంలో మ్యాస్ట్రో గజల్ శ్రీనివాస భావయుక్త గజల్స్ వినులకు విందు చేసాయి.

# ప్లానింగ్ నిబంధనలు సరళతరం

>> బాండ్లపైనా అన్ని మున్సిపాలిటీల్లోనూ స్పెషల్ డ్రైవ్ జరుగుతోందని, త్వరలోనే పరిష్కారం అవుతాయని తెలిపారు. భోగాపురం ఎయిర్‌పోర్టు రోడ్ల వల్ల ట్రాఫిక్ ఇబ్బందులు వస్తాయని, దీంతో రోడ్ల విస్తరణ చేయాల్సి ఉందని చెప్పారు. నీటి సమస్య ఉందని, వాటన్నిటినీ పరిష్కరించేందుకు సిఎం ఆదేశాల మేరకు ముందుకు వెళతామని అన్నారు. గతంలో ఇష్టానుసారంగా మాస్టర్‌ప్లాను మార్పులు చేశారని అన్నారు. ప్రజల అభిప్రాయం తీసుకుని మళ్లీ రూపొందిస్తామని చెప్పారు. 22ఏ భూముల సమస్య కూడా ఉందని, నీటి సమస్య, బీచ్ కారిడార్, అనకాపల్లి, గాజువాకలో భూ సమస్యలు ఉన్నాయని, వాటన్నిటినీ పరిష్కరిస్తామని వివరించారు.

# ఉగాది నుంచి పి-4 అమలు

>> ప్రజలు తమ అభిప్రాయాలను ఈ కోడ్ స్కాన్ చేయటం ద్వారా కానీ, వెబ్‌సైట్ ద్వారా కానీ పొందుపరుస్తున్నారు. తొలుత లాగిన్ అవగానే ప్రతి ఇంటికి అభివృద్ధి ప్రతి జీవితానికి ప్రగతి నినాదంతో పేదరిక నిర్మూలన పి4 విధానంపై అభిప్రాయ సేకరణ పత్రం వస్తుంది. అనంతరం కిందకు వెళ్లగానే పేదరిక నిర్మూలనకు ప్రజలు తమ అభిప్రాయాలు తెలిపేలా 11 ప్రశ్నలు ఇచ్చి చివరగా తమ సలహాలు ఇవ్వాలి. వీటన్నింటినీ పూరించి పత్రాన్ని సమర్పించగా అందుకు ఆయా అభిప్రాయాలు తెలిపిన వారికి వారి పేర్లతో జీరో పావర్టీ పి4 అనే ప్రశంసా పత్రం వస్తుంది. అట్టడుగున ఉన్న పేదల సాధికారతకు ఉద్దేశించిన పి4 కార్యక్రమాన్ని ప్రభుత్వం ఉగాది నుంచి అమలు చేయనుంది. మొదట ఎంపిక చేసిన 4 గ్రామాల్లో పైలట్ ప్రాజెక్టుగా అమలు చేయనున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడించారు. ఇందులో 5 వేల 869 కుటుంబాలుఉంటాయన్న సిఎం, అట్టడుగునఉన్న పేదలను ఆదుకోవడమే పథకం లక్ష్యమని స్పష్టం చేశారు.

# డీలిమిటేషన్‌పై కేంద్రానికి తీర్మానం

## నేడు తెలంగాణ అసెంబ్లీలో వాడి, వేడి చర్చ

## సభ ఆమోదం పొందాక తీర్మానం కేంద్రానికి అందజేత

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,మార్చి23:** లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన విధానానికి వ్యతిరేకంగా రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పునర్విభజనపై సిఎం రేవంత్‌రెడ్డి సోమ వారం అసెంబ్లీలో తీర్మానం ప్రవేశపెట్టనున్నారు. సభ్యుల ఆమోదం తర్వాత కేంద్రానికి పంపనున్నారు. డీలిమిటేషన్‌తో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగుతుందని నాయకులు ఆందోళన వ్యక్తం చేస్తున్న విషయం తెలిసిందే. కాగా, లోకసభ నియోజకవర్గాల పునర్విభజనకు సంబంధించి దక్షిణాది రాష్ట్రాలతో పాటు నష్టపోయే ఇతర రాష్ట్రాల హక్కులను కాపాడుకునే క్రమంలో రెండో సదస్సుకు హైదరాబాద్‌లో నిర్వహించనున్నారు.పునర్వి భజనకు సంబంధించి చెన్నైలో శనివారం నిర్వహించిన సదస్సు ఈ మేరకు తీర్మానించింది కూడా. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పునర్విభజనతో నష్టపోనున్న రాష్ట్రాల ప్రజల అభిమతానికి అనుగుణంగా రెండో సదస్సును హైదరాబాద్‌లో నిర్వహిస్తామని, అనంతరం భారీ బహిరంగ సభ ఏర్పాటు చేస్తామని చెన్నైలో తెలిపారు.పునర్విభజనపై దక్షిణాదితో పాటు నష్టపోయే ఇతర రాష్ట్రాల గళాన్ని బలంగా వినిపించేందుకు ఆయా రాష్ట్రాల్లోని అన్ని పార్టీల ఎంపీలతో ఒక కమిటీని ఏర్పాటు చేయాలని రేవంత్ రెడ్డి సూచించారు. దేశ రాజధాని ఢిల్లీలోనే అన్ని రాజకీయ పరమైన నిర్ణయాలు జరుగుతాయని, ఈనేపథ్యంలో అక్కడ కార్యకలాపాలను ఎప్పటికప్పుడు గమనిస్తూ... పరస్పరం సమన్వయం చేసుకుంటూ.. భవిష్యత్ కార్యాచరణ రూపకల్పనకు ఎంపీలతో కూడిన కమిటీ పని చేయాలని, ఇందుకు ప్రత్యేక కార్యాలయం ఢిల్లీలో ఏర్పాటు చేయాలని సదస్సులో సిఎం రేవంత్‌రెడ్డి చేసిన సూచనను ఆందరూ అంగీకరించారు. లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజనకు సంబంధించి చరిత్ర.. వర్తమాన పరిస్థితులతో పాటు జనాభా దామాషా, ప్రొరేట్ ప్రకారం పునర్విభజన జరిపితే దక్షిణాది రాష్ట్రాలు, పంజాబ్,ఒడిశా నష్టపోయే తీరును సీఎం రేవంత్ రెడ్డి చెన్నై సదస్సులో వివరించారు. నియోజక వర్గాల పునర్విభజన చేపట్టినా లోక్‌సభ సీట్లు పెంచకుండా శాసనసభ సీట్లు పెంచుకునే అవకాశం రాష్ట్రాలకు కల్పించాలని చేసిన సూచన ప్రతి ఒక్కరిని ఆకర్షించింది. మహిళలకు 33 శాతం సీట్లు, ఎస్సీ,ఎస్టీ సీట్ల పెంపుపైనా చేసిన సూచనలు చాలా అర్థవంతంగా ఉన్నాయని సదస్సులో పాల్గొన్న వివిధ పార్టీల నాయకులు అభిప్రాయపడ్డారు. కేంద్రం ప్రతిపాదిస్తున్న డీలిమిటేషన్‌కు వ్యతిరేకంగా సోమవారం అసెంబ్లీలో తీర్మానం చేసి ఆమోదం పొందిన తర్వాత కేంద్రానికి పంపనున్నారు. కేంద్రం ప్రతిపాదిస్తున్న జనాభా ఆధారిత లోక్‌సభ స్థానాల పునర్విభజన విధానంపై మా రాష్ట్ర శాసన సభలో తీర్మానం ఆమోదిస్తాం... మేం మా రాష్ట్రంలో ఎలా చేస్తున్నామో మీమీ రాష్ట్రాల్లోనూ అలానే చేయాలని సహచర ముఖ్యమంత్రులు, ఇతర నాయకులకు చెన్నైలో సిఎం రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేసిన విషయం తెలిసిందే. ఉగాది పండుగ తర్వాత లోక్‌సభ స్థానాల డీలిమిటేషన్ విధానానికి వ్యతిరేకంగా హైదరాబాద్‌లో రేవంత్ సర్కార్ పెద్దఎత్తున సదస్సు నిర్వహించ నుంది. దీనికి దక్షిణాది రాష్ట్రాలతో పంజాబ్,ఒడిశా రాష్ట్రాల నుంచి అన్ని పార్టీ నేతలను, ముఖ్యమంత్రులను ఆహ్వానిస్తున్నారు. ఇదిలా ఉండగా, అసెంబ్లీలో ప్రభుత్వ తీర్మానం కోసం ప్రశ్నోత్తరాలను రద్దు చేశారు. అసెంబ్లీ అజెండా షెడ్యూల్ ప్రకారం పద్దులపై చర్చ, తర్వాత ప్రభుత్వ తీర్మానం, రెండు ప్రభుత్వ బిల్లులపై చర్చ ఆమోదం జరగనున్నాయి.



ఆదివారం అమృత్‌సర్‌లోని స్వర్ణదేవాలయంలో మంత్రి లోకేష్, భార్య బ్రహ్మణి, కుమారుడు దేవాన్ష్

# అమృత్‌సర్ స్వర్ణ దేవాలయంలో మంత్రి లోకేశ్ దంపతులు ప్రత్యేక ప్రార్ధనలు

**విజయవాడ,మార్చి23,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ ఆదివారం కుటుంబ సమేతంగా పంజాబ్‌లో పర్యటించారు. అమృత్‌సర్‌లో ఉన్న సిక్కుల సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం స్వర్ణ దేవాలయాన్ని సందర్శించారు. స్వర్ణ దేవాలయంలో లోకేశ్ దంపతులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. స్వర్ణ దేవాలయ సందర్శన సందర్భంగా లోకేశ్, బ్రాహ్మణి, దేవాన్ష్ సిక్కు మతాచారాల ప్రచారం తలకు పవిత్రమైన వస్త్రాన్ని కట్టుకుని ప్రార్థనల్లో పాల్గొన్నారు. తన కుటుంబంతో కలిసి పంజాబ్‌లోని అమృత్‌సర్‌లో ఆధ్యాత్మిక ప్రదేశాల్లో పర్యటించారు. సతీమణి నారా బ్రాహ్మణి, కుమారుడు దేవాన్ష్‌తో కలిసి అక్కడకు వెళ్లిన మంత్రి లోకేశ్ స్వర్ణదేవాలయాన్ని (గోల్డెన్ టెంపుల్)ను సందర్శించారు. ప్రత్యేక ప్రార్థనలుచేశారు. దీనిపై లోకేశ్ ఎక్స్ వేదికగా స్పందిస్తూ... అందరికీ సుఖశాంతులు కలగాలని ప్రార్థించినట్టు తెలిపారు. పవిత్రమైన శ్రీ హర్మందిర్ సాహిబ్‌ను సందర్శించు కుని ప్రతి ఒక్కరికీ సుఖశాంతులు కలగాలని కోరుకున్నారు. అయితే ఈ పర్యటనపై మంత్రి నారా లోకేశ్ ఎక్స్ వేదికగా ఫొటోలు షేర్ చేశారు. స్వర్ణ దేవాలయం వద్ద దిగిన ఫొటోలను షేర్ చేశారు. ఈరోజు అమృత్‌సర్‌లోని పవిత్రమైన హర్మందిర్ సాహిబ్‌ను సందర్శించే అదృష్టం కలిగిందని మంత్రి చెప్పారు. శాంతి, అందరి శ్రేయస్సు కోసం ప్రార్థించానని తెలిపారు. స్వర్ణ దేవాలయం ప్రశాంతతకు స్ఫూర్తిదాయకమన్నారు. వాహెగురు ఆశీస్సులు మార్గనిర్దేశం చేస్తాయని లోకేశ్ పేర్కొన్నారు.

# స్వర్ణాంధ్ర విజన్ 2047 అమలు కోసం జిల్లా, నియోజకవర్గ స్థాయిలో కమిటీలు

## అమలు బాధ్యత సచివాలయ కార్యదర్శులకు ప్రణాళిక శాఖ ఉత్తర్వులు

**విజయవాడ,మార్చి23,ప్రభాతవార్తప్రతినిధి:** స్వర్ణాంధ్ర విజన్ 2047 అమలు కోసం జిల్లా, నియోజకవర్గ స్థాయిల్లో కమిటీలను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ మేరకు ప్రణాళికా శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లా స్థాయిలో విజన్ అమలు బాధ్యత విజన్ అమలు బాధ్యత ఆ జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రికి అప్పగించారు. సభ్యులుగా లోక్‌సభ, రాజ్యసభ ఎంపిలు, ఎమ్మెల్యే, ఎంపిలు, జెడ్పీ ఛైర్మన్, మున్సిపల్ కార్పొరేషన్ల మేయర్లు ఉంటారు, ఉపాధ్యక్షునిగా జిల్లా కలెక్టర్, కన్వీనర్‌గా సిపిఓ వ్యవహరిస్తారు. నియోజకవర్గాల యూనిట్‌కు స్థానిక ఎమ్మెల్యే ఛైర్మన్‌గా, నియోజకవర్గ ప్రధాన కేంద్రంలోని ఎంపిడివో కన్వీనర్‌గా ఎమ్మెల్సీ, మున్సిపల్ ఛైర్‌పర్సన్, ఆర్డీవో, ఇతర మున్సిపల్ కమిషనర్లు సభ్యులుగా ఉంటారు. సచివాలయాల కమిటీల్లో వాటి స్థాయిని బట్టి స్థానిక సర్పంచు, కార్పొరేటర్, వార్డు కౌన్సిలర్ ఛైర్మన్‌గా వ్యవహరిస్తారు. అదే సమయంలో క్షేత్రస్థాయిలో విజన్ అమలు బాధ్యతలను గ్రామ, వార్డు సచివాలయాల కార్యదర్శులకు అప్పగించాలని కూడా ప్రభుత్వం నిర్ణయిం చింది. ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా పనిచేస్తున్న వారిలో కొరతమందిని ఈ విధానం అమలుకోసం ఎరపిక చేయనున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో ఒక్కో నియోజకవర్గానికి ఐదుగురు చొప్పున 875 మందిని ఎరపికచేయనున్నారు.

స్టాటస్టిక్స్, గణారక, ఎకనామిక్స్, కామర్స్, కంప్యూటర్ సైన్స్, ఎంబిఏ, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, రాజ కీయ శాస్త్రం, వ్యవసాయం, ఇంజనీరిరగ్ అంశాల్లో డిగ్రీ అర్హత కలిగిన వారు నియోజకవర్గాల్లో పనిచేసేందుకు అర్హులుగా నిర్ణయించారు. అలాగే జిల్లాకు ఐదుగురు చొప్పున 130 మందిని జిల్లా స్థాయి విజన్ అమలుకు వినియోగించుకోనున్నారు. వివిధ ప్రభుత్వ శాఖల్లో శాఖకు ఇద్దరు చొప్పున 70 మందిని, ప్రణాళిక శాఖల్లో మరో 25 మంది కార్యదర్శులను ఎంపిక చేసి వినియోగించుకోవాలని నిర్ణయించారు.ఎరపిక చేసిన కార్యదర్శులు ఆన్ డ్యూటీ కింద తమకు అప్పగించిన ప్రాంతాల్లో, శాఖల్లో పనిచేయాల్సి ఉంటుంది. ముందుగా ఏడాదిపాటు వారిని ఓడి విధానంలో కొనసాగిస్తారు. అలాగే నాలుగు విభాగాల్లో పనిచేస్తున్న కార్యదర్శులనే విజన్‌కు వినియోగించుకోవాలని నిర్ణయించారు. మహిళ పోలీస్, సర్వే అసిస్టెరట్, రెవెన్యూ కార్యదర్శి, ప్లానింగ్ రెగ్యులేషన్ కార్యదర్శులను విజన్‌కు వాడుకోవాలని నిర్ణయించారు. వీరి ఎంపిక బాధ్యతను కలెక్టర్లకు అప్పగించారు. ఈ మేరకు ఏర్పాటు చేసే కమిటీకి కలెక్టర్ ఛైర్మన్‌గా వ్యవహరిస్తారు.

# ఎమ్మెల్యేల ఫిరాయింపులపై ఏం చర్యలు తీసుకున్నారో తెలపండి

## తెలంగాణ స్పీకర్ కార్యాలయానికి సుప్రీం కోర్టు నోటీసులు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధిల హైదరాబాద్,మార్చి23:** బిఆర్ఎస్ ఎమ్మెల్యేల ఫిరాయింపు వ్యవహారం అసెంబ్లీ కార్యాలయానికి చేరుకున్నది. తెలంగాణ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌కు సుప్రీంకోర్టు మరోసారి నోటీసులు జారీ చేసింది. ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపుల కేసులో ఏం చర్యలు తీసుకున్నారో తెలపాలంటూ గతంలోనూ నోటీసులు ఇచ్చింది. ఇందుకు సుప్రీంకోర్టు గడువు కూడా విధించింది. సుప్రీంకోర్టు ఆదేశాలతో పిటీషనర్ల తరఫు న్యాయవాదులు అసెంబ్లీ కార్యాలయానికి వచ్చి నోటీసులు అందించారు. ఒక పార్టీ బీ ఫామ్‌పై గెలిచి మరో పార్టీలోకి ఫిరాయించిన ఎమ్మెల్యేలపై ఎలాంటి చర్యలు తీసుకున్నారో అఫిడవిట్ రూపంలో వివరణ ఇవ్వాలని స్పీకర్ కార్యాలయాన్ని సుప్రీంకోర్టు విచారణ సందర్భంగా ఆదేశించింది. పిటీషనర్ల తరఫు న్యాయవాదులకు కూడా ఆదేశాలు ఇచ్చి స్పీకర్ కార్యాలయంలో నోటీసులను అందజేయాలని స్పష్టం చేసింది. ఈ ఆదేశాల్లో భాగంగా పిటీషనర్లుగా ఉన్న బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు కేపి వివేకానందగౌడ్, కౌశిక్‌రెడ్డి తరఫున న్యాయవాదులు స్పీకర్ కార్యాలయంలో నోటీసుల్ని అందజేశారు. 2023లో జరిగిన తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ నుంచి పోటీ చేసి గెలిచిన 10 మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరారు. ప్రజలు కారు గుర్తుపై గెలిపించాక పార్టీ మారడం వారి నమ్మకాన్ని వమ్ము చేయడమేనని బీఆర్ఎస్ విమర్శించింది. దీనిపై బీఆర్ఎస్ పార్టీ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలంటూ స్పీకర్‌ను ఆదేశించాలని కోరింది. విచారణ సందర్భంగా ప్రభుత్వం,అసెంబ్లీ కార్యదర్శి, 10 మంది ఎమ్మెల్యేలు, ఎన్నికల సంఘానికి సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. గత వారం విచారించిన సుప్రీంకోర్టు ధర్మాసనం తదుపరి విచారణను 25వ తేదీకి వాయిదా వేసింది.

# దేశంలో అడవుల విస్తీర్ణంలో 3వ స్థానంలో తెలంగాణ

**హైదరాబాద్,మార్చి 23 ,ప్రభాతవార్త :** రాష్ట్ర భౌగోళిక విస్తీర్ణంలో అడవులు 24.69 శాతం ఉన్నాయని సామాజిక, ఆర్థిక సర్వే( సోషియో ఎకనామిక్ సర్వే)2024..25లో రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. దేశంలో అడవులు 23.59 శాతం ఉండగా, రాష్ట్రంలో అంతకంటే అధికంగానే ఉన్నట్లు పేర్కొంది. అడవుల సగటు విస్తీర్ణంలో దేశంలో తెలంగాణ మూడ్ స్థానంలో నిలిచింది.రాష్ట్రంలో 2,939 కి పైగా వృక్ష,మొక్క జాతులున్నాయి. 365 పక్షిజాతులు, 131 ఇతర జంతువులు, మృగాల జాతులు న్నాయని సర్వేలో తెలిపారు.రాష్ట్రవ్యాప్తంగా మొత్తం అడవులు 27,688 చ.కి.మీ మేర విస్తరించి ఉన్నాయి. మొత్తం 12 రక్షిత ప్రాంతాల్లో 9 శాంక్చురీలు, 3 జాతీయ పార్కులు ఉన్నాయి.పర్యావరణ పరిరక్షణ కోసం ప్రభుత్వం వనమహోత్సవం, ప్రాజెక్ట్ టైగర్, అర్బన్ ఫారెస్ట్ బ్లాక్‌లకు చర్యలు చేప ట్టింది. అమ్రాబాద్ పులుల అభయారణ్యం (ఏటీఆర్)ను ప్లాస్టిక్ రహిత ప్రాంతంగా ప్రకటించింది. దేశవ్యాప్తంగా ఉన్న అడవులు విస్తీర్ణాన్ని పరిశీలిస్తే 44.25 శాతంతో చత్తీస్‌ఘడ్ మొదటి స్థానంలో ఉండగా 39.31 శాతంతో ఒడిశ్శా రెండో స్థానంలో 24.269 శాతంతో తెలంగాణ మూడవ స్థానంలో, 22.87 శాతంలో ఏపీలో నాల్గొ స్థానంలో, ఉన్నట్లు తన నివేదికలో పేర్కొంది.

# ఉల్లి ఎగుమతులపై 20% సుంకం రద్దు

>> సుంకాలను మినహాయిస్తున్నట్లు తెలిపింది. మండిల్లోను, రిటైల్‌ధరలు కూడా ఈ రద్దుతో కొంతమేర తగ్గుతాయని, దీనికితోడు రబీ పంట కూడా భారీ మొత్తంలో మండిలకు వచ్చే అవకాశం ఉందని వినియోగదారుల మంత్రిత్వశాఖ ప్రకటించింది. 2024 సెప్టెంబరునుంచి ఉల్లిపై ఎగుమతి సుంకాలు కొనసాగుతున్నాయి. అన్ని ఆంక్షలు ఉన్నప్పటికీ మొత్తం ఎగుమతులు ఈనెల మార్చి 18వ తేదీనాటికి 11.65 లక్షల టన్నులు జరిగాయని కేంద్రం ప్రకటించింది. గత ఏడాది సెప్టెంబరునుంచి 0.72 లక్షల టన్నులనుంచి ఈ ఏడాది జనవరినాటికి 1.85 లక్షల టన్నులకు పెరిగింది. ఉల్లిసాగుచేసే రాష్ట్రాలనుంచి పంట మండీలకు వస్తుండటంతో ఉల్లిధరలు గణనీయంగా తగ్గాయి.

# పంటనష్టంపై సమీక్షించిన సిఎం చంద్రబాబు

## ఇద్దరు రైతుల ఆత్మహత్యా యత్నంపై విచారం

## వారికి మెరుగైన వైద్యం అందించాలని అధికారులకు సూచన

**విజయవాడ, మార్చి 23,ప్రభాతవార్తప్రతినిధి:** అనంతపురం జిల్లా, యల్లనూరు మండలం నీర్జంపల్లిలో ఇద్దరు అరటిరైతుల ఆత్మహత్యాయత్నంపై వ్యవ సాయ మంత్రి అచ్చెన్నాయుడు, జిల్లా కలెక్టర్, వ్యవసాయ శాఖ అధికారు లతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాట్లాడారు. అకాల, వడగండ్ల వానతో పంట నష్టపోయి ఇద్దరు రైతులు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటనపై అధికారుల నుంచి సమాచారం తెలుసుకున్నారు. ప్రస్తుతం ఇద్దరు రైతుల పరిస్థితి కాస్త మెరుగ్గాఉందని, ప్రాణాపాయం తప్పిందని... అధికారులు వివరించారు. మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలిస్తు న్నట్లు అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. వడగళ్ల వాన కారణంగా కడప, అనంతపురం, సత్యసాయి, ప్రకాశం జిల్లాల్లోని 10 మండలాల్లో 40 గ్రామాల్లో పంటనష్ట జరిగిందని అధికారులు వివరించారు. మొత్తం 1,364 మంది రైతులకు చెందిన 1,670 హెక్టార్లలో హార్టికల్చర్ పంటలకు నష్టం జరిగినట్లు గుర్తించామని అధికారులు సిఎంకు తెలిపారు. అకాల వర్షాలు, వడగండ్ల వానవల్ల జరిగిన పంటనష్టం వివరాలను క్షేత్రస్థాయి పర్యటన ద్వారా పరిశీలించామని అధికారులు సిఎంకు వివరించారు. వారికి ప్రభుత్వ పరంగా సాయం అధించాలని అధికారులకు సిఎం సూచించారు. పంట నష్టపోయిన రైతులను ఆదుకుంటామని...రైతులు ఎవరూ ఆందోళన చెందవద్దని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా భరోసా ఇచ్చారు.

**వడగళ్ల వాన కారణంగా పంట నష్టం అంచనా వేయండి**

రాష్ట్ర వ్యవసాయ శాఖామంత్రి అచ్చెన్నాయుడుఉద్యాన శాఖ అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించిన మంత్రి అచ్చెన్నాయుడు రాయలసీమ జిల్లాల్లో వడగళ్ల వర్షం కారణంగా ఉద్యాన పంటలకు నష్టం వాటిల్లిన నేపథ్యంలో మంత్రి అచ్చెన్నాయుడు అధికారులకు ఆదేశాలు పంట నష్టం అంచనా వేయాలని, రైతులకు తగు సూచనలు చేయాలని ఉద్యాన శాఖ అధికారు లను ఆదేశించిన మంత్రి అచ్చెన్నాయుడు క్షేత్ర స్థాయిలో అధికారులు రైతులకు అందుబాటులో ఉండాలని ఆదేశాలు జారీ చేసారు.

# డీలిమిటేషన్‌పై కేంద్రం నిర్ణయం తీసుకోలేదు..

## తప్పుడు ప్రచారంలో కాంగ్రెస్, బిఆర్ఎస్ పోటాపోటీ

## ఆ రెండు పార్టీల పాత సంబంధం చెన్నైలో బయటపడింది: కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

**హైదరాబాద్, మార్చి 23 ప్రభాతవార్త:** నియోజకవర్గాల పునర్విభజనపై ఇప్పటివరకు పార్లమెంటులో గానీ, కేబినెట్‌లో ఎటువంటి చర్చ జరగలేదని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. కాని, అవకాశవాద పార్టీలు దక్షిణాదికి అన్యాయం జరుగుతోందని తప్పుడు ప్రచారం చేస్తూ దిగజరారుడు రాజకీయాలకు తెరలేపుతున్నాయంటూ మండిపడ్డారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. నియోజకవర్గాల పునర్విభజనపై కాంగ్రెస్, బిఆర్ఎస్ అసలు రంగు బయటపడిందని, చెన్నైలో జరిగిన సమావేశంలో తెలంగాణ కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీలు పోటీపడి మాట్లాడటం, వారి నిజస్వరూపాన్ని బయట పెట్టిందన్నారు.అంతేకాకుండా వారి పాత బంధం బయటపడిందన్నారు. దేశంలో లేని సమస్యను సృష్టించి, భారతీయ జనతా పార్టీకి, కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఈ రెండు పార్టీలు కలిసి పనిచేస్తున్నాయి. తమిళ నాడులో డిఎంకె పాలనలో అవినీతి, కుంభకోణాల పాలన చేస్తున్న స్టాలిన్ కుటుంబంపై ప్రభుత్వం ప్రజల్లో వ్యతిరేకత కూడగట్టుకుం దన్నారు. దక్షిణాది ప్రజల సంక్షేమం కోసం చిత్తశుద్ధితో నరేంద్ర మోడీ ప్రభుత్వం కృషి చేస్తోంది. భవిష్యత్తులోనూ చేస్తుందన్నారు. వచ్చే శాసనసభ ఎన్నికల్లో కర్ణాటకలో, తెలంగాణలో గెలిచేలా, తమిళనాడులో మరింత పట్టు సాధిం చేలా అంకితభావంతో పనిచేస్తున్నామని, అయితే, దక్షిణాదిలో భారతీయ జనతాపార్టీ బలపడకూడదనే రాజకీయ కుట్రకోణంతో కాంగ్రెస్ పార్టీ, డిఎంకె పార్టీ, బిఆర్ఎస్ పార్టీలు దుష్ప్రచారం చేస్తున్నాయంటూ మండి పడ్డారు. జనాభా లెక్కల సేకరణ ఇంకా ప్రారంభం కాలేదు. కేంద్ర ప్రభుత్వం ఈ అంశంపై ఎటువంటి నిర్ణయం తీసుకోలేదన్నారు. కానీ అవకాశవాద పార్టీలు దక్షిణాదికి అన్యాయం జరుగుతోందని తప్పుడు ప్రచారం చేస్తూ దిగజారుడు రాజకీయాలు చేస్తున్నాయని, తమిళనాడులో డిఎంకె ప్రభుత్వం అవినీతి, కుంభకోణాలతో నిండిపోయిందన్నారు. ప్రజల్లో పెరుగుతున్న వ్యతిరేకతను తప్పించుకోవడానికి, డీలిమిటేషన్ పేరుతో బిజెపిపై బురదజల్లే కుట్రలు చేస్తున్నారని, గతంలో ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయని కారణంగా, ఇప్పుడు భాష, ప్రాంతం పేరుతో తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. కర్ణాటక, తెలంగాణలో ఎప్పుడు ఎన్నికలు జరిగినా బిజెపి అధికారంలోకి వస్తుంది. గత పార్లమెంటు ఎన్నికలతో పాటు, ఇటీవల జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూడా ప్రజలు బిజెపికి మద్దతుగా తీర్పు ఇచ్చారన్నారు. దక్షిణాదిలో బిజెపి బలపడ కూడదన్న కుట్రతో కాంగ్రెస్, డిఎంకే, బిఆర్ఎస్ పార్టీలు కలిసి దుష్ప్రచారం చేస్తున్నాయన్నారు. దేశంలో కాంగ్రెస్ పార్టీ మూడు రాష్ట్రాలకే పరిమిత మైందన్నారు. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా ప్రజలు భారతీయ జనతా పార్టీకి పట్టం కట్టబోతున్నారని అన్నారు. కుటుంబ పార్టీలు, అసమర్థ పార్టీలు ముఠాగా ఏర్పడి, మోడీ ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నాయన్నారు. కొన్ని కుటుంబ పార్టీలు, అవినీతి పాలిత పార్టీలు తప్పుడు ప్రచారం చేస్తున్నాయన్నారు. డీలిమిటేషన్‌కు సంబంధించి ఏవైనా చట్టాలుంటే ఆ చట్టాలు కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో చేసినవేనన్నారు. డీలిమిటేషన్ జరగాలంటే ముందుగా జనాభా లెక్కల సేకరణ జరగాలి. పార్లమెంటులో చట్టం చేయాలంటే మేధావులు, రాష్ట్ర ప్రభుత్వాల సలహాలు తీసుకోవాలి. ఇందులో రాష్ట్ర ప్రభుత్వాల పాత్ర చాలా కీలకంగా ఉంటుం దన్నారు. నియోజకవర్గాల పునర్విభజన విషయంలో ప్రజలకు ఏదో అన్యాయం జరుగబోతోం దంటూ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కెటిఆర్ ఒకే సమావేశం పాల్గొని ఆరోపణలు చేయడాన్ని మేం ఖండిస్తున్నాం. వారి ఆరోపణలన్నీ అసత్యాలే అన్నారు. మోడీ ప్రభుత్వం సబ్ కా సాథ్, సబ్ కా విశ్వాస్ అనే ఆలోచనతో ముందుకెళ్తున్నారని అన్నారు.

ప్రపంచంలో అభివృద్ధి చెందిన దేశాలతో పోటీపడే విధంగా సమర్థవంతమైన పరిపాలనతో దేశ గౌరవాన్ని, అభివృద్ధిని పెంచే ప్రయత్నం చేస్తున్నారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గత ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై దృష్టిపెడితే బాగుంటుందని, అంతేకాని కేంద్రంపై డీలిమిటేషన్ పేరుతో విమర్శలు చేయడం తగదు. విమర్శలు చేసినంత మాత్రాన ప్రజల్లో కాంగ్రెస్ ప్రభుత్వంపై ఉన్న అసం తృప్తి పోదనేది గుర్తుంచుకోవాలన్నారు. కొన్ని కుటుంబ పార్టీలు, కుంభ కోణాల పార్టీలు చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని ప్రజలు తిప్పికొట్టాలని, బిఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీ మధ్య సయోధ్య చేసేందుకు మజ్లిస్ పార్టీ ప్రయత్నం చేస్తోందన్నారు. బిఆర్ఎస్, కాంగ్రెస్‌పార్టీ, మజ్లిస్ పార్టీలు ఒక్క టైనా తెలంగాణ ప్రజల మద్దతుతో ఆ మూడు పార్టీలను సమర్థవంతంగా బిజెపి ఎదుర్కొంటుందన్నారు. కేవలం తమిళనాడులో ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని కాంగ్రెస్ పార్టీ స్టాలిన్‌ను ముందుపెట్టి నాటకమాడుతుందన్నారు. ఈ నాటకంలో కెటిఆర్ భాగస్వామ్యమయ్యారు. కేవలం బిజెపి మరింత బలపడకుండా ప్రజల్లో తప్పుడు సంకేతాలను పంపేందుకే ఆయా పార్టీలు నాటకమాడుతున్నాయని మండిపడ్డారు.

## వారం - వర్జ్యం

తేది : 24-03-2025, సోమవారం
శ్రీ క్రోధి నామ సంవత్సరం,
ఫాల్గుణమాసం, ఉత్తరాయణం,
శిశిర ఋతువు, కృష్ణపక్షం,
దశమి తె.5.06
ఉత్తరాషాఢ తె.4.26
వర్జ్యం మ.12.20-1.57
దు.మ.12.47-1.36, 2) మ.3.13-4.02
శుభసమయం: ఉ.4.30-5.15
సా.7.30-8.00
రాహుకాలం - ఉ.7.30-9.00

## వార్తాఫలం

**మేషం:** వృత్తి, వ్యాపారాలు అభివృద్ధి చెందుతాయి. మిత్రుల నుంచి శుభవార్తలు అందుకొంటారు.

**వృషభం :** దూరప్రయాణాలలో నూతన పరిచయాలు పెరుగుతాయి. ధన,వస్తు లాభాలు పొందుతారు.

**మిథునం:** దీర్ఘకాలిక సమస్యలు తీరి ఊరట చెందుతారు. విందు, వినోదాలలో చురుకుగా పాల్గొంటారు.

**కర్కాటకం:** కొత్త మిత్రులు పరిచయమై సాయం అందిస్తారు. ఆరోగ్యం పట్ల మెలకవ అవసరం.

**సింహం:** అనుకోని అతిథుల నుండి శుభవార్తలు అందుకుంటారు. క్రయ విక్రయాలలో లాభాలు పొందుతారు.

**కన్య :**ముఖ్యమైన పనులలో స్వల్ప ఆటంకాలు ఎదురైన అధిగమించి ముందుకు సాగుతారు. ఔషధ సేవనం.

**తుల :** దూరప్రాంతాల నుండి కీలక సమాచారం అందుకుంటారు. ఖర్చులు పెరుగుతాయి. జాగ్రత్త అవసరం.

**వృశ్చికం:** సోదరులతో ఏర్పడిన వివాదాలు పరిష్కరించుకుంటారు. అనుకోని ప్రయాణాలు లాభిస్తాయి.

**ధనుస్సు:** ఊహించని ఆహ్వానాలు ఆశ్చర్య పరుస్తాయి. విలువైన వస్తువులు, ఆభరణాలు కొనుగోలు చేస్తారు.

**మకరం:** పాతమిత్రులను కలిసి ఆనందంగా గడుపుతారు. విందు, వినోదాలలో పాల్గొంటారు.

**కుంభం:** ఉద్యోగాలలో స్థానమార్పులు వుంటాయి. వృత్తి, వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. వాహనసౌఖ్యం.

**మీనం:** కొత్త కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. జీవిత భాగస్వామి నుండి ధనలాభం పొందుతారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

24-3Pg3exHMNWJQET.qxd:24-3Pg3exHMNWJQET.qxd 01/01/01 8:38 AM Page 1





పడవల ఏడుకొండలు

## బెజవాడ బార్ అసోసియేషన్ ఇసి సభ్యునిగా 'పడవల'

**విజయవాడ,మార్చి 23,ప్రభాతవార్త:** బెజవాడ బార్ అసోసియేషన్‌లో ఎన్నికల సందడి మొదలైంది. ఈ నేపథ్యంలో బార్ అసోసియేషన్ ఎన్నికలకు సంబంధించి వివిధ పోస్టులకు ఇప్పటికే నామినేషన్లు దాఖలయ్యాయి. వీరిలో 30సంవత్సరాల సీనియర్ న్యాయవాదుల జాబితాలో బార్ ఎగ్జిక్యూటివ్ సభ్యునిగా అందరికీ తలలో నాలుకలా మెసిలే న్యాయవాది పడవల ఏడుకొండలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆయన ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు బార్ ఎన్నికల అధికారి డిపి రామకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా సీనియర్ న్యాయవాది పడవల ఏడుకొండలు మాట్లాడుతూ బార్ కౌన్సిల్ సభ్యులు సూరాబత్తుల మల్లేశ్వరరావు,బెజవాడ బార్ మాజీ అధ్యక్షులు వివి గుర్నాథంల నేతృతంలో న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి తనవంతుగా కృషి సల్పుతానని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఏకగ్రీవంగా ఇసి సభ్యునిగా ఎన్నికైన న్యాయవాది పడవల ఏడుకొండలుకు పలువురు సీనియర్, జూనియర్ న్యాయవాదులు అభినందనలు తెలిపారు.

## మరణించిన న్యాయవాదుల నామినీలకు చెల్లించే పరిహారం పెంపు

**విజయవాడ,మార్చి 23,ప్రభాతవార్త:** నేటి నుండి అడ్వకేట్ వెల్ఫేర్ ఫండ్‌లో భాగంగా మరణించిన న్యాయవాదుల నామినీలకు చెల్లించే మొత్తాన్ని రూ.5లక్షల నుండి 6 లక్షలకు పెంచుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బార్ కౌన్సిల్ ఛైర్మన్ నల్లారి ద్వారకానాథ్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆదివారం ఏకగ్రీవంగా బార్ కౌన్సిల్ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు రాష్ట్ర బార్ కౌన్సిల్ ఛైర్మన్ తెలిపారు.ఈ నిర్ణయం ప్రకారం ఈ ఆదేశాలు ఏప్రిల్ 1,2025 నుండి అమలు లోకి వస్తాయని పేర్కొన్నారు. అంతేకాక రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న న్యాయవాదులు,వారి జీవిత భాగస్వాములకు వైద్య సహాయాన్ని రూ.లక్ష నుండి రూ.లక్ష 50 వేలకు పెంచాలని ఈ సమావేశంలో నిర్ణయించారు.అదనంగా బార్ కౌన్సిల్ రోల్స్‌లో నమోదు చేసుకున్న న్యాయవాదులు ప్రమాదవశాత్తు మరణిస్తే వారి కుటుంబ సభ్యులకు రూ.5 లక్షల మేర ప్రమాద పరిహారాన్ని అందించే కొత్త పథకాన్ని ఈ సంవత్సరం మే 1 నుండి అమలు చేయాలని బార్ కౌన్సిల్ ఈ సమావేశంలో నిర్ణయించినట్లు ఛైర్మన్ నల్లారి ద్వారకానాథ్‌రెడ్డి తెలిపారు. ఈ పథకాలన్నీ బార్ కౌన్సిల్ నిధుల నుండి అందించబడతాయని స్పష్టం చేశారు.

## పునర్విభజనకు జగన్ పరోక్ష మద్దతు

### పిసిసి అధ్యక్షురాలు షర్మిల

**విజయవాడ,మార్చి 23 ప్రభాతవార్త ప్రతినిధి:** జనాభా ప్రాతిపదికన లోక్‌సభ నియోజకవర్గాలను పునర్విభజించాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయంపై నోరు విప్పకపోవడం ద్వారా ప్రధాన మోదీకి మాజీ ముఖ్యమంత్రి జగన్ పరోక్షంగా మద్దతిస్తున్నట్లుగా ఉందని రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు షర్మిల పేర్కొన్నారు. డీలిమిటేషన్‌తో దక్షిణాది రాష్ట్రాలు తీవ్రంగా నష్టపోతాయని విజయవాడలోని పీసీసీ కార్యాలయం నుంచి విడుదల చేసిన ప్రకటనలో ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. జనాభా ప్రాతిపదికన సీట్లను విభజిస్తే ఉత్తరాది ప్రాబల్యం మరింతగా పెరుగుతుంది. ఒక్క ఉత్తర్‌ప్రదేశ్‌లోనే 143 ఎంపీ సీట్లు పెరుగుతాయి. దక్షిణాదిలోని తమిళనాడు కర్ణాటక, ఏపీ తెలంగాణ వంటి ప్రధాన రాష్ట్రాల్లో 144 సీట్లు మాత్రమే పెరుగుతాయి. ఇది కాదా వివక్ష చూపడం అంటే? యూపి బిహార్ రెండు రాష్ట్రాలు కలిపితే 122 సీట్లు పెరిగితే దక్షిణాది మొత్తం కలిపిన 192 సీట్లకే పరిమితం. ఇది అన్యాయం కాదా? డీలిమిటేషన్‌పై దక్షణాది రాష్ట్రాలు చేస్తున్నది రాజకీయం కాదు. ప్రజల హక్కుల కోసం చేస్తున్న పోరాటం. జనాభా ప్రాతిపదికన పునర్విభజన అంగీకరించే ప్రసక్తే లేదు. ఈ అంశంపై రాజకీయాలు పక్కనపెట్టి వైకాంగ్రెస్ పార్టీ. తెలుగుదేశంపార్టీ,జనసేన పార్టీలు ప్రజల హక్కులను కాపాడాలి అని కోరారు.

## రాజ్‌భవన్‌లో బీహార్ ఆవిర్భావ వేడుకలు

### హాజరైన గవర్నర్ అబ్దుల్ నజీర్

**విజయవాడ, మార్చి 23 ప్రభాతవార్త ప్రతినిధి:** బిహార్ రాష్ట్ర ఆవిర్భావ వేడుకలను విజయవాడలోని ఏపీ రాజ్‌భవన్‌లో నిర్వహించారు. ఏక్ భారత్-శ్రేష్ఠ్ భారత్‌లో భాగంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో గవర్నర్ అబ్దుల్ నజీర్ పాల్గొని మాట్లాడారు. బిహార్‌కు ఘనమైన చరిత్ర ఉంది. అన్నిమతాల వారూ కలిసి మెలిసి జీవించే ఆధ్యాత్మిక ప్రాముఖ్యత కలిగిన రాష్ట్రం. వాల్మీకి, గౌతమబుద్ధ, మహావీర, గురుగోవింద్ సింగ్ మహారాజ్ వంటి ఆధ్యాత్మిక గురువులు నడయాడిన ప్రాంతం అని పేర్కొన్నారు. అంతకు ముందు బిహార్ గవర్నర్ ఆరిఫ్ మొహమ్మద్ ఖాన్ వీడియో సందేశాన్ని ప్రదర్శించారు. విజయవాడ పరిసరాల్లో చదువుకుంటున్న బిహార్‌కు చెందిన విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శినలిచ్చారు. గవర్నర్ కార్యదర్శి డాక్టర్ ఎం.హరి జవహర్‌లాల్ తదితరులు పాల్గొన్నారు.

# రుషి కొండపై బ్లూఫ్లాగ్ పునరుద్ధరణ

## ఇచ్చిన మాట నిలబెట్టుకున్నాం: మంత్రి దుర్గేష్

**విజయవాడ, మార్చి 23 ప్రభాతవార్త ప్రతినిధి:** రుషికొండ బీచ్‌కు బ్లూఫ్లాగ్ గుర్తింపు పునరుద్ధరణపై మంత్రి కందుల దుర్గేష్ హర్షం వ్యక్తం చేశారు. బ్లూఫ్లాగ్ పునరుద్ధరణపై గతంలో ఇచ్చిన మాట నిలబెట్టుకున్నామన్నారు. ఇందు కోసం కృషిచేసిన అధికారులకు మంత్రి అభినందనలు తెలిపారు. సీఎం చంద్రబాబు డిప్యూటీ సీఎం పవన్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మరికొన్ని బీచ్‌లకు సైతం బ్లూఫ్లాగ్ గుర్తింపు కోసం ప్రతిపాదనలు పంపినట్లు మంత్రి తెలిపారు. రాష్ట్రంలో పర్యాటకరంగాన్ని అనుహ్యంగా సంస్కరిస్తామన్నారు. విదేశీయ టూరిస్టులను ఆకర్షించే దిశలో చర్యలు తీసుకుంటామన్నారు. భారతదేశంలో బ్లూఫ్లాగ్ గుర్తింపు పొందిన మొదటి ఎనిమిది బీచ్‌లలో రుషికొండ ఒకటని తెలిపిన మంత్రి దుర్గేష్ నిరంతరం రుషికొండ బీచ్‌లో భద్రతా ప్రణాళిక, పర్యావరణం,



ట్రాఫిక్, నీటిశుద్ధి, వ్యర్థాల నిర్వహణ సక్రమంగా చేపట్టేలా అధికారులకు ఆదేశాలు జారీ చేసామన్నారు. రాష్ట్రంలో మరిన్ని బీచ్ లకు బ్లూఫ్లాగ్ సర్టిఫికేట్ కోసం ఇప్పటికే ప్రతిపాదనలు పంపామని వెల్లడించారు. మరి కొన్ని బీచ్ లకు బ్లూఫ్లాగ్ సర్టిఫికెట్ వస్తే ఆయా బీచ్ లకు ప్రత్యేక నిధులు వచ్చి మరింత అభివృద్ధి చెందుతాయని తెలిపారు. ఇప్పటికే రుషికొండ బీచ్‌పై విధించిన తాత్కాలిక ఉపసంహరణ ఆదేశాలు ఎత్తివేస్తున్నట్లు బ్లూఫాగ్ ఇండియా అధికారులు ప్రకటించి విశాఖపట్నం కలెక్టర్ కు సబంధిత ధ్రువీకరణ పత్రం అందజేశారు. మళ్లీ రుషికొండ బీచ్ కు బ్లూఫాగ్ హోదాను డెన్మార్కు కు చెందిన ఫౌండేషన్ ఫర్ ఎన్విరాన్‌మెంట్ ఎడ్యుకేషన్ సంస్థ ప్రకటించింది. బ్లూ ఫ్లాగ్ సర్టిఫికేషన్ పొందిన రుషికొండ బీచ్‌లో మళ్లీ నీలిరంగు జెండా రెపరెపలాడుతోంది. యుద్ధప్రాతిపదిక పర్యాటక శాఖాధికారులకు దిశానిర్దేశం చేస్తూ అనతి కాలంలోనే బ్లూఫ్లాగ్ పునరుద్ధరణకు చర్యలు తీసుకున్న మంత్రి దుర్గేష్ ను రాష్ట్ర ప్రజలు, పర్యాటకులు, ప్రత్యేకించి విశాఖ వాసులు అభినందిస్తున్నారు.

## గవర్నర్‌ను కలిసిన ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు

**విజయవాడ, మార్చి 23 ప్రభాతవార్త ప్రతినిధి:** 78వ గణతంత్ర దినోత్సవ వేడుకలలో ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ యూనివర్సిటీల నుంచి న్యూఢిల్లీలో 40రోజుల పాటు పెరేడ్ చేసి 78వ గణతంత్ర దినోత్సవ వేడుకలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్‌జస్టిస్ సయ్యద్ అబ్దుల్ నజీర్ గవర్నర్‌ని మర్యాదపూర్వకంగా కలిసారని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఫ్రీ రిపబ్లిక్ పెరేడ్ కంటిన్జెంట్ లీడర్,ఎన్టీఆర్ జిల్లా ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ కొల్లేఇ రమేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లు మాట్లాడుతూ మన రాష్ట్ర గవర్నర్‌ని కల



వడం సంతోషంగా ఉందని తెలిపారు. గవర్నర్ జస్టిస్ సయ్యద్ అబ్దుల్ నజీర్ మాట్లాడుతూ మీరందరూ రేపటి భావిభారత పౌరులుగా దేశానికి సేవలందించాలని కొనియాడడారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుండి ఢిల్లీ గణతంత్ర దినోత్సవ వేడుకల్లో పాల్గొని రాష్ట్ర ప్రతిష్ట కోసం కృషి చేసిన మీ అందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు మరియు ధన్యవాదాలు తెలిపారు.

## బలభద్రపురం కేన్సర్ కేసులకు చికిత్సలు: మంత్రి సత్యకుమార్ యాదవ్

**విజయవాడ, మార్చి23,ప్రభాతవార్తప్రతినిధి:** బలభద్రపురంలో కాన్సర్ కేసులపై దృష్టి పెట్టి, చికిత్సలను అందిస్తున్నామని ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. అక్కడ వైద్య శిబిరం ఏర్పాటు చేశామని ప్రస్తుతం వైద్య బృందాలు బలభద్రపురంలో ఇంటింటికి తిరిగి వివరాలు సేకరిస్తున్నారని మంత్రి తెలిపారు. కాన్సర్ బాధితులకు చికిత్స ప్రారంభించి ఉచిత కాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేస్తున్నారని తెలిపారు.త్వరలో కర్నూలులో కాన్సర్ చికిత్సా కేంద్రం అందుబాటులో ఉంటుందని తెలిపారు. అత్యాధునిక వైద్య సేవలను ప్రజలందరికీ అందుబాటులోకి తేవాలని మంత్రి సత్యకుమార్ అన్నారు. విజయవాడలోని ఓ కార్పోరేట్ ఆస్పత్రిలో



ప్రోస్టేట్ సమస్యలకు అందుబాటులోకి వచ్చిన విప్లవాత్మక చికిత్సా విధానం "రెజ్యూమ్"ను ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు, ఎమ్మెల్యేలు గద్దె రామ్మోహన్ రావు, కామినేని శ్రీనివాస్, బోడే ప్రసాద్‌లతో కలసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజారోగ్య పరిరక్షణకు ప్రాధాన్యతను ఇస్తున్నా మన్నారు. రాష్ట్రంలో ప్రప్రథమంగా అందు బాటులోకి వచ్చిన ఈ ఆధునిక చికిత్సతో ప్రజలకు మరింత మెరుగైన సేవలందించడం సాధ్యమవుతుందని మంత్రి ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఎన్టీఆర్ వైద్యసేవను మరింత విస్తరించి పేద ప్రజలకు సైతం అత్యున్నత స్థాయి కార్పొరేట్ వైద్యాన్ని అందిస్తున్నామని చెప్పారు. ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ లక్ష్యసాధనకు కార్పొరేట్ ఆసుపత్రుల వారు సహకరించాలని మంత్రి సత్యకుమార్ కోరారు. ప్రోస్టేట్ సమస్యలకు సంబంధించిన అన్ని వ్యాధులకు దేశంలోని మొట్టమొదటి సమగ్ర చికిత్సా విభాగంగా విజయవాడలోని కార్పోరేట్ ఆస్పత్రి కొత్త చరిత్రకు శ్రీకారం చుట్టిందని అన్నారు.

## రాష్ట్ర తెలుగు యువత ఉపాధ్యక్షుడి ఆధ్వర్యంలో ఇఫ్తార్

### హాజరైన మంత్రి కొల్లు రవీంద్ర

**విజయవాడ,మార్చి 23,ప్రభాతవార్త:** రంజాన్ మాసం సందర్భంగా రాష్ట్ర తెలుగు యువత ఉపాధ్యక్షులు డాక్టర్ హసీం బేగ్ అధ్వర్యంలో ఇంగ్లీష్‌పాలెం,గౌసియా మసీదులో ఇఫ్తార్ విందును నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర,ఆర్టీసి చైర్మన్ కొనకళ్ళ నారాయణరావు,కొనకళ్ళ బుల్లయ్య,మాజీ మున్సిపల్ చైర్మన్ బాబూ ప్రసాద్,మాదివాడ రాము,ఇలియాస్ ఫాషా,వసీంబేగ్,పలపాటి సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.



## స్వాతంత్ర్య సమర వీరులకు సిఎం చంద్రబాబు నివాళి

**విజయవాడ,మార్చి23,ప్రభాతవార్తప్రతినిధి:** భారత జాతికి స్వేచ్ఛా జీవితాన్ని ప్రసాదించడానికి 23 ఏళ్ల వయసులోనే వీరోచిత పోరాటలు చేసి.. యువ హృదయాలపై చెరగని ముద్ర వేసిన స్వాతంత్ర్య సమర వీరులు భగత్ సింగ్,రాజ్ గురు , సుఖ్ దేవ్‌లు ఉరికంబం ఎక్కి ప్రాణత్యాగం చేసిన షహీద్ దివాస్ సందర్భంగా ఆ అమరవీరుల చరిత్రను మననం చేసుకుంటూ వారి సంస్మృతికి నివాళులర్పిద్దామని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. భగత్ సింగ్ సుఖ్ దేవ్, రాజ్ గురు. వాళ్ల పేర్లు వింటే చాలు ప్రతి భారతీయుడి గుండె గర్వంతో నిండిపోతుంది. ఈ ముగ్గురూ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా భరతమాత కోసం పోరాడిన మహావీరులు. భారతదేశ స్వాతంత్ర్యం కోసం తమ ప్రాణాలనే ఆర్పించారు.

అలాంటి త్యాగమూర్తు లను ఈ రోజు మన దేశం స్మరించుకుంటుందని అన్నారు. స్వేచ్ఛ, న్యాయం కోసం వారు నిర్భయంగా చేసిన కృషి మనందరికీ స్ఫూర్తి అని ఆయన అన్నారు. ఆ అమరవీరుల చరిత్రను మననం చేసుకుంటూ వారికి ఘనంగా నివాళులర్పించారు. భగత్ సింగ్, సుఖ్ దేవ్, రాజ్ గురు.. ఈ ముగ్గురూ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా భరతమాత కోసం పోరాడిన మహావీరులు. వీరి పేర్లు వింటేనే భారతీయుల రక్తం దేశభక్తితో ఉప్పొంగిపోతుంది.

అలాంటి దేశభక్తులను ఉరి తీసిన రోజు నేడే. 23 మార్చి, 1931న అప్పటి బ్రిటిష్ ప్రభుత్వం వారిని ఉరితీసింది. 17, డిసెంబర్ 1928న బ్రిటన్ అధికారి శాండర్స్‌ను హత్య చేయడం, పార్లమెం ట్‌లో బాంబులు వేయడం వంటి కారణాలను చూపి ముగ్గురినీ ఉరితీశారు. ఈ నేపథ్యంలోనే ప్రతి ఏటా ఆ రోజును అమర వీరుల దినోత్సవం (షహీద్ దివస్)గా జరుపుకుంటారు.

# ఆస్తి పన్ను పెంపు నిలిపివేయాలి

## సిఎం చంద్రబాబుకు వి.శ్రీనివాసరావు లేఖ

**విజయవాడ,మార్చి23,ప్రభాతవార్తప్రతినిధి:** పట్టణాలలో ఆస్తి పన్ను పెంపుదలకు సంబంధించి మున్సిపల్ సవరణ చట్టం 44/2020 రద్దు, ఆస్తి పన్ను పెంపు నిలిపివేయాలని కోరుతూఎపి ముఖ్యమంత్రి చంద్రబాబుకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు లేఖ రాశారు. గత ప్రభుత్వం పట్టణాలు, నగరాలలో ఆస్తి పన్ను మదింపు విధానాన్ని మారుస్తూ మునిసిపల్ కార్పొరేషన్ చట్టాలలో సవరణ చేస్తూ ఆర్డినెన్సు నెం.23.11.2020న ఆర్డినెన్సు నెం.16/2020 ని విడుదల చేసిందని, ఈ ఆర్డినెన్సును సవరణ



చట్టం 44/2020గా అసెంబ్లీలో ఆమోదించారని అన్నారు. అప్పటి వరకు ఉన్న అద్దె విలువలపై ఆస్తి పన్ను (ఇంటిపన్ను) మదింపు చేసే విధానాన్ని మారుస్తూ ఆస్తి కేపిటల్ విలువపై ఆస్తిపన్ను మదింపు చేసే విధానాన్ని ఈ చట్టం ద్వారా ప్రవేశపెట్టారనీ, దీనిని అమలు జరపడం కోసం రూల్సు రూపొందించి ఆర్డినెన్సు విడుదల చేసిన మరుసటిరోజే 24.11.2020న జి.వో.ఎం.ఎస్.నెం.198ని విడుదల చేశారనీ తెలిపారు. 202425 ఆర్థిక సంవత్సరం ముగింపులో ఉన్నందున ఇంటిపన్ను చెల్లించాలని అధికారులు ఒత్తిడి చేస్తున్నారని సిఎం చంద్రబాబుకు శ్రీనివాసరావు తెలిపారు. తక్షణమే కట్టకపోతే మంచినీరు, డ్రైనేజీ కనెక్షన్‌లు తొలగిస్తామని బెదిరిస్తున్నారని, కొన్నిచోట్ల ఇప్పటికే తొలగించారు అని చెప్పారు. ఆర్థిక సంవత్సరం ముగియకుండానే పెనాలిటీతో వసూలు చేయడం సమంజం కాదు అని అన్నారు. కావున 24 శాతం పెనాల్టీలు రద్దు చేసి మే నెలాఖరు వరకు పెనాల్టీ లేకుండా పన్నులు ప్రజలు చెల్లించే అవకాశం కల్పించాలని అందుకు తగు ఆదేశాలు ఇవ్వాలని సిఎంను కోరారు.

## కొండపై అనధికారుల తరిమివేత

**తిరుమల,మార్చి 23 ప్రభాతవార్తప్రతినిధి:** ఏడుకొండలపై అనధికారికంగా, ఎలాంటి పనులు లేకుండా తిష్టవేసిన పెద్దసంఖ్యలో వ్యక్తులను తిరుమల పోలీసులు తిరుపతికి తరలించారు. తిరుమల పుణ్యక్షేత్రం కావడం, ఇక్కడ ప్రశాంతత నెలకొల్పడంలో భాగంగా, ఇటీవల అనధికార వ్యక్తలు మద్యం సేవించి మత్తులో హల్‌చల్ చేయడం, హత్యాయత్నాలకు పాల్పడటం వంటివి జరిగాయి. ఈ నేపథ్యంలో సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాలతో తిరుపతి జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్‌రాజు సూచనలతో తిరుమల డిఎస్పీ విజయశేఖర్,సిఐలు విజయ కుమార్, రాయుడు భారీగా స్థానికులు ఉంటున్న బాలాజీనగర్, మేదరమిట్ట వెనుకవైపు, బాటగం గమ్మ ఆలయం వెనుక ప్రాంతాల్లో టెంట్లు వేసుకుని అనధికారికంగా ఉన్న వారందరినీ ఖాళీ చేశారు. 44మంది మగ వారిని, 28మంది మహి ళలను తిరుపతికి దించేశారు. అనధికారికంగా ఉంటే చట్టపరంగా చర్యలు



తీసుకుంటామని సిఐ విజయకుమార్ తెలిపారు.

# తిరుమల సమాచారం



## నేడే వెంకన్న వార్షిక బడ్జెట్

### రూ.5,400కోట్లరూపాయల అంచనాతో ప్రతిపాదనలు

### హుండీ ద్వారా రూ.1,800కోట్లు ఆదాయం దిశగా అడుగులు

**ప్రభాతవార్తప్రతినిధి-తిరుమల:** అత్యంత సంపన్నవంతమైన హిందూ దేవుళ్ళలో తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామికి సంబంధించిన 2025-26 వార్షిక బడ్జెట్ ప్రతిపాదనలు 5,400కోట్ల రూపాయలపైమాటగానే అంచనాలు సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. ఇందులో రానున్న ఆర్థిక సంవత్సరంలో భక్తులు తమ మొక్కుబడుల్లో కానుకల రూపంలో 1,800కోట్ల రూపాయలు ఆదాయం రావచ్చనే అభిప్రాయంతో రూపొందించారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తరువాత టిటిడి పాలకమండలి ఆదాయాన్ని పెంచుకునే దిశగా, వ్యయాన్ని తగ్గించే మార్గాలను అనుసరిస్తోంది. టిటిడి ఛైర్మన్ బి ఆర్ నాయుడు సారథ్యంలోని పాలకమండలి, టిటిడి ఇఒ శ్యామలరావు, అదనపు ఇఒ చిరు మామిళ్ళ వెంకయ్యచౌదరి శ్రీవేంకటేశ్వరస్వామికి ఆదాయం చేకూర్చేదిశగా కార్యాచరణ రూపొందించారు. సోమవారం తిరుమలలో జరగనున్న వార్షిక బడ్జెట్ పాలకమండలి సమావేశంలో దీన్ని ఆమోదించనున్నారు. గత ఏడాది మార్చినెల నుండి ఈ ఏడాది ఫిబ్రవరి నెలాఖరు వరకు ఏడుకొండల వేంకటేశ్వరస్వామికి హుండీద్వారా రాబడిన ఆదాయాన్ని పరిగణనలోనికి తీసుకుని బడ్జెట్ తయారుచేయడం షరామామూలే. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి గత ఏడాది ఫిబ్రవరి ఆఖరులోనే వార్షిక బడ్జెట్‌ను 5,141.74కోట్ల రూపాయల అంచనాతో అప్పటి టిటిడి ధర్మకర్తలమండలి ఆమోదించిన విషయం విదితమే. ఈ ఏడాది అంతేస్థాయిలో కొంచెం ఇంచుమించుగా 5,400కోట్ల రూపాయల వరకు ఆదాయం సముపార్జన ఉండవచ్చనేది అంచనా . టిటిడి ఉన్నతాధికారులు వార్షిక గణాంకాలు ప్రాతిపదికన బడ్జెట్ రూపొందించి,తుది మెరుగులు దిద్దారు.దీన్ని టిటిడి ఛైర్మన్ బిఆర్ నాయుడు కూడా పరిశీలించారు. 2024-25 వార్షిక బడ్జెట్‌లో అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడు ,శ్రీవేంకటేశ్వరస్వామికి ఆదాయం 5,141కోట్లు సముపార్జించుకునే రీతిలో రూపొందించారు. వడ్డీకాసులవాని దర్శనానికి విచ్చేస్తున్న భక్తులు తమ మొక్కుబడుల్లో భాగంగా కానుకల రూపంలో హుండీకి సమర్పించే ఆదాయం రూపేణా 1,611కోట్ల రూపాయలుగా అంచనా వేశారు. స్వామివారి ప్రసాదాల విక్రయం ద్వారా 600కోట్ల రూపాయలు, ఆర్జితసేవలు, విఐపి బ్రేక్ దర్శనాలు, ప్రత్యేకప్రవేశదర్శనాలు ద్వారా 338కోట్లు, ఆర్జితసేవల ద్వారానే 150కోట్లు, కల్యాణమండపాల అద్దెరూపంలో 147కోట్లు రూపాయలు, భక్తులు సమర్పించే తలనీలాల ద్వారా కల్యాణకట్టనుండి 151.50కోట్ల రూపాయలు, వివిధ బ్యాంకుల్లో దేవుని డిపాజిట్లు ద్వారా 1,167కోట్ల రూపాయలు వడ్డీరూపంలో ,ఇతరత్రా రూపేణా 129కోట్లు రూపాయలు ఇలా వరుసగా ఆదాయం 5,141 కోట్లు సముపార్జించుకునేలా అంచనా వేశారు. 2023-24 సంవత్సరానికి దేవుని వార్షిక బడ్జెట్ 4,411కోట్ల రూపాయలుగా అంచనా వేసిన టిటిడి అధికారులు అందుకు అనూహ్యంగా రెట్టింపుస్థాయిలో 5,122.80 కోట్లు రూపాయలు ఆదాయం గడించింది. వడ్డీకాసులవాని ఆదాయం రూపంలో వచ్చే కానుకలను భక్తుల సౌకర్యాలకు, భద్రతకు, వసతి కల్పనకు సద్వినియోగం చేసేలా బడ్జెట్ ప్రతిపాదనలు ఉంటాయి.


## ప్రజలందరికీ మంచి జరగాలి



**తిరుమల,మార్చి 23 ప్రభాతవార్తప్రతినిధి:** శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకుంటే మంచి జరుగుతుందని, తెలుగుప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని స్వామివారిని ప్రార్ధించినట్లు పలువురు ప్రముఖులు తెలిపారు.కుటుంబసమేతంగా ఆదివారం ఉదయం ఆలయం వద్దకు తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టీస్ సుధ, రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తులు జస్టీస్ సుజాత, జస్టీస్ సురేష్‌రెడ్డి, చెన్నై హైకోర్టున్యాయమూర్తి జస్టీస్ భవానీసుబ్రమణియన్, వయొలిన్ వాద్యకారుడు పద్మశ్రీ అన్నవరపు రామస్వామి, భారత మాజీ క్రికెటర్ నిఖిల్‌చోప్రా తదితరులు వేర్వేరుగా విచ్చేశారు. తొలుత ఆలయంలోని ధ్వజస్తంభం మొక్కారు. ఆనందనిలయంలోనికి చేరుకుని శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. టిటిడి అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## వేదవిద్య దినదినాభివృద్ధి చెందాలి

### అహోబిలం మఠాధిపతి యతీంద్రమహాదేశికన్



**తిరుమల,మార్చి 23ప్రభాతవార్తప్రతినిధి:** హిందూ సనాతనధర్మ విస్తృతప్రచారంలో వేదాలు కీలకమని, వేదవిద్య దినదినాభివృద్ధి చెందాలని అహోబిల మఠాధిపతి రంగనాథయతీంద్ర మహాదేశికన్ అన్నారు. తిరుమలలోని ధర్మగిరి వేద విజ్ఞానపీఠాన్ని ఆదివారం ఆయన సందర్శించారు.ఇక్కడ వేదవిద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు అనుగ్రహభాషణం చేశారు. వేద విద్యాభివృద్ధికి టిటిడి చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. తానుకూడా వేదవిజ్ఞానపీఠం పూర్వవిద్యార్థినే అని గుర్తుచేసుకున్నారు. వేదవిద్య విధానం అమలుపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులతో కలసి 17 వేదాలను ఆయన పఠిం చారు. ఈ కార్యక్రమంలో వేదవిజ్ఞానపీఠం ప్రిన్సిపాల్ కుప్పాశివసుబ్రమణ్యఅవధాని, టిటిడి ఆగమ సలహాదారుడు మోహనరంగాచార్యులు, వేద, ఆగమపండితులు పాల్గొన్నారు.

## రెండురోజులు విఐపి బ్రేక్‌కు సిఫార్సులు తేవొద్దు

### రేపు, 30న విఐపి బ్రేక్ దర్శనాలు రద్దు

**తిరుమల,మార్చి 23ప్రభాతవార్తప్రతినిధి:** శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 30వతేదీ ఆదివారం తెలుగు నూతన "విశ్వావసు"నామసంవత్సర"ఉగాది పర్వదిన ఆస్థానం శాస్త్రోక్తంగా జరగనుంది. ఈ సందర్భంగా రేపు,30తేదీల్లో విఐపి బ్రేక్ దర్శనాలు టిటిడి రద్దు చేసింది. ఇందుకు సంబంధించి నేడు, 29నవిఐపి బ్రేక్ దర్శనాలకు సంబంధించి సిఫార్సులేఖలు స్వీకరించబడవు. రేపు మంగళవారం ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం జరగనుంది. ఈ కారణంగా విఐపి బ్రేక్ రద్దుచేశారు.

**బంగారు వాకిలిలో ఆస్థానం:** శ్రీవేంకటేశ్వరస్వామి కొలువైన ఆనందనిలయానికి ముందు బంగారువాకిలిలో 30వతేదీ ఆదివారం తెల్లవారుజామున 3గంటలకు సుప్రభాతం అనంతరం ఆలయ శుద్ధి చేస్తారు. ఉదయం 6గంటలకు శ్రీదేవిభూదేవిసమేత మలయప్పస్వామివారికి ,విశ్వక్సేనుల వారికి విశేష సమర్పణ జరుగుతుంది. ఉదయం 7గంటల నుండి 9గంటల వరకు విమానప్రాకారం,ధ్వజస్తంభం చుట్టూ ఊరేగింపుగా ఆలయంలోనికి ప్రవేశిస్తారు. ఆ తరువాత వెంకన్న మూలవిరాట్టుకు ,ఉత్సవమూర్తులకు నూతన వస్త్రాలను ధరింపజేస్తారు. ఆ తరువాత పంచాంగ శ్రవణం నిర్వహిస్తారు. ఉగాది ఆస్థానాన్ని బంగారు వాకిలివద్ద ఆగమ పండితులు, అర్చకులు ఆగమోక్తంగా నిర్వహిస్తారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామివారికి జరిగే ఆర్జి తసేవలు కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, ఆర్జితబ్రహ్మోత్సవం టిటిడి రద్దు చేసింది.

## విద్యాసంస్థల్లో 'కిశోరి వికాసం'

**విజయవాడ మార్చి 23 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విద్య, ఆరోగ్యం, పోషకాహారం, మానవ అక్రమ రవాణా, ఆత్మరక్షణ జీవనోపాధి అవకాశాలు , బాల్య వివాహాల నిర్మూలన తదితర అంశాలపై కిశోరి వికాసం కార్యక్రమాన్ని తిరిగి ప్రారంభించాలని నిర్ణయించింది. పాఠశాల విద్యాశాఖ సహకారంతో అమలు చేయడానికి మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ నోడల్ విభాగంగా పని చేస్తుంది. దీంట్లో భాగంగా పాఠశాలలు కళాశాలల్లో విద్యార్థులతో కిశోరి వికాసం బృందాలను ఏర్పాటు చేయాలని విద్యాశాఖ ఆదేశించింది. నోడల్ ఉపాధ్యాయిని ఆధ్వర్యంలో ఈ కమిటీలు ఏర్పాటు చేస్తారు. ప్రతి బృందంలో 15 నుంచి 20 మంది ఉంటారు. బాలికలు, బాలురకు అవగాహన కార్యక్రమం నిర్వహించడానికి పాఠశాలల్లో గ్రూప్ శిక్షకులు నోడల్ అధికారులు ప్రతి శనివారం వీడియోలు, చిత్రాలు పోస్టర్‌లు, కమ్యూనికేషన్ మెటీరియల్‌తో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తారు.బాల్య వివాహాలను ఎలా నియంత్రించాలి. ఆత్మరక్షణంశాలకు సంబంధించి బాలికలకు కీలక అవగాహన కలిగిస్తారు.గతంలో తెలుగుదేశం ప్రభుత్వ హయంలో కార్యక్రమాన్ని నిర్వహించేవారు.

వార్త

ఆశలకు, శక్తిసామర్థ్యాలకు మధ్య అగాధం ఉంటుంది. దాన్ని అర్థం చేసుకున్నవారు ఎప్పుడూ సుఖపడతారు.

-గాథే

# ట్రంప్‌కు పగ్గాలెప్పుడు?

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్ అమలు చేస్తున్న, తీసుకుంటున్న నిర్ణయాలు ప్రపంచ దేశాలను నివ్వెరపరుస్తున్నాయి. ఒకపక్క న్యాయస్థానాల్లో ఇటీవల అమలుచేసిన అన్ని నిర్ణయాలపైనా చురకలువేసి వాటన్నింటిపైనా బాధితులకు ఉపశమనం కల్పించినప్పటికీ ట్రంప్ వైఖరి మాత్రం మారలేదు. అక్రమ వలసదారులపై ఉక్కుపాదం మోపుతున్నామని చెప్పిన ట్రంప్ విడతల వారీగా అందరినీ వారివారి దేశాలకు పంపిస్తున్న సంగతి తెలిసిందే. జన్మతఃపౌరసత్వ హక్కును రద్దుచేసి న్యాయస్థానంలో మొట్టికాయలు తిన్నారు. సైన్యంలో ట్రాన్స్ జెండర్ల నియామకాలు, క్రీడల్లో ట్రాన్స్ జెండర్ల పట్ల వివక్ష చూపించారంటూ ఆయనపై పలు కేసులు దాఖలయ్యాయి. ఇక తాజాగా తనఅనుంగు మిత్రుడు, బిలియనీర్ పారిశ్రామికవేత్త ఎలాన్ మస్క్‌కు కష్టం వస్తే చాలు తనకు కష్టమొచ్చిందన్నట్లుగా ట్రంప్ ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఆయనకు ఉన్న టెస్లా కార్ల సంస్థపై ఎవరు దాడులుచేసినా వారికి 20 ఏళ్ల జైలుశిక్ష అంటూ న్యాయస్థానాల కంటే ముందుగా ఆయనే శిక్షలు కూడా నిర్ణయించేసారు. ట్రంప్ నియమించిన డోజ్‌కు ఛీఫ్‌గా ఉన్న మస్క్ వేలాదిమంది ఉద్యోగులపై వేటువేసారు. ప్రభుత్వశాఖల్లో ఉద్యోగులపైనా కఠిన కార్యాచరణఅమలు చేసారు. మీరేం పనిచేసారో చెప్పాలంటూ వారికి ఇమెయిల్స్ పంపించడంతో ఈ ఉదంతంకూడా న్యాయస్థానాలకు పోయింది. ఇక దేశంలో ప్రక్షాళన, వృథా వ్యయం అరికట్టే నెపంతో చేపట్టిన కార్యాచరణ ఒవక్క కొనసాగుతుంటే మరోపక్క విదేశాల నుంచి వచ్చి నివసిస్తున్నవారిపైనా కార్యనిర్వాహక ఉత్తర్వులపేరిట మరో వెన్నుపోటు పొడిచారు. నిజానికి ఏదేశంలో అయినా అనిశ్చితి, అంతర్యుద్ధం వంటివాటితో భయపడి ఇతర దేశాల్లో ఆశ్రయం పొందాలని వచ్చినవారికి అమెరికా వెసులుబాటు కల్పిస్తున్నది. అందుకు ఆ రాజ్యాంగంలోనే పొందుపరిచారు. అమెరికా గుర్తించిన కొన్ని దేశాల పౌరులు రెండేళ్లపాటు అమెరికాలో ఉంటూ ఉపాధి పొందవచ్చు. అయితే ఈ వెసులుబాటును ఆసరాగా చేసుకుని అక్రమ వలసదారులు పెరిగిపోయారని ట్రంప్ భావించారు. ఇప్పుడు వారిపైనా వేటువేసారు. తాత్కాలిక నివాస హోదాను రద్దుచేస్తు ఉత్తర్వులు విడుదలచేయించారు. డిపార్టుమెంట్ ఆఫ్ హోంల్యాండ్ సెక్యూరిటీ ఈమేరకు ప్రకటన జారీచేసింది. క్యూబా, హైతీ, నికరాగ్వా, వెనెజులా దేశాలకు చెందిన లక్షలాది మంది వలసదారులకు ఈ నిర్ణయం వల్ల చట్టపరమైన రక్షణ కరువవుతుంది. నెలరోజుల్లో వారందరినీ దేశం నుంచి బహిష్కరించనున్నట్లు హోంల్యాండ్ సెక్యూరిటీ ప్రకటించింది. గడచిన మూడేళ్లుగా అంటే 2022 అక్టోబరు తర్వాత ఆ దేశాల నుంచి అమెరికాకు వలసదారులుగా వచ్చిన సుమారు 5.32 లక్షలమందికి ఇప్పుడు ఈ ఉత్తర్వులు అమలవుతాయి. ఖచ్చితంగా వారిపై బహిష్కరణ వేటు పడుతుంది. వీరంతా ఇతరుల సాయంతో అమెరికాకు వచ్చారని, మానవతాదృక్పథంతో కూడిన పెరోల్‌పై వీరంతా తాత్కాలిక ఉపాధిపొందుతూ రెండేళ్లపాటు అమెరికాలో నివసించేందుకు తాత్కాలిక అనుమతులు మాత్రమే పొందినట్లు అమెరికా వలసల విభాగం చెపుతోంది. వీరందరిపైనా వచ్చేనెల 24 లేదా ఫెడరల్ రిజిస్టరులో నోటీసులు ప్రకటించిన 30 రోజుల తర్వాత అమెరికాలో ఉండేందుకు న్యాయపరమైన హోదాను కోల్పోతారు. ఎన్నికల ప్రచారంలోనే 'హ్యూమానిటీ పెరోల్' పేరిట ఇచ్చే ఈ తాత్కాలిక సదుపాయం భారీగా దుర్వినియోగం అవుతోందని, తాను అధికారంలోకి రాగానే చెక్ పెడతానని ట్రంప్ ప్రకటించారు. అమెరికాలో సుదీర్ఘకాలంగా అంటే ట్రంప్ రాజకీయాల్లోకి రాక కొన్ని తరాల ముందు నుంచే ఈ వెసులుబాటు ఉంది. యుద్ధం, రాజకీయ అస్థిరత, అంతర్యుద్ధాలతో సతమతం అవుతున్న దేశాల్లోని ప్రజలు అమెరికాలో తాత్కాలికంగా నివసించి ఉపాధిపొందేందుకు వీలుగా నేరుగా అధ్యక్షుడే వీరికి చట్టపరమైన హోదా ఇస్తారు. ఇప్పుడు ట్రంప్ అధికారంలోకి వచ్చిన తర్వాత హోంల్యాండ్ సెక్యూరిటీ అక్రమ వలసలతోపాటు ఈ హ్యూమానిటీ పెరోల్‌పైనా దృష్టిసారించింది. మొత్తం నివేదికలు క్రోడీకరించి మస్క్‌చీఫ్‌గా ఉన్న డోజ్‌కు పంపించిందో ఏమోకానీ వీరందరిపైనా ఇక ఏప్రిల్‌నెలాఖరు నుంచి వేటుపడుతోంది. అమెరికాను వీరంతా వీడి వెళ్లిపోవాల్సి ఉంటుంది. నిజానికి ఈవీసా పొందినవారు రెండేళ్ల ముగిసిన తర్వాత కొనసాగాలంటే శరణార్థిగా కానీ లేదా వీసాకోసం దరఖాస్తు చేసుకునే వెసులుబాటు ఉంది. ఇప్పుడు ట్రంప్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ దరఖాస్తుల ప్రక్రియ మొత్తం నిలిపివేసారు. వీటిపైనా ఫెడరల్ కోర్టుల్లో లెక్కలేనన్ని పిటిషన్లు దాఖలు అయ్యాయి. అమెరికా ఫస్ట్, అమెరికన్ ఫస్ట్ నినాదాన్ని పదేపదే గుర్తుచేస్తున్న ట్రంప్ 'మేక్ అమెరికా గ్రేట్ అగైన్' అన్న నినాదంతో మొత్తం రిపబ్లికన్ అమెరికన్ల గుండెల్లో నిలిచిపోయారు. దీనితో ఇతర దేశాలవారు వలసలు వచ్చితమ ఉపాధికి గండికొడుతున్నారన్న దుగ్ధ అమెరికన్లలో పెరిగిపోతోంది. అందుకే తుపాకీ సంస్కృతి కూడా పెరిగిపోయింది. అమెరికా ఆవిర్భావమే వలసల రాజ్యంగా వచ్చిందన్న అంశాన్ని ట్రంప్ విస్మరిస్తున్నారు. పాలకులే కొన్ని తరాలకు ముందు వలసలు వచ్చిన సంగతి ఆయనకు తెలియందీ కాదు. కానీ ఆయన కొనసాగిస్తున్న ఈ అనిశ్చితి కార్యాచరణ వల్ల లక్షలాదిమంది ఇప్పుడు దేశం వీడి వెళ్లాల్సిన దుస్థితి ఎదురవుతోంది. ట్రంప్ దూకుడును కట్టడిచేసే చర్నకోల ఝుళిపించకపోతే రానురాను అమెరికా నియంతరాజ్యంగా మారిపోయే ప్రమాదం ఉంది. కొంతలో కొంత అక్కడి ఫెడరల్‌కోర్టులకు మాత్రమే ట్రంప్‌ను కట్టడిచేయగలిగే సామర్థ్యం ఉందని చెప్పుకోవాల్సిన తరుణం మళ్లీ వచ్చింది.

వినడంలో మనిషి తొందర పడాలి, కానీ మాట్లాడటంలో తొందర పడకూడదు.



జేమ్స్ జ్యాడిత్

కష్టతరమైన పనిని చేసే వ్యక్తి, అప్పగించబడిన పనిని చాలా బాగా చేసే వ్యక్తి ఎన్నటికీ తన ఆత్మ గౌరవాన్ని కోల్పోడు.



జార్జి బెర్నార్డ్ షా

# ప్రజావాక్కు



## సినిమాలు వివాదాస్పదం కారాదు

ఛత్రపతి శివాజీ కుమారుడు శంభాజీ జీవిత ఘట్టాలతో రాసినఒక చారిత్రాత్మక నవలఆధారంగా నిర్మించిన ఛావా సినిమా చుట్టూ తొలుత వివాదం రాజుకుని నాగ్‌పూర్‌లో గత సోమవారం చెలరేగిన హింసలో 33మంది పోలీసులు, ఐదుగురు పౌరులు గాయపడగా రెండు బుల్డోజర్లతో సహా అనేక వాహనాలకు దుండగులు నిప్పంటించారు. ఈఘటనల వెనుక ముందస్తు పథకం ఉన్నదని మహారాష్ట్ర ముఖ్యమంత్రి అంటున్న మాటలు వాస్తవమేనా?. కానీ ఈ నెల మొదటి వారంలో సమస్య రాజుకున్నప్పటి నుండి ఇంటిలిజెన్స్ వర్గాలు, పోలీసులు ఏం చేశారు? దుండగుల కదలికలను అంచనా వేయటంలో ఎందుకు విఫలమయ్యారు?. ఏదిఏమైనా చరిత్రను ఆధారంగా చేసుకొని నిర్మించినట్లు చెబుతున్న ఈ సినిమా ఈ విధంగా వివాదాస్పదం కావడం చాలా బాధాకర విషయం.

-దాసం వెంకటరెడ్డి, బెంగుళూరు

## పర్యావరణ పరిరక్షణపై దృష్టిసారించాలి

సుప్రీం కోర్ట్ ఇటీవల ఒక తీర్పును ఇస్తూ పర్యావరణ పరిరక్షణ ఎంత అవసరమో పారిశ్రామిక అభివృద్ధి అంతే అవసరం అనితేల్చింది. అయితే అభివృద్ధి అన్ని దేశాలకు అవసరమే. అన్నిప్రాంతాలకు అవసరమే. అయితే అభివృద్ధి కాసారాలను విషకాసారాలుగా మార్చకుండా ఎక్కువ మందికి ఉద్యోగఉపాధి అవకాశాలు కల్పించేవిధంగా ఉండాలి. ఉదాహరణకు గ్రామీణ ఆర్థికవ్యవస్థను బలోపేతం చేస్తూ స్వయం సహాయక బృందాలద్వారా అభివృద్ధి జరిగేట్టుగా చూడాలి. ఇక అంత మాత్రమే కాదు. ఆ అభివృద్ధి అనేది అన్ని ప్రాంతాలలో ఒకే విధంగా ఉండాలి.

-భారత అవినాష్, జనగామ

## పెన్షన్ ఫండ్ చెల్లించాలి

కోల్ ఇండియా, సింగరేణి బొగ్గుగని అధికారులకు కార్మికులకు కోల్‌మైన్స్ ప్రావిడెంట్ ఫండ్ ద్వారా దాదాపు ఐదు లక్షల మందికి పింఛన్ చెల్లిస్తున్నారు. అధికారులు, కార్మికుల వద్ద బేసిక్ నుంచి ఏడు శాతం వసూలు చేసి యాజమాన్యాలు ఏడుశాతం కలిపి పెన్షన్ ఫండ్‌కు జమ చేస్తున్నారు. పదవి విరమణ తర్వాత వారి బేసిక్, మారేడు కరువు భత్యంపై ఇరవై శాతం పెన్షన్ చెల్లిస్తున్నారు. చెల్లింపుల మధ్య ఆంతర్యం పెరుగుతుంది.

- ఎ.వేణుమాధవ్, హైదరాబాద్

## ప్రజల సమస్యలు పట్టించుకోండి

రెండువేలపద్నాలుగులో కేంద్రప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి దేశంలోని దాదాపు డబ్బై లక్షల మంది ఐ.పి.ఎస్95 స్కీంలో రిటైరైన ఉద్యోగులు తమకు కనీసపెన్షన్ను రూ.7,500కు పెంచమని అనేక అర్జీలుచేసుకున్నా, పార్లమెంటులో అనేకసార్లు ఈ ప్రస్తావన ఎమ్.పి.లు పదేపదే తీసుకొచ్చినా, హేమమాలిని మొదలగు ఎమ్.పి.లు ప్రధానినికలసినా, వారెన్ని వాగ్దానాలు చేసినా, ఈ పదేళ్ల శ్రమ, పోరాటాలు, నిరాహార దీక్షలు ప్రభుత్వ హామీలు అన్నీనీటి మాటలయ్యాయి. ఈ మధ్య ఫిబ్రవరి 28న జరిగిన ఇ.పి.ఎఫ్.ఓ. మీటింగులో ఈ ఐ.పి.ఎస్. ఫించను పెంపుదలను నిర్ణయిస్తారని వార్తలొచ్చినా అదీ జరుగలేదు. అంతకు ముందు లేబర్ మినిస్టరు నేషనల్ ఏజిటేషన్ కమిటి లీడర్లను పిలిచి మీరు ఇక ఆందోళనలను చేయకండి, పెన్షను పెంపుదల ఆలోచన ప్రభుత్వానికి ఉందని కల్లబొల్లి కబుర్లు చెప్పారు. మరల దేశవ్యాప్తంగా ఆందోళనలు చేయడానికి ఈ వయోవృద్ధులైన అభాగ్య రిటైరీలు సన్నద్ధం అవుతున్నారు.

-ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

## గురుకులాలపై అధ్యయనం అవసరం

తెలంగాణ రాష్ట్రంలో ఉంది ఎస్సీఎస్టీబీసీ మైనారిటీ గురుకులాలపై అధ్యయనం అవసరం. గురుకులాలలో అమలులో ఉన్న కోర్సులు, ఎక్కడసాంక్షన్ అయితే అక్కడ ఉండే విధంగా చూడాలి. ఇంటర్మీడియట్లో సామాజిక శాస్త్రాలను కూడా ప్రవేశపెట్టాలి. పార్ట్ టైం టీచర్ల సమస్యలు, నైట్ స్టడీ సమస్యలు, వికలాంగులైన టీచర్స్, లెక్చరర్స్ సమస్యలు, వసతి గృహాల కేటాయింపులు, డిప్యూటీ వార్డెన్ విధులు, స్టేట్ సిలబస్, సెంట్రల్ సిలబస్, గురుకులాలకు ప్రభుత్వం అమలు చేస్తున్న సెలవులు, అమలు విధానం, సమయపాలన పాటించని సిబ్బంది, ఉద్యోగులు వాడుకున్నసెలవులు, వంటి విషయాలపై 2025-2026 విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి గురుకులాలలోని లెక్చరర్‌లచేత అధ్యయనం చేయించాలి.

- రాపాక రవీందర్, జనగాం

## మండలి సభ్యుల వల్ల ఏమి ప్రయోజనం?

ప్రభుత్వపాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుని ఉపాధ్యాయులకు ఈ శాసనమండలి సభ్యులవల్ల ఏమీ పెద్దగా ప్రయోజనం ఉండదు. ముఖ్యమంత్రి ఏం తలుచుకుంటే అదే అవుతుంది. శాసనమండలి సభ్యులు మంచి ఆలోచనాలు ముఖ్యమంత్రికి అందించలేరు. ఒకవేళ ఇచ్చినా ముఖ్యమంత్రులు వినరు.

-వీరగంట భాస్కర్ రావు, బొబ్బిలి

మనవి | ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# ఉపాధి లేమికి ఏదీ సరైన పరిష్కారం!

**నిరుద్యోగానికి, ఉపాధి లేమికి కారణమైన వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవటం లేదు. సమగ్ర భూసంస్కరణలు అమలు జరిపి పేదలకు భూమి లభించినప్పుడే గ్రామీణ నిరుద్యోగం తగ్గుతుంది. వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు, ప్రజల అవసరాలకు అనుగుణమైన పారిశ్రామిక అభివృద్ధి జరగటం ద్వారా దేశంలో నిరుద్యోగ సమస్య అదుపులోకి వస్తుంది. ఇలాంటి విధానాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యతిరేకం. అందువల్లే దేశంలో నిరుద్యోగ సమస్య తగ్గటం లేదు. ఉద్యోగ, ఉపాధి కల్పనలో కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా నిరుద్యోగ యువత, గ్రామీణ, పట్టణ పేదలు దేశవ్యాప్తంగా సమైక్యంగా ఉద్యమించాలి.**

బొల్లిముంత సాంబశివరావు

'స్వాతంత్ర్యం' వచ్చిందని చెబుతున్న దగ్గర నుండి యువత ప్రధానంగా ఎదుర్కొంటున్న ఉద్యోగ, ఉపాధి కల్పనలో పాలక ప్రభుత్వాలన్నీ ఉద్దేశపూరిత వైఫల్యం చెందాయి. గ్రామీణ ప్రజలకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించే వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు, ప్రజల అవసరాలను తీర్చే ఉత్పత్తిపరిశ్రమలను నెలకొల్పకుండా, సామ్రాజ్యవాద దేశాలపరిశ్రమలకు కావాల్సిన ముడివస్తువులను, చిన్న చిన్న యంత్రాలను తయారు చేసే పరిశ్రమలు, సామ్రాజ్యవాద దేశాల ప్రయోజనాలకు అనుగుణమైన కొన్ని బడా పరిశ్రమల స్థాపన అనేవిధానాలు నేటికీ అమలు జరుపుతూ వస్తున్నాయి. ఫలితంగా పారిశ్రామిక అభివృద్ధిలోనూ, ఉద్యోగ, ఉపాధికల్పన వైఫల్యంలో దేశం కొట్టుమిట్టాడుతున్న పరిస్థితి ఏర్పడింది. ఎన్నికల ప్రచారంలో పాలక పార్టీలు, ఏర్పడిన ప్రభుత్వాలు దేశంలో నిరుద్యోగ, ఉపాధి సమస్యను పరిష్కరించి యువతకు మంచి భవిష్యత్తును అందించేందుకు, ప్రణాళికలు రూపొందిస్తున్నామని చెప్పే మాటలు, మాటలకే పరిమితంకాగా, నిరుద్యోగం మాత్రం పెరుగుతూనే ఉన్నది. జీవితం పట్ల యువతలో నిరాశ, నిస్పృహలు మాత్రం పెరుగుతూ ఉన్నాయి. పాలకుల విధానాల వల్ల ఉద్యోగ, ఉపాధి అవకాశాలు తగ్గటంతో నిరుద్యోగశాతం పెరుగుతూ ఉంది. 1980లో ప్రపంచబ్యాంక్ డేటా ప్రకారం నమోదు అయిన నిరుద్యోగరేటు 2.8శాతంగా ఉంది. అందుకు కారణం ఎక్కువ మంది ప్రజలు వ్యవసాయ రంగంలో ఉపాధి పొందటమే కారణమని పేర్కొంది. 1990లో సరళీకరణ ఆర్థిక విధానాల కాలంలో కార్మిక మార్కెట్లో తీవ్ర మార్పులు జరిగాయి. సరళీకరణ ఆర్థిక విధానాల ద్వారా సృష్టించబడిన పరిస్థితులు గ్రామీణ ప్రాంతం నుండి ప్రజలు ఉపాధికోసం నగరాలకు వలసలు పోయేలా చేసింది. అంతేకాకుండా నిరుద్యోగరేటు 2.8శాతం నుంచి 6శాతానికి పెరిగింది. నేషనల్ శాంపిల్ సర్వే గణాంకాల కార్యక్రమాల మంత్రిత్వశాఖ నిర్వహించిన కార్మిక శక్తి సర్వేల ప్రకారం 2009-10లోఉపాధిరేటు 39.2శాతం నుండి2011-12లో 36.6శాతానికి పడిపోయింది. 2013-2014లో 5.42 శాతంగా ఉన్న నిరుద్యోగం కరోనా పరిస్థితుల కారణంగా 2020లో 8శాతం కాగా 2022లో 7.33శాతం తగ్గి, 2023లో 8.4శాతం పెరిగింది. 2024 మే నాటికి 6.3 శాతంగా ఉన్న నిరుద్యోగం అదే సంవత్సరం జూన్ నాటికి 9.2 శాతానికి పెరిగింది. పట్టణ ప్రాంతాలకన్నా, గ్రామీణ ప్రాంతంలో నిరుద్యోగం ఎక్కువగాఉంది. గ్రామీణ ప్రాంతంలోనే కాకుండా పట్టణ ప్రాంతంలో కూడా నిరుద్యోగం పెరుగుతూ ఉంది. 2024 మేలో 8.6శాతం ఉండగా, జూన్ నాటికి 8.9శాతానికి పెరిగింది. దేశవ్యాప్తంగా మహిళల విషయం చూస్తే పట్టణ ప్రాంతంలో ఉంటే, గ్రామీణ ప్రాంతంలో 17.1శాతం నిరుద్యోగులుగా ఉన్నారు. 48.6శాతం మహిళల నిరుద్యోగులతో జమ్మూ కాశ్మీర్ మొదటిస్థానంలో ఉండగా, కేరళ 46.6శాతంతో రెండవ స్థానంలో ఉంది. 39.4శాతంతో ఉత్తరాఖండ్ మూడవస్థానంలో, 35.9శాతంతో హిమాచల్‌ప్రదేశ్‌లు కొనసాగుతున్నాయి. పురుష నిరుద్యోగంలో కూడా 24.3శాతంతో కేరళ మొదటిస్థానంలో ఉండగా తర్వాత స్థానాలు ఒడిశా, రాజస్థాన్, హిమాచల్, ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రాలున్నాయి. భారతదేశంలో నిరుద్యోగం తాండవిస్తున్నదని అంతర్జాతీయ కార్మికసంస్థ (ఐఎల్వో) మానవాభివృద్ధి సంస్థ (ఐహెచ్డీ) సంయుక్త అధ్యయనం వెల్లడించింది. 'భారత నిరుద్యోగ నివేదిక 2024లో పలు కీలక విషయాలను వెల్లడించింది. ఆ నివేదికను కేంద్ర ప్రభుత్వ ముఖ్య ఆర్థికసలహాదారు విడుదలచేశారు. ఈ నివేదిక చదువుకున్నయువత ఉద్యోగాలు లేక నిస్సహాయస్థితిలో ఉన్నారని తెలిపింది. 2022 నాటికి దేశంలోని మొత్తం నిరుద్యోగుల్లో 83శాతం యువకులేనని నివేదిక పేర్కొంది. దేశం మొత్తం నిరుద్యోగుల్లో చదువుకున్న యువత 2000 సంవత్సరం నాటికి 54.2శాతం ఉండగా 2022 నాటికి 67.7శాతానికి పెరిగింది. ఇదిదేశానికి తీవ్రసమస్యగా మారిందని నివేదిక చెప్పింది. ప్రస్తుతం నిరుద్యోగులైన యువ



విద్యావంతుల్లో మహిళలు 67.7 శాతం ఉంటే, పురుషులు 62.2 శాతంగా ఉన్నారని నివేదించింది. ఇవన్నీ చెబుతూనే నిరుద్యోగాన్ని తగ్గించటంలో ప్రభుత్వాలే అన్ని చేయలేవని ప్రభుత్వ సలహాదారు నాగేశ్వర్ చెప్పటం కేంద్రప్రభుత్వాన్ని కాపాడే ప్రయత్నం చేయటమే. భారత రాజ్యాంగంలో పని చేయగల వారికి ఉద్యోగ, ఉపాధి కల్పించటం ప్రభుత్వాల బాధ్యతగా పేర్కొంది. ఉద్యోగ కల్పనను ప్రభుత్వాలే పూర్తిగా చేయలేవని ఆయన చెప్పటం రాజ్యాంగ విరుద్ధం కాదా! ప్రభుత్వమే బాధ్యత వహించి పబ్లిక్, ప్రైవేట్ రంగాల్లో ఉద్యోగాలు కల్పించి ఉద్యోగుల, కార్మికుల హక్కులను పరిరక్షించాల్సింది కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలే. అందుకు విరుద్ధంగా కేంద్ర ప్రభుత్వం నాలుగు కార్మిక చట్టాల పేరుతో, కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులను హరించి, వారిని పారిశ్రామికవేత్తలకు బానిసలను చేయచూస్తున్నది. 2014లో జరిగిన ఎన్నికల ప్రచారంలో ప్రతిసంవత్సరం 2కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని మోడీనాయకత్వాన ఉన్న ఎన్డీఏ కూటమి వాగ్దానం చేసింది. మోడీనాయకత్వంలో ఉన్న ప్రభుత్వ పాలనకు 10సంవత్సరాల, 9నెలలు గడిచిపోయింది. ఎన్డీఏ వాగ్దానం ప్రకారం20 కోట్లకుపైగా ఉద్యోగాలు కల్పించాలి. చేసిన వాగ్దానం ప్రకారం ఉద్యోగాలు కల్పించకపోగా గత ఐదుసంవత్సరాల్లో 12 కోట్ల ఉద్యోగాలను కేంద్రప్రభుత్వం తీసివేసింది. ఉపాధి కల్పించానని చెప్పుకుంటున్న దానిలో కూడా సగం మంది యువతస్వయం ఉపాధి ద్వారానే ఉపాధి పొందారు. 2012తో పోల్చుకుంటే కేంద్ర పాలనలో నిరుద్యోగం మూడురెట్లు పెరిగింది. రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ నిరుద్యోగం తీవ్రంగానే ఉంది. ఆంధ్రప్రదేశ్‌లో నిరుద్యోగంతో యువత కొట్టుమిట్టాడుతున్నారు. డిగ్రీ, పీజీ, ఇంజినీరింగ్ చేసిన యువత ఉద్యోగాలు లేక అల్లాడుతున్నారు. 2024 మే నెలలో లేబర్ బ్యూరో విడుదల చేసిన పీరియాడిక్లేబర్ఫోర్ సర్వే (పీఎల్ఎఫ్ఎస్) గణాంకాలు ఈ వాస్తవాన్ని వెల్లడించాయి. రాష్ట్రంలో నిరుద్యోగ రేటు 17.5శాతం నమోదు అయిందని సర్వే గణాంకాలు తెలిపాయి. ఇందులో పురుషుల నిరుద్యోగం 16.4శాతం కాగా, మహిళల నిరుద్యోగం 19.7శాతంగా నమోదైయింది. నిరుద్యోగంలో ఏపీ 10 వస్థానంలో ఉంది. మూడు పార్టీల కూటమి అధికారంలోకివస్తే20 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తానని హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చి 10 నెలలు గడిచినా ఎటువంటి ఉద్యోగాలు భర్తీచేయలేదు. ఉద్యోగాలు భర్తీ చేయకపోగా, 2లక్షల, 60 వేలమంది వాలంటీర్లకు ఉపాధిని దూరం చేసింది. బేవరేజ్ కార్పొరేషన్లో పనిచేసే 20 వేల మంది ఉద్యోగులను చంద్రబాబు ప్రభుత్వం తొలగించింది. తెలంగాణలోనూ నిరుద్యోగంతో యువత అల్లాడుతున్నారు. 2023 ఎన్నికల ప్రచారంలో 2 లక్షల ఉద్యోగాలు మొదటి ఏడాదిలో భర్తీచేస్తానని కాంగ్రెస్ వాగ్దానం చేసింది. జాబ్ క్యాలెండర్ల హామీ ఇచ్చింది. రిజర్వుబ్యాంక్ ఆఫ్ ఇండియా 2022 లెక్కల ప్రకారం తెలంగాణ గ్రామీణ ప్రాంతంలో నిరుద్యోగరేటు 34శాతంగా ఉంది. పట్టణప్రాంతంలో 65 శాతంగా ఉంది. తెలంగాణ ఏర్పడిన 10సంవత్సరాల్లో 60 లక్షల మంది నిరుద్యోగులుగా ఉన్నారు. చదువుకున్న 15-29 ఏళ్ల యువతలో ప్రతి నలుగురిలో ఒకరు నిరుద్యోగులుగా ఉన్నారు. త్వరలో 35వేల ఉద్యోగాలు భర్తీచేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పే మాటలు కార్యాచరణలోకి రావటంలేదు. అధికారంలోకి వచ్చి సంవత్సరం గడిచినా రెండు లక్షల ఉద్యోగాల కల్పన ఆచరణలో విఫలమైంది. మోడీ నాయకత్వాన ఉన్న ఎన్డీఏ, తెలంగాణ రాష్ట్రంలోని కాంగ్రెస్, ఏపీలో చంద్రబాబునాయకత్వాన ఉన్న మూడు పార్టీల కూటమి యువత ఓట్లను పొందేందుకు ఉద్యోగకల్పన అనే ఎరను ముందుపెట్టి, అధికారంలోకి వచ్చిన తర్వాత ఉద్యోగాలు కల్పించకుండా నిరుద్యోగ యువతను మోసం చేస్తూనే ఉన్నాయి. నిరుద్యోగానికి, ఉపాధి లేమికి కారణమైన వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవటం లేదు. సమగ్ర భూసంస్కరణలు అమలు జరిపి పేదలకు భూమి లభించినప్పుడే గ్రామీణ నిరుద్యోగం తగ్గుతుంది. వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు, ప్రజల అవసరాలకు అనుగుణమైన పారిశ్రామిక అభివృద్ధి జరగటం ద్వారా దేశంలో నిరుద్యోగ సమస్య అదుపులోకి వస్తుంది. ఇలాంటి విధానాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యతిరేకం. అందువల్లే దేశంలో నిరుద్యోగ సమస్య తగ్గటం లేదు. ఉద్యోగ, ఉపాధి కల్పనలో కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా నిరుద్యోగ యువత, గ్రామీణ, పట్టణ పేదలు దేశవ్యాప్తంగా సమైక్యంగా ఉద్యమించాలి. •

# భద్రతా మండలిలో సంస్కరణలు జరిగేనా!

కనుమ ఎల్లారెడ్డి

పంతొమ్మిదివందల నలభైఐదు అక్టోబర్ 24 న ఏర్పడిన ఐక్యరాజ్య సమితిలో, సమితి ఏర్పడిన నాటి నుంచి కేవలం ఐదు దేశాలు మాత్రమే శాశ్వత సభ్యత్వం కలిగి ఉన్నాయి. దాదాపు సమితి ఏర్పడి 80 సంవత్సరాలు అవుతున్నా ఇంత వరకు శాశ్వత సభ్య దేశంగా 6వ దేశం ఏదీ చేరకపోవడం శోచనీయం. ఐక్యరాజ్య సమితిలో కనీసం 10 దేశాలకైనా శాశ్వత సభ్యత్వంఉండాలి. అగ్రరాజ్యం ఈ విషయంలో చొరవచూపాలి. ఐక్యరాజ్యసమితి మొత్తం అమెరికా చుట్టే తిరుగుతూ ఉంటుంది. అమెరికా తలచుకుంటే 6 వ, 7 వ దేశాలుగా భారత్, దక్షిణాఫ్రికా సిద్ధంగా ఉన్నాయి. మిగతా దేశాల మాటేమో కాని భారత్ చేరికపై ప్రయత్నాలు జరుగుతున్న, తెరపై పేరువచ్చినా కొన్ని రాజకీయాలు పొడచూపడం, ముఖ్యంగా చైనా, పాక్ అడ్డుపడటం తెలిసిందే. చైనా తన ప్రాభవం కోల్పోతాననే భయంతో ఉన్నట్లు కనిపిస్తోంది. పొరుగున ఉన్న పాక్‌కు భారత్‌కు శాశ్వత సభ్యత్వ విషయం సహింపలేదు. ఆది భారత్ చేరకుండా రాజకీయం చేస్తుంది. ఆసియాలో నాదే పెత్తనం సాగాలి అనే ఆశ చైనాకు ఉంది. భారత్ చేరితే తన వాణి బొంగురు పోతుందని దాని భయం. రష్యా, బ్రిటన్, ఫ్రాన్స్ భారత్‌ను ఆహ్వానిస్తాయి. రష్యా మాత్రం భారత్ చేరికకు ఎప్పటికి మద్దతు ఉండనే ఉంటుంది. ఎన్నోసార్లు భారత్ భద్రతా మండలిలో చేరాలి అని ఊటంకించింది. భారత్ చేరిక గతంలో ట్రంప్ అధికారంలో ఉన్నపుడే జరగాల్సింది. ట్రంప్ ఇప్పుడు మరోసారి అమెరికా అధ్యక్షుడిగా ఉన్నారు. కనుక 6వ దేశంగా భారత్ చేరాలి అనే ప్రకటన చేయాలి. ఇప్పటికే ఎన్నో సంస్కరణలు చేస్తున్న ట్రంప్ భద్రతా మండలిని కూడా ప్రక్షాళన చేయాలి. ట్రంప్ మాట అన్ని దేశాలు శిరసా వహిస్తాయి. చైనా కొంచెం తాటాకు శబ్దాలు చేసినా





ఆది ట్రంప్ ముందు పారదు. ఉక్రైన్‌కు, హమాస్‌కు కాల్పుల విరమణ ఆగాలి. శాంతికోసం మనం ప్రయత్నంచేయాలి అని ట్రంప్ ఉద్దేశంగా ఉంది. ఆ దిశలో ప్రయత్నాలు చేసినా, హమాస్ పెడ చెవిన పెడుతోంది. ఉక్రైన్ పూర్తిగా అమెరికా అదుపు, ఆజ్ఞలో ఉంది. ట్రంప్ మాట వినకపోతే ఇక హమాస్ కొన్ని చిక్కులు ఎదురుకొక తప్పదు. ఆది తెలిసే ఉక్రైన్ అధ్యక్షుడు జెలెన్ స్కి అమెరికా చెప్పినట్లు నడుచుకునే స్థాయికి వచ్చాడు. ఇక్కడ రష్యా కూడా ట్రంప్ చెప్పినట్లు కాల్పుల విరమణ ఆపాలి. రెండు దేశాలు కూడా విశ్వంలోనే పెద్దవిగా ఉన్నాయి. భద్రతా మండలిలో శాశ్వత సభ్యదేశాలు. ట్రంప్ రష్యా వైపే మొగ్గుచూపుతున్నారు. చిన్న దేశమైన ఉక్రైన్ అభివృద్ధిచెందాలన్నా, మౌలికవసతులు సమకుర్చుకోవాలన్నా అమెరికా అండ ఎప్పటికి ఉండాలన్నా అమెరికా చెప్పినట్లు నడచుకోవాలి. అదే ఉక్రైన్ దేశానికి ఉత్తమం. దేశాలు ఏకమైనా అమెరికాను ఏమి చేయలేవు. ఊరికే మాటలు దాడి తప్పితే ఏమి, ఏదీ ఏ దేశానికి చేత కాదు. అమెరికా చెప్పి చూస్తుంది. మాట వినకపోతే ఇక ఆ దేశానికి చుక్కలే. సుంకలా విషయం ఆయాదేశాల వాణిజ్య సంబంధం. దేశ రక్షణ విషయంలో మాత్రం అమెరికా తన మార్క్ చూపిస్తుంది. కనుక భద్రతా మండలిలో ఇక దేశాలు రాజకీయాలు ప్రక్కన పెట్టాలి. అమెరికా చొరవ తీసుకుంటేనే భారత్‌కు మార్గం సుగమం కావొచ్చు. ట్రంప్, మోడీ ఇద్దరూ స్నేహితులు కనుక భారత్ చేరికకు ఏ దేశం అడ్డు చెప్పే సాహసంచేయదు. ఒకవేళ ఏ దేశమైనా అడ్డుచెబితే అమెరికా సహించదు. భద్రతా మండలిని సంస్కరించడం ట్రంప్ తోనే సాధ్యం. అన్ని హంగులు భారత్‌కు ఉన్నా భద్రతా మండలిలో రాజ్యాల అనైక్యతతో చర్చకు వచ్చి మరుగున పడింది. ట్రంప్ రావడంతో 6 వ దేశం భారత్ చేరికకు ఏ డోకా ఉండదు. ట్రంప్ అధ్యక్ష పదవి నుంచి దిగిపోయే లోపు భారత్‌ను భద్రతా మండలిలో 6 వ దేశంగా చేరుస్తాడని నమ్ముదాం. రాబోయే కొద్ది నెలలలో కాని రెండు, మూడు సంవత్సరాలలో కాని భారత్ ఖచ్చితంగా భద్రతా మండలిలో శాశ్వత సభ్య దేశంగా చేరుతుందని ఆశిద్దాం. •

# మానవాళిపై పర్యావరణ ప్రభావం

ఎం కె కుమార్

భారతదేశంలో ఉష్ణోగ్రతల పెరుగుదల రూపంలో వాతావరణ మార్పుల ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. ప్రపంచ బ్యాంక్ నివేదిక ప్రకారం, గత కొన్ని దశాబ్దాలతో పోల్చుకుంటే దేశంలో రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. భవిష్యత్తులో ఇవి మరింత ప్రమాదకర స్థాయికి చేరే అవకాశం ఉంది. 1901 నుండి 2018 వరకు, భారతదేశ సగటు ఉష్ణోగ్రత దాదాపు 0.7 డిగ్రీల సెల్సియస్ పెరిగింది. ఈ పెరుగుదల వడగాల్పులు, కరువు పరిస్థితులు, తీవ్రమైన వర్షపాతం వంటి విపరీత వాతావరణ సంఘటనలను ప్రోత్సహిస్తోంది. వడగాల్పులు భారతదేశంలో ఆరోగ్య సమస్యలను పెంచుతున్నాయి. డాక్టర్‌సౌమ్య స్వామినాథన్ ప్రకారం, వాతావరణ మార్పుల ప్రభావం ఆరోగ్యానికి మాత్రమే కాకుండా, ఆర్థిక, సామాజిక రంగాలపై కూడా తీవ్ర ప్రభావం చూపుతుంది. ప్రజల జీవన ప్రమాణాలు తగ్గిపోతున్నాయి. ఆరోగ్య సమస్యలు ఎక్కువ అవుతున్నాయి. ప్రత్యేకంగా మహిళలు, పిల్లలు, వృద్ధులపై ఎక్కువ ప్రభావం చూపుతున్నాయి. వాతావరణ మార్పుల కారణంగా నీటి సంక్షోభం కూడా తీవ్రమవుతోంది. 2025 నాటికి భారతదేశం నీటి ఒత్తిడికి గురవుతుందని ఐక్యరాజ్య సమితి అంచనా వేస్తోంది. తలసరి నీటి లభ్యత ఏటా తగ్గిపోతున్నందున, తక్షణ చర్యలు అవసరమవుతున్నాయి. ఈ పరిస్థితులను ఎదుర్కొనేందుకు, పునర్వినియోగ ఇంధనాలపై దృష్టి సారించడం అవసరం. పర్యావరణ పరిరక్షణ చర్యలను చేపట్టడం, వాతావరణ మార్పులను తగ్గించే విధానాలను అమలు చేయడం అవసరం. ప్రజలందరూ కలిసి చర్యలు తీసుకుంటే, భవిష్యత్తులో వాతావరణ మార్పుల ప్రభావాలను తగ్గించవచ్చు. 2024 సంవత్సరం ప్రపంచంలోనే అత్యంత వేడి సంవత్సరంగా రికార్డులకెక్కింది. ఈ సంవత్సరం గ్లోబల్ ఉపరితల ఉష్ణోగ్రతలు ప్రాకృతిక పారిశ్రామిక స్థాయిలకంటే 1.6శాతం పెరిగాయి. ఈ ఆందోళనకరమైన ట్రెండ్, వాతావరణ మార్పుల వేగవంతమైన ప్రభావాలను స్పష్టంగా చూపుతోంది. గ్రీన్‌హౌస్ వాయువుల ఉత్పత్తి అతి తీవ్రస్థాయికి చేరుకోవడంతో ప్రపంచవ్యాప్తంగా శాస్త్రవేత్తలు, దీనిపై అప్రమత్తం చేస్తున్నారు. ఈ ఉష్ణోగ్రతల పెరుగుదల ప్రధానంగా మనుషులచే ఉత్పత్తి చేసే గ్రీన్‌హౌస్ వాయువులు, ప్రకృతిక వాతావరణ మార్పుల కారణంగా ఏర్పడింది. 2024లో వాతావరణంలో కార్బన్ డయాక్సైడ్ స్థాయిలు 420పీపీఎమ్‌ను దాటి ప్రాకృతిక పారిశ్రామిక స్థాయిలైన 280 పీపీఎమ్‌తో పోలిస్తే గణనీయంగా పెరిగాయి. వ్యవసాయం, ఎమిషన్ గ్యాస్ ఉత్ప



త్తుల ద్వారా మెథేన్, నైట్రస్ ఆక్సైడ్ కూడా ఈ వేడి పెరుగుదలకు కారణమయ్యాయి. ఈ సంవత్సరం తీవ్ర వాతావరణ మార్పులు మానవ జీవితాలపై తక్షణ ప్రభావాలను చూపించాయి. యూరోప్ తన చరిత్రలోనే అత్యంత వేడి వేసవిని అనుభవించింది. ఇందులో కొన్ని నగరాల్లో ఉష్ణోగ్రతలు 45 శాతాన్ని మించినాయి. ఆసియాలో, భారత్, పాకిస్థాన్ వంటి దేశాల్లో తీవ్రమైన వేడి తరంగాలు వేలాదిమంది ఆరోగ్య సమస్యలకు గురిచేశాయి. ఈ దేశాల్లో 47 డిగ్రీల వరకు వేడిపెరిగింది. అమెరికా, ఆస్ట్రేలియా, దక్షి ణ యూరోప్ వంటి ప్రాంతాల్లో అడవుల అగ్నిప్రమాదాలు తీవ్ర నష్టం కలిగించాయి. ఉష్ణోగ్రతల పెరుగుదల మానవ సమాజాలపై, పర్యావరణ వ్యవస్థలపై తీవ్రమైన ప్రభావాలను చూపుతాయి. ధ్రువ ప్రాంతాల మంచుకుప్పలు వేగంగా కరుగుతున్నాయి. ఇది సముద్ర మట్టాన్ని పెంచుతోంది. మియామి, జకార్తా, వెనిస్ వంటి తీరనగరాలు భారీ వరదలకు గురవుతున్నాయి. సముద్రజలాల ఉష్ణోగ్రతల పెరుగుదల వల్ల గొప్ప బారియర్ రీఫ్ వంటి సముద్ర జీవవైవిధ్య ప్రదేశాల్లో పుష్కలంగా ఉండే జీవులు ప్రభావితమయ్యాయి. వ్యవసాయ ప్రాంతాల్లో పొడిబారిన వాతావరణ పరిస్థితులు పంట ఉత్పత్తి తగ్గుదలకు దారితీశాయి. ఇది ప్రపంచ ఆహార భద్రతకు ముప్పుగా మారింది. వాతావరణ మార్పులకు పరిష్కారం ఇవ్వడానికి తక్షణ చర్యలు తీసుకోవాలి. గ్రీన్‌హౌస్ వాయువుల ఉత్పత్తిని తగ్గించడానికి సౌర, గాలివిద్యుత్ వంటి పునర్వినియోగ ఇంధనాలను ప్రోత్సహించాలి. అంతర్జాతీయ స్థాయిలో సహకారం ముఖ్యమైంది. ఎందుకంటే వాతావరణ మార్పులు సరిహద్దుల్ని దాటిపోయే సమస్య. 2024లో నమోదైన వేడిఉష్ణోగ్రతలు మానవాళికి ఒక హెచ్చరికగా నిలిచాయి. ఈ సమస్యను పరిష్కరించడంలో దేశాలకు సామర్థ్యం ఉన్నప్పటికీ, చర్యలు తీసుకోవడం అత్య వసరం. సమష్టిగా, నిర్దిష్టంగా వ్యవహరించి, వాతావరణ మార్పుల దుష్ప్రభావాలను తగ్గించడానికి ప్రయత్నించాలి. భవిష్యత్తు తరాలకు ఆరోగ్యకరమైన భూమిని అందించడానికి మనం ప్రయత్నించాలి. భారతదేశంలో వాతావరణ మార్పులు, ఉష్ణోగ్రతల పెరుగుదల అనేది మనసమాజానికి ఒక హెచ్చరిక. దీనిప్రభావం ప్రపంచవ్యాప్తంగా స్పష్టంగాకనిపిస్తున్నది. దీని పరిష్కారంగా మనం పర్యావరణ పరిరక్షణ చర్యలను సీరియస్‌గా తీసుకోవడం, పునర్వినియోగ ఇంధనాల వినియోగాన్ని ప్రోత్సహించడం అవసరం. అంతర్జాతీయ స్థాయిలో సమగ్రచర్యలు చేపట్టడం అత్యవసరం. మనం తీసుకునే చర్యలు భవిష్యత్తులో వాతావరణ మార్పుల దుష్ప్రభావాలను తగ్గించడానికి, ప్రజల ఆరోగ్యాన్ని కాపాడడానికి ఎంతో అవసరం. ఈసమస్యను పరిష్కారించినప్పుడే భావితరాలకు ఆరోగ్యకరమైన భూమిని అందించగలుగుతాం. •

# అందరి శ్రేయస్సు కోసం ప్రార్థించాను: మంత్రి లోకేష్

**మంగళగిరి,మార్చి23,ప్రభాతవార్త :** స్వర్ణ దేవాలయం సందర్శన మహా భాగ్యం విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్‌పంజాబ్ లోని అమృత్ సర్ స్వర్ణ దేవాలయంని సందర్శించి, అందరూ సుఖశాంతులతో, ఆయురారోగ్యాలతో ఆనందంగా ఉండాలని ప్రార్థించానని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. ఆదివారం ఉదయం అమృత్ సర్ చేరుకున్న మంత్రి కుటుంబం స్వర్ణ దేవాలయంని సందర్శించింది. అమృత్‌సర్ లోని పవిత్ర శ్రీ హర్మందిర్ సాహిబ్‌ను సందర్శించే భాగ్యం దొరకడం చాలా సంతోషంగా ఉందని లోకేష్ పేర్కొన్నారు. స్వర్ణ దేవాలయం ఆవరణలో గడిపిన సమయం ఆధ్యాత్మిక ప్రశాంతతను చేకూర్చిందన్నారు. మంత్రి నారా లోకేష్‌తో పాటు భార్య బ్రాహ్మణి, తనయుడు దేవాన్ష్‌లు స్వర్ణ దేవాలయంలో కొలను, లంగర్ సందర్శించారు.



# గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా ఎంపి కృషి

## -గడ్డి కృష్ణారెడ్డి

**ఎ కొండూరు, మార్చి 23, ప్రభాతవార్త :** దేశంలోనే ఎన్‌టిఆర్ జిల్లాను ఆదర్శ జిల్లాగా తీర్చిదిద్దడమే ధ్యేయంగా విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని) శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నారని ఎ కొండూరు మండల టిడిపి ప్రెసిడెంట్ గడ్డి కృష్ణారెడ్డి పేర్కొన్నారు. గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా ఎంపి శివనాథ్ ఆధ్వర్యంలో సంజయ్ కార్యక్రమాన్ని రేపూడి గ్రామ ప్రజలతో పంచాయతీ చాంపియన్స్ సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. గ్రామ పార్టీ అధ్యక్షుడు ప్రసాద్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన గ్రామ సభలో సొంగా సంజయ్ వర్మ మండల పార్టీ అధ్యక్షుడు గడ్డి కృష్ణారెడ్డి మాట్లాడుతూ మహిళలు పారిశ్రామిక వేత్తలుగా ఎదిగి ఆర్థికంగా స్వయం సమృద్ధి సాధించినపుడే పేదరిక నిర్మూలన సాధ్యమని వీరు తెలిపారు. గ్రామంలో రైతులు ప్రెన్యూర్‌గా మారి ఆర్థికాభివృద్ధి సాధించేందుకు ఎంపి చిన్ని, ఎమ్మెల్యే శ్రీనివాసరావు అందిస్తున్న సాకారం మర్చిపోలేమని తెలిపారు. ఇంకా ఇతర కార్యక్రమాల గురించి పంచాయతీ చాంపియన్స్ పూర్తి సహకారం ప్రజలకు అందిస్తారని వీరు తెలిపారు. ఇంకా ఈ కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేటర్ సంజయ్ వర్మ, టిడిపి ప్రెసిడెంట్ జి కృష్ణారెడ్డి (జికెఆర్) ఎపి స్టేట్ మాదిగ కార్పోరేషన్ డైరెక్టర్ వాసం మునియ్య, తిరువూరు ఎఎంసి మాజీ ఛైర్మన్ అలవాల రమేష్‌రెడ్డి, పి శ్రీనివాసరావు, బి నాగపద్మ, ప్రసాద్‌రెడ్డి, పంచాయతీ చాంపియన్స్ తాజుద్దీన్, ఎం రామారావు (జాన్), బూత్ కన్వీనర్లు, ఆశావర్కర్లు, బుక్ కీపర్లు డ్వాక్రా మహిళలు గ్రామ ప్రజలు తెలిపారు.



# బెజవాడ బార్ అసోసియేషన్ ఈసి సభ్యునిగా 'పడవల'



**విజయవాడ,మార్చి 23,ప్రభాతవార్త :** బెజవాడ బార్ అసోసియేషన్‌లో ఎన్నికల సందడి మొదలైంది. ఈ నేపథ్యంలో బార్ అసోసియేషన్ ఎన్నికలకు సంబంధించి వివిధ పోస్టులకు ఇప్పటికే నామినేషన్లు దాఖలయ్యాయి. వీరిలో 30 సంవత్సరాల సీనియర్ న్యాయవాదుల జాబితాలో బార్ ఎగ్జిక్యూటివ్ సభ్యునిగా అందరికీ తలలో నాలుకలా మెసిలే న్యాయవాది పడవల ఏడుకొండలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆయన ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు బార్ ఎన్నికల అధికారి డిపి రామకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా సీనియర్ న్యాయవాది పడవల ఏడుకొండలు మాట్లాడుతూ బార్ కౌన్సిల్ సభ్యులు సూరాబత్తుల మల్లేశ్వరరావు,బెజవాడ బార్ మాజీ అధ్యక్షులు వివి గుర్నాథంల నేతృతంలో న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి తన వంతుగా తీవ్రంగా కృషి సల్పుతానని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఏకగ్రీవంగా ఇసి సభ్యునిగా ఎన్నికైన న్యాయవాది పడవల ఏడుకొండలుకు పలువురు సీనియర్,జూనియర్ న్యాయవాదులు అభినందనలు తెలిపారు.

# ఘనంగా హజరత్ అలీ జండా గంధ మహోత్సవం

**ఎ కొండూరు, మార్చి 23, ప్రభాతవార్త :** హుజూర్ హజరత్ సయ్యద్ మౌలా అలీ ముష్కిల్‌కు షా అలీ ఇబ్నె అబితాలిబ్ కరముల్లాహు రజిఅల్లాహుతాల అన్హు వారి జెండా గంద మహోత్సవాన్ని ఎన్‌టిఆర్ జిల్లా ఎ కొండూరు మండలం చీమలపాడు అతావుల్లా బాబా దర్బార్ అండ్ దర్గాలో శుక్రవారం రాత్రి అత్యంత భక్తిశ్రద్దలతో పీఠాధిపతి అతావుల్లా బాబా ఆధ్యాత్మిక వారసుడు బాబా వారి ఆశీస్సులతో ఘనంగా నిర్వహించారు. అనంతరం కులమతాలకతీతంగా ఉభయ తెలుగు రాష్ట్రాల నుండి ఢిల్లీ, నాగపూర్, యుపి రాష్ట్రాల నుండి వచ్చిన అతావుల్లా బాబా భక్తులకు ఉపవాస దీక్షాపరులకు మహాదివ్య అన్నసమారాధన జరిపారు. ఎఎంటికె దర్బార్ బాబె ఎ బాగ్దాద్‌లో ఈ హజరత్ అలీ జెండా ప్రతిష్ట సందర్భంగా మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం అతావుల్లా బాబా దర్గా వద్ద పవిత్రాత్మకు దువా (వేడుకోలు) నిర్వహించారు. ఇంకా ఈ కార్యక్రమంలో ప్రముఖ వాస్తు శిల్పి దైవజ్ఞున జాఫర్ షరీఫ్ బొగ్దాది, తాజ్ ఖాదర్ బాబు పాల్గొని భక్తులకు స్వయంగా ప్రసాదం వడ్డించారు.



# జూమియా మజీద్‌లో ఇఫ్తార్ విందు

**తిరువూరు, మార్చి 23, ప్రభాతవార్త :** తిరువూరు పట్టణంలోని జూమియా మస్జీద్‌లో విజయవాడ పార్లమెంట్ తెలుగు యువత అధికార ప్రతినిధి మాదాల హరిచరణ్ (కిట్టు) ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందులో భాగంగా తేనేటి విందును ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు షేక్ అబ్దుల్ హుస్సేన్ నాళ్ళా సురేంద్ర, సీనియర్ నాయకులు కందిమళ్ల శేషగిరిరావు, నియోజకవర్గ తెలుగు యువత ఉపాధ్యక్షులు హుస్సేన్ మోదుగు వెంకటేశ్వరరావు తుమ్మలపల్లి వెంకట పుల్లారావు నిరంజన్ చీపు ప్రభాకర్ కందిమళ్ల సుమిత్ తదితరులు పాల్గొన్నారు.



# అధికమైన ఉష్ణోగ్రతలు

# విలవిల లాడుతున్న ప్రజలు

**యడ్లపాడు, మార్చి 23, ప్రభాతావార్త :** రోజు రోజుకు పెరిగిపోతున్న అధిక ఉష్ణోగ్రతలకు గ్రామీణ ప్రాంతాలలో రోడ్లు, అదేవిధంగా 16వ నెంబరు జాతీయ రహదారి ఖాళీగా దర్శనమిస్తున్నాయి. ఉదయం పదిగంటలు కాక ముందే అధిక ఉష్టోగ్రతల దాటికి ప్రజలు అల్లాడి పోతున్నారు గ్రామీణ ప్రాంత వాసులు. ఎంతో అత్యవసర పరిస్థితులలో తప్ప ఎవరూ బయటికి రాలేకపోతున్నారు. గ్రామీణ ప్రాంతాలలో ఉపాధిహామీకూలీల బాధలు అంతా ఇంతాకా కుంగా పోయింది. రెక్కాడితేగాని, డొక్కాడని పరిస్దితులలో వున్న కూలీలకు ఈ అధిక ఉష్ణోగ్రతలు తలకు మించిన భారంగా తయారు అయిందని పలువురు కూలీలు వాపోతు న్నారు. ఎప్పుడూ ఎంతో రద్దీగా ఉండే జాతీయ రహదారి సైతం నిశ్శబ్ధంగా తయారైంది. గత పది రోజుల నుండి 35నుండి36 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయని అధికారులు తెలుపుతున్నారు.



అమరావతి వార్త



# ఏప్రిల్ 1న సిఎం రాక

**పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొననున్న సిఎం**

**బాపట్ల,మార్చి23,ప్రభాతవార్త:** బాపట్ల జిల్లాని పర్చూరు నియోజకవర్గంలో ఏప్రిల్ 1న పింఛన్ల పంపిణీ కార్యక్రమమునకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వస్తున్నట్లు జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి అన్నారు. ఆదివారం స్థానిక కలెక్టర్ క్యాంప్ కార్యాల యంలో ఆయన అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్చూరు నియోజకవర్గంలో రాష్ట్ర ముఖ్యమంత్రి పాల్గొనే ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమమునకు " పేదల సేవలో" అనే నామకరణం జరిగినట్లు ఆయన అన్నారు. ఈ కార్యక్రమం సంబంధించి జిల్లా ఇన్చార్జి మంత్రి, జిల్లా మంత్రులు, పార్లమెంట్ సభ్యులు, శాసనసభ్యులతో చర్చించినట్లు ఆయన తెలిపారు. ఏప్రిల్ ఒకటో తారీఖున ఈ కార్యక్రమం సుమారు నాలుగు గంటల పాటు జరుగుతుందని అన్నారు. మొదటగా లబ్ధిదారులకు పింఛన్ల పంపిణీ, ప్రజా వేదిక కార్యక్రమం, పొలిటికల్ మీటింగ్ చివరిగా అధికారులతో సమావేశంలో రాష్ట్ర ముఖ్యమంత్రి పాల్గొంటారని ఆయన తెలిపారు. ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి అధికారులకు విధుల కేటాయింపులో జిల్లా రెవెన్యూ అధికారికి ఆయన సూచనలు చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి కార్యక్రమములను ఎటువంటి ఆటంకం లేకుండా జయప్రదం చేయాలని అధికారులకు అయన దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి జి గంగాధర్ గౌడ్, సిపిఓ శ్రీనివాసరావు, డిపిఓ ప్రభాకర్, డ్వామా పిడి విజయలక్ష్మి, డి ఆర్ డి ఎ పి డి పద్మ, బాపట్ల డిఎల్డివో విజయలక్ష్మి, బాపట్ల, చీరాల,రేపల్లె రెవెన్యూ డివిజన్ అధికారులు మరియు తదితరులు పాల్గొన్నారు.



# ఎన్ఎస్‌పి మైలవరం బ్రాంచి కాలువకు మొక్కుబడిగా సాగర్ నీరు

**ఎ కొండూరు, మార్చి 23, ప్రభాతవార్త :** నాగార్జున సాగర్ మైలవరం బ్రాంచ్ కెనాల్‌కు అధికారులు ఆదివారం మొక్కబడిగా విడుదల చేసిన నీరు ఆయకట్టు భూముల చివరి వరకు చేరడం దేవుడెరుగు ! అండర్ టన్నెల్ (యుటి) రంధ్రాల్లో ఇంకిపోవడానికి సరిపోతాయని ఆయకట్టు రైతులు ఆక్షేపించారు. ఈ మైలవరం బ్రాంచ్ కాల్వకు 1100 క్యూసెక్కుల నీటిని విడుదల చేయాల్సి ఉండగా ఇటీవల అధికారులు విస్సన్నపేట నియంత్రిక నుండి మొక్కుబడిగా 300 క్యూసెక్కుల నీటిని విడుదల చేసి రెండు, మూడు రోజుల్లో విడుదల చేయడం ఆపేయడం వల్ల ఉపయోగం ఏమిటని ! ఆయకట్టు రైతులు ప్రశ్నిస్తున్నారు. ప్రస్తుతం మామిడి తోటలకు మిర్చి జొన్న మొక్కజొన్న తదితర పంటలకు నీరు చాలా అవసరం. కానీ ఈ పరిస్థితుల్లో విసన్నపేట నుండి అధికారులకు మైలవరం బ్రాంచ్ కెనాల్‌కు విడుదల చేసిన సాగర్ మండలంలో కృష్ణారావుపాలెం రెగ్యులేటర్ 13.950 కి.మీ వద్దకు ఆదివారం చేరడంతో ఈ రెగ్యులేటర్‌కు ఆనుకుని వున్న వెల్వడం మేజర్ కాల్వకు నీరు వెళ్లే పరిస్థితి లేక పోవడంతో ఆయకట్టు రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇకనైనా ఈ మైలవరం బ్రాంచ్ కెనాల్‌కు సుమారు 800 క్యూసెక్కుల నీటిని విడుదల చేయాలని అలాగే 13వ కి.మీ రెగ్యులేటర్ నుండి వెల్వడం మేజర్ కాల్వకు నీరు విడుదల చేసి ఆదుకోవాలని ఆయకట్టు రైతులు ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్‌కు, ఎన్ఎస్ఐ 3వ జోన్ ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేశారు.



# భూగర్భ జలాల పరిరక్షణకు రైతులు పంటకుంటలను ఏర్పాటు చేసుకోవాలి

**ఎ కొండూరు, మార్చి 23, ప్రభాతవార్త :** ప్రపంచ జలదినోత్సవం సందర్భంగా రైతులు పంట కుంటలు ఏర్పాటు చేసుకుని పంట చేలల్లో భూగర్భ జలాలు పెంపొందించుకోవాలని మండల టిడిపి ప్రెసిడెంట్ గడ్డి కృష్ణారెడ్డి అన్నారు. ఎన్‌టిఆర్ జిల్లా తిరువూరు నియోజకవర్గ ఎ కొండూరు మండలంలో మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీపథకం (ఎపిఎన్ఆర్ఇజిసి) కరువు పనుల్లో భాగంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా శనివారం 1.5లక్ష పంట కుంటల ఏర్పాటుతో శ్రీకారం చుట్టి భూమి పూజ కార్యక్రమాల్లో భాగంగా శనివారం కృష్ణారెడ్డి చీమలపాడు, రామచంద్రాపురం గ్రామాల్లో పంటకుంటల ఏర్పాటుకు భూమి పూజ జరిపారు. భూగర్భ జలాల పరిరక్షణ ద్వారానే మానవ మనుగడ సాధ్యమని తద్వారా రైతులకు పంట చేలకు నీరు వృధా కాకుండా సమృద్ధిగా నీటిని వినియోగించుకోవచ్చని కృష్ణారెడ్డి తెలిపారు. ఇంకా ఈ భూమి పూజ కార్యక్రమంలో ఎపిఎన్ఆర్ఇజిఎస్ ఎపిడి కె.పార్థసారధి, ఎ కొండూరు ఎపివో జె.రామారావు, తెదేపా లీడర్లు న్యాయంపల్లి రామకృష్ణ, జె.కిషోర్, మేకల రామారావు (జాన్), బి.ఆదిశేషు, ఎస్‌కె ఆదాం షరీఫ్, మోర్ల తిరుపతిరావు, కరువు పని కూలీలు, సన్నచిన్నకారు రైతులు పాల్గొన్నారు.




# రాష్ట్ర తెలుగు యువత ఉపాధ్యక్షుని ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు

## -ఇఫ్తార్ విందులో పాల్గొన్న రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర

**విజయవాడ,మార్చి 23, ప్రభాతవార్త :** రంజాన్ మాసం సందర్భంగా రాష్ట్ర తెలుగు యువత ఉపాధ్యక్షులు డాక్టర్ హసీం బేగ్ అధ్వర్యంలోఇంగ్లీష్‌పాలెం ,గౌసియా మసీదులో ఇఫ్తార్ విందును నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర,ఆర్టీసి ఛైర్మన్ కొనకళ్ళ నారాయణరావు,కొనకళ్ళ బుల్లయ్య,మాజీ మున్సిపల్ ఛైర్మన్ బాబూ ప్రసాద్,మాదివాడ రాము,ఇలియాస్ ఫాషా,వసీంబేగ్,పలపాటి సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.



# కార్పొరేట్ ఆసుపత్రికి ధీటుగా ప్రభుత్వ ఆసుపత్రి : మంత్రి సత్యకుమార్

**సత్తెనపల్లి, మార్చి 23 ప్రభాతవార్త :** కార్పోరేట్ ఆసుపత్రికి ధీటుగా సత్తెనపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యసేవలు అందించాలని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. ఆదివారం రూ.7 కోట్లతో అప్‌గ్రేడ్ చేసిన వంద పడకల ఏరియా ఆసుపత్రిని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణతో కలిసి ఆదివారం ఆయన ప్రారంభించారు. ఆసుపత్రిలో నూతనంగా నిర్మించిన వార్డులు, గదులను వారు పరిశీలించారు. అత్యాధునిక డయాగ్నోస్టిక్స్ పరికరాలు సమకూర్చేందుకు ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ చేసిన కృషిని మంత్రి అభినందించారు. రాష్ట్రంలో ప్రజా ఆరోగ్యానికి కూటమి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యతను ఇస్తుందన్నారు. రూ.36 కోట్లతో నరసరావుపేటలో క్రిటికల్ కేర్ బ్లాక్‌ను అందుబాటులోకి తీసు కువస్తామన్నారు. పిడుగురాళ్ళ మెడికల్ కళాశాలను ఏడాదిన్నం లోపు పూర్తి చేస్తామని మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలియజేశారు. ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ సత్తెనపల్లి నియోజకవర్గానికి వందల పడకల ఆసుపత్రిని మంజూరు చేసిన ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు, డిఎం అండ్ హెచ్ఓ డాక్టర్ రంగారావు, ఆర్డీవోరమణాకాంత్‌రెడ్డి, సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మణరావు, వైద్యులు ప్రవీణ్, నవీన్, టిడిపి, జనసేన, బిజెపి పార్టీ నాయకులు పాల్గొన్నారు.



# 24న సిపిఎం ధర్నా

**ఎ కొండూరు, మార్చి 23, ప్రభాతవార్త :** ఇబ్రహీంపట్నం మైలవరం తిరువూరు జగదల్‌పూర్ జాతీయ రహదారి ఎన్‌టిఆర్ జిల్లా ఎ కొండూరు మండలం రామచంద్రాపురం వద్ద గత 8ఏళ్లుగా నిలిచి విస్తరణ పనులను వెంటనే ప్రారంభించి పూర్తి చేయాలని సిపిఎం మండల కార్యదర్శి పానెం ఆనందరావు ఎన్‌హెచ్-30 ఉన్నతాధికారులకు జాయింట్ కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ జాతీయ రహదారిపై గ్రామంలో పెద్ద పెద్ద గుంటలు ఏర్పడి రాత్రిపూట ఆటోలు, ద్విచక్ర వాహనాల ప్రమాదాల్లో కాళ్ళు చేతులు పోగొట్టుకుని వికలాంగులయ్యారని ఆనందరావు ఆరోపించారు. ఈ జాతీయ రహదారిపై రాత్రి పగలు నడిచే వాహనాలతో దుమ్ము ధూళి ఇళ్లలోకి రావడంతో ప్రజలు శ్వాసకోశ క్యాన్సర్ లాంటి జబ్బులకు గురవుతున్నారని ఆనందరావు విమర్శించారు. సిపిఎం ప్రజా చైతన్యయాత్రలో భాగంగా ఈ నెల 24న ఉదయం 10 గంటలకు మండల తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్నట్లు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆనందరావు కోరారు.

# నేడు డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక : కమిషనరు



**గుంటూరు కార్పొరేషన్,మార్చి23,ప్రభాతవార్త:** ఈ నెల 24వ తేది సోమవారం గుంటూరు నగర ప్రజల స్థానిక సమస్యల పరిష్కారానికి ఉదయం 9:30 నుండి 10:30 గంటల వరకు గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ చాంబర్ లో డయల్ యువర్ కమిషనర్ (0863 2224202) కార్యక్రమం నిర్వహిస్తున్నామని, అనంతరం "ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక" (పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమం ద్వారా కౌన్సిల్ సమావేశ మందిరంలో మధ్యాహ్నం 1 గంట వరకు ప్రజల నుండి నేరుగా అర్జీలు, ఫిర్యాదులు తీసుకుంటామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

# బెట్టింగ్‌లకు పాల్పడితే కఠినచర్యలు : పల్నాడుజిల్లా ఎస్పీ



**నరసరావుపేట క్రైం, మార్చి 23 ప్రభాతవార్త :** ఐపిఎల్ క్రికెట్ మ్యాచ్‌ల సందర్భంగా ఎవరైనా బెట్టింగ్‌లకు పాల్పడితే ఉపేక్షించేది లేదని జిల్లా ఎస్పీ కె.శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా బెట్టింగ్‌లకు పాల్పడేవారిపై ప్రత్యేక నిఘా పెట్టామన్నారు. గతంలో బెట్టింగ్‌లకు పాల్పడినవారి వివరాలను సేకరించి కౌన్సిలింగ్ నిర్వహించామన్నారు. ఆన్‌లైన్ ద్వారా బెట్టింగ్ జరిపినా, గుంపులు గుంపులుగా టీవీలు, సెలఫోన్లలో క్రికెట్ చూస్తూ పందాలు కాసేవారిని గుర్తిస్తామన్నారు. క్రికెట్ బెట్టింగ్‌లలో పాల్గొంటున్న వారి వివరాలు తమకు తెలిపితే గోప్యంగా ఉంచుతామన్నారు. 100, 112 నెంబర్లకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు. క్రికెట్ బెట్టింగ్‌లలో డబ్బులు పోగొట్టుకొని ఎన్నో కుటుంబాలు వీధిన పడ్డాయన్నారు. ధైర్యంగా సమాచారం ఇవ్వాలని ఎస్పీ కె.శ్రీనివాసరావు సూచించారు.

# రాష్ట్రాభివృద్ధి,ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

## రాష్ట్ర పౌరసరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్,కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని,ఎమ్మెల్సీ ఆలపాటి

కొల్లిపర,మార్చి 23 ప్రభాతవార్త: రాష్ట్రాభివృద్ధి..ప్రజా సంక్షేమమే ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుని పనిచేస్తుందని రాష్ట్ర పౌరసరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు.ఆదివారం మండల కేంద్రం కొల్లిపర రేపల్లె బ్యాంకు కెనాల్‌పై రూ.4.19 కోట్లతో నిర్మించనున్న హైలెవల్ నూతన వంతెన నిర్మాణానికి కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్,ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్‌లతో కలసి ఆయన శంఖుస్థాపన చేసారు.ఈ సందర్భంగా మనోహర్ మాట్లాడుతూ వంతెన నిర్మాణం పూర్తయితే కొన్ని గ్రామాల ప్రజలకు ఉపయోగంగా ఉంటుందన్నారు.పట్టణాలు..పల్లెలు అభివృద్ధి చెందాలనే చిత్తశుద్ధితో నిధులు తీసుకొచ్చి అభివృద్ధి చేపడుతున్నామన్నారు.రాబోయే రోజుల్లో తెనాలి నియోజకవర్గాన్ని రూ.96 కోట్ల 60 లక్షల నిధులతో అభివృద్ధి చేపడతామన్నారు.రాష్ట్రాన్ని నెంబర్‌వన్‌గా నిలపాలనేది కూటమి ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందన్నారు.

**కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ..**

ఎన్నికల ముందు మనోహర్‌ను గెలిపించాలని నేను కోరానని మనోహర్ మంత్రి అవుతారని చెప్పటం జరిగిందన్నారు.ఎన్నడూ లేనివిధంగా మనోహర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిచిన కారణంగా నిధులు తెచ్చి అభివృద్ధి చేపట్టారన్నారు.గత ప్రభుత్వం అవగాహన లోపం వలన గతంలో అభివృద్ధి కుంటుపడిందని కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో నిధులు తీసుకొచ్చి అభివృద్ధి చేస్తున్నామన్నారు.డొంకరోడ్లు కూడా నిధులు తీసుకొచ్చి అభివృద్ధి చేస్తామన్నారు.

**ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ..**

మనోహర్,పెమ్మసాని అనుభవంతో ఈ ప్రాంతానికి నిధులు తీసుకొచ్చి అభివృద్ధి చేయటం జరుగుతుందన్నారు.రైతాంగానికి అవసరమైన డొంకరోడ్లు పూర్తి చేస్తామన్న వారి దూర దృష్టిని హర్షించాలన్నారు.గత ప్రభుత్వం రాష్ట్రాన్ని విధ్వంసం చేసి ప్రజలను ఎన్నో కష్టాలకు గురిచేసారన్నారు.కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో అభివృద్ధి..సంక్షేమం రెండు కళ్ళతో ముందుకు తీసుకెళుతున్నట్లు చెప్పారు.మోడీ..చంద్రబాబు,పవన్‌కళ్యాణ్ కూటమికి ప్రతి ఒక్కరూ మద్దతి ఇచ్చి కూటమికి అండగా నిలవాలన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పిల్లి రాధిక,ఎంపిపి భీమవరపు పద్మావతి,తహశీల్దార్ గుమ్మడి సిద్దార్ధ,ఎంపీడీఓ విజయలక్ష్మి,మండల టీడీపీ అధ్యక్షుడు భీమవరపు చిన కోటిరెడ్డి,జనసేన మండల అద్య క్షుడు యర్రు వెంకయ్యానాయుడు,దుగ్గిరాల మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ వంగా సా ంబిరెడ్డి,టీడీపీ జిల్లా కార్యదర్శి కంచర్ల అమృతరాజు,నాయకులు గుదిబండి గోవర్ధనరెడ్డి,అడపా నారాయణరెడ్డి,భీమవరపు కిషోర్‌రెడ్డి,కట్టా శ్రీహరిరెడ్డి,అద్దంకి వేణుగోపాల్,పెరికల రాంబాబు,సంబంధిత శాఖాధికారులు తదితరులు పాల్గొన్నారు.



# అగ్నివీర్ ఆర్మీ రిక్రూట్మెంట్ ర్యాలీ



బాపట్ల,మార్చి23,ప్రభాతవార్త: అగ్ని వీర్ ఆర్మీ రిక్రూట్మెంట్ ర్యాలీ ద్వారా నిరుద్యోగ యువత ఉద్యోగాలు పొందాలని జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి అన్నారు. ఆదివారం ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత రక్షణశాఖ వివిధ దళాల రిక్రూట్మెంట్లో విప్లవాత్మకమైన సంస్కరణలకు శ్రీకారం చుడుతూ నూతనంగా ప్రవేశపెట్టిన అగ్ని పథకంలో భాగంగా ఆర్మీ నందు ఉద్యోగాల ప్రకటన జారీ అయినదన్నారు.అగ్ని జనరల్ డ్యూటీ, అగ్ని వీర్ టెక్నికల్, అగ్ని వీర్ ఆఫీస్ అసిస్టెంట్, స్టోర్ కీపర్ టెక్నికల్ అగ్ని విర్ ట్రేడేస్మేన్ విభాగాలలో ఉద్యోగ నియామ కాలు జరుగుతాయని ఆయన అన్నారు. అర్హులైన యువత నుండి ఆన్లైన్ ద్వారా దరఖాస్తులు ఆహ్వానిస్తుందని ఆయన తెలిపారు. ఈ ఉద్యోగ నియామకమునకు రాత పరీక్షను ఆన్లైన్ ద్వారా నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ వ్రాత పరీక్ష మొదటి సారిగా తెలుగులో కూడా నిర్వహించు చున్నారని, అదేవిధంగా ఎన్. సి. సి నందు ఏ.బి.సి సర్టిఫికెట్ లు ఉన్నవారు మరియు క్రీడాకారులకు ప్రత్యేక బోనస్ మార్కులు ఉంటాయని అని తెలిపారు. ఐటిఐ,డిప్లమా చేసిన వారు అగ్ని టెక్నికల్ విభాగానికి అర్హులు అని ఆయన అన్నారు. జిల్లాలోని ఆసక్తిగల యువకులు ఏప్రిల్ 10-2025వ తేదీ లోపు ఇండియన్ ఆర్మీ వెబ్ సైట్ నందు దరఖాస్తు చేసుకోవాల్సింది గాఆయన అన్నారు. నియామక వివరాలను పై వెబ్సైట్ నందు తెలుసుకోవచ్చునని, ఈ అవకాశాన్ని సద్వినియోగ వరుచుకొని యువత తమ భవితకు మార్గం సులభం చేసుకోవాల్సిందిగా ఆయన కోరారు.

# నేడు ప్రజాఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ



**గుంటూరు కలెక్టరేట్,మార్చి 23,ప్రభాతవార్త :** ప్రజల నుంచిఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమం మండల, డివిజనల్ మున్సిపల్ స్థాయిలో నిర్వహించ బడుతుంది. అర్జీదారులు ఈ విషయాన్ని గమనించి తమ ఫిర్యాదులను సమీపంలోని మండల,డివిజనల్, మున్సిపల్ కార్యాలయాల్లో సమర్పించుకోవచ్చన్నారు.

# తెదేపా శ్రేణులకు పార్టీ సభ్యత్వ కార్డే అసలైన గుర్తింపు కార్డు : ఎమ్మెల్యే ప్రత్తిపాటి

**చిలకలూరిపేట, మార్చి23,ప్రభాతవార్త:** తెలుగుదేశం కుటుంబ సభ్యుల కు పార్టీ సభ్యత్వ కార్డు అసలుసిసలైన గుర్తింపు కార్డు అని, దాని ద్వారా లభించే గౌరవం ఎంతో విలువైనదని, అధికారంతో



సంబంధం లేకుండా ఎప్పుడు ప్రజల కోసం పనిచేయడం ఒక వరమని మాజీమంత్రివర్యులు శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. ఆదివారం పట్టణంలోని టిడిపి క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని వివిధ మండలాలకు చెందిన నాయకులకు టిడిపి సభ్యత్వ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రత్తిపాటిమాట్లాడుతూ కుటుంబ సాధికార సారథుల నియామక ప్రక్రియను ఈ నెలాఖరులోపు పూర్తిచేయాలని టిడిపి నాయకులు, కార్యకర్తలు సాధికార సారథుల జాబితాలో విధిగా నమోదై ఉండాలని సూచించారు. సంక్షేమ పథకాలు అర్హులకే అందాలని కూటమి ప్రభుత్వం సదుద్దేశమని, కుటుంబాన్ని యూనిట్‌గా తీసుకుని ఉగాది నుంచి చంద్రబాబు ప్రభుత్వం పి4 పథకాన్ని ప్రారంభించనున్నది అని ప్రత్తిపాటి తెలిపారు. రాష్ట్రంలో పేద,మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థిక చేయూతనందించి ప్రతిఒక్కరి ఆదాయాన్ని పెంచి,తద్వారా రాష్ట్ర తలసరి ఆదాయం పెంచడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. మండల గ్రామనాయకులు సభ్యత్వం పొందిన ప్రతిఒక్కరికి గర్తింపు కార్డు చేరాలని అవసరమైతే ఇంటింటికి తిరిగి కార్డులను పంపిణీ చేసి కూటమి ప్రభుత్వ పనితీరుపై తమ అభిప్రాయాలను,కార్యకర్తలనుంచి అడిగి తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ షేక్‌రఫానీ, టిడిపి నాయకులు షేక్‌కరిముల్లా, నెల్లూరి సదాశివరావు, జవ్వాజి మదన్‌మోహన్, బండారుపల్లి సత్యనారాయణ, కామినేని సాయిబాబు, పఠాన్ సమద్‌ఖాన్, మద్దుమాల రవి, క్లస్టర్, యూనిట్ ఇన్‌చార్జిలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అమ్మవారిని దర్శించుకున్న న్యాయమూర్తులు

**పిట్టలవానిపాలెం, మార్చి23, ప్రభాతవార్త:** చందోలు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ బగళాముఖీ అమ్మవారి ఆలయానికి ఆదివారం ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ గుణరంజన్ వారి సతీమణి,విజిత, కుమారుడు గిరీష్, కుమార్తె గ్రీష్మ మరియు రైల్వే కోర్టు జడ్జి పి రమాదేవి,నూజివీడు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వి వెంకటేశ్వరరావు లు అమ్మవారిని దర్శించి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించుకున్నారు.ఈ సందర్భంగా ఆలయ సాంప్రదాయం ప్రకారం వేద ఆశీర్వచనము,అమ్మవారి జ్ఞాపికతో వారిని సత్కరించడమైనదని కార్య నిర్వహణ అధికారి జి నరసింహామూర్తి ప్రకటనలో తెలియజేశారు.



# అభివృద్ధికి ఆకర్షితులై తెదేపాలో చేరిక

## పార్టీలోకి ఆహ్వానించిన ఎమ్మెల్యే యరపతినేని

**పిడుగురాళ్ల, మార్చి 23 ప్రభాతవార్త:** కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధికి ఆకర్షితులై పలువురు టీడీపీలో చేరుతున్నారు. మండలంలోని కొత్తవెల్లంపల్లి గ్రామంలోని ముదిరాజ్ సామాజిక వర్గానికి చెందిన వైసీపీ నేతలు ఆపార్టీని వీడి టీడీపీలో చేరారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే



యరపతినేని శ్రీనివాసరావు వారికి పార్టీ కండువాలను కప్పి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ వైసీపీ పార్టీ విధానాలకు విసుగుచెంది కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధికి ఆకర్షితులమై టీడీపీలో చేరినట్లు చెప్పారు. పార్టీలో చేరిన వారిలో గొర్రె శ్రీనివాసరావు, అనిల్‌కుమార్ (వార్డు మెంబర్), నాగరాజు, దుర్గారావు, గంజనబోయిన చిన సింగరయ్య తదితరులు ఉన్నారు.

# లక్కీ రోడ్‌లైన్స్ ఆధ్వర్యంలో పేదలకు దుస్తులు, విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు పంపిణీ

**చిలకలూరిపేట, మార్చి23, ప్రభాతవార్త:** పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా లక్కీరోడ్‌లైన్స్ అధినేత మొహమ్మద్ యూసఫ్‌ఆలీ స్వగృహంలో ఆదివారం జకాత్ సొమ్ముతో 700 పేద కుటుంబాలకు దుస్తులు, 200 మందికి ఆర్థిక సహాయం, పేద,ముస్లిం యువతులకు వివాహానికి,పేదవిద్యార్థులకు స్కాలర్‌షిప్



నిమిత్తం సుమారు 7లక్షల 50వేల రూపాయలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా మాజీశాసనసభ్యురాలు, ఒయాసిస్ అధ్యక్షురాలు డాక్టర్ కందిమళ్ళ జయమ్మ, ఒయాసిస్ కార్యదర్శి కరణం విజయలక్ష్మి, లక్కీ రోడ్‌లైన్స్ అధినేత మొహమ్మద్ యూసఫ్ ఆలీ, కరీమా, డాక్టర్ అబ్దుల్ బాసిత్, మున్సిపల్ డిఈ షేక్ అబ్దుల్ రహీమ్, కాటన్ రెహమాన్, అస్లాం నజీర్ అహమ్మద్, లక్కీ రోడ్‌లైన్స్ సిబ్బంది పాల్గొన్నారు.

# రెడ్‌క్రాస్ సొసైటీ సర్వసభ్య సమావేశం

**నరసరావుపేట, మార్చి 23 ప్రభాతవార్త :** పల్నాడు జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ శాఖ సర్వసభ్య సమావేశం ఆదివారం ఛైర్మన్ డాక్టర్ కంజుల జగన్‌మోహన్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. సంస్థ ప్రతినిధులు జి.మురళీకృష్ణ, పి.వి.ఎం.శరత్‌బాబు, డాక్టర్ సృజన, వీరారెడ్డి, మస్తాన్‌వలి, మాలకొండారెడ్డి, కొలిపాక చంద్రశేఖర్, అబ్దుల్ గఫార్ తదితరులు పాల్గొన్నారు. రెడ్‌క్రాస్‌కు సేవలందించిన శ్రీనివాసగుప్తా, డాక్టర్ సృజనాలను ఘనంగా సత్కరించారు. రెడ్‌క్రాస్ స్థలంలో నూతన భవనాన్ని నిర్మించాలని నిర్ణయించారు. ఓల్డేజ్ హోమ్, స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ సెంటర్, ఉచిత వైద్యశాల, జనరిక్ మెడికల్ షాప్ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. తలసేమియా ట్రాన్స్‌ఫ్యూజన్ సెంటర్ ఏర్పాటు చేసి పుట్టుకతో వచ్చే జబ్బులకు ఉచితంగా సేవలందిస్తామన్నారు. అదే విధంగా బ్లడ్ బ్యాంక్ ద్వారా అందిస్తున్న సేవలను తెలియజేశారు. బాధితులను ఆదుకునే కార్యక్రమాలను నిర్వహించి




నట్లు ఛైర్మన్ డాక్టర్ కంజుల జగన్‌మోహన్‌రెడ్డి వివరించారు.

# ఉన్నత స్థాయికి ఎదిగేందుకు కష్టపడి చదవాలి

**నరసరావుపేట, మార్చి 23 ప్రభాతవార్త :** పట్టణంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో బాలికలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్య క్రమానికి పాఠశాల ప్రిన్సిపాల్ ఎం ప్రమీలా రాణి అధ్యక్షత వహించారు. సైకాలజిస్ట్ అండ్ కౌన్సిలర్ రావలి శాంతివర్ధన్ పాల్గొనిమాట్లాడారు. ఏ రంగంలో రాణించాలో నిర్ణయం చేసుకుని, దృఢ సంకల్పంతో ముందుకు వెళ్లాలని సూచించారు. విద్యార్థినులకు మానసిక దృఢత్వం కలిగి ఉండాలని సూచించారు.



ప్రతి ఒక్కరు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని పేర్కొన్నారు. ప్రస్తుత కాలంలో అన్నీ రంగాలలో పురుషులుతో పాటు మహిళాలు సమానంగా రాణిస్తున్నారని తెలిపారు. ఉన్నత స్థాయికి ఎదిగేందుకు కష్టపడి చదువుకోవాలన్నారు. ఈసందర్భంగా మెంటల్ హెల్త్ అండ్ కెరియర్ గైడెన్స్ పై వివిధ అంశాలు శాంతి వర్ధన్ తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎం ప్రమీలా రాణితో పాటు పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# మాజీ సైనికులు రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షులుగా తాండ్ర సాంబశివరావు ఎన్నిక

**బాపట్ల, మార్చి23, ప్రభాతవార్త:** రాష్ట్ర స్థాయి లో మాజీ సైనికులకు స్టేట్ అసోసియేషన్ కోసం జరిగిన ఎన్నికలలో బాపట్ల జిల్లా మాజీ సైనికుల అధ్యక్షులు, ఎంపీటీసీ తాండ్ర సాంబశివరావు



ఆయన ప్రత్యర్థి ఎన్టీఆర్ జిల్లా (విజయవాడ) అధ్యక్షులు గరిమెళ్ళ శివ నాగేశ్వర రావు పై భారీ మెజారిటీ తో గెలుపొందారు. రాష్ట్ర మాజీ సైనికులు రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షుల ఎన్నికలు విజయవాడలో ఆదివారం నిర్వహించారు. ఈ ఎన్నికలలో తాండ్ర సాంబశివరావు అధ్యక్షులుగా గెలుపొందారు. రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ గా అనంతపురం జిల్లా అధ్యక్షులు పి విశ్వేశ్వర రావు తన ప్రత్యర్థి కర్నూలు జిల్లా అధ్యక్షులు పేరయ్య చౌదరి పై గెలుపొందారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గా రాజమండ్రి వాస్తవ్యులు ప్రముఖ న్యాయవాది డాక్టర్ సూరెడ్డి శివ కుమార్ తన ప్రత్యర్థి గిద్దలూరు సెక్రటరీ పై గెలుపొందారు. రాష్ట్ర జాయింట్ సెక్రటరీ గా పలాస అధ్యక్షులు ఐ మన్మధరావు తన ప్రత్యర్థి విశాఖపట్టణం వాస్తవ్యులు కాకి వెంకట రమణ రెడ్డి పై గెలుపొందారు. రాష్ట్ర కోశాధికారి గా విజయవాడ కు చెందిన ఉమామహేశ్వర రావు తన ప్రత్యర్థి అయిన చిత్తూరు సెక్రటరీ కలిశెట్టి సిద్దయ్య పై గెలుపొందారు. అత్యంత ప్రతిష్టాత్మకంగా రాష్ట్రంలో మొట్ట మొదటి సారి పోలీసు బందోబస్తు మధ్య ఉన్నతాధికారుల సమక్షంలో పకడ్బందీగా ఎన్నికలు నిర్వహించటం సంతోష దాయకం అని నూతన రాష్ట్ర అధ్యక్షులు తాండ్ర సాంబశివరావు తన కమిటీ సభ్యులతో కలిసి తెలియజేశారు. రాష్ట్ర స్థాయిలో కమిటీ ఏర్పడుటకు తన వంతు శాయశక్తులా కృషి చేసిన అడహాక్ కమిటీ అధ్యక్షులు కే గోవిందరావు కు అధ్యక్షులు తాండ్ర తో పాటు నూతన కమిటీ సభ్యులు ప్రత్యేకమైన ధన్యవాదాలు తెలిపారు. అసోసియేషన్ అభివృద్ధికి, మాజీ సైనికులు సంక్షేమానికి, సమస్యల పరిషారానికి తన వంతు కృషి చేస్తానని ఆయన అన్నారు.

# వాహన నెంబర్ ప్లేట్లపై పిచ్చి రాతలు కనిపిస్తే ఉపేక్షించేది లేదు

**బాపట్ల, మార్చి23, ప్రభాతవార్త:** వాహన నెంబర్ ప్లేట్లపై పిచ్చి రాతలు కనిపిస్తే ఉపేక్షించేది లేదని బాపట్ల పట్టణ సీఐ రాంబాబు అన్నారు. ఆదివారం బాపట్ల పాత బస్టాండ్ వద్ద పట్టణ సీఐ రాంబాబు వాహన తనిఖీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగ ఆయన మాట్లాడుతూ కార్లు, ద్విచక్ర వాహనాల నెంబర్ ప్లేట్లపై చిలిపి రాతలు, సినిమా హీరోల ఫోటోలు కనిపిస్తే వాహనదారులను ఉపేక్షించేది లేదన్నారు. వాహనదారులు వివరాలు దొరకకుండా చాలామంది నెంబర్ ప్లేట్ పై నెంబర్లు గుర్తించకుండా రకరకాల డిజైన్లు పేర్లు, స్టిక్కర్లతో తప్పించుకుంటున్నారని నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.



# నియోజకవర్గంలో పర్యటించిన ఎమ్మెల్యే చదలవాడ

**నరసరావుపేట, మార్చి 23 ప్రభాతవార్త :** ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు ఆదివారం నియోజకవర్గంలో పర్యటించారు. ప్రముఖ న్యాయవాది, తెలుగుదేశంపార్టీ సీనియర్ నాయకులు పంగులూరి ఆంజనేయ చౌదరి అంతిమయాత్రలో వారు పాల్గొన్నారు. ఆయన పార్థివదేహానికి పూలమాలలు వేసి



నివాళులర్పించారు. పార్టీకి వారు అందించిన సేవలను గుర్తు చేశారు. అదే విధంగా బార్ అసోసియేషన్ అధ్యక్షునిగా, ప్రభుత్వ ప్లీడర్‌గా అందించిన సేవలను ఈ సందర్భంగా తెలియజేశారు. ఆయన భౌతికకాయానికి తెలుగుదేశంపార్టీ జెండాను కప్పి నివాళులర్పించారు. అనంతరం అంతిమ యాత్రలో పాల్గొన్నారు.

**అభివృద్ధి పనులను పరిశీలించిన ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ...**

పట్టణంలోని వివిధ ప్రాంతాలలో నిర్వహిస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు పరిశీలించారు. చిలకలూరిపేటరోడ్డులోని బాబాపేట వద్ద ఉన్న సి.సి.రోడ్డు పనులను పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. నాణ్యతా ప్రమాణాలకు పెద్దపీట వేయాలన్నారు. స్థానిక ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా వేగంగా నిర్మాణాన్ని చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు సూచించారు.

# అంజుమన్ కమిటీ ఆధ్వర్యంలో రంజాన్ తోఫా

**బాపట్లరూరల్, మార్చి23, ప్రభాతవార్త:** అంజుమన్ కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలోని అన్ని మసీదుల పేస్మామ్, మోజన్లలకు రంజాన్ తోఫా అందించడం జరిగిందని అంజుమన్ కమిటీ అధ్యక్షులు అబ్దుల్ రహీం జానీ తెలిపారు. స్థానిక పాత బస్టాండ్ సెంటర్లోని అంజుమన్ మసీదు



ప్రాంగణంలో ఆదివారం రంజాన్ తోఫా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంజుమన్ సంస్థ పట్టణంలోని అన్ని మసీదులకు పెద్దన్న పాత్ర పోషిస్తుందన్నారు. పట్టణంలోని అన్ని మసీదులకు కావలసిన మోలిక సదుపాయాలు అంజుమన్ సంస్థలతోనే జరుగుతుందన్నారు . పట్టణంలోని ముస్లింలకు సంబంధించి ఏ కార్యక్రమం చేపట్టాలన్న అన్ని మసీదుల పెద్దలు, అంజుమన్ సంస్థతో చర్చించి ఆ కార్యక్రమానికి శ్రీకారం చేపడతారన్నారు. అంతే కాకుండా అంజుమన్ సంస్థ పట్టణంలోని నిరుపేద ముస్లింలకు అండగా నిలుస్తుంది అన్నారు నిరుపేద ముస్లింలకు విద్యా ,వైద్యం సదుపాయాలు కల్పిస్తుందన్నారు. నిరుపేద అమ్మాయిల పెళ్లిళ్లకు కూడా అంజుమన్ సంస్థ సహాయం అందిస్తుందన్నారు. పవిత్ర రంజాన్ పండుగ సందర్భంగా పట్టణంలోని 17 మసీదుల పెష్మాములకు రు.5000 చొప్పున మోజన్లలకు రు.3000 చొప్పున రంజాన్ తోఫా అందించడం జరిగిందన్నారు. గతంలో రంజాన్ తోఫా కేవలం ఐదు మసీదులకు మాత్రమే అందించటం జరిగిందన్నారు. నూతన కమిటీ ఏర్పడిన నాటి నుండి పట్టణంలోని 17 మసీదులకు రంజాన్ తోఫా అందిస్తున్నామన్నారు. ఈ ప్రక్రియ అదేవిధంగా కొనసాగిస్తామని ఆయన తెలిపారు. అనంతరం అంజుమన్ సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగులకు నెల జీతంతో పాటు రంజాన్ తోఫా మరియు బట్టలు అందించడం జరిగిందన్నారు ఈ కార్యక్రమంలో కమిటీ వైస్ ప్రెసిడెంట్ బాజీవలి ,సెక్రటరీ అబ్దుల్ కరీం ,జాయింట్ సెక్రటరీ రఫీ , ట్రెజరర్ మీరా సాహెబ్ ,మెంబర్లు మోలాలి ,ఆదం ,మజీద్ ,ఖాసిం ,సిద్దయ్య ,హనీఫ్ ,పేష్మాములు, మోజన్లు, తదితరులు పాల్గొన్నారు.

# నెల్లూరు ఈడి నాగేంద్ర ప్రసాద్ నుంచి అవార్డు అందుకున్న చిలకలూరిపేట డిపో మేనేజర్ యస్ రాంబాబు

చిలకలూరిపేట, మార్చి23, ప్రభాతవార్త: చిలకలూరిపేట ఏ.పి.యస్.ఆర్.టి.సి డిపో మేనేజర్ సింహాద్రి రాంబాబు నరసరావుపేటలో జరిగిన కార్యక్రమంలో శివరాత్రి పర్వదినం సందర్భంగా ప్రయాణీకులకు మెరుగైన సేవలను అందించినందుకుగాను నెల్లూరు జోన్ ఈడి నాగేంద్రప్రసాద్ చేతుల మీదుగా అవార్డు



అందుకున్నారు. డిపో మేనేజర్ రాంబాబు అవార్డు పొందటం పట్ల డిపో ఎంప్లాయిస్ యూనియన్ కార్యదర్శి అద్దంకి వర ప్రసాద్, బి.కోటేశ్వరరావు, యమ్ సుబ్బారావు, ఏ థామస్, కె.వై రత్నం, సైదావలిలు హర్షం వ్యక్తం చేశారు.

# రాజకీయాలకు ఆతీతంగా ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ ఏర్పాటు

**నరసరావుపేట టౌన్, మార్చి 23 ప్రభాతవార్త :** రాజకీయ పార్టీలకు ఆతీతంగా ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ ఏర్పాటు చేస్తున్నట్లు జనసేనపార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి సయ్యద్ జిలాని అన్నారు. ఆదివారం స్థానిక షాదీఖానాలో ముస్లిం మత పెద్దలు వివిధ రాజకీయ పార్టీలలోనినాయకులు కార్యక్రమంలో పాల్గొని మాట్లాడా రు. మైనార్టీ సోదరులు ఎదుర్కొనే సమస్యలను చర్చించారు. ముస్లింల అభివృద్ధితో పాటు వారివిద్యకు సంబంధించి మత పెద్దలు సూచనలు చేసారు. అదే విధంగా ముస్లిం ఆస్తుల పరిరక్షణ గురించి మాట్లాడారు. మైనార్టీ సంక్షేమ సంఘం విధి విధానాలు, అందుకు అవసరమైన చట్టబద్ధత కల్పించే విధంగా భవిష్యత్ అడుగులు వేయాలని నిర్ణయించారు. రంజాన్ పర్వదినం



అనంతరం ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ ని ఎన్నుకుని అధికారికంగా ప్రకటించాలని నాయకులు తెలిపారు. కార్యక్రమంలో పెద్దలు సయ్యద్ జిలానితో పాటు షేక్ మీరావలి, షేక్ ఖాజావలి, షేక్.గఫార్, అయూబ్, రెహంతుల్లా, రిజిస్ట్రర్ ఆఫీస్ అజీజ్, మన్నాన్‌షరీఫ్, ఖాజా, షేక్ ఖాదర్‌బాషా, అష్రూఫ్, కరీముల్లా, మస్తాన్‌వలి, మాబూ, బడే బాబు, మాజీ కౌన్సిలర్‌లు మంజూర్ పాల్గొన్నారు.

# ఆర్యవైశ్య అన్నదాన సత్రంలో సేవా కార్యక్రమాలు

**నరసరావుపేట టౌన్, మార్చి 23 ప్రభాతవార్త :** మండలంలోని ఇస్సపాలెం గ్రామంలో ఉన్న ఆర్యవైశ్య అన్నదాన సత్రంలో ప్రత్యేక సేవా కార్యక్రమాలను ఆదివారం నిర్వహించారు. సత్రం అధ్యక్షులు బత్తుల మురళీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, భజనలు జరిగాయి. అనంతరం శ్రీ మహంకాళి అమ్మవారి దర్శనానికి వచ్చిన భక్తులకు అన్నదాన



కార్యక్రమాన్ని నిర్వహించారు. సభా కార్యక్రమానికి బత్తుల మురళీ అధ్యక్షత వహించారు. సభకు హాజరైన ప్రముఖులు ఇ.ఎం.స్వామి, వాసవిక్లబ్ ప్రతినిధులు మాట్లాడారు. కార్యక్రమంలో బొగ్గారపు బ్రహ్మానందం, చేగు వెంకటేశ్వరరావు, జెల్లిపల్లి శ్రీనివాసరావు, కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

# మెగా జాబ్‌మేళాలో150 మందికి ఉద్యోగ అవకాశాలు


**పిడుగురాళ్ల, మార్చి 23 ప్రభాతవార్త:** పట్టణంలోని వివేకానంద పబ్లిక్ స్కూల్ అర్వత్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యాన ఆదివారం నిర్వహించిన మెగా జాబ్‌మేళాకు విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా అర్వత్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్ డైరెక్టర్ యలగాల కృష్ణంరాజు యాదవ్ మాట్లాడుతూ జాబ్‌మేళాలో 12 కంపెనీలు పాల్గొన్నాయన్నారు. మొత్తం 450 మంది జాబ్‌మేళాకు పేర్లు



నమోదు చేసుకోగా 350 మంది హాజరయ్యారన్నారు. వీరిలో 150 మంది వేర్వేరు కంపెనీల్లో ఉద్యోగాలు సాధించారన్నారు. మిగిలిన వారికి త్వరలోనే ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని కృష్ణంరాజు యాదవ్ తెలిపారు.

# సీసీ రోడ్ల నాణ్యతా ప్రమాణాలను పరిశీలించిన అధికారులు

**యడ్లపాడు, మార్చి 23, ప్రభాతవార్త :** మండల పరిధిలోని గ్రామాలలో నిర్వహించిన పనులకు సంబంధించిన నాణ్యతా ప్రమాణాలను అధికారుల బృంధం శని, అదివారాలలో పరిశీలించారు. నిర్వహించిన పనులు మొత్తం 23పనులు గాను 20పనులు పూర్తిచేయటం జరిగింద ని, 2.79 కోట్లుకుగాను ప్రస్తుతం 2.05కోట్లకు సంబంధిన పూర్తిఅయిన పనులు పరిశీలించారని, మండలంలోని మైదవోలు, లింగారావుపాలెం, తిమ్మాపురం, బోయపాలెం, కొండవీడు, కోట, సొలస, కొత్తసొలస, ఉన్నవ, కారుచోల, గుత్తావారి



పాలెం, సందెపూడి, తుర్లపాడు, జగ్గాపురం పర్యటించారన్నారు. పనులకు సంబంధించిన నాణ్యతా ప్రమాణాలపై అధికారులు సంతృప్తిచెందటం జరిగిందని యడ్లపాడు పంచాయితీరాజ్ ఎఈ బాలకుమార్ తెలిపారు. నర్సరావుపేట నాణ్యతా ప్రమాణాల డిఇ శౌరిరాజు, ఏఈ కె రమేష్, చంద్రశేఖరరెడ్డి, యడ్లపాడు ఎఈ బాలకుమార్, అయా గ్రామాల పనులు నిర్వహించిన నిర్వాహకులు పాల్గొనటం జరిగిందన్నారు.

# భగత్‌సింగ్ పోరాట స్ఫూర్తితో ఉద్యమించాలి

చిలకలూరిపేటటౌన్, మార్చి23, ప్రభాతవార్త: నిరంతర సమస్యల పరిష్కారం కోసం యువత




భగత్‌సింగ్ పోరాట స్ఫూర్తితో ఉద్యమించాలని, సిపిఐ ఏరియా ఇన్‌ఛార్జి కార్యదర్శి తాళ్ళూరి బాబురావు అన్నారు. ఆదివారం భారత స్వతంత్ర్య విప్లవ ధృవతారలు సర్దార్ భగత్‌సింగ్, రాజగురు, సుఖదేవ్‌ల వర్ధంతిని సిపిఐ కార్యాలయంలో ఏ.ఐ.వై.యఫ్ నియోజక సమితి ఆధ్వర్యంలో నిర్వహించారు. ముందుగా భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఏ.ఐ.వై.యఫ్ పల్నాడు జిల్లా కార్యదర్శి షేక్‌సుబానీ మాట్లాడుతూ సమసమాజ స్థాపనే ధ్యేయంగా సోషలిజాన్ని కాంక్షించిన భగత్‌సింగ్ ఆశయాల కోసం యువత పాటుపడాలన్నారు. 23సంవత్సరాల వయస్సులో దేశంకోసం ప్రాణాలు అర్పించిన పోరాటయోధులు వారు అనిఅన్నారు. కార్యక్రమంలో చెరుకుపల్లి నిర్మల, దాసరి వరహాలు, సురభి రాజు, కె మల్లికార్జున్, బి రాంబాబు నాయక్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# గోగినేని భారతీదేవి రంగా బడుగు బలహీన వర్గాలకు చేసినసేవలు చిరస్మరణీయం

**గుంటూరు కల్చరల్, మార్చి 23, ప్రభాతవార్త :** స్థానిక బృందావన్ గార్డెన్స్‌లోని శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం శ్రీపద్మావతి కల్యాణమండపం వేదికగా ఆదివారం ఉదయం ఆచార్య ఎన్జీరంగా ఫౌండేషన్ ఆధ్వర్యంలో డాక్టర్ జక్కంపూడి సీతారామరావు నిర్వహణలో గోగినేని భారతీదేఇ రంగా జ్ఞాపకార్థం జరిగినసభా కార్యక్రమానికి సభాధ్యక్షులుగా చిగురుపాటి రవీంద్రబాబు, ముఖ్యఅతిథిగా పొన్నూరు శాసనసభ్యులు ధూళిపాళ్ళ నరేంద్రకుమార్, వక్తలుగా విశ్రాంత లెక్చరర్ వెలగా పుష్పకుమారి, విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ వెలివోలు నాగరాజ్యలక్ష్మీ, వక్తల పరిచయకర్తగా డాక్టర్



జక్కంపూడి సీతారామారావు పాల్గొన్నారు. తొలుత కార్యక్రమాలను ఆలయ పాలకమండలి అధ్యక్షులు సిహెచ్ మస్తానయ్య సంస్థ వారు జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. తొలి పలుకులు పలుకుతూ గోగినేని భారతి నారీ లోకానికి దర్పణం లాంటిదన్నారు. వక్తలు మాట్లాడుతూ భారతీదేవి, రంగా బడుగు వర్గాలకు, చేతి వృత్తుల వారికి, రైతులకు వారు చేసిన సేవలు, త్యాగాలు చిరస్మరణీయమన్నారు. డాక్టర్ నాగరాజ్యలక్ష్మీ మాట్లాడుతూ భారతీదేవిని వజ్రంతో పోల్చారు. మహిళలకు ఉద్యమస్ఫూర్తిని కల్పించారన్నారు. ఇటువంటి కార్యక్రమాన్ని నిర్వహించి యువతకు స్ఫూర్తి కలిగిస్తున్న డాక్టర్ జక్కంపూడి సీతారామారావు ను అభినందించి, సంస్థ వారు వక్తలను సత్కరించారు. పి.వి.రమణ బృందం రైతు భజనావళి పాటలు పాడి ఆహుతులను అలరించారు.

# మెడికల్ షాపులో నిషేధిత ఔషధాలు వసూల్ “మత్తు”లో డ్రగ్ అధికారులు : శివసేన

**గుంటూరు క్రైమ్, మార్చి 23, ప్రభాతవార్త :** స్థానిక శివసేనపార్టీ రాష్ట్ర కార్యాలయంలో విలేకరుల సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులు వినోదుల నరసింహారావు మాట్లాడుతూ ర్యాష్టంలో మెడికల్ షాప్స్‌పై విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ దాడుల్లో భాగంగా రాష్ట్ర వా ్యప్తంగా మెడికల్ షాపుల్లో తనిఖీలు నిర్వహించారు. తనిఖీ బృందాలు నిషేధిత మందులను పెద్దమొత్తంలో స్వాధీనం చేసుకోవడం జరిగిందని, దీని వెనుక అధికార మరియు ప్రతిపక్ష నాయకుల హస్తం ఉందని శివసేన పార్టీ ఆరోపించింది. రాష్ట్రంలో మరియు ఉమ్మడి గుంటూరు జిల్లాల్లో ఆస్పత్రికి అనుబంధంగా ఉన్న అనేక మెడికల్ షాపుల్లో కాలం చెల్లిన ఇంజెక్షన్లు, మందులను అమ్ముతున్నప్పటికి డ్రగ్ కంట్రోల్ అధికారులు తనిఖీలు చేయకుండా వసూళ్ళ “మత్తు”లో చూసి చూడనట్లుగా ప్రజల ఆరోగ్యానికి



రక్షణ లేకుండా చేస్తున్నారని అటువంటి అధికారులును సస్పెండ్ చేయాలని శివసేన పార్టీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. చట్టవిరుద్ధ పనులకు పాల్పడుతున్న కారకులపై కేసులు నమోదుచేసి లైసెన్సులు రద్దుచేయాలని రాష్ట్ర అధ్యక్షులు నరసింహారావు కోరారు. అదేవిధంగా ఈగల్ టీమ్ ఐజ రవికృష్ణకి ప్రత్యేక అభినందనలు తెలిపారు. కార్యక్రమ ంలో జిల్లా అధ్యక్షులు గోవింద్‌సింగ్, రాష్ట్ర కార్యదర్శి వినయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# 30న ఉగాది క్రీడా పురస్కారాలు అందజేత

**గుంటూరు స్పోర్ట్స్, మార్చి 23, ప్రభాతవార్త :** గ్లోబల్ స్పోర్ట్స్ ఫౌండేషన్, గ్లోబల్ స్పోర్ట్స్ (స్పోర్ట్స్ మ్యాగజైన్) ఆధ్వర్యంలో ఉగాది పండుగ సందర్భంగా ఈనెల 30వ తేది సాయంత్రం 6గంటలకు స్థానిక జేకేసి కళాశాల రోడ్డులోని హనుమాన్ నగర్ 1వ లైన్‌లో గల వివివి హెల్త్ క్లబ్ లో ఉగాది క్రీడాపురస్కారాలు, అవార్డులను అందజేస్తున్నట్లు గ్లోబల్ స్పోర్ట్స్ ఫౌండేషన్ కార్యదర్శి జి.వి.ఎస్. ప్రసాద్ తెలిపారు. ఉత్తమ క్రీడాకారులు, శిక్షకులు, క్రీడా ప్రమోటర్స్, స్పోర్ట్స్ డాక్టర్స్‌కు ఈ అవార్డులు అందజేస్తున్నట్లు తెలిపారు. గత పది సంవత్సరాలుగా గ్లోబల్‌స్పోర్ట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గుంటూరులో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

## వైద్య సేవలకు కూటమిప్రభుత్వం అధిక ప్రాధాన్యత: ఎమ్మెల్యే ప్రత్తిపాటి

చిలకలూరిపేటరూరల్,మార్చి23,ప్రభాతవార్త: కూటమిప్రభుత్వం పేదప్రజలకు అధిక ప్రాధాన్యత ఇస్తోందని మాజీమంత్రివర్యులు స్థానిక



శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. ఆదివారం మండలంలోని బొప్పూడి గ్రామంలో కాటూరి వైద్యకళాశాల, ఎన్టీఆర్ వైద్యసేవావిభాగం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వైద్యశిబిరాన్ని ప్రత్తిపాటి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బొప్పూడి గ్రామంతో పాటు చుట్టుప్రక్కల ఐదు గ్రామాల ప్రజల కోసం గ్రామ కూటమినేతలు వైద్యశిబిరాన్ని ఏర్పాటుచేయడం అభినందనీయం అని అన్నారు. పలు అనారోగ్య సమస్యలతో బాధపడేవారికి వైద్య సిబ్బంది శిబిరంలోనే ఉచిత వైద్య పరీక్ష నిర్వహించి మందులు అందిస్తారని,దీర్ఘకాల అనారోగ్య సమస్యలతో బాధపడే వారు మాత్రం కాటూరి వైద్య కళాశాలకు వెళ్ళి అక్కడ ఉచిత వైద్యసేవలు పొందే ఏర్పాట్లు చేశారని అన్నారు. ఎన్టీఆర్ వైద్యసేవ క్రింద అన్నిరకాల దీర్ఘకాలిక వ్యాధులకు కూటమిప్రభుత్వం ప్రజలకు నాణ్యమైన వైద్య చికిత్సలు అందిస్తోందన్నారు. కార్యక్రమంలో కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ షేకరఫానీ, టిడిపి నాయకులు షేక్ కరిముల్లా, నెల్లూరి సదాశివరావు, జవ్వాజి మదన్ మోహన్, అంబటి సోంబాబు, గుంటు కోటేశ్వరరావు, కాటూరి మెడికల్ ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గ్రంధి సాంబశివరావు చిత్రపటానికి నివాళులు అర్పించిన ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్



**చిలకలూరిపేట,మార్చి23,ప్రభాతవార్త:** పట్టణానికి చెందిన మాజీ మున్సిపల్ కౌన్సిలర్ గ్రంధి ఆంజనేయులు సోదరుడు గ్రంధి సాంబశివరావు ఇటీవల మరణించారు. కాగా ఆయన దశదినకర్మ ఆదివారం సాంబశివరావు గృహంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శాసనమండలి సభ్యులు మర్రి రాజశేఖర్ పాల్గొని సాంబశివరావు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు.

## పిల్లల సంరక్షణ కోసం రూపొందించిన చట్టం ఫోక్సో చట్టం

### -న్యాయవిజ్ఞాన సదస్సులో న్యాయమూర్తి కె నరేంద్రరెడ్డి

**చిలకలూరిపేట,మార్చి23,ప్రభాతవార్త:** మైనర్ విద్యార్దినిలు, బాలికల సంరక్షణ కోసం



రూపొందించిన చట్టం ఫోక్సో చట్టమని మండల న్యాయసేవాధికార సంస్ద ఛైర్మన్, న్యాయమూర్తి కె నరేంద్రరెడ్డి అన్నారు. స్దానిక యంపిడిఓ కార్యాలయంలో జరిగిన న్యాయవిజ్ఞాన సదస్సులో ఆయన మాట్లాడుతూ 18 సంవత్సరాల లోపు పిల్లలపై వేదింపులు,దుర్వినియోగం, మరియు లైంగిక నేరాలను నివారించేందుకు ఏ విధమైన చర్యలు తీసుకోవాలి, ఈ చట్టంలోని శిక్షానిబంధనల గురించి, ఈ చట్టంలోని బాదితుల గోప్యతను ఏ విధంగా కాపాడాలి అనే విషయాలను న్యాయమూర్తి వివరించారు. రాష్ట్ర న్యాయసేవాధికార సంస్ద, జిల్లా న్యాయసేవాధికార సంస్ద వారి ఆదేశాలమేరకు స్దానిక మండల న్యాయసేవాధికార సంస్ద ఆధ్వర్యంలో ఈ న్యాయవిజ్ఞాన సదస్సును ఏర్పాటు చేశారు. ఈ సదస్సులో యంపిడిఓ కె శ్రీనివాసరావు, యంపిపి దేవినేని శంకరరావు, ఎస్ఐ శివరామకృష్ణ, న్యాయవాదులు జివివిఎస్ ప్రసాద్,పి వెంకటేశ్వరరావు, శాంతకుమారి, సిడిపిఓ, మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

## ఘనవ్యర్థాలపై శిక్షణా కార్యక్రమం : యంపిడిఓ స్వరూపరాణి



**నాదెండ్ల,మార్చి23,ప్రభాతవార్త:** మండల కేంద్రమైన నాదెండ్లలో సోమవారం నుండి శుక్రవారం వరకు ఐదు రోజులపాటు ఘనవ్యర్థాల నిర్వహణపై శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నాదెండ్ల యంపిడిఓ స్వరూపరాణి ఆదివారం తెలిపారు. గ్రామంలో ఉన్న ఘన వ్యర్థాల నిర్వహణా కేంద్రాన్ని నియోజకవర్గస్థాయి స్దానిక శిక్షణా కేంద్రంగా ఎంపిక చేయడం జరిగిందని, నియోజకవర్గంలోని మూడు మండలాల అధికారులు, సిబ్బంది ఈ శిక్షణా కార్యక్రమంలో పాల్గొంటారని ఆమె తెలిపారు. మండలాల వారిగా జరిగే ఈ శిక్షణ కార్యక్రమంలో సోమవారం నాదెండ్ల మండలం, మంగళ, బుధవారాలు చిలకలూరిపేట మండలం, గురు,శుక్ర వారాలు యడ్లపాడు మండలానికి చెందిన ప్రభుత్వ యంత్రాంగం హాజరుకానున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా మండలాల యంపిడిఓలు, ఈఓపిఆర్డిలు, గ్రామ పంచాయితీ కార్యదర్శులు, యంఆర్పిలు, క్లాప్ మిత్రాలు, గ్రీన్ గార్డ్లు హాజరుకానున్నారని ఆమె వివరించారు.

## ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులుగా ఆర్ వి వి రమేష్ ఏకగ్రీవంగా

**గుంటూరు కార్పొరేషన్,మార్చి23,ప్రభాతవార్త :** ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులుగా ఆర్ వి వి రమేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గుంటూరు జిల్లా పరిషత్ సమావేశ భవనంలో ఆదివారం జరిగిన సమావేశానికి అసోసియేషన్ అధ్యక్షుడు బండి శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. అనంతరం జరిగిన సమావేశంలో పదవి కాలం ముగిసిన 13 జిల్లాల అధ్యక్ష కార్యదర్శులు ఎంపిక ఏప్రిల్ 30 తేదీన జరుగుతుందని సమావేశం నిర్ణయించింది.



ఈ సందర్భంగా బండి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎంతోకాలంగా పంచాయతీరాజ్ శాఖలో పనిచేసే ఉద్యోగుల పదోన్నతులు కల్పించాలని కోరారు 50 కోటాకు అప్పిస్టెంట్ల ఆఫీసర్లకు ఎండివోలుగా పదోన్నతులు కల్పించాలని కోరారు. రికార్డు అసిస్టెంట్ లైబ్రరీ అసిస్టెంట్లకు జూనియర్ అసిస్టెంట్లుగా పదోన్నతులు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. సమావేశంలో రాష్ట్ర కమిటీ ట్రెజరర్ పి.దస్తగిరి, ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ కూచిపూడి మోహన్ రావు, కొండూరు శ్రీనివాసరావు, జిల్లాల పూర్వపు ఉపాధ్యక్షులు మూరం సత్యనారాయణ, శ్రీధర్ బాబు, జి ఎస్ ప్రసాద్, పూర్వందర్రెడ్డి,కే సాగర్ రెడ్డి, పెంటయ్య, చెంచు రత్నం జిల్లాల కార్యదర్శి కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## ఇఫ్తార్ విందులో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి

**నరసరావుపేట టౌన్, మార్చి 23 ప్రభాతవార్త :** మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఆదివారం ఇఫ్తార్ విందు కార్యక్రమంలో పాల్గొన్నారు.



పట్టణంలోని 3వ వార్డు నాయబ్‌బజార్‌లో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. నాయకులు షేక్.ఖాదర్‌బాషా, షఫీ బ్రదర్స్‌ను డాక్టర్ గోపిరెడ్డి అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రంజాన్ మాసం నెల రోజులు ఉపవాస దీక్షలు ఆచరిస్తున్న మైనార్టీల కు అల్లా దీవెనలు ఎల్లప్పుడూ ఉండాలన్నారు. వరవకట్ట మసీదు షాపింగ్ కాంప్లెక్స్ నూతన నిర్మాణం జరగాల్సిన అవసరం ఉందన్నారు. అదే విధంగా ముస్లిం మత పెద్దలకు వ్యక్తిగతంగా తామే వేతనాలు చెల్లించామని గుర్తు చేశారు. ప్రేమ, స్నేహం, త్యాగం, మంచితనానికి రంజాన్ పండుగ నిదర్శనమని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సీపీ నాయకులు షేక్.ఖాజావలి, షేక్.మస్తాన్‌వలి, మంజూర్, ఖాజా, గౌస్, ఇమామ్‌బాషా, శిలార్ తదితరులు పాల్గొన్నారు.

## భారత సంతతి వ్యోమగామి సునీతా విలియమ్స్‌కి అవగాహన సంస్థ సభ్యుల అభినందన

**గుంటూరు కల్చరల్,మార్చి 23,ప్రభాతవార్త :** అంతరిక్ష పరిశోధనలకు,ప్రయోగాలకు మరింత శక్తి ,సామర్థ్యాన్ని, స్ఫూర్తిని ఇచ్చిన భారత సంతతి వ్యోమగామి సునీత విలియమ్స్ రోదసీ చరిత్రలోనే చారిత్రక ఘట్టాన్ని ఆవిష్కరించారని అవగాహన సంస్థ సభ్యులు సునీతా విలియమ్స్ ని అభినందించారు. సంస్థ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో అవగాహన సంస్థ భూమికి దిగి శాస్త్ర చరిత్ర సృష్టించిన సునీతా విలియమ్స్ కు జాతీయ జెండాలు చేతబూని అభినందన కార్యక్రమం నిర్వహించారు.కార్యక్రమంలో విద్యావేత్త కొండా శివరామిరెడ్డి,డైరెక్టర్ పి.శ్రీమన్నారాయణ,సీనియర్ ఇంజనీర్ ఎన్.సదాశివమ్,కొండా శివరామిరెడ్డి,అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## క్యాంపస్ ఇంటర్వ్యూలకు విశేష స్పందన

**గుంటూరు విద్య,మార్చి 23,ప్రభాతవార్త :** స్థానిక అమరావతిరోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాల్లో భారతదేశ బహుళ జాతి ఔషధ తయారీ సంస్థ డివిస్ లాబొరేటరీస్ నిర్వహించిన ఫుల్ క్యాంపస్ ఇంటర్వ్యూలకు వివిధ కళాశాలల నుండి 150మంది విద్యార్థులు హాజరైనట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వి.నాగభూషణం తెలిపారు. కార్యక్రమానికి డివిస్ లాబొరేటరీస్ హెచ్‌ఆర్‌డి ప్రతినిధులు కె.రామకృష్ణ,కె.ప్రతాప్‌లు పర్యవేక్షణలో విద్యార్థులు రాత పరీక్ష ఇంటర్వ్యూ నిర్వహించారు. 50మంది ఎంపికైనట్లు వారికి నెలరోజుల్లో జాబ్ ఆఫర్ పంపనున్నట్లు హెచ్‌ఆర్‌డి మేనేజర్ తెలియజేశారు. కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు,కార్యదర్శి డాక్టర్ ఎస్.మధుసూదనరావు లు డివిస్ ల్యాబ్ ప్రతినిధులను అభినందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సీతారామయ్య,డాక్టర్.ఎ.ప్రత్యూష,ప్లేస్‌మెంట్ సెల్ కోఆర్డినేటర్ డాక్టర్ డి.బ్రహ్మశ్రీనివాసరావు,సభ్యులు పాల్గొన్నారు.

## మండలంలో అభివృద్ధి పనులకు శ్రీకారం

**రాజుపాలెం, మార్చి 23 ప్రభాతవార్త :** మండలంలోని మొక్కపాడు గ్రామంలో నిర్వహించే అభివృద్ధి పనులను



రాష్ట్ర ఆరోగ్యశాఖామంత్రి సత్యకుమార్ యాదవ్, ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణలు ఆదివారం శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ మొక్కపాడు గ్రామం ఎద్దువాగుపై రూ.5 కోట్ల 66 లక్షల వ్యయంతో బ్రిడ్జిని నిర్మించడం సంతోషమన్నారు. ప్రభుత్వం చేసే అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ చేసే అభివృద్ధి కార్యక్రమాలకు ప్రభుత్వం తమవంతు సహకారం అందిస్తుందని తెలియజేశారు. ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఎన్నో ఏళ్ళుగా గ్రామస్తులు ఈ సమస్యను ఎదుర్కొంటున్నారని తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రూ.5 కోట్ల 66 లక్షల వ్యయంతో బ్రిడ్జిని నిర్మించి సమస్యను పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. అధికారులు నాణ్యతా ప్రమాణాలు పాటించి వేగంగా బ్రిడ్జి నిర్మాణాన్ని పూర్తి చేయాలని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ సూచించారు.

## డాక్టర్ సింగరాజు సాయికృష్ణ దంపతులకు అభినందనలు తెలిపిన డాక్టర్ చదలవాడ

నరసరావుపేట, మార్చి 23 ప్రభాతవార్త : ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు ఆదివారం డాక్టర్ సింగరాజు సాయికృష్ణ దంపతులను అభినందించారు. సత్తెనపల్లి పట్టణంలో వారి ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన వైద్యశాలను ఆయన సందర్శించారు. హాస ్పటల్‌లో ఉన్న వివిధ విభాగాలను పరిశీలించి అక్కడ అందుతున్న సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు ఉత్తమ సేవలు అందిస్తూ అటు నరసరావుపేటలోనూ, ఇటు సత్తెన పల్లిలోనూ డాక్టర్ సింగరాజు సాయికృష్ణ ప్రజల వైద్యునిగా కొనసాగుతున్నారని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు అన్నారు. కార్యక్రమంలో వారి వెంట ఎంఏఎం విద్యాసంస్థల ఛైర్మన్ ఎం.ఆర్.శేషగిరిరావు, రంగిశెట్టి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



**మంత్రి సత్యకుమార్‌ను కలిసిన ఎమ్మెల్యే చదలవాడ...**

రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖామంత్రి సత్యకుమార్‌ను ఆదివారం ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు కలిశారు. సత్తెనపల్లి పట్టణంలో వంద పడకల ఆసుపత్రిని మంత్రితో కలిసి ఆయన ప్రారంభించారు. నరసరావుపేట నియోజకవర్గానికి సంబంధించిన వివిధ అంశాలను మంత్రి దృష్టికి ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు తీసుకెళ్ళారు. కార్యక్రమంలో సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు పాల్గొన్నారు.

## కోవిడ్ ఫైటర్ సేవలు అభినందనీయం

### -కమిషనర్ పులి శ్రీనివాసులు పులి శ్రీనివాసులు

**గుంటూరు కార్పొరేషన్,మార్చి23,ప్రభాతవార్త :** ఐదేళ్ల క్రితం గుంటూరు నగరంలో కోవిడ్ పారిన పడి మరణించిన వేలాదిమందికి ఉచితంగా దహన సంస్కారాలు చేయడం, లక్షలాదిమంది పేదలకు భోజన




సదుపాయం కల్పించడం, ఆధునిక అంబులెన్స్ తో వందలాది మందికి పలు విధాల ఆరోగ్య సేవలు అందించడం హర్షణీయం, అభినందనీయమని గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు కొనియాడారు.ఆదివారం గుంటూరులోని స్థానిక కోబాల్ట్ పేట 3వ లైన్ లో 30 మంది పేద మహిళలకు గత నాలుగు నెలలుగా శిక్షణ అందించి ఉచితంగా నూతన కుట్టుమిషన్లను బహుకరించి వారిలో ఆత్మవిశ్వాసం, ఆత్మస్థైర్యాన్ని నింపి, సాధికారతవైపు పురోగమించేటట్లు కోవిడ్ ఫైటర్స్ కృషి చేయడాన్ని స్వాగతించారు. గుంటూరు నగరంలోని దాతృత్వం గల సంస్థలన్నిటితో ఒక విశాల వేదికను ఏర్పాటు చేసి గుంటూరు నగరపాలక సంస్థ ద్వారా సేవా కార్యక్రమాలు విస్తృత పరుస్తామన్నారు. జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి మాట్లాడుతూ ప్రపంచ ఆనంద సూచికలో అతి చిన్న దేశమైన ఫిన్లాండ్ మొదటి స్థానంలో ఉండగా అత్యధిక జనాభా గల భారతదేశం 118వ స్థానంలో ఉండడం బాధాకరమన్నారు. భారతదేశంలో సేవా సంస్థలు మరిన్ని ముందుకు వచ్చి సమాజంలోని అసమానతలను తగ్గించడానికి, సేవా కార్యక్రమాలను పెంపొందించడానికి కమ్యూనిటీ సోషల్ రెస్పాన్సిబిలిటీని ప్రోత్సహించాలన్నారు. కోవిడ్ ఫైటర్స్ వ్యవస్థాపకులు పఠాన్ అల్లాబక్షు మాట్లాడుతూ దాతలు మరింత మంది ముందుకు వచ్చి కోవిడ్ ఫైటర్స్ చేస్తున్న సేవా కార్యక్రమాలకు తోడ్పాటును అందించాలని కోరారు. కార్మెల్ సేవా సదన్ వ్యవస్థాపకులు జాక్ క్లమాకస్ (గోతాల స్వామి) మాట్లాడుతూ అభాగ్యులైన నిరుపేదలకు కార్మెల్ సేవా సదన్ నిరంతరం ఆశ్రయమిస్తుందని, పొన్నూరులో 300కు పైగా మహిళా మానసిక వికలాంగులు, గుంటూరులో 70 మంది పురుష మానసిక వికలాంగులను చేరదీసి సేవలందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఇబ్రహీం, డాక్టర్ ఆదం ఖాన్, రుద్ర చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు సుభాని, నేస్తం వ్యవస్థాపకులు జలీల్ అహ్మద్, జవహర్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ ప్రిన్సిపల్ అస్ర హుస్సేన్, టోపీ బాబు, సైజుద్దీన్, ఆవాజ్ నేత చిస్టీ, బాజీ భాయ్ తదితరులు పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ పులి శ్రీనివాసులు కుట్టుమిషన్ శిక్షణ పొందిన 30 మంది మహిళలకు నూతన కుట్టు మిషన్లు అందజేస్తూ ప్రతిభ పురస్కార పత్రాలను అందజేశారు.

## ఉద్యమ సూర్యుడు కామ్రేడ్ జేబీ శ్రీధర్ అస్తమయం

### -నివాళులుఅర్పించిన పలు రాజకీయ,ప్రజా సంఘాలనేతలు

**బాపట్ల,మార్చి23,ప్రభాతవార్త:** ఉద్యమ సూర్యుడు కామ్రేడ్ జేబీ శ్రీధర్ అస్తమించారు. విద్యార్థి స్థాయి నుంచి ఉద్యమాల బాట పట్టిన జెల్ది భాగ్యశ్రీధర్ ఆదివారం తెల్లవారు జామున తీవ్ర అస్వస్థతకు గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుది శ్వాస విడిచారు. సీపీఐ సానుభూతిపర్కులైన తల్లిదండ్రులు ఆనందరావు మార్తమ్మల పోరాట ఉద్యమ లక్షణాలను పునికిపుచ్చుకుని విధ్యార్థి దశ నుంచి ఉద్యమకారుడిగా ప్రజా సమస్యలపై పోరాటం చేయటం ప్రారంభించారు. సుమారు ఐదు దశాబ్ధాల పాటు కమ్యూనిస్టు పార్టీ సిద్ధాంతాల వ్యాప్తికి ఉమ్మడి గుంటూరు, ప్రకాశం, బాపట్ల జిల్లాలో అలుపెరగని పోరాటం చేసి బడుగు బలహీన వర్గాలు పేద ప్రజల సమస్యల కోసం అనునిత్యం పోరాటం సాగించారు. పేదలు, కార్మికులు, ఉద్యోగ, బ్యాంకింగ్, ముఠా కార్మికులు, హమాలీలు, రిక్షా, ఆటో రంగం, పారిశుద్ధ్య కార్మికుల సమస్యల పరిష్కారం కోసం జేబీ శ్రీధర్ ముందుండి పోరాటం చేసేవారు. బాపట్లలో జరిగిన వామపక్ష ఉద్యమాల్లో శ్రీధర్ కీలక పాత్ర పోషించారు. ఉద్యమాల్లో చురగ్గా పాల్గొనటం వలన ఆరోగ్యంపై అశ్రద్ద చేయటం వలన ఆరోగ్యం క్షీణిస్తూ వచ్చింది. హృదయ సంబంధిత వ్యాధితో బాధపడుతూ ప్రజా సమస్యలపై అలుపెరగని పోరాటం చేసి తుది శ్వాస వరకు ఉద్యమమే ఉపిరిగా ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యాసగా జేబీ శ్రీధర్ జీవితం గడిపాడు. జేబీ శ్రీధర్ అకస్మిక మృతిపై సీపీఐ రాష్ట్ర కార్యవర్గం దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరావు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్, జంగాల అజయ్‌కుమార్, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బందెల నాసర్‌జీ, జిల్లా కార్యదర్శి తన్నీరు సింగరకొండ తదితరులు శ్రీధర్



భౌతికకాయానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. బాపట్ల మాజీ ఎమ్మెల్యేలు కోన రఘుపతి, చీరాల గోవర్ధనరెడ్డి, గాదె వెంకటరెడ్డి శ్రీధర్ మృతిపై దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. శ్రీధర్ భౌతికాయానికి నివాళులర్పించిన వారిలో ప్రజా నాట్యమండలి రాష్ట్ర నాయకులు ఆరేటి రామారావు, మత్స్యకార సంఘ రాష్ట్ర కార్యదర్శి పి.నాగాంజనేయులు, చేనేత సంఘం రాష్ట్ర నాయకులు జి.బాలాజీ, ఏఐటీయూసీ రాష్ట్ర నాయకులు రావుల అంజిబాబు, ఐఎల్ రాష్ట్ర నాయకులు శాంతకుమార్, ఎన్ఐఎఫ్ డబ్ల్యు రాష్ట్ర నాయకులు చెరుకుపల్లి నిర్మల, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు కాబోతు ఈశ్వరరావు,గుంటూరు నగర కార్యదర్శి కోట మల్యాద్రి ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి బత్తుల శామ్యూల్, సీపీఐఎంఎల్ న్యూ డెమొక్రసీ జిల్లా నాయకులు మేకల ప్రసాద్, సీపీఎం నాయకులు నూతలపాటి కోటేశ్వరావు, నల్లమడ రైతు సంఘం నాయకులు ప్రొఫెసర్ విజయ్‌కుమార్, మాచవరం సీపీఐ మాజీ ఎంపీటీసీ వెంకట్రావు,గుంటూరు జిల్లా ఏఐఎఫ్ కార్యదర్శి జంగాల చైతన్య,వ్యవసాయ కార్మిక సంఘం గుంటూరు జిల్లా నాయకులు సత్యానందం, గుంటూరు జిల్లా సిపిఐ ఆఫీస్ కార్యదర్శి రమణ, టీడీపీ నాయకులు కావూరి శ్రీనివాసరెడ్డి, వైసీపీ కాగిత సుదీర్‌బాబు, గవిని కృష్ణమూర్తి, జోగి రాజా, జనసేన సమన్వకర్త నామన శ్రీమన్నారాయణ, తదితరులు నివాళులుఅర్పించారు.

## భగత్‌సింగ్‌ను ఈతరం స్ఫూర్తిగా తీసుకోవాలి

**గుంటూరు కల్చరల్,మార్చి 23,ప్రభాతవార్త :** అంతరాలు లేని సమాజం సోషలిజమేనని నమ్మిదాని ఆచరణలకు శ్రీకారం చుట్టిన మేధావి మొదటితరం మార క్సిస్టు భగత్‌సింగ్ అని ఆవిప్లవ వీరకిశోరాన్ని నేటి తరం సూ ఫ్ఫూర్తిగా తీసుకోవాలని అవగాహన సంస్థ ఆధ్వర్యంలో జరిగిన భగత్‌సింగ్ 94వ వర్థంతి కార్యక్రమంలో పాల్గొన్న సభ్యులు నివాళులరి ్పంచారు.స్థానిక కొత్తపేట కూడలి వద్ద భగత్‌సింగ్ సేవాసమితి అధ్యక్షుడు ఎం.భగత్ అధ్యక్షతన కార్యక్రమం జరిగింది.భగత్‌సింగ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.అనంతరం సంస ్థకార్యదర్శి కొండా శివరామిరెడ్డి మాట్లాడుతూ విశ్వమానవ సౌభ్రాతృత్వం కోసం మనుషులంతా ఒక్కటే అనే భావనకోసం నిలబడిన భగత్‌సింగ్ ఇంక్విలాబ్ జిందాబాద్ అని



నినదిస్తూ యావద్దేశం తనపైపు చూసేలా చేసుకున్నాడన్నారు.భరతమాత విముక్తికోసం తన సహచరులు రాజ్‌గురు,సుఖదేవ్‌లతో ఉరికొయ్యల్ని ముద్దాడి ఆనాడు లక్షలాది మంది యువతకు స్ఫూర్తి నిచ్చారన్నారు.కార్యక్రమంలో విద్యావేత్త చంద్రయ్య,సంస్కారభారతి జిల్లా అధ్యక్షుడు పి.శ్రీధర్,విద్యావేత్త ఆర్.వి.సింగరయ్య,సీనియర్ సిటిజన్స్ నాయకులు ఆర్.వెంకటరత్నం,ఎల్.మురళీకృష్ణ,భావన్నారాయణ,తదితరులు నివాళులర్పించారు.

## పొలం అమ్మకం, కొనుగోలుదారుల డబ్బుతో ఉడాయించిన మధ్యవర్తి

### - చాకచక్యంగా పట్టుకున్న మాచర్ల పట్టణ పోలీసులు

**మాచర్ల, మార్చి 23 ప్రభాతవార్త:** పొలం అమ్మకం కొనుగోలుదారుల మధ్య మధ్యవర్తిత్వం వహించిన వ్యక్తి ఆ ఇరువురిని మోసగించి నగదుతో పరారైన వ్యక్తిని పట్టణ ఎస్సై సంధ్యారాణి చాకచక్యంతో పట్టుకున్నారని సీఐ ప్రభాకరరావు తెలిపారు. పట్టణ




పోలీసు స్టేషన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ నిందితుడిని అరెస్టు చేసి అదుపులోకి తీసుకున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోని రంగారెడ్డి జిల్లా తుక్కుగూడ గ్రామానికి చెందిన బందెల నరసింహారెడ్డి 2022లో దుర్గి మండలం ముటుకూరు గ్రామ శివారులో ఆరు ఎకరాల 88 సెంట్లు పొలాన్ని కొనుగోలు చేశాడు. ఆ పొలాన్ని విక్రయించే క్రమంలో సత్యసాయి జిల్లా ధర్మవరం పట్టణానికి చెందిన మైలా మల్లేష్ యాదవ్ సదరు పొలం విషయంలో మధ్యవర్తిగా వ్యవహరించాడు. పొలం కొనుగోలుకు ముందుకు వచ్చిన దుర్గి మండలానికి చెందిన మాదాసు వెంకటేశ్వర్లుకి 70 లక్షల 50 వేల రూపాయలకు అమ్మే విధంగా మాట్లాడుకున్నారు. అడ్వాన్సుగా 45 లక్షలు మాదాసు వెంకటేశ్వరఉ్లు మధ్యవర్తి మల్లేష్‌యాదవ్‌కు ఇవ్వగా ఆ నగదు నుంచి పొలం యజమాని నరసింహారెడ్డికి రూ.30 లక్షలు మాత్రమే ఇచ్చి 15 లక్షలు తన వద్దే ఉంచుకున్నారు. మిగతా నగదు రిజిస్ట్రేషన్ రోజున ఇస్తానన్నాడు. అది నమ్మి ఈ నెల 15వ తేదీన తన పొలాన్ని నరసింహారెడ్డి మాదాసు వెంకటేశ్వర్లుకు రిజిస్ట్రేషన్ చేశాడు. మాదాసు వెంకటేశ్వర్లు ఒప్పందం మేరకు మిగిలిన సొమ్ము 25 లక్షల 50 వేలు మల్లేష్‌యాదవ్‌కు ఇచ్చాడు. ఈ నగదుతో పాటు అడ్వాన్సుగా ఇచ్చిన మొత్తంలో తన వద్దే ఉంచుకున్న 15 లక్షలు మొత్తం 40 లక్షల 50 వేల రూపాయలతో మల్లేష్ యాదవ్ ఉడాయించాడు. నరసింహారెడ్డి ఎన్నిసార్లు మల్లేష్‌యాదవ్‌కు ఫోన్లు చేసినా స్పందించకపోవడంతో మోసపోయానని గ్రహించి పట్టణ పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. సీఐ ప్రభాకరరావు ఆధ్వర్యంలో ఎస్సై జి.సంధ్యారాణి దర్యాప్తు చేస్తూ టెక్నాలజీ సాయంతో మల్లేష్‌యాదవ్ చిత్తూరు జిల్లాలో ఉన్నట్లు గుర్తించారు. ఎస్సై సంధ్యారాణి ప్రత్యేక బృందంతో చిత్తూరు జిల్లాలో మల్లేష్‌ను అదుపులోకి తీసుకుని అతని వద్ద నగదును రికవరీ చేశారు. నిందితుడిని మాచర్ల కోర్టు నందు హాజరుపరచగా 14 రోజులు రిమాండ్ విధించినట్లు సీఐ ప్రభాకరరావు చెప్పారు. ముద్దాయిని గురజాల సబ్ జైలుకి తరలించారు. ముద్దాయిని అరెస్టు చేసి అతని వద్ద నుంచి రూ.20 లక్షల సొమ్మును రికవరీ చేయటంలో చాకచక్యం చూపించిన ఎస్సై సంధ్యారాణిని ఉన్నతాధికారులు అభినందనలు తెలిపారు.

## ఈతరం ఉపాధ్యాయులకు ఆదర్శం భాస్కరబాబు

**మాచర్ల, మార్చి 23 ప్రభాతవార్త:** ఈ తరం ఉపాధ్యాయులకు తాటి భాస్కరబాబు ఆదర్శప్రాయుడని మాచర్ల మండల విద్యాశాఖాధికారి అల్లి సురేష్ అన్నారు. మాచర్లలోని పీడబ్ల్యూడీ కాలనీ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా పనిచేస్తూ మార్చి 31న ఉద్యోగ విరమణ చేస్తున్న సందర్భంగా ఎస్టీయూ మాచర్ల శాఖ ఆధ్వర్యంలో స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంఈఓ సురేష్ మాట్లాడుతూ సుదీర్ఘకాలం ఉపాధ్యాయునిగా పనిచేసి



ఎందరో విద్యార్థుల భవిష్యత్తు తీర్చిదిద్దిన ఉత్తమ ఉపాధ్యాయుడని, అలాగే ఎమ్మార్పీ, ఎస్సార్పీగా అనేక శిక్షణ కార్యక్రమాల్లో పాల్గొన్నారని బిగ్ హెల్ప్ సంస్థ ద్వారా పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మరొక ముఖ్య అతిథి బిగ్ హెల్ప్ మేనేజింగ్ ట్రస్టీ సరోజిని మాట్లాడుతూ, ఉపాధ్యాయుడిగానే గాక సేవాసంస్థ ద్వారా ఆడపిల్లలకు అనేక స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమాలు ఏర్పాటు చేయడం, పాఠశాల్లో కళావేదికలు ఏర్పాటు చేయడంలో భాస్కరబాబు చొరవ ఉందన్నారు. ఎస్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జె.గంగాధరబాబు మాట్లాడుతూ ఉపాధ్యాయునిగా, ఎస్టీయూ సంఘంలో కూడా అనేక పదవులను అలంకరించి ఉపాధ్యాయ లోకానికి అనేక సేవలు అందించారని కొనియాడారు. అనంతరం భాస్కరబాబుని ఎస్టీయూ సంఘం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ నాయకులు, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు, బిగ్ హెల్ప్ సంస్థ సభ్యులు కుటుంబ సభ్యులు, మిత్రుల, పాఠశాల విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## గేట్ ఫలితాల్లో 241వ ర్యాంకు సాధించిన విద్యార్థిని శ్వేతశ్రీ



**మాచర్ల, మార్చి 23 ప్రభాతవార్త:** ఇటీవల ప్రభుత్వం విడుదల చేసిన గేట్ ఫలితాల్లో మండల కేంద్రమైన దుర్గి గ్రామానికి చెందిన కొమెర శ్వేతశ్రీ జాతీయ స్థాయిలో 241వ ర్యాంకు సాధించింది. శ్వేత దుర్గి మండలంలో మోడల్ స్కూల్‌లో పదో తరగతిలో 10కి 10 పాయింట్లు సాధించి, శ్రీకాకుళంలోని ట్రిపుల్ ఐటీలో సీటు సాధించి చదువుకుంటుంది. శ్వేతశ్రీ ర్యాంకు సాధించడం పట్ల పాఠశాల టీచర్లతోపాటు తల్లిదండ్రులు ఆదినారాయణ, అరుణలు హర్షం వ్యక్తం చేసి అభినందనలు తెలిపారు.

## భగత్‌సింగ్ 94వ వర్ధంతి సభ

**పెదకూరపాడు, మార్చి 23 ప్రభాతవార్త :** భగత్‌సింగ్ 94వ వర్ధంతి సభను ఆదివారం స్థానికంగా నిర్వహించారు. సిపిఎం కార్యదర్శి సూరిబాబు మాట్లాడుతూ యువతరాన్ని సమాయత్తం చేసి ఆయన తమ పోరాటాన్ని కొనసాగించాడని తెలిపారు. వారి స్ఫూర్తిని నేటి



యువత అలవర్చుకోవాలన్నారు. దేశంలో జరుగుతున్న అన్యాయాలపై పోరాటం ప్రారంభించాలన్నారు. నాయకులు దారా ప్రసాద్ మాట్లాడుతూ దేశ సమగ్రత, ఐక్యత కోసం వారు చేసిన కృషిని వివరించారు. వామపక్షాల సిద్ధాంతాన్ని దేశంలో తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. సోషలిస్ట్ వ్యవస్థలో అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉంటారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు తాటిబోయిన సుబ్బారావు, ఎస్.కె.రఫీ, సి.హెచ్.నరహరి, వెంకటేశ్వరరాజు, సత్యనారాయణ, పాములు పాల్గొన్నారు.

## ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను అభినందించిన నోబుల్ టీచర్స్ అసోసియేషన్

**గుంటూరు విద్య,మార్చి 23,ప్రభాతవార్త :** ఇటీవల జరిగిన కృష్ణా-గుంటూరు జిల్లాల గ్రాడ్యుయేట్ శాసనమండలి అభ్యర్థిగా గెలుపొందిన ఆలపాటి రాజేంద్రప్రసాద్ ను గుంటూరులోని ఏపిఎన్జీవో హోమ్‌లో నోబుల్ టీచర్స్ రా ష్ట్ర శాఖ అధ్యక్షులు కె.శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగింది. సమావేశానికి ముఖ్య అతిథిగా శాసనమండలి సభ్యులు పి.అశోక్‌బాబు మాట్లాడుతూ దేశచరిత్రలో శాసనమండలి ఎన్నికల్లో ప్రత్యర్థిపై 82,830ఓట్ల మెజార్టీతో గెలుపొందడం చరిత్ర అని కూటమి ప్రభుత్వం ఉపాధ్యాయ సమస్యలపట్ల సానుకూలంగా



ఉందని,కూటమి ప్రబుత్వం బదిలీ చట్టం 2025అమల్లోకి తీసుకురావడం ఒక చరిత్ర అని గత వైసీపీ ప్రభుత్వం నిబంధనలకుప విరుద్ధంగా 1100అక్రమ బదిలీలు చేపట్టిందన్నారు.మరో ముఖ్యఅతిధి మాజీ ఉపాధ్యాయ శాసనమండలి సభ్యులు డాక్టర్ ఏ.ఎస్.రామకృష్ణ మాట్లాడుతూ నోబుల్ టీచర్స్ అసోసియేషన్ ఒక మంచి ఉపాధ్యాయ సంఘంగా ఎదగాలన్నారు.ఆలపాటి గెలుపుకు నోబుల్ టీచర్స్ అసోసియేషన్ ఎంతోకృషి చేసిందని,విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ విద్యావ్యవస్థను గాడిలో పెట ్టడానికి ప్రయత్నిసు ్తనా ్నరని,ఉపాధ్యాయుల సమస్యలు అన్ని త్వరంలో పరిష్కారిస్తానికి కూటమి ప్రభుత్వం ప్రయత్నం చేస్తుందని,ఈ నెలాఖరు నాటికి రూ.6,200కోట్లు ఉద్యోగుల బకాయిలు చెల్లించడం హర్షణీయమన్నారు.సన్మాన గ్రహీత ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ నోబుల్ టీచర్ ్స అసోసియేషన్ బలోపేతానికి తనవంతు కృషిచేస్తానన్నారు.అనంతరం ఎమ్మెల్సీ ఆలపాటిని గజమాలతో సత్కరించి,జ్ఞాపికను అందించారు.కార ్యక్రమంలో నోబుల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రదాన కార్యదర్శి బొనిగల హైమారావు,మన్నవ సుబ్బారావు,చెరుకూరి సుభాష్ చంద్రబోస్,పిడికిటి తిలక్‌బాబు,రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి కె.శ్రీనివాస్,గుంటూరు జిల్లా అధ్యక్షులు ఎస్‌కె అబ్దుల ఖలీల్,నాయకులు పి.సాయివిశ్వనాద్,పి.లలితబాబు,రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వివిధ జిల్లాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పాల్గొని ఘనంగా సన్మానించారు.

# 'ఓదెల 2' గ్రేట్ థియేట్రికల్ ఎక్స్పీరియన్స్ ఇచ్చే సినిమా

## ప్రెస్ మీట్ లో హీరోయిన్ తమన్నా భాటియా

**తమన్నా భాటియా** హైలీ యాంటిసిపేటెడ్ మూవీ 'ఓదెల 2'లో నెవర్ బిఫోర్ క్యారెక్టర్‌లో అలరించడానికి సిద్ధంగా వున్నారు. సూపర్ నాచురల్ థ్రిల్లర్ ఓదెల రైల్వే స్టేషన్‌కి సీక్వెల్ ఇది. అశోక్ తేజ దర్శకత్వంలో, మధు క్రియేషన్స్, సంపత్ నంది టీమ్‌వర్క్స్‌పై డి మధు నిర్మించిన ఈ చిత్రం ప్రతి అప్‌డేట్‌తో హ్యూజ్ బజ్ క్రియేట్ చేస్తోంది. తమన్నా నాగ సాధువుగా, మిస్టరీ ఎనర్జీతో కూడిన పాత్రను పోషిస్తున్నారు. ఈ సినిమా టీజర్ అంచనాలని నెక్స్ట్ లెవెల్‌కి తీసుకెళ్ళింది. ఈ వేసవిలో బిగ్గెస్ట్ ఎట్రాక్షన్‌లలో ఒకటిగా ఏప్రిల్ 17న సినిమా ఓదెల2 థియేటర్స్‌లో విడుదల కానుంది. హారర్, థ్రిల్లర్ చిత్రాలకు అన్ని వర్గాల ప్రేక్షకులలో ప్రత్యేక ఆసక్తి ఉంటుంది. నాగ సాధువుగా తమన్నా భాటియా శక్తివంతమైన పాత్రలో కనిపించనున్న ఓదెల 2 కథనం, సాంకేతిక అంశాల పరంగా ఇంతకు ముందు ఎప్పుడూ చూడని గ్రేట్ సినిమాటిక్ ఎక్స్ పీరియన్స్ ని అందించనుంది.



రిలీజ్ డేట్ పోస్టర్ తమన్నాను ఊహించని లుక్‌లో ప్రజెంట్ చేసింది. ఆభరణాలతో సాంప్రదాయ దుస్తులలో ధరించి, ఆమె ఒక సాధారణ మహిళగా కనిపిస్తునే ఇంటెన్స్ ఎక్స్ ప్రెషన్, గాయం గుర్తులు క్యారెక్టర్‌పై చాలా క్యూరియాసిటీనీ పెంచాయి. వారణాసి నేపథ్యం మిస్టీరియస్ లేయర్‌ని యాడ్ చేస్తున్నాయి. హెబ్బా పటేల్, వశిష్ట ఎన్ సింహ ఈ చిత్రంలో ముఖ్యమైన పాత్రలు పోషిస్తున్నారు. థ్రిల్లింగ్ యాక్షన్‌ను కథలలో అద్భుతంగా బ్లెండ్ చేయడంలో పేరుతెచ్చుకున్న సంపత్ నంది ఓదెల 2ని పర్యవేక్షిస్తున్నారు. ఈ చిత్రానికి కాంతర ఫేం అజనీష్ లోక్‌నాథ్ సంగీతం సమకూర్చారు. సౌందరరాజన్ ఎస్ సినిమాటోగ్రఫీ నిర్వర్తించగా, రాజీవ్ నాయర్ ఆర్ట్ డైరెక్టర్. అద్భుతమైన టెక్నికల్ టీంతో 'ఓదెల 2' ఒక మరపురాని సినిమాటిక్ ఎక్స్ పీరియన్స్ అందించబోతోంది.

ప్రెస్‌మీట్‌లో హీరోయిన్ తమన్నా భాటియా మాట్లాడుతూ, ఓదెల సినిమాని డైరెక్టర్ అశోక్ చాలా అద్భుతంగా తీశారు. ఆ సినిమా చూసినప్పుడే దానికి పార్ట్ 2 ఉండాలని భావించాను. సంపత్ నంది పార్ట్2 ఐడియా చెప్పినప్పుడు ఎక్సైటింగ్‌గా అనిపించింది. ఇది ఈజీ జోనర్ కాదు. ఒక పల్లెటూరి కథని ఇంత ఎక్సైటింగ్‌గా థ్రిల్లింగ్‌గా చెప్పడం మామూలు విషయం కాదు. డైరెక్టర్ అశోక్ సినిమాని నెక్స్ట్ లెవెల్‌లో తీశారు. నేను ఏ సినిమా చేసిన ఆడియన్స్‌కి ఒక కొత్త ఎక్స్పీరియన్స్ ఉండాలని కోరుకుంటాను. అలాంటి కొత్త ఎక్స్పీరియన్స్‌ని ఇచ్చే సినిమా ఇది. భైరవి క్యారెక్టర్ చేయడం యాక్టర్‌గా అదృష్టంగా భావిస్తున్నాను. నా కెరీర్ లో హైయెస్ట్ ఐషాట్ క్లోజప్స్ ఉన్న సినిమా ఇదే. భైరవి క్యారెక్టర్‌ని బీలవబుల్, నేచురల్, మ్యాజికల్‌గా చూపించడం నిజంగా బిగ్ ఛాలెంజ్. మధుసినిమాని చాలా గ్రాండ్‌గా నిర్మించారు. ఇది గ్రేట్ థియేట్రికల్ ఎక్స్పీరియన్స్ ఉండే సినిమా. తప్పకుండా అందరికీ గ్రేట్ బిగ్ స్క్రీన్ ఎక్స్పీరియన్స్ ఇస్తుంది అన్నారు.

మూవీ క్రియేటర్ సంపత్ నంది మాట్లాడుతూ, ఈ సినిమా టీజర్‌కి ఆర్గానిక్‌గా చాలా అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. దీనికి కారణం మీడియా, ప్రేక్షకులు, లార్డ్ శివ. ఓదెల సినిమా నాకు ఒక ఎమోషన్. నేను ఆ ఊర్లో పుట్టి పెరిగాను. చాలా గౌరవంగా ప్రేమతో ఈ సినిమాని రాసి తీయడం జరిగింది. ఊరిని కాపాడేది ఆ ఊర్లో ఉన్న ఇలవేల్పు దేవుడి గుడి. ఒక లైన్‌లో చెప్పాలంటే ఓదెల విలేజ్‌లో ఒక కష్టం వస్తే ఆ కష్టం పెద్దదైతే ఆ ఊరిలో ఉన్న ఓదెల మల్లన్న నాగ సాధు క్యారెక్టర్ ద్వారా ఎలా పరిష్కరించారనే అనేది కథ. కంటెంట్, స్క్రీన్ ప్లే, విజువల్ వండర్‌గా ఉంటాయి. ఏప్రిల్ 17న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు వస్తుంది. ఇది థియేటర్ ఎక్స్పీరియన్స్ ఉండే సినిమా. సినిమా ప్రేమించే ప్రేక్షకులు ఎక్కడున్నా ఈ సినిమాని చూసి ఆదరిస్తారని మనస్పూర్తిగా కోరుకుంటున్నాను అన్నారు. నిర్మాత డి మధు మాట్లాడుతూ.. మహా కుంభమేళాలో రిలీజ్ చేసిన ఈ సినిమా టీజర్‌కి చాలా అద్భుతమైనటువంటి రెస్పాన్స్ వచ్చింది .తమన్నా వచ్చిన తర్వాత బడ్జెట్ గురించి ఇంక ఆలోచించలేదు. సంపత్ నంది సూపర్ విజన్, డైరెక్టర్ అశోక్ దర్శకత్వం సినిమాని అద్భుతంగా మలిచి ఈ చిత్రాన్ని థియేటర్స్‌లో చూసి ప్రేక్షకులు గొప్పగా ఆస్వాదిస్తారని ఆదరిస్తారని కోరుకుంటున్నాను. డైరెక్టర్ అశోక్ తేజ మాట్లాడుతూ.. ఆకలిగా ఉందని అన్నం కోసం సంపత్ నంది దగ్గరికి వెళ్లాను ఆయన నాకు బిర్యాని తినిపించారు. థాంక్యూ సో మచ్ సంపత్ . తమన్నా ఎంతో గొప్పగా మమ్మల్ని రిసీవ్ చేసుకుని ఈ సినిమాని చేశారు. ఈ సినిమాలో పనిచేసిన అందరికీ పేరుపేరునా ధన్యవాదాలుఅన్నారు. యాక్టర్ నాగమహేష్ మాట్లాడుతూ.. ఇందులో ఇన్స్పెక్టర్ పాత్రలో కనిపించబోతున్నాను. ఈ సినిమా అద్భుతమైన ఘనవిజయం సాధిస్తుందని ప్రగాఢంగా నమ్ముతున్నాను అన్నారు.



# సంబరాల యేటిగట్టు నుంచి శ్రీకాంత్ ఫస్ట్ లుక్ రిలీజ్

**మెగా సుప్రీం హీరో** సాయి దుర్గ తేజ్ మోస్ట్ ఎవైటెడ్ పాన్ ఇండియా ప్రాజెక్ట్ సంబరాల యేటిగట్టుతో తన కెరీర్‌ను న్యూ హైట్స్ కి తీసుకెళ్లడానికి సిద్ధంగా ఉన్నారు. నూతన దర్శకుడు రోహిత్ కెపి దర్శకత్వం వహించిన ఈ యాక్షన్‌ప్యాక్డ్ థ్రిల్లర్‌లో సాయి దుర్గ తేజ్ నెవర్ బిఫోర్ అవతార్‌లో కనిపించనున్నారు. బ్లాక్‌బస్టర్ హనుమాన్‌తో భారీ విజయం సాధించిన తర్వాత ప్రైమ్‌షో ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై కె. నిరంజన్ రెడ్డి, చైతన్య రెడ్డి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

ఈ చిత్రంలో వెర్సటైల్ యాక్టర్ శ్రీకాంత్ ఇంపార్టెంట్ రోల్ పోషిస్తున్నారు. ఈ రోజు శ్రీకాంత్ బర్త్ డే. ఈ సందర్భంగా విషెష్ అందిస్తూ మేకర్స్ శ్రీకాంత్‌ని బ్రిటిషు పాత్రలో పరిచయం చేస్తూ ఫస్ట్ లుక్ రిలీజ్ చేశారు. రగ్గడ్ హెయిర్, గడ్డంతో బ్లాక్ కోట్ ధరించి ఫెరోషియస్‌గా కనిపించిన శ్రీకాంత్ లుక్ అదిరిపోయింది. ప్రస్తుతం ఈ పోస్టర్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఇప్పటికే విడుదలైన కార్నేజ్ టీజర్ ట్రెమండస్ రెస్పాన్స్‌తో సంబరాల యేటిగట్టు చుట్టూ ఉన్న బజ్ నెక్స్ట్ లెవల్ కి తీసుకెళ్ళింది.

సంబరాల యేటిగట్టు షూటింగ్ శరవేగంగా సాగుతోంది. భారీ బడ్జెట్‌తో సంబరాల యేటిగట్టు సాయి దుర్గ తేజ్‌కు ప్రతిష్టాత్మకమైన ప్రాజెక్ట్‌గా నిలుస్తోంది. ఈ ప్రతిష్టాత్మక వెంచర్‌లో అద్భుతమైన టెక్నికల్ టీం పని చేస్తోంది. వెట్రి పళనిసామి సినిమాటోగ్రఫీ, బి. అజనీష్ లోక్‌నాథ్ సంగీతం, నవీన్ విజయ కృష్ణ ఎడిటింగ్, గాంధీ నడికుడికర్ ప్రొడక్షన్ డిజైనర్‌గా పని చేస్తున్నారు. ఈ చిత్రం సెప్టెంబర్ 25, 2025న తెలుగు, తమిళం, హిందీ, కన్నడ, మలయాళం భాషల్లో పాన్ ఇండియా రిలీజ్ కానుంది.

తారాగణం: సాయి దుర్గ తేజ్, ఐశ్వర్య లక్ష్మి.

సాంకేతిక సిబ్బంది: రచన దర్శకత్వం: రోహిత్ కె.పి. నిర్మాతలు: కె నిరంజన్ రెడ్డి, చైతన్య రెడ్డి, బ్యానర్: ప్రైమ్‌షో ఎంటర్‌టైన్‌మెంట్, డీవోపీ: వెట్రి పళనిసామి, సంగీతం: బి.అజనీష్ లోక్‌నాథ్, ఎడిటర్: నవీన్,విజయకృష్ణ, ప్రొడక్షన్ డిజైనర్: గాంధీ నడికుడికర్, కాస్ట్యూమ్ డిజైనర్: అయేషా ,మరియం, పీఆర్వో: వంశీశేఖర్,మార్కెటింగ్: హ్యాష్‌ట్యాగ్ మీడియా.

# సాంగ్ షూట్ కోసం శ్రీలంక వెళ్తున్న విజయ్



**హీరో విజయ్** దేవరకొండ తన కొత్త సినిమా 'కింగ్ డమ్' సాంగ్ షూట్ కోసం శ్రీలంక వెళ్తున్నారు. ఈ సినిమాలోని ఓ లవ్ సాంగ్ ను ఈ షెడ్యూల్‌లో చిత్రీకరించనున్నారు. వారం రోజుల పాటు ఈ షెడ్యూల్ జరుగనుంది. లవ్ సాంగ్స్ చేయడంలో మ్యూజిక్ డైరెక్టర్ అనిరుధ్ స్పెషాలిటీ అందరికీ తెలిసిందే. 'కింగ్ డమ్' లవ్ సాంగ్స్‌కు కూడా ఆయన బ్లాక్ బస్టర్ ట్యూన్స్ రెడీ చేశారు. శ్రీలంక వెళ్తున్న విజయ్ ఎయిర్ పోర్ట్ పిక్స్ వైరల్ అవుతున్నాయి. రౌడీ ట్రెండీ సమ్మర్ వేర్ లో స్టైల్ ఐకాన్ గా కనిపిస్తున్నారు విజయ్.

రీసెంట్ గా రిలీజ్ చేసిన 'కింగ్ డమ్' టీజర్ హ్యూజ్ రెస్పాన్స్ తెచ్చుకుంటోంది. ఏఐతో వీడియోతో రిలీజ్ చేసిన టీజర్ ఒరిజినల్ సౌండ్ ట్రాక్‌కు కూడా భారీ స్పందన వచ్చింది. కింగ్ డమ్ చిత్రాన్ని యంగ్ టాలెంటెడ్ డైరెక్టర్ గౌతమ్ తిన్ననూరి రూపొందిస్తున్నారు. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్ టైన్ మెంట్స్, ఫార్చూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్స్ పై నాగవంశీ, సాయి సౌజన్య భారీ పాన్ ఇండియా చిత్రంగా నిర్మిస్తున్నారు. కింగ్ డమ్ సినిమా మే 30న ఈ సినిమా వరల్డ్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది.

## అమెజాన్ ప్రైమ్‌లో స్ట్రీమింగ్ అవుతున్న

# 'గాంధీ తాత చెట్టు'



**ప్రముఖ దర్శకుడు** సుకుమార్ కూతురు సుకృతి వేణి నటించిన చిత్రం 'గాంధీ తాత చెట్టు'. ఇటీవల థియేటర్స్‌లో విడుదలై అందరి హృదయాలను హత్తుకున్న ఈ సందేశాత్మక చిత్రం ఇప్పుడు ప్రముఖ ఓటీటీ ఫ్లాట్‌ఫామ్ అమెజాన్ ప్రైమ్‌లో స్ట్రీమ్ అవుతూ అందరి హృదయాలను హత్తుకుంటోంది. సినిమా అంటే కేవలం వినోదం కోసమే మాత్రం కాదు సమాజానికి స్ఫూర్తినిచ్చే ఓ అద్భుతమైన సాధనం. అనే మాటలు ఈ చిత్రానికి అతికినట్టుగా సరిపోతాయి. సాధారణ కమర్షియల్ అంశాలతో పాటు ఈ చిత్రంలో అందరిలో సామాజిక స్పృహను కలిగించే అంశాలు ఉన్నాయి. అమెజాన్ ప్రైమ్‌లో చూసిన వారు ఈచిత్రం గురించి మెచ్చుకోకుండా ఉండలేకపోతున్నారు. ఇక ఈ సినిమా కథ విషయానికొస్తే ఈ కథ గాంధీ అనే ఓ ధైర్యవంతమైన అమ్మాయి కథ ఇది. కార్పొరేట్ సంస్థలు ఊరిని కొని, పెద్ద పెద్ద ఫ్యాక్టరీలు పెట్టేందుకు ప్రయత్నిస్తాయి. ఊరి ప్రజలు డబ్బుకు ఆశపడి తమ పొలాలను అమ్మేస్తారు. కానీ గాంధీ మాత్రం తన ఊరిని ఎలాగైనా కాపాడాలని నిశ్చయించుకుంటుంది. తన తాత పేరు నిలబెట్టాలన్న సంకల్పంతో, ఊరికి కొత్త ఆశను అందించేందుకు గాంధీ చేసిన ప్రయత్నాలు ప్రేక్షకుల హృదయాలను తాకుతాయి. ఊరి ప్రజలు గాంధీ బెల్లం తయారీవిధానం నేర్చుకుంటారు. ఎవరూ చెరుకు కొనడానికి ముందుకు రాకపోయినా, గాంధీ తన తెలివితో ఊరిని తిరిగి నిలబెట్టే విధానం ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటుంది. ఈ చిత్రంలో సుకుమార్ కూతురు సుకృతి నటనకు అందరి నుంచి మంచి ప్రశంసలు లభించాయి.



సాక్షి మాలిక్

# 'సిఎం పెళ్లాం' సినిమా ప్రమోషనల్ సాంగ్ లాంచ్



**ఇంద్రజ, అజయ్,** జయసుధ, సుమన్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న సినిమా సిఎం పెళ్లాం. ఈ చిత్రాన్ని ఆర్.కే సినిమాస్ బ్యానర్ పై బొల్లా రామకృష్ణ నిర్మిస్తున్నారు. దర్శకుడు గడ్డం రమణా రెడ్డి రూపొందిస్తున్నారు. త్వరలోనే ఈ సినిమా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవుతోంది. ఈ నేపథ్యంలో సిఎం పెళ్లాం సినిమా ప్రమోషనల్ సాంగ్ లాంఛ్ కార్యక్రమాన్ని హైదరాబాద్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నిర్మాత బొల్లా రామకృష్ణ మాట్లాడుతూ రాజకీయ నేపథ్యంతో సాగే మంచి సందేశాత్మక చిత్రమిది. దర్శకుడు గడ్డం రమణా రెడ్డి నాకు మిత్రులు. ఆయన ఇంట్రెస్టింగ్ స్టోరీ ఒకటి ఉంది అంటే విని ఇంప్రెస్ అయ్యాను. ప్రొడ్యూస్ చేసేందుకు ముందుకొచ్చాను. సిఎంగా అజయ్, ఆయన భార్య పాత్రలో ఇంద్రజ నటన ఆకట్టుకుంటుంది. ఈ రోజు మా మూవీ ప్రమోషనల్ సాంగ్ రిలీజ్ చేశారు.

# 'పరదా' నుంచి మా అందాల సిరి సాంగ్ రిలీజ్



**తన తొలి సినిమా** సినిమా బండితో ప్రశంసలు అందుకున్న దర్శకుడు ప్రవీణ్ కండ్రేగుల ఇప్పుడు తన రెండవ చిత్రం 'పరదా'తో వస్తున్నారు. మోస్ట్ ట్యాలెంటెడ్ అనుపమ పరమేశ్వరన్, దర్శన రాజేంద్రన్, సంగీత వంటి అద్భుతమైన తారాగణం ఈ చిత్రంలో నటిస్తున్నారు. ఫ్యామిలీ మ్యాన్ సిరీస్‌తో పాపులరైన రాజ్, డికె ఈ చిత్రానికి మద్దతు ఇస్తున్నారు. శ్రీనివాసులు పివి, శ్రీధర్ మక్కువతో కలిసి విజయ్ డొంకడ ఆనంద మీడియా బ్యానర్ పై ఈ సినిమాని నిర్మిస్తున్నారు. ఇప్పటికే విడుదల ఫస్ట్ లుక్ పోస్టర్, కాన్సెప్ట్ వీడియో, సినిమా టీజర్‌కు అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. ఈ రోజు మేకర్స్ మా అందాల సిరి సాంగ్‌ని రిలీజ్ చేసి మ్యూజిక్ ప్రమోషన్స్ కిక్ స్టార్ చేశారు. స్టార్ కంపోజర్ గోపీ సుందర్ ఈ సాంగ్‌ని క్యాచి బీట్స్‌తో బ్యూటీఫుల్ నెంబర్‌గా కంపోజ్ చేశారు. శ్రీకృష్ణ, రమ్య బెహరా వోకల్స్ పాటకి మరింత ఆకర్షణ తీసుకొచ్చాయి. వనమాలి రాసిన మీనింగ్ ఫుల్ లిరిక్స్ ఆకట్టుకున్నాయి. ట్రెడిషన్ ఒట్టిపడే ఈ సాంగ్ లో విజువల్స్ ప్లజెంట్ గా వున్నాయి. అనుపమ పరమేశ్వరన్ ఎలిగెంట్ డ్యాన్స్ మూమెంట్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఇన్సంట్ హిట్‌గా నిలిచిన ఈ సాంగ్ ఆల్బమ్‌కు చార్ట్ బస్టర్ స్టార్ట్‌ని అందించింది. ఈ చిత్రానికి మృదుల్ సుజిత్ సేన్ డీవోపీగా పని చేస్తున్నారు. ధర్మేంద్ర కాకరాల ఎడిటర్. శ్రీనివాస్ కళింగ ఆర్ట్ డైరెక్టర్ గా పని చేస్తున్నారు.

తారాగణం: అనుపమ పరమేశ్వరన్, దర్శన రాజేంద్రన్, సంగీత

సాంకేతిక సిబ్బంది: బ్యానర్: ఆనంద మీడియా, దర్శకత్వం: ప్రవీణ్ కాండ్రేగుల, నిర్మాతలు: విజయ్ డొంకాడ, శ్రీనివాసులు పివి, శ్రీధర్ మక్కువ, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: రోహిత్ కొప్పు, సంగీతం: గోపీ సుందర్, సాహిత్యం: వనమాలి, రచయితలు: పూజిత శ్రీకాంతి, ప్రహస్ బొప్పూడి, స్క్రిప్ట్ డాక్టర్: కృష్ణ ప్రత్యూష, డీవోపీ: మృదుల్ సుజిత్ సేన్, ఎడిటర్: ధర్మేంద్ర కాకరాల, సౌండ్ డిజైన్: వరుణ్ వేణుగోపాల్, ఆర్ట్ డైరెక్టర్: శ్రీనివాస్ కళింగ, కాస్ట్యూమ్ డిజైనర్: పూజిత తాడికొండ, పీఆర్వో: వంశీశేఖర్, పబ్లిసిటీ డిజైన్స్: అనిల్ !! భాను

## మార్చి 19, 2026న విడుదల కానున్న యష్

# 'టాక్సిక్: ఎ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్‌అప్స్'



**ఉగాది, గుడి పడ్వా,** ఈద్ సందర్భంగా మార్చి 19, 2026న విడుదల కానున్న రాకింగ్ స్టార్ యష్ 'టాక్సిక్: ఎ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్‌అప్స్' రాకింగ్ స్టార్ యష్ యాక్షన్ ఎంటర్‌టైనర్ టాక్సిక్: ఎ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్‌అప్స్ మీద ఉన్న అంచనాలు అందరికీ తెలిసిందే. ఈ మూవీని వచ్చే ఏడాది మార్చి 19న విడుదల చేయబోతోన్నట్టుగా ప్రకటించారు. ఉగాది, గుడి పడ్వాతో మార్చి 19న కొత్త సంవత్సరాన్ని ప్రారంభించడంతో పాటు, మార్చి 20/21న ఈద్ వేడుకలతో టాక్సిక్ భారతదేశం అంతటా సందడి చేయనుంది. కన్నడ, ఇంగ్లీష్ భాషల్లో టాక్సిక్ మూవీని తెరకెక్కిస్తున్న సంగతి తెలిసిందే. అంతర్జాతీయ ప్రాజెక్ట్‌గా టాక్సిక్ ప్రపంచ వ్యాప్తంగా రిలీజ్ కాబోతోంది. భారతీయ ప్రాజెక్ట్‌గా టాక్సిక్ ఇంటర్నేషనల్ సినిమాటిక్ అనుభవాన్ని అందించనుంది. ఈ చిత్రం భారతీయ, అంతర్జాతీయ సినిమా రంగం నుంచి ఎంతో అనుభవం, ప్రతిభ ఉన్న వారినందరినీ ఒకే చోటకు చేర్చనుంది. ఈ చిత్రాన్ని హిందీ, తెలుగు, తమిళం, మలయాళంతో పాటు ఇతర భాషల్లోకీ డబ్ చేయనున్నారు.

టాక్సిక్ విడుదల తేదీ ప్రకటన సందర్భంగా రాకింగ్ స్టార్ యష్ 'టాక్సిక్: ఎ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్‌అప్స్' నుంచి అద్భుతమైన పోస్టర్‌ను రిలీజ్ చేశారు. పోస్టర్‌లో కనిపించే మంటలు, చుట్టూ ఉన్న పొగ, హీరోని చూపించిన తీరు, ఆ గన్‌ను పట్టుకున్న విధానం, హీరో పెట్టుకున్న టోపీ ఇలా అన్నీ కూడా ఎంతో స్టైలిష్‌గా ఉన్నాయి. యష్ పుట్టిన రోజు సందర్భంగా రిలీజ్ చేసిన గ్లింప్స్ నేషనల్, ఇంటర్నేషనల్ వైడ్‌గా ఎంత వైరల్ అయిందో అందరికీ తెలిసిందే.

ఈ ప్రతిష్టాత్మక వెంచర్‌కు అంతర్జాతీయంగా ప్రశంసలు పొందిన మేకర్ గీతుమోహన్‌దాస్ దర్శకత్వం వహిస్తున్నారు. జాతీయ అవార్డు, సన్‌డాన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ప్రతిష్టాత్మక గ్లోబల్ ఫిల్మ్‌మేకింగ్ అవార్డు వంటి వాటితో గీతు మోహన్ దాస్ ప్రపంచ వేదికలపై తన సత్తాను చాటుకున్నారు. ఇక ఇప్పుడు టాక్సిక్ మూవీతో మరోసారి తన మార్క్ వేయబోతోన్నారు. కెవిఎన్ ప్రొడక్షన్స్, మాన్ స్టర్ మైండ్ క్రియేషన్స్ పతాకాలపై వెంకట్ కె. నారాయణ, యష్ సంయుక్తంగా నిర్మించిన టాక్సిక్: ఎ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్‌అప్స్ మార్చి 19, 2026న థియేటర్లలోకి రానుంది.

24-3Pg5.qxd:24-3Pg5.qxd 01/01/01 7:08 AM Page 1



# ఆ నోట్ల గుట్టలు ఎవరివి?

### ఆ సొమ్ముతో తనకు సంబంధంలేదన్న జస్టిస్ వర్మ

### కాలిన నగదు విడియో విడుదల చేసిన 'సుప్రీం'

### కొనసాగుతున్న అంతర్గత దర్యాప్తు





**న్యూఢిల్లీ, మార్చి 23:** ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి యశ్వంత్‌వర్మ అధికార నివాసంలో ఈనెల 14న హోళీరోజున జరిగిన అగ్నిప్రమాదంలో కరెన్సీ నోట్ల కట్టలు కాలిపోయినట్లు ఆరోపణలు వచ్చినసంగతి తెలిసిందే. స్టోర్‌రూమ్‌లో కాలిన డబ్బులకు సంబంధించిన ఫోటోలు విడియోక్లిప్‌ను శనివారం రాత్రి సుప్రీంకోర్టు విడుదలచేసింది. వీటితోపాటు సంబంధిత నివేదికను కూడా సుప్రీంకోర్టు వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచింది. సుప్రీం ప్రధాన న్యాయమూర్తి సంజీవ్‌ఖన్నా ఆధ్వర్యంలో ఈసంఘటనపై అంతర్గత దర్యాప్తుజరుగుతోంది. ఈ క్రమంలోనే జస్టిస్ యశ్వంత్‌వర్మకు న్యాయపరమైన విధులు అప్పగించవద్దని ఢిల్లీ హైకోర్టుప్రధాన న్యాయమూర్తి డికె ఉపాధ్యాయను సుప్రీం కోర్టు సిజె ఆదేశించారు. అయితే కాలిన సొమ్ముతో తనకు ఎలాంటి సంబంధం లేదని ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి వర్మ స్పష్టం చేసారు. తనను కించపరిచేందుకు ఉద్దేశ్య పూర్వకంగా జరిగిన కుట్రగా ఆయన ఆరోపించారు. కాలిన నగదు ఫోటోలు, విడియోక్లిప్‌ల ప్రామాణికతను ఆయన ప్రశ్నించారు. ప్రభుత్వం తనకు కేటాయించిన నివాసంలోని స్టాఫ్ క్వార్టర్స్‌కు సమీపంలో ఉన్న స్టోర్‌రూమ్‌లో మంటలు చెలరేగాయని అన్నారు. పాత ఫర్నీచర్ గృహోపకరణాలు తోటపనికి వినియోగించే వస్తువులు ఉంచేస్టోర్‌రూమ్ అని తెలిపారు. తాళం వేయని ఈ స్టోర్‌రూమ్‌కు తన నివాసానికి నేరుగా అనుసంధానంలేదని చెప్పారు. మరోవైపు తాను, తనభార్య మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌కు వెళ్లినప్పుడు ఆరోజు రాత్రివేళ ఆ స్టోర్‌రూమ్‌లో అగ్ని ప్రమాదం జరిగిందని ఢిల్లీ హైకోర్టు న్యాయ మూర్తి యశ్వంత్‌వర్మ తెలిపారు. తన కుమార్తె వృద్ధురాలైన తల్లి ఆసమయంలో ఇంట్లో ఉన్నట్లు చెప్పారు. ఆస్టోర్‌రూమ్‌లో మంటలు చెలరేగడంతో తన కుమార్తె ప్రైవేటు కార్యదర్శి అగ్నిమాపక శాఖకు సమాచారం ఇచ్చారన్నారు. మంటలను ఆర్పినప్పుడు తన కుటుంబసభ్యులు సిబ్బంది దూరంగా ఉన్నారని చెప్పారు. ఆ సమ యంలో అక్కడ ఎలాంటి నగదు కనిపించలేదని అన్నారు. తాను కాని తన కుటుంబసభ్యులుకాని ఎప్పుడూ ఆస్టోర్‌రూమ్‌లో డబ్బులు నిల్వచేయ లేదని ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి యశ్వంత్‌వర్మ తెలిపారు. ఆలాగే కాలిన కరెన్సీ ఆనవాళ్లు ఏవీ కూడా ఫైర్‌సిబ్బంది తమకు చూపించలేదని చెప్పారు. ఒకవేళ అంతపెద్ద నగదును సిబ్బంది నిజంగా రికవరీచేసి ఉంటే దాని గురించి తమకు ఎందుకు చెప్పలేదని ప్రశ్నించారు. తమ నివాసంనుంచి వేరుగా ఉన్న స్టోర్‌రూమ్‌లో డబ్బుల మూటలు కాలి నట్లుగా వచ్చినఆరోపణలు నిరాధారమైనవి అశాస్త్రీయమైనవని జస్టిస్ యశ్వంత్‌వర్మ ఖండించారు.



## మతిస్థిమితంలేని బీహార్ సిఎం

### నితీష్‌కుమార్‌పై ప్రశాంత్ కిశోర్ వ్యాఖ్యలు

**సమస్తిపూర్, మార్చి 23:** బీహార్ ముఖ్యమంత్రి నితీష్‌కుమార్‌పై జన్‌సూరజ్ వ్యవస్థాపకుడు ప్రశాంత్ కిశోర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. నితీష్ శారీరకంగా అలసిపోయారని, మానసిక పరిస్థితి సరిగా లేదని, దీంతో ఆయన పాలన విషయంలో రాజీ పడుతున్నారని ఆరోపించారు. సిఎం పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఆదివారం ఇక్కడ మీడియాతో ప్రశాంత్ కిశోర్ మాట్లాడుతూ 'నితీష్‌కుమార్ ఆరోగ్య పరిస్థితిపై ఆయన మిత్రపక్ష నేత సుశీల్‌కుమార్ మోదీ తొలిసారి మాట్లాడారు. ఆ తర్వాత పలువురు బీహార్ మంత్రులు కూడా వ్యాఖ్యానించారు. గత జనవరి వరకు నేను ఎలాంటి కామెంట్లు చేయలేదు. కానీ బిపిఎస్‌సి నిరసనల తర్వాత నితీష్‌కుమార్ మానసిక స్థితి క్షీణించిందని తెలిసింది. ఆ కారణంగానే రాష్ట్రంలో ఏమి జరుగుతుందో కూడా తెలియని పరిస్థితిలో ఆయన ఉన్నారు. ఆయన శారీరకంగా అలసిపోయారు. మానసికంగా ఫిట్‌నెస్‌తో లేరు. ఇందుకు సాక్ష్యం కావాలంటే ఆయన కౌన్సిల్‌లో మంత్రుల పేర్లు అడిగి చూడండి. ముఖ్యమంత్రి పదవికి నితీష్‌కుమార్ రాజీనామా చేయడం మంచిది.'అని సూచించారు. ఇందులో బిజెపి కూడా సమానబాధ్యత ఉందని, నితీష్‌కుమార్ మానసిక స్థితి కోల్పోయారని విషయం ప్రధానికి కానీ, హోంమంత్రికి కానీ తెలిసినట్లు లేదని అన్నారు.

**తేజస్వీ అదే మాట..:** కాగా, నితీష్ మానసిక, శారీరక దారుఢ్యాన్ని కోల్పోయారని ఆర్జెడి నేత తేజస్వియాదవ్ ఇటీవల కాలంలో పలుమార్లు విమర్శలు గుప్పించారు. నితీష్‌కుమార్ రాజీనామా కు డిమాండ్ చేశారు. ఒక కార్యక్రమంలో జాతీయ గీతం ఆలపిస్తుండగా నితీష్ మాట్లాడు తున్న విడియోను గత గురువారం ఆయన షేర్ చేశారు. యువకులు, విద్యార్థులు, మహిళలు, వయోవృద్ధులను ప్రతిరోజూ అవమా నించే ముఖ్యమంత్రి కనీసం జాతీయ గీతాన్నైనా అవ మానించకుండా ఉంటే బాగుంటుందని వ్యాఖ్యా నించారు.



## అన్నామలై వ్యాఖ్యలపై కర్ణాటక డిప్యూటీ సిఎం ఫైర్

### రాష్ట్రంకంటే పార్టీపెద్దల ఆదేశాలే ఆయనకు ఎక్కువని ఎద్దేవా

**బెంగళూరు, మార్చి 23:** నియోజకవర్గాల పునర్విభజనపై తమిళనాడు సిఎం ఎంకె స్టాలిన్ అధ్యక్షతన జరిగిన జెఎసి సమావేశంపై బిజెపి రాష్ట్రచీఫ్ అన్నామలే చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదంగా మారాయి. వీటిపై కర్ణాటక డిప్యూటి సిఎం డికె శివకుమార్ స్పందించారు. అన్నామలై రాష్ట్రానికి కాకుండా పార్టీకి విధేయుడుగా ఉన్నారన్నారు. జెఎసి సమావేశంలో పార్టీనేతలతో కలిసి అన్నామలై నిరసన చేసారని ఆసమయంలో కేరళ, కర్ణాటక రాష్ట్రాలనుద్దేశించి ఆరోపణలుచేసారన్నారు. వీటిపై తాజాగా శివకుమార్ స్పందించారు. అన్నామలైకి రాష్ట్రవిషయాలకంటేప్రధానిమోడీ, హోంమంత్రి అమిత్‌షాలు దేశానికి ఏంచెపుతున్నారనేదే ముఖ్యం. ఆయనకు ఏదీ తెలియదు. అన్నామలై రాష్ట్రానికి కాకండా పార్టీకి విదేయత చూపుతున్నారని ఆయన విమర్శించారు. జెఎసి సమావేశంలో పార్లమెంటు స్థానాలు తగ్గించడంద్వారా రాష్ట్రప్రాతినిధ్యాన్ని కుదించేందుకు ఆమోదిస్తే మాతృదేశంలోనే రాజకీయ అధికారంలేని పౌరులుగా ఉంటామని స్టాలిన్ వ్యాఖ్యలు చేసారు. పునర్విభజనకు వ్యతిరేకం కాదని, న్యా యంగా నియోజకవర్గాల పునిర్విభజన జరగా లని కోరుతున్నట్లు స్టాలిన్ వెల్లడించిన సంగతి తెలిసిందే. ఇందుకోసమే ఉమ్మడి కార్యాచరణ కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

## సంభాల్‌మసీదు కమిటీ చీఫ్ అరెస్ట్



**సంభాల్(యుపి), మార్చి 23:** షాహి జమా మసీదుకమిటీ అధ్యక్షుడు జాఫర్ ఆలీని పోలీసులు ఆదివారం అరెస్టుచేసారు. గత ఏడాది నవంబరులో పెచ్చుమీరిన హింసకు సంబంధించి ఆయనప్రమేయం ఉందని పోలీసులు ఆయన్ను అదుపులోకి తీసుకున్నారు. కోర్టు ఆదేశాలతో మసీదులో సర్వే సందర్భంగా చెలరేగిన హింసాత్మక ఘటనల్లో ఆయనప్రమేయం లేకపోలేదన్నారు. స్థానిక సిట్ అధికారుల ఆధ్వర్యంలోమసీదు కమిటీ ఛీఫ్‌ను అదుపులోకి తీసుకని ఆయన వాంగ్మూలం నమోదుచేసినట్లు వెల్లడించారు. యుపి ప్రభుత్వం ఏర్పాటుచేసిన ముగ్గురుసభ్యుల జ్యుడిషియల్ కమిషన్ సోమవారంనుంచి విచారణప్రారంభిస్తుంది. గత ఏడాదిజరిగిన అల్లర్లలోముగ్గురు వ్యక్తులు చనిపోగా అనేక మందికి తీవ్ర గాయాలయ్యాయి. ముఘల్‌చక్రవర్తుల కాలంనాటి మసీదు ప్రాచీనకాలంలో హిందూ దేవాలయం కూల్చివేసి నిర్మించారన్న ఆరోపణలున్నాయి. సంభాల్ ఎస్‌పి కృషన్‌కుమార్ బిష్ణోయి మాట్లాడుతూ షాహిజామా మసీదు చీఫ్ జాఫర్ ఆలీని అరెస్టు చేసామని ఆయన్ను విచారిస్తున్నట్లు తెలిపారు. సంభాల్ కొత్వాలి ఇన్‌ఛార్జి అనుజ 'కుమార్ తోమర్ కూడా మసీదు కమిటీ అధ్యక్షుడిని సిట్ అదుపులోకి తీసుకుందని తెలిపారు. జాఫర్ ఆలీ అన్న తాహిర్ ఆలీ మాట్లాడుతూ పోలీసులు అక్రమంగా తన సోద రుడిని జైలుకు పంపిస్తున్నారని, జ్యుడిషియల్ ప్యానెల్‌ముందు ఆయన వాంగ్మూలం రికార్డు చేయాల్సి ఉండగా ముందుగానే కుట్రపూరితంగా అరెస్టుచేసారని ఆరోపిం చారు. ఉదయం 11.15 గంటలకు ఇన్‌స్పెక్టర్ మా ఇంటికి వచ్చి సర్కిల్ అధికారి కుల్‌దీప్‌సింగ్ మీతో మాట్లాడాల నుకుంటున్నారని చెప్పారని ఆయన మాతో మాట్లాడారని గత రాత్రికూడా మాట్లాడారన్నారు. ఈలోపే అదుపులోకి తీసుకుని మాసోదరుడిని జైలుకు పంపించారని అన్నారు. జాఫర్ ఇప్పటికే తన సాక్ష్యం చెప్పాడని, పోలీసులు కాల్పుల్లోనే నలుగురు చనిపోయారని చెప్పినట్లు గుర్తుచేసారు. పోలీసులు తన సోదరుడిని తీసుకెళ్లేముందు కూడా తనకు చెప్పాడని తాను జైలుకు వెళ్లడా నికిసైతం సిద్ధమేనని నిజాన్ని దాచి మాట్లాడ బోనని చెప్పాడన్నారు. బయటినుంచి నిధులు అందాయన్నది పూర్తిగా అవాస్తవమని ఒక్క పైసాకూడా రాలేదన్నారు. ఈకేసును కోర్టులోనే పోరాడతామని, విజయం మాదే అవుతుందని అన్నారు. సంభాల్ యంత్రాంగం కావాలనే ప్రజల్లో మతం చిచ్చురేపుతోందని ఆరోపించారు. ఇక్కడ ఉన్న అశాంతిని సర్దుబాటుచేయకపోగా అందరినీ రెచ్చగొడుతున్నారన్నారు. తాహిర్ ఆలీ, జాఫర్ ఆలీ, మసూద్ ఫరూఖీ, ఖాసిమ్ అడ్వకేట్‌లు కూడా తమ వాంగ్మూలాలను సోమ వారం జ్యుడిషియల్ కమిషన్‌ముందు ఇవ్వాల్సి ఉంది.

## ఇజ్రాయెల్-హామాస్ యుద్ధంలో మృత్యుఘోష..

### 50 వేలు దాటిన మరణాలు : గాజా ఆరోగ్య శాఖ వెల్లడి



**టెల్‌అవీవ్, మార్చి 23:** ఇజ్రాయెల్-హమాస్ యుద్ధంలో ఇప్పటివరకు 50 వేల మంది పాలస్తీనీయన్ల ప్రాణాలు కోల్పోయినట్లుగా గాజా ఆరోగ్య శాఖ వెల్లడించింది. మరో 1.13 లక్షల మంది గాయపడినట్లు తెలిపింది. ఇటీవల కాల్పుల విరమణ ముగిసిన తర్వాత వారం వ్యవదిలోనే మళ్లీ దాడులు మొదలుకాగా వీటిలో దాదాపు 673 మంది చనిపోయారు. అయితే, మొత్తం మరణించిన వారిలో సామాన్య పౌరులు, యుద్ధంలో పాల్గొన్న వారు ఎంతమంది ఉన్నారనే విషయంపై గాజా ఆరోగ్య శాఖ స్పష్టత ఇవ్వలేదు. అయితే, ఇజ్రాయెల్ మాత్రం దాదాపు 20 వేల మంది మిలిటెంట్లను చంపినట్లు పేర్కొంది. కాల్పుల విరమణ ముగిసిన తర్వాత మళ్లీ దాడులు మొదలుపెట్టిన ఇజ్రాయెల్ తాజాగా దక్షిణ గాజాపై భీకర దాడులకు పాల్పడుతోంది. శనివారం రాత్రి జరిపిన దాడుల్లో 26 మంది ప్రాణాలు కోల్పోయారు. హమాస్ రాజకీయ నేత సహా పలువురు మహిళలు, చిన్నారులు చనిపోయారు. రఫా నగరాన్ని ఖాళీ చేయాలని ఇజ్రాయెల్ సైన్యం ఇప్పటికే ఆదేశించింది. దీంతో పాలస్తీనా వాసులు తమ సామగ్రిని పట్టుకొని దుమ్ము రోడ్లపై బారులు తీరిన పరిస్థితి కనిపించింది.

# వాణిజ్య ఒప్పందాలు వాస్తవం..

### భారత్ ప్రయోజనాలకే తొలి ప్రాధాన్యం: విదేశాంగ మంత్రి జైశంకర్



**న్యూఢిల్లీ, మార్చి 23:** అంతర్జాతీయ ఒప్పందాలపై ఓవైపు చర్చ జరుగుతుండటం, ప్రతీకర వాణిజ్య సుంకాలకు అగ్రరాజ్యం అమెరికా గడువు విధించిన నేపథ్యంలో వాణిజ్య ఒప్పందాలు వాస్తవమని, అయితే భారత్ ప్రయోజనాలకే తొలి ప్రాధాన్యం అనే విధానాన్ని తాము అనుసరించనున్నామని కేంద్ర విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ పేర్కొన్నారు. అంతర్జాతీయ ఆర్థిక సంబంధాల్లో వాణిజ్య ఒప్పందాలు చాలా కీలకమని, అయితే ఇందువల్ల ఒనగూరే ప్రయోజనాలను చాలా జాగ్రత్తగా బేరీజు వేసుకోవాలని ఒక మీడియా సంస్థ నిర్వహించిన కార్యక్రమంలో జైశంకర్ అన్నారు. ప్రధానంగా సున్నితమైన టెక్నాలజీ విషయంలో ఇలాంటి ఒప్పందాల వల్ల ఇరువైపులా ప్రయోజనాలు ఉంటాయని చెప్పారు. భారత్ ప్రభుత్వం ప్రస్తుతం మూడు కీలక వాణిజ్య ఒప్పందాలపై సంప్రదింపులు జరుపుతోందని విదేశాంగమంత్రి జైశంకర్ తెలిపారు. వీటిలో ఒకటి యుఎస్‌తో జరుగుతోందని చెప్పారు. 'అంతర్జాతీయ ఆర్థిక సంబంధాల్లో వాణిజ్య ఒప్పందాలు కీలకం. ఇప్పుడు వీటి ప్రాధాన్యత కూడా పెరిగింది. దీనిని భారత్ గుర్తించింది. ప్రస్తుతం, మనం మూడు వాణిజ్య ఒప్పందాలపై సంప్రదింపులు జరుపుతున్నాం. ఐరోపా సమాఖ్య, యుకె, అమెరికాతో ద్వైపాక్షిక ఒప్పందంతో చర్చలు జరుపుతున్నాం. న్యూజిలాండ్‌తో కూడా ఈ వారమే చర్చలు ప్రారంభించాం. మరికొందరితో కూడా చర్చలు జరపనున్నాం' అని జైశంకర్ తెలిపారు. భారతదేశం 'ఇండియా ఫస్ట్' విధానాన్ని అనుసరించనుందని జైశంకర్ భరోసా ఇచ్చారు. వికసిత్ భారత్ లక్ష్యంగా ఇండియా ఫస్ట్ పాలసీని అనుసరించనున్నట్లు చెప్పారు. గతంలో ఎక్కువగా ఆసియా దేశాలతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు (ఎఫ్‌టిఎ)లు చేసుకునే వాళ్లమని, వాణిజ్యం పోటాపోటీగా ఉండేదని అన్నారు. అమెరికా ఫస్ట్ పాలసీలో భాగంగా డొనాల్డ్ ట్రంప్ ఇటీవల ప్రతీకార సుంకాలను కట్టుబడి ఉన్నామని ప్రకటించారు. భారత్‌తో మంచి సంబంధాలే ఉన్నాయని, అయితే భారత్ అధిక సుంకాలు విధిస్తోందని, ఏప్రిల్ 2 నుంచి ప్రతీకార సుంకాలు తప్పవని హెచ్చరించారు.

## అమెరికాలో మళ్లీ కాల్పులు

## భారత్‌కు చెందిన తండ్రి, కుమార్తె మృతి



**వర్జీనియా, మార్చి 22:** అమెరికాలో ఇదనదరు భారతీయులపై కాల్పులు జరిగిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వర్జీనియాలోని ఓ డిపార్టుమెంటల్ స్టోర్‌లో ఓ దుండగుడు జరిపిన కాల్పుల్లో అక్కడే పనిచేస్తున్న భారత్‌కు చెందిన ఉర్మి (24), ఆమె తండ్రి ప్రదీప్ పటేల్ మృతి చెందారు. కాల్పులకు తెగబడిన వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. గురువారం ఉదయం మద్యం కొనేందుకు స్టోర్‌కు వెళ్లిన దుండగుడు ముందురోజు రాత్రి స్టోర్‌ను మూసేశారని వారిపై ఆగ్రహం వ్యక్తం చేశాడు. వెంటనే కాల్పులు జరపగా ప్రదీప్ పటేల్ అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన ఊర్మి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ప్రాణాలు విడిచింది. భార్య కుమార్తెతో కలిసి ఆరేళ్ల క్రితం ప్రదీప్ పటేల్ గుజరాత్ నుంచి అమెరికా వెళ్లినట్లు సమాచారం.

### న్యూమెక్సికోలో రెండు గ్రూప్‌ల మధ్య కాల్పులు.. ముగ్గురు మృతి

**వాషింగ్టన్:** అమెరికాలో మరోసారి కాల్పుల మోత మోగింది. న్యూమెక్సికోలోని లాస్ క్రూసెజ్‌లో శుక్రవారం రాత్రి రెండు గ్రూప్‌ల మధ్య కాల్పులు చోటుచేసుకున్నాయి. ఈ ఘటనలో ముగ్గురు మృతి చెందగా.. 15 మంది గాయపడ్డారు. స్థానిక కాలమానం ప్రకారం ఈ ఘటన రాత్రి 10 గంటలకు జరిగింది. మృతుల్లో ఇద్దరు టీనేజర్లు ఉన్నారు. గాయపడిన వారిలో అంతా 16 నుంచి 36 యేళ్ల వయసు మధ్యలోనే ఉంటారని పోలీసులు తెలిపారు. గాయపడిన వారిని ఆస్పత్రికి తరలించారు. అనుమతి లేని ఓ కారు ప్రదర్శన సందర్భంగా రెండు గ్రూప్‌ల మధ్య ఈ కాల్పులు జరిగినట్లు లాస్‌క్రూస్ పోలీసు చీఫ్ జెరేమీ స్టోరి పేర్కొన్నారు. సమాచారం అందుకున్న వెంటనే ఘటనాస్థలానికి చేరుకుని సహాయ చర్యలు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.



## సరిహద్దుల్లో భద్రతకు రోబో డ్రోన్లు


**న్యూఢిల్లీ, మార్చి 23:** అంతర్జాతీయ సరిహద్దుల వెంబడి భద్రత కొనసాగించేందుకుగాను అస్సాంలోని గువాహతి ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ పరిశోధకులు అధునాతన రోబోలను అభివృద్ధిచేసారు. అత్యంత సవాళ్లతో కూడిన అంతర్జాతీయ సరిహద్దులను నిరంతర గస్తీకి ఈ ఎఐ ఆధారిత నిఘాతో అత్యంత ప్రయోజనం ఉంటుందని ఐఐటి పరిశోధకులు చెపుతున్నారు. ఐఐటి గువాహతిలో డిఎస్పాటియో రోబోటిక్ లేబ్ ప్రైవేట్ లిమిటెడ్ అనే స్టార్టప్ అభివృద్ధిచేసిన ఈ రోబోలు రక్షణ పరిశోధన అభివృద్ధి సంస్థనుంచి గుర్తింపు పొందినట్లు తెలుస్తోంది. భారత సైన్యం ఇప్పటికే ఈ నిఘా వ్యవస్థ ఫీల్డ్‌ట్రయల్స్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. డిఎస్ఆర్ఎల్ సిఇఒ అర్బన్‌కుమార్ బర్మన్ మాట్లాడుతూ మనుషుల గస్తీపై ఆధారపడే భద్రత కార్యాచరణకు బిన్నంగా ఈ రోబోలు స్వయంప్రతిపత్తి వ్యవస్థను కలిగి ఉంటాయన్నారు. అన్నివాతా వరణ పరిస్థితుల్లోను సమర్థంగా పనిచేస్తా యన్నారు. నేవిగేషన్ ఎఐ ఆధారిత నిఘాతో కూడిన ఈ వ్యవస్థ సరిహద్దు రక్షణ కీలకమైన మౌలిక సదుపాయాల నిఘా వ్యూహాత్మక రక్షణ విషయాల్లో ఓ విప్లవాత్మక మార్పుకానుంది. జాతీయ అంతర్జాతీయ భద్రత విషయంలో ఎదురవుతున్న సవాళ్లను తట్టుకో దానికి ఎఐ ఆధారిత అత్యాధునిక పరికరాలను అభివృది చేయాలనేదే మా లక్ష్యం అన్నారు. దుండుగులు అంతర్జాతీయ సరిహద్దుల్లోకి డ్రోన్‌లను పంపించి చొరబాట్లకు ప్రయత్నించడం వంటివిచేస్తే ఈరోబోల సెన్సార్లు వెంటనే గుర్తించి అప్రమత్తం చేస్తాయి. ఈ రక్షణ జాతీయభద్రతను బలోపేతంచేసే మరిన్ని ఆవిష్కరణలుచేసేందుకు నిరంతరం ఐఐటి కృషిచేస్తుందని ఆయన చెప్పారు.

### బోల్తాపడి ఇ రిక్షాను ఢీకొన్న యాపిల్ పళ్ల ట్రక్కు

### ఇద్దరు మృతి, ట్రక్కు డ్రైవర్‌కు తీవ్ర గాయాలు

**హత్రాస్(యుపి), మార్చి 23:** యాపిల్ పళ్ల లోడుతో వెళుతున్న ఒక ట్రక్కు ఓవర్‌టర్న్ అయి ఈరిక్షాను ఢీకొనడంతో ఇద్దరు చనిపోయారు. ఆలిఘర్ ఈటా రోడ్డులో ఆదివారం ఉదయం ఈ ప్రమాదం జరిగింది. ఉదయం 9.30 గంటలప్రాంతంలో ట్రక్కు ఒడిశావైపునకు వెళుతుండగా అదుపుతప్పి ఈరిక్షాను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఈరిక్షా డ్రైవర్, ప్యాసింజర్ ఒకరు ఇద్దరూ చనిపోయారు. ట్రక్కు డ్రైవర్‌కు తీవ్రగాయాలయ్యాయి. సికిందర్‌రావు కమ్యూనిటీ హెల్త్‌సెంటర్‌కు డ్రైవర్‌ను తరలించారు. మృతులు 20 ఏళ్ల గోపాల్, 21 ఏళ్ల కన్హయ్యగా గుర్తించారు. కొత్వాలిపోలీస్‌స్టేషన్ ఎస్ఐ అరవింద్ రాథి కేసునమోదుచేసుకుని దర్యాప్తుచేస్తున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రులకు తరలించినట్లు చెప్పారు.

## ఏప్రిల్ 28న కెనడా పార్లమెంటుకు ఎన్నికలు




**ఒట్టావా, మార్చి 23:** ప్రధానమంత్రిగా మార్క్ కార్నీ ప్రమాణస్వీకారంచేసిన కెనడాలో ముందస్తు ఎన్నికలకు సిద్ధం అయ్యారు. ఏప్రిల్ 28న ఫెడరల్ ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. పార్లమెంటులో మొత్తం 338 స్థానాలున్నాయి. వీటికి ఏప్రిల్ 28న ఎన్నికలు నిర్వహించనున్నట్లు కార్నీ ఆదివారం ప్రకటించారు. ప్రధాని కార్నీ కెనడా రాజధాని ఒట్టావానుంచి బరిలోకి దిగేందుకు సిద్ధం అయ్యారు. లిబరల్‌పార్టీ ఈఅంశం ధృవీకరించింది. జనవరిలో జస్టిన్‌ట్రూడో ప్రధానిపదవికి రాజీనామాచేయడంతో లిబరల్‌పార్టీసభ్యులు తదుపరి ప్రధానిగా కార్నీని ఎన్నుకున్నారు. కొత్త నాయకత్వం ఏర్పడిన తర్వాత గ్లోబల్‌న్యూస్ నిర్వహించిన పోల్ సర్వేల్లో ఓటర్లు అధికార పార్టీవైపు మొగ్గుచూపుతున్నట్లు వెల్లడి అయింది. 42శాతంమంది ఓటర్లు లిబరల్‌పార్టీకి మద్దతివ్వగా 36శాతం మంది కన్సర్వేటివ్‌కు అనుకూలంగా ఉన్నారు. ఇక 48శాతం మంది కార్నీ నాయకత్వం ఆమోదిస్తున్నారు. 30శాతం వ్యతిరేకిస్తున్నారు. అతిపెద్ద వాణిజ్యభాగస్వాములైన కెనడా, మెక్సికోలనుంచి వచ్చే దిగుమతులపై మార్చి 4నుంచి అమెరికా 25శాతం సుంకాలు వసూలుచేస్తున్న సంగతి తెలిసిందే. వలసలు,డ్రగ్స్ అక్రమ రవాణానున సరిహద్దుల్లోనే కట్టడిచేయడంలో విఫలమైతే కెనడా యుఎస్‌లో 51వ రాష్ట్రంగా చేరాలని ట్రంప్ చురకలంటించారు. ఈ హెచ్చరికల నేపథ్యంలో ఆదేశంలో జరగనున్న ఎన్నికలు కీలకంగా మారుతున్నాయి.

# రిమోట్ ఐఇడిలతో భద్రతా దళాలకు మరింత ముప్పు

## ఛత్తీస్‌గఢ్‌లో బటయపడుతున్న అధునాతన మందుపాతరలు



**రాయ్‌పూర్, మార్చి 23:** మావోయిస్టుల ఏరివేత లక్ష్యంగా భద్రతాదళాలు దూకుడు ప్రదర్శిస్తున్నాయి. వచ్చే ఏడాది మార్చికల్లా నక్సల్స్ రహిత దేశంగా మారుస్తామన్న కేంద్ర ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా క్షేత్రస్థాయిలో గాలింపులు ముమ్మరంచేసాయి. గడచిన మూడునెలల వ్యవధిలోనే 120 మందికిపైగా మావోయిస్టులు మృతిచెందారు. అయితే యాంటి నక్సల్స్ ఆపరేషన్‌ల వేళ రక్షణదళాలకు మందుపాతరలు సవాల్ చేస్తున్నాయి. ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్‌లలో ఐఇడి పేలుళ్ల స్వాధీనం ఘటనలుపెరిగాయి. మరోవైపు సిగ్నల్స్‌ద్వారా దూరం నుంచి పేల్చగల ఆర్‌సిఐఇడిలు కూడా లభిస్తున్నాయి. గత ఏడాది ఛత్తీస్‌గఢ్‌లో మందుపాతరలకు సంబంధించి 78 పేలుళ్ల స్వాధీనం సంఘటనలు నమోదయ్యాయి. ఈ ఏడాదిలో మార్చి మధ్య నాటికే ఈ సంఖ్య 100 దాటింది. 2020-22లో సెక్యూరిటీ క్యాంపులకు 3-7 కిలోమీటర్లపరిధిలో ఐఇడిలు లభ్యమయ్యేవని 2023-24 మధ్యకాలంలో అవిమూడు కిలోమీటర్లలోపే వెలుగుచూస్తున్నట్లు నివేదికలో తేలింది. 2020-21తో పోలిస్తే 2022-24లో ఈతరహా ఘటనలు 25శాతంపెరిగాయని తెలింది. గత ఏడాది కాలంలో ఛత్తీస్‌గఢ్ ఝార్ఖండ్‌లలోని నక్సల్స్ ప్రభావితప్రాంతాల్లో 70కి పైగా కొత్త ఫార్వర్డ్ ఆపరేటింగ్‌బేస్‌లు వచ్చాయి. వీటిసంఖ్య పెరిగిన కొద్దీ ఐఇడి ఘటనలూ పెరుగుతున్నట్లు ఒక అధికారి వెల్లడించారు. ఈమధ్యకాలంలో ఈ రెండు రాష్ట్రాల్లోనూ ఆర్‌సీ ఐఇడిల ముప్పు ఆందోళనకరంగా మారింది. గతవారంలోనే బీజాపూర్‌జిల్లాలో సిఆర్‌పిఎఫ్ క్యాంప్ సమీపంలో ఐదు కిలోల పేలుడు పదార్థం వెలుగుచూడటం కలకలం రేపింది. బాంబువద్దరెండు ఖాళీగాజుసీసాలతోపాటు దూరంనుంచి పేల్చేందుకువీలుగా సమీపంలోని ఒకచ ఎట్టుకింద వైర్‌తోఅనుసంధానమై ఉన్న చిన్న యాంటెన్నా కూడా లభించింది. ఇదే జిల్లాలో ఒక వంతెనకింద తొలిసారి ఈ తరహా ఐఇడిని సిఆర్‌పిఎఫ్ స్వాధీనంచేసుకుంది. వీటివాడకం మరింతగాపెరుగుతుందని అంచనావేస్తున్నారు. దూరంనుంచి వీలిని పేల్చే ఛాన్స్ ఉండటంతో ఇవి మరింత ప్రమాదకరమని చెపుతున్నారు.

### జమ్ము అమర్‌నాథ్ గుహలకు రోప్‌వేకు బిడ్లు

**జమ్ము, మార్చి 23:** అమర్‌నాథ్ ఆలయ మార్గం సహా మూడుచోట్ల రోప్‌వేలు నిర్మించేందుకు సమగ్ర పథకనివేదిక రూపకల్పనకోసం బిడ్‌లు ఆహ్వానించామని జమ్ముకాశ్మీర్‌ప్రభుత్వం వెల్లడించింది. బాల్‌టాల్‌నుంచి 3880 మీటర్ల ఎత్తులో ఉన్న అమర్‌నాథ్‌గుహ వరకూ 11.60 కిలోమీటర్ల మేర ఒరోప్‌వేతోపాటు బుద్‌గాంవ్, రాంబన్ జిల్లాల్లో నిర్మించాల్సి న రెండు రోప్‌వేలు ఈజాబితాలో ఉన్నాయి. శంకరాచార్య ఆలయం వద్ద రోప్‌వే నిర్మాణప్రక్రియ డిపిఆర్‌దశలోనే ఉందని పేర్కొంది.



## 120 అడుగుల ఎత్తయిన రథం కూలి ఒకరి మృతి, అనేకమందికి గాయాలు

**బెంగళూరు, మార్చి 23:** మద్దూరమ్మ జాతరలో నిర్వహించిన ఊరేగింపులో 120 అడుగుల ఎత్తయిన రథం కూలింది. ఈ ఘటనలో ఒకరు మరణించగా పలువురు గాయపడ్డారు. కర్ణాటకలోని బెంగళూరురూరల్ జిల్లాలో ఈసంఘటన జరిగింది.

అనేకల్‌లోని హుస్కూర్‌లో మద్దూరమ్మ జాతర సందర్భంగా వంద అడుగు లకుపైగా ఎత్తయిన రెండు రథాలను ఆలయ నిర్వాహకులు తయారుచేయించారు. ఊరేగింపు సందర్భంగా రెండు రథాలను తాళ్లసాయంతో భక్తులు లాగారు. అయితే ఈదు రుగాలులలకు 120 అడుగుల ఎత్తయినరథం అదుపు తప్పి ఒక పక్కకు కూలిపోయింది. ఈ ప్రమాదంలో ఒక వ్యక్తిమరణించాడు. పలువురు గాయపడ్డారు. పలు వాహనాలుకూడా ధ్వంసం అయ్యాయి. మరోవైపు పోలీసులు, అధికారులు సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. మృతుడిని తమిళనాడు లోని హోసూర్‌కు చెందిన లోహిత్‌గా గుర్తించారు. ఎత్తయిన రథం కూలిన సంఘటనపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మరోవైపు ఈ విడియోక్లిప్ సోషల్‌మీడియాలో వైరల్ అయింది.

24-3Pg6exHMNWJQE.qxd:24-3Pg6exHMNWJQE.qxd 01/01/01 9:20 AM Page 1






ఆదివారం మీడియా సమావేశంలో మాట్లాడుతున్న గిడుగు రుద్రరాజు

## కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి సమష్టిగా కృషి


### మాజీ పీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు

**వెదురుకుప్పం, మార్చి 23 ప్రభాతవార్త :** దేశసమగ్రత కాపాడటం, బడుగు, బలహీన, పేద వర్గాల అభ్యున్నతిని సంరక్షించగల ఏకైక జాతీయ పార్టీ కాంగ్రెస్ మాత్రమేనని, ఆ పార్టీ బలోపేతంకు సమిష్టిగా కలిసి పనిచేద్దామని మాజీ పీసీసీ అధ్యక్షులు గిడుగు రుద్రరాజు పిలుపునిచ్చారు. చిత్తూరు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పోటుగారి భాస్కర్ తండ్రి పోటుగారి శంకరయ్య శుభస్వీకరణ కార్యక్రమంలో భాగంగా ముందుగా ఆయన చిత్ర పటంకు నివాళి అర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశ భవిష్యత్తును చక్కదిద్దగల, గాంధేయే సిద్దాంతాలతో ముందుకువెళ్ళుతున్న జాతీయ పార్టీ కాంగ్రెస్ పార్టీ ఒక్కటేనని స్పష్టం చేశారు. భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలోని నరేంద్ర మోదీ పాలన అరాచక పాలనను తలపిస్తుందని ఆరోపించారు. కేవలం భారత దేశ రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్.అంబేద్కర్ రాజ్యాగం ప్రకారం పాలన అందిగల శక్తి కేవలం కాంగ్రెస్ పార్టీకే ఉందన్నారు. ప్రజలు గుర్తించి తిరిగి కాంగ్రెస్ పార్టీని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అధికారంలో తీసుకురావలన్నారు. యువనేత రాహుగాంధీ 2029లో ప్రధానమంత్రిగా చూస్తామని జోస్యం చెప్పారు. పార్టీ పట్టిష్టతకు సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులతో ప్రణాళికలు సిద్ధచేస్తున్నారని చెప్పారు. అందులో భాగంగానే మార్చి 27,28, ఏప్రిల్ 4 తేది లలో జాతీయ స్థాయిలో పార్టీ సంస్థగత బలోపేతం కొరకు అహ్మదాబాదులో పార్టీ సమావేశాలు జరుగుతాయన్నారు. క్షేత్రస్థాయిలో పార్టీ పటిష్టతకు యువతకు పెద్ద పీఠ వేయాలని పెద్దలు ఆలోచన చేస్తున్నారని తెలిపారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా, తిరుపతి జిల్లా గతంలో తాను పనిచేసిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు గుర్తుచేసుకున్నారు. సంతోషంలో కార్యకర్తలకు, నాయకులకు తోడుగా ఉండటం కాదు బాధను పంచుకోవాలని అండగా నిలబడాలనేది పార్టీ సిద్దాంతమని అందుకే తాను ఈ కార్యక్రమంకు హాజరై భాస్కర్ కుటుంబ సభ్యులను పరామర్శించడం జరిగిం దన్నారు. వ్యక్తితత్వం ముఖ్యమని పదవులు కాదని శంకరయ్య క్రమశిక్షణ గలవారని గుర్తు చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు, సీనిప్రముఖులు ఆకులశివ, మండల పార్టీ అధ్యక్షులు కందుకూరి హుమేష్, నాయ కులు సుబ్రమణ్యంరెడ్డి, చిన్నా పాల్గొన్నారు.

## కారు,స్కూటర్ ఢీ: ఒకరు మృతి



**వెంకటాచలం (నెల్లూరు),మార్చి 23,ప్రభాతవార్త :** కారు, స్కూటర్ ఢీ కొని ఒక్కరు మృతి చెందిన సంఘటన వెంకటాచలం మండలంలోని గొలగముడి రోడ్డు వద్ద చోటు చేసుకుంది. వివరాలు నెల్లూరు నుంచి గుడూరు వెళ్తున్న కారు అతి వేగంగా రావడంతో గొలగమూడి రోడ్డు వద్ద స్కూటీని ఢీ కొంది. ఈ ప్రమాదంలో స్కూటీ లో డ్రైవ్ చేస్తున్న వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతి చెందిన వివరాలు లభ్యం కాలేదు. దీంతో వెంకటాచలం ఎస్సై ఆంజినేయులు మృత దేహాన్ని పోస్టు మార్టంకి నెల్లూరు గవర్నమెంట్ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు.




అన్న క్యాంటీన్ నిర్వహణ కోసం చంద్రబాబు రూ.కోటి విరాళం చెక్కు అందిస్తున్నరంగారావు కుటుంబ సభ్యులు

## నార్నే రంగారావు జ్ఞాపకార్థం అన్న క్యాంటీన్‌కు రూ.1 కోటి విరాళం

**విజయవాడ,మార్చి23,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రముఖ పారిశ్రామిక వేత్త, ఆంధ్రప్రదేశ్ రియల్ ఎస్టేట్ డెవలపర్స్ ఫౌండర్, చైర్మన్ నార్నే రంగారావు జ్ఞాపకార్థం ఆయన సతీమణి డాక్టర్ శాంతారావు నార్నే అన్న క్యాంటీన్‌కు రూ.1,00,01,016 విరాళంగా అందజేశారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక అన్న క్యాంటీన్ తిరిగి ప్రారంభించిన సమయంలో నారా భువనేశ్వరి గారు రూ. 1 కోటి విరాళంగా ఇచ్చి తనకు స్ఫూర్తి నింపారని డాక్టర్ శాంతారావు అన్నారు. అనారోగ్యం కారణంగా చనిపోవడానికి ఒకరోజు ముందు రూ. 1 కోటి విరాళం అందించే విషయాన్ని నార్నే రంగారావు డాక్టర్ శాంతారావు గారికి గుర్తు చేశారు. దీంతో ఆయన మరణానంతరం తన కుమార్తె, నార్నె ఎస్టేట్స్ డైరెక్టర్ అడుసుమిల్లి దీప, వైట్ ఫీల్డ్ బయో ఎండీ అడుసుమిల్లి నరేష్ కుమార్‌తో కలిసి వచ్చి శాంతారావు విరాళాన్ని సీఈవో నార్నె గోకుల్ తోడ్పాటుతో రాష్ట్ర ప్రభుత్వానికి అందజేశారు. పేదలకు రూ. 5 లకే అన్నం పెట్టాలనే ఆలోచనకు... ఇలాంటి వారి మంచి మనసు ఎంతో దోహదం చేస్తుంది. ఎంతో నిజాయితీగా, ఆదర్శంగా జీవితాన్ని గడిపిన నార్నే రంగారావు కాలం చేయడానికి ఒక రోజు ముందు కూడా అన్న క్యాంటీన్ విరాళం గురించి భార్యకు గుర్తు చేయడం వారి గొప్ప మనసుకు నిదర్శనం.

రియల్ ఎస్టేట్ రంగంలో ఆయన చేసిన సేవలు స్మరించుకుంటూ అన్న క్యాంటీన్‌కు విరాళం ఇచ్చిన వారి కుటుంబ సభ్యులకు నా ధన్యవాదాలు, అభినందనలు తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి

**హన్మకొండ బ్యూరో, మార్చి 24, ప్రభాతవార్త:** రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి చెందిన ఘటన ఆదివారం హసన్ పర్తి పెద్ద చెరువు కట్ట మూలమలుపు వద్ద చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ వట్టే చేరాలు కథనం ప్రకారం... మండలంలోని సీతంపేటకు చెందిన బౌతు మహేష్ (20), దుర్గం పవన్ కళ్యాణ్ (22) ఇద్దరు మిత్రులు. వీరు తమ ద్విచక్ర వాహనంపై సీతంపేటకు వెళ్తుండగా మార్గమధ్యలో హసన్ పర్తి పెద్ద చెరువు కట్ట మూలమలుపు వద్ద ఎదురుగా వస్తున్న టిప్పర్ అతివేగంగా ఢీకొట్టడంతో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. మృతి విషయం తెలిసిన ఇన్ స్పెక్టర్ వట్టే చేరాలు, ఎస్సైలు దేవేందర్, శీలం రవి ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాలను ఎంజీఎం మార్చురికి తరలించారు. అనంతరం ట్రాఫిక్ ను క్రమబద్ధీకరించారు. మృతుల కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ చేరాలు తెలిపారు. టిప్పర్ డ్రైవర్ ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపడుతున్నట్టు ఇన్‌స్పెక్టర్ చేరాలు వెల్లడించారు.

## భద్రతా బలగాలపై మావోయిస్టుల మెరుపుదాడి

### నలుగురు జవాన్లకు తీవ్రగాయాలు

**చర్ల, ప్రభాతవార్త :** ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా భూపాలపట్నం జాతీయ ప్రధాన రహదారిపై గొర్లనల్ల గ్రామ సమీపంలో భద్రతా బలగాల వాహనాన్ని లక్ష్యంగా చేసుకుని మావోయిస్టులు మందుపాతర పేల్చారు. భద్రతా బలగాల రాకపై నిఘా పెట్టిన నక్సల్స్ ప్రధాన రహదారిపై ముందస్తుగానే మందుపాతరను అమర్చి ఆదివారం మధ్యాహ్నం ఈ దాడి ఘటనకు పాల్పడ్డారు. ఆ మందు పాతర పేల్చిన అనంతరం భద్రతా బలగాలపై కాల్పులు జరిపారు. ఇరువురి మధ్య కొద్దిసేపు కాల్పులు జరిగాయి.

అనంతరం ఆ ప్రాంతం నుంచి మావోయిస్టులు వెను తిరిగారు. దాడి ఘటన తెలుసుకున్న బస్తర్ ఐసీ పీ.సుందర్‌రాజ్, బీజాపూర్ ఎస్పీ జితేంద్రయాదవ్, అదనపు బలగాలను ఘటన స్థలానికి పంపించారు. అటవీ ప్రాంతంలో మావోయిస్టుల కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. గాయపడిన జవాన్‌లను జిల్లా ఆసుపత్రికి తరలించారు.

# తిరుమలలో మళ్లీ ప్లాస్టిక్ సీసాల నీరు!

## గాజు సీసాలకు బ్రేక్, నేడు పాలకమండలిలో చర్చ



**తిరుమల,మార్చి 23 ప్రభాతవార్తప్రతినిధి:** ఏడుకొండల వేంకటేశ్వరస్వామి దర్శనార్థం తిరుమలకు వస్తున్న భక్తులు నాణ్యమైన, తక్కువ ధరకు మంచినీరు అందుకునే దిశగా టిటిడి పాలమండలి, అధికారులు కార్యాచరణ రూపొందిస్తున్నారు. ఇందులో భాగంగా మళ్ళీ తిరుమలకొండపై ప్లాస్టిక్ సీసాల నీటిని అందుబాటులోకి తీసుకురావాలని ఆలోచనచేస్తున్నారు. ఇప్పటికే ఈ విషయంగా టిటిడి అధికారులు, పాలక మండలి సానుకూలంగా వున్నట్లు తెలుస్తోంది. కలియుగవైకుంఠం తిరుమలకొండపై పర్యావరణ పరిరక్షణ, కాలుష్యనియంత్రణలో భాగంగా ప్లాస్టిక్ వస్తువులను పూర్తిగా నిషేధిస్తూ 2022 జూన్‌లో నిర్ణయం తీసుకున్నారు. దీన్ని అమలుచేస్తున్నారు కూడా. అంతకంటే ముందే 2021లోనే తిరుమలలో ప్లాస్టిక్‌సీసాల నీటిని విక్రయించడం నిషేధించారు. అప్పట్లోనే దీనిపై అత్యధికమంది భక్తులు కూడా వ్యతిరేకించారు. ప్లాస్టిక్‌సీసాలో నీరు తక్కువ ధరకే విక్రయిస్తారు. అరలీటరు సీసానీరు 10రూపాయలు, లీటరు సీసానీరు 20 రూపాయలు, 2లీటర్ల సీసానీరు 35రూపాయలకు అందుబాటులో ఉండేది. అయితే గతంలో వైసిపి టిటిడి పాలకమండలి ఏకంగా దీన్ని రద్దుచేశారు. ఆస్థానంలో తొలుత స్టెయిన్‌లెస్ స్టీల్,రాగి నీటిసీసాలను అందుబాటులోకి తీసుకువచ్చారు. వీటిని టిటిడినే స్వయంగా విక్రయించింది కూడా. అయితే ఇవేమీ సామాన్యభక్తులకు అందుబాటులో లేకపోవడంతో ఆ స్థానంలో గాజుసీసాల నీటిని విక్రయించాలని ఆదేశాలిచ్చారు. దీనివెనుక అప్పటి టిటిడి పాలకమండలి పెద్దల హస్తం కూడా ఉందనే ఆరోపణలు వినిపించాయి. మెల్లమెల్లగా గత మూడేళ్ళగా గాజుసీసాల నీటినే భక్తులు కూడా కొనుగోలుచేస్తున్నారు. ఈ సీసాల ధర 65రూపాయలకు విక్రయిస్తుండటంతో భక్తులకు భారంగా మారింది. ఖాళీగాజుసీసాలు ఏ దుకాణంలో తిరిగి వచ్చినా 30రూపాయలు డిపాజిట్ ఇచ్చేవారు. ఇలా భారంగా మారడంతో బాటు గాజుసీసాలతో ప్రమాదంగా మారింది. కొందరు భక్తులు, అనదికార హాకర్లు గాజుసీసాలతో దాడులకు దిగారు. ఈ నేపథ్యంలో ప్రస్తుత పాలక మండలి భక్తుల సౌలభ్యం కోసం తిరిగి ప్లాస్టిక్‌సీసాల నీటిని విక్రయించేలా నిర్ణయం తీసుకోనున్నారు. సోమవారం నేడు జరిగే బోర్డు సమావేశంలో దీన్ని చర్చించి ఆమోదయోగ్యంగా నిర్ణయం తీసుకోనున్నారు. మరీ ప్లాస్టిక్‌సీసాలను పర్యావరణానికి ప్రమాదంగా కాకుండా ఎలా తరలిస్తారనేది చూడాల్సిందే. ప్లాస్టిక్ నిషేధంలో భాగంగా అలిపిరి వద్ద ప్రతిరోజూ 10బస్తాలు ప్లాస్టిక్ నీటి సీసాలు ప్రోగవుతున్నాయి. అంతేగాక కొండపై టిటిడి జలప్రసాదిని అందుబాటులో ఉంది. వేసవికాలం కావడంతో ఇక్కడ అవసరాలకు తగ్గట్లు ప్లాస్టిక్‌సీసాల నీటిని భక్తులకు మళ్లీ అందుబాటులోకి తేవాలని చూస్తుండటంపై భక్తుల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

## ఆంధ్రా, తమిళనాడు సరిహద్దుల్లో చెట్టును ఢీకొన్న కారు

# ఇద్దరు మృతి, ఆరుగురికి గాయాలు

### అతివేగమే కారణమని అనుమానం



**తడ, మార్చి 23 ప్రభాతవార్త:** విహార యాత్రకు వెళుతూ తమిళనాడుకు చెందిన కొందరు రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. ఆంధ్రా, తమిళనాడు సరిహద్దుల్లోని తడ మండలం పెరియవట్టు వద్ద ఆదివారం ఉదయం చెన్నై నుంచి ఉబ్బలమడుగుకు వెళుతున్న కారు చెట్టును ఢీకొని ఈ ప్రమాదం జరిగింది. ప్రమాదం జరిగిన చోటే ఒక మహిళ మృతిచెందగా, అనంతరం చికిత్స పొందుతూ మరొక మహిళ మృతిచెందారు. పోలీసుల కథనం మేరకు, కారును అతివేగంగా నడపడం ఈ ప్రమాదానికి కారణం. చెన్నైలోని తాంబరం నుంచి బుచ్చినాయుడుకండ్రిగ మండలం ఉబ్బలమడుగు వాటర్‌ఫాల్స్‌కు వీకెండ్‌లో విహరిద్దామని వెళుతున్న స్నేహితుల బృందం ఈ ప్రమాదంలో చిక్కుకుంది. మొత్తం అందరూ డ్రైవర్‌తో సహా స్నేహితులే ఉన్నారు. ప్రమాద సమయంలో కారును మహమ్మద్ అవాస్ నడుపుతున్నాడు. తమిళనాడును దాటుకొని ఆంధ్రా ప్రాంతంలో ప్రవేశించిన తర్వాత పెరియవట్టు వద్ద ఈ కారును అతివేగంగా అజాగ్రత్తగా నడిపి జాతీయ రహదారి పక్కనున్న కొబ్బరిచెట్టును ఢీకొట్టినట్లు పోలీసులకు ప్రాథమిక సమాచారం అందింది. ప్రమాదం జరిగిన ప్రదేశంలోనే షబిల్ ఫాతిమా (21) అనే మహిళ అక్కడికక్కడే మృతి చెందారు. గాయపడిన డ్రైవర్‌తో సహా మిగిలిన ఆరుగురిని మొదట ఎలావూరు సమీపంలోని ఒక ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించిన అనంతరం మెరుగైన వైద్యం కోసం చెన్నైకి తీసుకెళ్లినట్లు తెలిసింది. అక్కడ చికిత్స పొందుతున్న డీనా (34) ఆసుపత్రిలోనే మరణించారు. మృతిచెందిన ఫాతిమా తాంబరంకు చెందిన వారు కాగా, డీనా చెన్నైలోని అమిజుకళైకి చెందిన వారు. డ్రైవర్ మహ్మద్ అవాస్ చెన్నైలోని భారతి దరన్‌నగర్‌కు చెందిన వారు కాగా, లోగేష్ శాంతిరోడ్డు నివాసి. బెంజిమెన్ నీలచ్చేరి ప్రాంతానికి చెందిన యువకుడు. ఆలియా బేగం భారతిదరన్‌కు చెందినవారు. శ్రీమాన్ చెన్నైలోని సైదాపేట, మహేష్ తాంబరంకు చెందిన వారిగా గుర్తించారు. మొదటమృతిచెందిన మహిళను పోలీసులు సూళ్లూరుపేట ప్రభుత్వాసుపత్రికి పోస్టుమార్టంనిమిత్తం తరలించారు. అనంతరం సాయంత్రం మరో మహిళ మృతిచెందినట్లు సమా చారం అందింది. సూళ్లూరుపేట సీఐ మురళీకృష్ణ ఆధ్వర్యంలో పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# చేపాక్‌లో చెలరేగిన సిఎస్కే

### 4 వికెట్ల తేడాతో ముంబయి ఓటమి



**చెన్నై, మార్చి 23:** ఐపిఎల్‌లో ఐదుసార్లు ఛాంపియన్‌గా నిలిచిన చెన్నై సూపర్‌కింగ్స్ 2025 ఐపిఎల్‌లో బోణీచేసింది. ఆదివారం చేపాక్ వేదికగా జరిగిన మ్యాచ్‌లో తన ప్రత్యర్థి ముంబయి ఇండియన్స్‌పై నాలుగు వికెట్ల తేడాతో గెలిచింది. 156 పరుగుల లక్ష్యాన్ని 19.1 ఓవర్లలో ఆరువికెట్లునష్టపోయి చెన్నైజట్టు ఛేదించి విజయం అందుకుంది. చెన్నై కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ 26 బంతుల్లో ఆరుఫోర్లు, మూడు సిక్సర్లతో 53 పరుగులు చేసాడు. చెన్నై గెలుపులో కీలకంగా నిలిచాడు. రచిన్‌రవీంద్ర 45 బంతుల్లో రెండు ఫోర్లు నాలుగు సిక్సర్లుచేసి 45 బంతుల్లో 65 పరుగులుచేసి నాటౌట్‌గా నిలిచాడు. చివరివరకూ క్రీజులో ఉండి చెన్నైని గెలిపించారు. ముంబై తరపున విగ్నేశ్‌పుత్తూర్ 3 వికెట్లతో మెరిసాడు. పిచ్‌స్లోగా ఉండటంతో సిఎస్కే లక్ష్యఛేదన తడబడుతూనే ఆరంభించింది. రాహుల్ త్రిపాఠి రెండు పరుగులతో నిరాశపరిచాడు. ఈ దశలోక్రీజులోకి వచ్చిన కెప్టెన్ రుతురాజ్‌గైక్వాడ్ ధాటిగా బ్యాటింగ్‌చేసాడు. ఫలితంగా చెన్నై సూపర్‌కింగ్స్ లక్ష్యంవైపు పరుగులుతీసింది. రచిన్‌రవీంద్ర ఒక ఎండ్‌లో ఆచితూచి ఆడితే మరో ఎండ్‌లో రుతురాజ్‌గైక్వాడ్‌మెరుపులు మెరిపించాడు. రుతురాజ్ ఔట్ అయిన తర్వాత చెన్నై వెంట వెంటనే వికెట్లను కోల్పోయింది. దూబే తొమినమది, దీపక్‌హుడా ఐదు, శ్యామకరణ్ నాలుగు పరుగులుచేసి ఘోరంగా విఫలం అయ్యారు. దాంతో చెన్నై ఐదు వికెట్లను నష్టపోయింది. ఈ దశలో క్రీజులోకి వచ్చిన రవీంద్ర జడేజా 18 బంతుల్లో 17 పరుగులుచేసి కొంత మెరుగనిపించాడు. చివరిలో ధోనీ క్రీజులోకి వచ్చినా రెండు బంతులను ఆడే అవకాశం మాత్రమే వచ్చింది. రచిన్‌రవీంద్ర విన్నింగ్‌షాట్‌తో మ్యాచ్‌ను ముగించాడు. తొలుత బ్యాటింగ్‌చేసిన ముంబయి ఇండియన్స్ 20 ఓవర్లలో తొమ్మిది వికెట్లకు 155పరుగులు మాత్రమేచేసింది. ఐపిఎల్ 2025 సీజన్‌లో భాగంగా వీరిద్దరికీ ఇదే తొలిమ్యాచ్‌కావడం గమనార్హం. చేపాక్‌స్టేడియంలో చెన్నై బౌలర్లు మరోసారి రాణించారు. నూర్ అహ్మద్ నాలుగు వికెట్లతోమెరిశాడు. ఖలీల్ అహ్మద్‌కు మూడు వికెట్లు దక్కాయి. ఇద్దరి ధాటికి ముంబయి ఇండియన్స్ ఏదశలోనూ కోలుకోలేక పోయింది. తిలక్‌వర్మ 25 బంతుల్లో 31పరుగులు చేసాడు. ఆతడే టాప్‌స్కోరరుగా నిలిచాడు. తాత్కాలిక కెప్టెన్ సూర్యకుమార్‌యాదవ్ 26 బంతుల్లో 29 పరుగులుచేసి నిరాశనే మిగిల్చాడు. చివరిలో దీపక్ చాహర్ 15 బంతుల్లో 29 పరుగులుచేసి నాటౌట్‌గానే నిలిచి ధాటిగా ఆడటంతో ముంబయి ఇండియన్స్ 155 మార్కుకు చేరింది.

# ఆర్టీసీ బస్సును ఢీకొన్న కారు

### సూర్యాపేట జిల్లాలో ఘోరప్రమాదం

### ఒకే కుటుంబంలోని ముగ్గురు మృతి.. ఆరుగురికి గాయాలు




**ప్రభాతవార్త, నడిగూడెం,(సూర్యాపేట):** సూర్యాపేట జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. శుభ కార్యానికి వెళ్లి తిరిగి హైదరాబాద్ ప్రయాణిస్తుండగా ప్రమాదం చోటుచేసుకుంది. ఖమ్మం వెళ్తున్న ఆర్టీసీ బస్సు ను కారు బలంగా ఢీకొట్టడంతో అక్కడికక్కడే ముగ్గురు మృతి చెందగా ఆరుగురు గాయపడ్డారు. సూర్యాపేట జిల్లా చివ్వెంల మండలం బీబీ గూడెం గ్రామ శివారులో విజేత పైపుల కంపెనీ ముందు ఆదివారం సాయంత్రం ఈ ప్రమాదం జరిగింది. ఆత్మకూరు ఎస్ మండలం కోటపహాడ్ గ్రామంలో శుభకార్యానికి హాజరై హైదరాబాద్ వెళ్తుండగా ప్రమాదం జరిగింది. ఖమ్మం ఆర్టీసీ బస్సు ను కారు ఢీకొట్టడంతో మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం కాంటయ్యపాలెం కు చెందిన గడ్డం రవీందర్(34), అతని భార్య రేణుక(28), వారి కూతురు రిషిత(8) అక్కడికక్కడే మృతి చెందారు. కారు నుజ్జు నుజ్జు అయింది. కారులో ఏడుగురు ప్రయాణిస్తున్నట్లు గుర్తిం చారు. నలుగురు పిల్లల పరిస్థితి విషమంగా ఉండ డంతో మెరుగైన వైద్యం నిమిత్తం సూర్యాపేట ప్రభుత్వాసుపత్రికి తరలిం చారు. మృతుడు రవీందర్ హైదరాబాదులో నివాస మంటూ కార్ డ్రైవర్ గా జీవనం కొన సాగిస్తు న్నాడు. శుభ కార్యానికి వెళ్లి వస్తున్న క్రమంలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో కడారి పుష్ప, గంధం మధు, కడారి హర్షిత, గంధం సాన్విక, గంధం గగన్ చందర్, గంధం మల్లికార్జున్, కడారి జస్విన్, గడ్డం రిషి కృష్ణ గాయపడ్డట్లు పోలీసులు తెలిపారు. గాయపడ్డ వారికి చికిత్స చేస్తున్నారు. జరిగిన సంఘటన చూసేవారి హృదయాలను కలచివేసింది. జరిగిన సంఘటన తెలవడంతో చుట్టుపక్కల వారు సంఘటన స్థలానికి చేరుకొని జరిగిన సంఘటన పట్ల ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకొని పరిస్థితిని సమీక్షి ంచారు. చివ్వెంల పోలీసులు విచారణ చేస్తున్నారు.

# ఫోర్టిఫైడ్ సన్నబియ్యం పిడిఎస్‌లో పంపిణీ

### తెలంగాణ సివిల్ సప్లయ్ కమిషనర్ డిఎస్ చౌహాన్

**హైదరాబాద్, మార్చి 23, ప్రభాతవార్త:** తెలంగాణలో ఫోర్టిఫైడ్ సన్నబియ్యం ఏప్రిల్ నెల నుంచి పంపిణీకి స్వీకారం చుట్టబోతున్నామని సివిల్ సప్లయ్ కమీషనర్ డిఎస్ చౌహాన్ తెలిపారు. ఆదివారం చత్తీస్‌గడ్ లోని రాయపూర్ ఐఐఎంలో అంతర్జాతీయ నాయకత్వం సదస్సులో ఆయన మాట్లాడుతూ తెలంగాణలో సివిల్‌సప్లయ్‌శాఖలో అక్రమాలు అరికట్టడుతూ పారదర్శకత పెంచుతూన్నమని తెలిపారు. ప్రజాపంపిణీ వ్యవస్థలో కొత్త విధానాలు ఆచరిస్తూ వినియోగదారుడికి మెరుగైన సేవలు సకాలంలో అందిస్తున్నామని తెలిపారు. నాణ్యతకలిగిన సరుకులతో ప్రజాపంపిణీ వ్యవస్థను మెరుగుపరిచామని తెలిపారు. 409కోట్ల రూపాయల విలువగల పిడిఎస్‌బియ్యం ఇప్పటి వరకు అక్రమ రవాణా జరగకుండా పట్టుకొని సీజ్‌చేశామని తెలిపారు. గతంలో పోలిస్తే తొమ్మిదిరెట్లు నిఘా పట్టుకొన్నామని వివరించారు. వరిధాన్యం సేకరణలో కూడా వాతావార్ణ సాంకేతిక పరిజ్ఞానం జోడించామని దీనితో స్కోచ్ అవార్డు 2024లో లభించిందని వివరించారు. పిలిఫిన్స్ దేశంలో బియ్యం ఎగుమతి ఒప్పొందాలు చేసుకొన్నామని తెలిపారు. తెలంగాణలో ప్రతి రవాణా మార్గంలో వ్యయాలు తగ్గించే విధంగా రూపొందించి నిత్యవసరవస్తువులు పక్కదారి పట్టకుండా నిఘా ఏర్పాటు చేసి 12 నుంచి 15కోట్ల రూపాయల ఆదా చేస్తున్నామని తెలిపారు. స్మార్ట్ చౌకధరల దుకాణం జనపోషణ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు.

24-3P□g7exHMNWJQE.qxd:24-3P□g7exHMNWJQE.qxd 01/01/01 9:37 AM Page 1



# శ్రీరామనవమి ఉత్సవాలకు రండి

## సిఎంను ఆహ్వానించిన డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క, మంత్రులు కొండా సురేఖ, తుమ్మల నాగేశ్వరరావు



ఆదివారం సిఎం నివాసంలో శ్రీరామనవమి బ్రహ్మోత్సవాల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సిఎం భట్టి, మంత్రులు కొండా సురేఖ, తుమ్మల నాగేశ్వరరావు

**హైదరాబాద్, మార్చి 23, ప్రభాతవార్త:** భద్రాచలంలో శ్రీరామనవమి సందర్భంగా నిర్వహించే తిరుకళ్యాణ, బ్రహ్మోత్సవాలకు రావాలని సిఎం రేవంత్‌రెడ్డిని మంత్రి కొండా సురేఖ, డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క, తుమ్మల నాగేశ్వరరావు, భద్రాచలం దేవస్థానం అర్చకులు, అధికారులు ఆహ్వానించారు. ఈ మేరకు వారు ఆదివారం సిఎం నివాసంలో కలిసి ఆహ్వాన పత్రికను అందచేశారు. ఆ సందర్భంగా వారు శ్రీరామనవమి బ్రహ్మోత్సవాలకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అవసరమైన భూసేకరణ, నిధులకు సంబంధించి పూర్తి వివరాలను అందించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సీఎం సలహాదారులు వేం నరేందర్‌రెడ్డి, దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్, దేవాదాయశాఖ కమిషనర్ శ్రీధర్‌బాబు, ఆలయ ఈవో రమాదేవి, ఆలయ అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

**పంచాంగాన్ని ఆవిష్కరించిన మంత్రి కొండా సురేఖ**

దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖధూప దీప నైవేద్య అర్చన సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన విశ్వవసు నామ సంవత్సర పంచాంగ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా ఉండాలని దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఆకాంక్షించారు. ఈ సందర్భంగా మంత్రి అర్చకులను ఉద్దేశించి మంత్రి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని దానికి భగవంతుని కృప ఉండాలని దానికి అర్చకులుగా మీ వంతు సహకారంగా క్షేమంగా సుభిక్షంగా ఉండేందుకు ప్రతినిత్యం భగవంతుని అర్చన చేయాలన్నారు.

ఈ కార్యక్ర మంలో ప్రధాన కార్యదర్శులు అన్న వజ్జల ప్రసాద్‌శర్మ తిరునగరి వెంకటాద్రి స్వామి కోశాధికారి నందనం హరికిషన్ శర్మ వర్కింగ్ ప్రెసిడెంట్ ఫణి కుమార్ శర్మ కన్వీనర్ అమరేశ్వరశర్మ విశాలాక్షి ఉపాధ్యక్షులు మహేషు, రవికుమార్ లక్ష్మీకాంతాచార్యులు అధికార ప్రతినిధులు భార్గవాచార్యులు సంతోష్ శర్మ వివిధ జిల్లాల అధ్యక్షులు రమేష్ శర్మ మునగలేటి త్రిపురారి మనోహర్ శర్మ పార్థసారథి జంగం మహేష్ జయతేర్థ చారి సుబ్రహ్మణ్య శర్మ శిరేష్ శర్మ అంజనప్ప స్వామి రాజప్ప స్వామి అడవయ్య స్వామి సిద్ధాంతి గణేష్ జ్ఞానేశ్వర్ ఇతర రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వివిధ జిల్లాల నుండి కార్యవర్గ సభ్యులు అర్చకులు తిదితరులు పాల్గొన్నారు.

# సైబర్ నేరగాళ్ల విషయంలో కార్పొరేట్ కంపెనీలు జాగ్రత్తగా ఉండాలి

## టిజిసిఎస్‌బి హెచ్చరిక

**హైదరాబాద్, మార్చి 23, ప్రభాతవార్త:** కార్పొరేట్ కంపెనీలు సైబర్ నేరగాళ్ల విషయంలో జాగ్రత్తగా వుండాలని తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టిజిసిఎస్‌బి) హెచ్చరించింది. కార్పొరేట్ కంపెనీల్లో ఉన్నత పదవుల్లో వున్న వారు తమకు వచ్చే మెయిల్స్ విషయంలో జాగ్రత్తగా వుండాలని టిజిసిఎస్‌బి డిజి శిఖా గోయల్ తెలిపా రు. ఈ మేరకు ఆమె ఆదివారం నాడు ఒక ప్రకటన విడుదల చేశారు. సైబర్ నేరగాళ్లు కార్పొరేట్ కంపెనీల సిఎండిలు, సిఈఓలు మాట్లాడుతున్నట్లు ఉన్నత పదవుల్లో వున్న వారికి ఫోన్‌లు చేయడం, తమ నంబర్లు ఇస్తూ కంపెనీ సమాచారం కోసం ప్రయత్నించడం ఇటీవల కాలంలో పెరిగిందని ఆమె తెలిపారు. ఇదే సమయంలో ఫి షింగ్ మెయిల్స్ విషయంలోనూ ఉద్యోగులు, ఉన్నత పదవుల్లో వున్న వారు జాగ్రత్తగా వుండాలని ఆమె కోరారు. ఈ విషయంలో ఏమాత్రం తేడా వచ్చినా కంపెనీకి సంబంధించి బ్యాంకుల ఖాతాల్లో వున్న నగదును సైబర్ నేరగాళ్లు కాజేసే ప్రమాదం వుందని, ఇదే సమయంలో కంపెనీకి చెందిన విలువైన సమాచారం గల్లంతయ్యే అవకాశం వుందని ఆమె తెలిపారు. కార్పొరేట్ కంపెనీలు గుర్తు తెలియని వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్‌ల విషయంలో జాగ్రత్తగా వుండాలని, ఏమైనా అనుమానం వస్తే 1930కి ఫిర్యాదు చేయాలని శిఖాగోయల్ కోరారు.

# 26 నుంచి ఎస్‌ఎస్‌సి మూల్యాంకనం ప్రారంభం

## 19 కేంద్రాల్లో కొనసాగనున్న స్పాట్ వ్యాల్యుయేషన్

**హైదరాబాద్, మార్చి 23, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఈ నెల 21 నుంచి ప్రారంభమైన 10వ తరగత వార్షిక పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనం ఈ నెల 26 నుంచి ప్రారంభం కానుంది. ఏప్రిల్ 4 వరకు పరీక్షలు కొనసాగనున్నప్పటికీ.. లాంగ్వేజెస్ పరీక్షలు ముగియగానే జవాబు పత్రాల మూల్యాంకనాన్ని ప్రారంభించనున్నారు. ప్రతి ఏడాది ఇలాగే మూల్యాంకనాన్ని కొనసాగిస్తారు. రాష్ట్ర వ్యాప్తంగా 19 కేంద్రాల్లో స్పాట్ వాల్యుయేషన్ కేంద్రాలను కొనసాగించనున్నారు. హైదరాబాద్‌లో రెండు కేంద్రాలను కొనసాగిస్తూ.. మిగిలిన కేంద్రాలను జిల్లాల్లో కొనసాగించనున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 10వ తరగతి పరీక్షలకు 5.05 లక్షల మంది విద్యార్థులు హాజరు కానున్నారు. ఎస్‌ఎస్‌సి మూల్యాంకనాన్ని ఈ నెల 26 నుంచి మొదలుపెట్టి.. ఏప్రిల్ 13 వరకు ముగించాలని అధికారులు భావిస్తున్నారు. అయితే ఏప్రిల్ 13 వరకు పూర్తికాకపోతే మరో రెండు, మూడు రోజుల్లో పూర్తి చేసి.. ఏప్రిల్ నెలాఖరులోగానీ.. మే మొదటి వారంలోగానీ ఎస్‌ఎస్‌సి ఫలితాలను విడుదల చేయడానికి పాఠశాల విద్య శాఖ అధికారులు కసరత్తు చేస్తున్నారు. రాష్ట్రంలో ఆదిలాబాద్, మంచిర్యాల్, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల్, హన్మకొండ, కరీంనగర్, సంగారెడ్డి, సిద్ధిపేట, యాదాద్రి భువనగిరి, మేడ్చల్ మల్కాజ్‌గిరి, హైదరాబాద్(మేజర్), హైదరాబాద్(మైనర్), రంగారెడ్డి, మహబూబ్ నగర్, నాగర్‌కర్నూల్, నల్గొండ, సూర్యాపేట, ఖమ్మం కేంద్రాల్లో మూల్యాంకనాన్ని కొనసాగించనున్నారు.

# ప్రమాదాల నివారణకు పకడ్బందీ చర్యలు

## రవాణా కార్యాలయాల్లో ట్రాఫిక్ అవగాహన పార్కులు

## మంత్రి పొన్నం ప్రభాకర్

**కరీంనగర్ రూరల్, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ప్రమాదాల నివారణకు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నామని, నూతన స్క్రాప్ పాలసీ, ఎలక్ట్రిక్ వెహికల్ విధానం, ట్రాఫిక్ అవగాహన పార్కుల నిర్మాణం వంటివి ఇందులో భాగమని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఆదివారం తిమ్మాపూర్‌లోని రవాణా శాఖ కార్యాలయ ప్రాంగణంలో జువ్వాడి చొక్కారావు ట్రాఫిక్ అవగాహన పార్కును మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు. ఇక్కడ రూ. 8 కోట్లతో నిర్మించనున్న ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని రవాణా కార్యాలయాల్లో ట్రాఫిక్ అవగాహన పార్కులను ఏర్పాటు చేయనున్నామని అన్నారు. ఈ పార్కుల వల్ల విద్యార్థులు ట్రాఫిక్ నియమాలపై అవగాహన పెంచుకొని భవిష్యత్తులో ప్రమాదాల బారిన పడకుండా ఉంటారని అన్నారు. ఏఐ టెక్నాలజీ ద్వారా వాహనాల ఫిట్నెస్ ను నిర్ధారించేందుకు గాను ఆటోమేటెడ్ టెస్టింగ్ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. మొట్టమొదటిగా కరీంనగర్ లోనే ఈ ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్ నిర్మాణానికి ప్రారంభోత్సవం జరిగిందని అన్నారు. నూతన స్క్రాప్ పాలసీ విధానం ద్వారా 15 సంవత్సరాలు దాటిన వాహనాల స్థానంలో కొత్త వాహనాలు కొనుగోలు చేస్తే రాయితీ ఇస్తామని తెలిపారు. కాలుష్య నివారణకు దేశంలోనే మొదటిసారిగా ఎలక్ట్రిక్ వెహికిల్ పాలసీని తీసుకొచ్చామని అన్నారు. ప్రజలను ప్రమాదాల నుండి రక్షించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అయినప్పటికీ ప్రజల్లోనూ ట్రాఫిక్ రూల్స్ పట్ల అవగాహన ఉండాలని, అందరూ నిబంధనలను పాటించాలని, తద్వారా ప్రమాదాల నివారించవచ్చని అన్నారు. మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ తిమ్మాపూర్ లోని ట్రాఫిక్ పార్క్ విద్యార్థులందరూ సందర్శించి రోడ్డు భద్రత నియమాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. ప్రతి పాఠశాల విద్యార్థి ఈ పార్కును సందర్శించేలా చూడాలని అధికారులను ఆదేశించారు. తెలంగాణలో ప్రమాదాల నివారణకు ప్రభుత్వం అనేక రోడ్డు భద్రతాచర్యలను తీసుకుంటున్నదని గుర్తుచేశారు.



ఆదివారం తిమ్మాపూర్‌లోని రవాణా శాఖ కార్యాలయంలో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

# వ్యవస్థీకృత అణిచివేతపై పోరాటం చేయాలి

## కేరళలో దళిత ప్రగతి సదస్సులో మంత్రి సీతక్క

**హైదరాబాద్, మార్చి 23 ,ప్రభాతవార్త :** దళితుల హక్కుల కోసం మాట్లాడుతున్న ఈ సమయంలో, మన పోరాటాలు సమానత్వం, సామాజిక న్యాయం మాత్రమే ఉండకూడదని, సమాజం లోతుగా చొచ్చుకొని ఉన్న వ్యవస్థీకృత అణచివేత పైన పోరాడాల్సిన సమయం వచ్చిందని పంచాయితీరాజ్‌శాఖ మంత్రి సీతక్క అన్నారు. ఆదివారం కేరళ రాజధాని తిరువంతపురంలో ప్రారంభమైన దళిత ప్రగతి సదస్సులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లా డుతూ..ఒక ఆదివాసి మహిళాగా అణగారిన వర్గాలు ఎదుర్కొనే కష్టాలు, అన్యాయాల్ని ప్రత్యక్షంగా ఎదుర్కొన్నాను అన్నారు.

నేను, ఈ రోజు మీ ముందు అధికారానికి ఉదాహరణగా నిలబడ్డాను అన్న సీతక్క మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలవడమే కాదు, పంచాయితీ రాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా స్త్రీ సంక్షేమం మంత్రి గా ఉన్నట్లు పేర్కొన్నారు. ఈ ప్రయాణంలో ఎన్నో సవాళ్లను ఎదుర్కొన్నట్లు తెలిపారు. మనం సాధించిన విజయాల్ని సంబరంగా చేసుకోవలసిన అవసరం కూడా ఉందని, ఆ విజయాలు ఎంత చిన్నవి అయినా సంబరంగా జరుపుకోవాలి, ఎందుకంటే అమరుల త్యాగాల్ని, వారు సాధించిన విజయాల్ని స్మరించాల్సిన అవసరం ఉందన్నారు. అయ్యంగర్ పోరాటం మొదలు నంగేలీ వరకు ఎన్నో పోరాటాలు చేశారు. వారు భావి తరాల బాగు కోసం పని చేశారని మంత్రి సీతక్క ఈ సంద ర్భంగా గుర్తు చేశారు దేశ దళిత ఆది వాసులుగా, మనకి ఒక గొప్ప ప్రతిఘటన, విప్లవ చరిత్ర ఉందని, బ్రిటిష్ మొదలు ఈ రోజు కి మార్పు కోసం చేస్తున్న అస్తిత్వ ఉద్యమాలు అందులో భాగమే అన్నారు. చరిత్ర నుండి మనం స్ఫూర్తి పొంది, సమసమాజం కోసం పోరాడాల్సిన అవసరం ఉందనే అభిప్రాయాన్ని ఆమె వ్యక్తం చేశారు.

# డీలిమిటేషన్‌తో తీవ్రంగా నష్టపోయే అవకాశం

## ప్రభుత్వ సలహాదారు కె కేశవరావు వ్యాఖ్య

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, మార్చి 23:** కేంద్ర ప్రభుత్వం నూతనంగా తీసుకువస్తున్న డీలిమి టేషన్ విధానంపై కాంగ్రెస్ సీనియర్ నేత, ప్రభుత్వ సలహాదారు కె.కేశవ రావు కీలక వ్యాఖ్యలు చేశారు.



ఆదివారం ఆయన తన మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కేకే మాట్లాడుతూ డీలిమిటేషన్ విధానంపై అన్ని రాష్ట్రాలతో చర్చించాకే ముందుకు వెళ్లాలని సూచించారు. ఈ విధానం ద్వారా దక్షిణాదిలో రాష్ట్రాల భాగస్వామ్యం పెరగాలి గాని తగ్గ కూడదు అని ఆశించారు. పార్ల మెంట్ ఆమోదంతోనే చట్టం చేయాలి తప్ప,మొండిగా ముందుకు వెళ్లకూడదు అని పేర్కొన్నారు. ఇది సీట్ల గురించి పోరాటం కాదని, పార్ల మెంట్‌లో దక్షిణాది రాష్ట్రాలకు ప్రాధాన్యత ఉండాలన్నదే అభిప్రాయం అని తెలిపారు. ఈ అంశంపై దక్షిణాది నేతలు అంతా ఒక్కటి కావాలని... లేదంటే తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉందని కేశవరావు వెల్లడించారు. జనాభా ప్రకారం నియోజకవర్గాల పునర్విభజన చేయాలని కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తుండగా ఆదాయం ఎక్కువ, జనాభా తక్కువగా ఉన్న దక్షిణాది రాష్ట్రాలు ఈ విధానాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. పార్లమెంట్‌లో దక్షిణాది రాష్ట్రాల భాగస్వామ్యం ఇంకా పెరగాలని కేశవరావు ఆకాంక్షించారు.

# నాలుగు జిల్లాల్లోనూ క్యాంప్ ఆఫీసులు

## నిత్యం ఉపాధ్యాయులకు అందుబాటులో ఉంటా

## కరీంనగర్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ మల్క కొమురయ్య

**హైదరాబాద్, మార్చి 23, ప్రభాతవార్త:** ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా గెలిపించిన ఉపాధ్యాయులకు ధన్యవాదాలు తెలుపుతున్నానని.. నిత్యం ఉపాధ్యా యులకు అందుబాటులో ఉంటానని కరీంనగర్-మెదక్- నిజామాబాద్-ఆదిలాబాద్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ముల్క కొమరయ్య తెలిపారు. నాలుగు జిల్లాల్లోనూ క్యాంప్ ఆఫీసులను ఏర్పాటు చేసి.. నిత్యం అందుబాటులో ఉంటానని తెలిపారు. నిత్యం అందుబాటులో ఉంటూ.. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కా రానికి కృషి చేస్తానని తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో మల్క కొమరయ్యకు మద్దతు తెలిపిన టీచర్ల సంఘాలు ఆదివారం ఆత్మీయ సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించాయి. ఈ సందర్భంగా మల్క కొమరయ్య మాట్లాడుతూ.. ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న టీచర్ల సమస్యలను ఫైనాన్షియల్, నాన్ ఫైనాన్షియల్ కేటగిరిల కింద విభజించి వాటికి పరిష్కార మార్గాలు అన్వేషించాల్సిన అవసరం ఉందన్నారు. వాటిపై నివేదికను ప్రభుత్వానికి అందజేసి ఒక్కొక్కటిగా సమస్యలను పరిష్కరించడానికి ప్రయత్నిస్తానని తెలిపారు. టీచర్ల సమస్యలపై ప్రభుత్వానికి ఒక డెడ్ లైన్ ఇచ్చి, అప్పటిలోగా ప్రభుత్వం నుంచి స్పందన లేకుంటే వివిధ మార్గాల్లో ఉద్యమం, పోరాటాలు, ఆందోళనలు చేపడుదామన్నారు. ఎమ్మెల్సీగా తనకు టీచర్లు అందించిన గెలుపు మరింత బాధ్యతను పెంచిందన్నారు. ప్రమాణ స్వీకారం తర్వాత కరీంనగర్, మంచిర్యాల, నిజామాబాద్, హైదరాబాద్‌లో నాలుగు ఆఫీసులు ప్రారంభించి టీచర్ల సమస్యలపై స్పందిస్తానని, ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్తానని కొమరయ్య తెలిపారు. 317 జీవో రద్దు కోసం కేంద్ర మంత్రి బండి సంజయ్, తపస్ చేసిన పోరాటం టీచర్లను ఆలోచింపజేసిందని మల్క కొమరయ్య అన్నారు.

# త్వరలో ఎఐసిసి ఆధ్వర్యంలో పాదయాత్రలు

## పార్టీలో కష్టపడిన వారికి ప్రత్యేక గుర్తింపు

## పిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్

## జైబాపు, జైభీమ్, జైసంవిధాన్ అభియాన్ సన్నాహక సమావేశం

## పాల్గొన్న ప్రజాప్రతినిధులు, ముఖ్యనేతలు



సమావేశంలో మాట్లాడుతున్న పిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్

**హైదరాబాద్(అత్తాపూర్), మార్చి 23, ప్రభాతవార్త:** రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మన అందరిపై ఉందని, బిజెపి ప్రభుత్వం రాజ్యాంగ సవరణ పేరుతో రాజ్యాంగాన్ని అంతం చేసే కుట్ర చేస్తుందని, రాజ్యాంగం కోసం ఎంతవరకైనా పోరాటం చేస్తామని పిసిసి అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్‌గౌడ్ పేర్కొన్నారు. ఆదివారం రాజేంద్ర నగర్ పరిధిలోని ఆరంఘర్‌లో టియుఎఫ్‌ఐడిసి చైర్మన్, డిసిసి అధ్యక్షుడు రంగారెడ్డి జిల్లా చల్లా నరసింహారెడ్డి ఆధ్వర్యంలో జైబాపు జైభీమ్, జైసంవిధాన్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అతిథులుగా పిసిసి అధ్యక్షుడు బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఏఐసీసీ ఆదేశాల మేరకు రంగారెడ్డి జిల్లాలో జైబాపు జైభీమ్, జైసమవిధాన్ అభియాన్ సనాక సమేశాన్ని పెద్దఎత్తున నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం దేశంలో అంబేద్కర్ ను అడుగడుగునా అవమాన పరుస్తూ రాజ్యాంగానికి కించపరచిన అమిషాను వెంటనే బర్తరఫ్ చేయాలని పలుమార్లు డిమాండ్ కేంద్ర ప్రభుత్వం పెడ చెవిన పెడుతుందని పేర్కొన్నారు. కొత్త సవరణల పేరుతో బిజెపి రాజ్యాంగాన్ని తీసుకు రావడానికి మోడీ ప్రయత్నిస్తున్నారని రాజ్యాం గాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత కాంగ్రెస్‌పై ఉందని రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవడానికి ఏఐసీసీ పెద్దఎత్తున పాద యాత్రలు చేపట్ట బోతుంద న్నారు. బిజెపి ప్రభుత్వం దక్షిణాది రాష్ట్రాలపై చిన్నచూపు చూస్తుందని తీ చెన్నైలో జరి గిన డిలిమిటేషన్ ఈ కార్యక్రమంలో తెలంగాణకు అన్యాయం ఊరుకునే ప్రసక్తే లేదని తేల్చి చెప్పడం జరిగిందన్నారు. డీలిమిటేషన్ పేరుతో రాష్ట్రంలో ఎంపీ సీట్లను తగ్గించడానికి ప్రయత్నం చేస్తే తగిన గుణపాఠం చెప్తామని రాష్ట్ర హక్కుల పరిరక్షణ ఏ పోరాటమైన చేయడానికి సిద్ధమని హెచ్చరించారు. డీలిమిటేషన్‌కు తాము వ్యతిరేకమని పేర్కొ న్నారు. రాష్ట్రానికి ఎలాంటి నష్టం జరగకుండా చర్యలు తీసుకుంటున్నామని త్వరలోనే నగరంలో బిజెపి విధానాలకు వ్యతిరేకంగా భారీ బహిరంగ సభ నిర్వహించబోతున్నామని తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు కష్టపడి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని వారికి పార్టీ అన్ని విధాలుగా అండగా ఉంటుందని పేర్కొన్నారు. కష్టపడిన వారికి కాస్త ఆలస్యమైన తగిన గుర్తింపు లభిస్తుందన్నారు. ఎవరు కూడా ఆధార్యపడవద్దని అండగా ఉంటామని భరోసా కల్పించారు. త్వరలోనే రంగారెడ్డి జిల్లాకు మంత్రిని నియమిస్తామని రంగారెడ్డి జిల్లా పై ప్రత్యేక దృష్టి పెడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ఇంత పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేసినందుకు ధన్య వాదాలు తెలిపారు. రాబోయే ఎన్నికల్లో గ్రామ, మున్సిపల్ స్థాయిలో కష్టపడి తమ సత్తా ఏంటో చూపించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా మాజీ జడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు సానం శ్రీనివాస్‌గౌడ్, నాయకులు ధనం జయ్, రంగారెడ్డి జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్య క్షులు నాగేందర్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు, మున్సిపల్ చైర్మన్‌లు, ప్రెసిడెంట్‌లు, తదితరులు పాల్గొన్నారు.




ఫ్లెక్సీని ఆవిష్కరించి మాట్లాడుతున్న మాజీమంత్రి హరీశ్‌రావు

# ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్స్ నిర్వాహకులపై సర్కారు కఠినంగా వ్యవహరించాలి

## పిడి యాక్టు పెట్టి అరెస్టు చేయాలి: మాజీమంత్రి హరీశ్‌రావు

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:** ఆన్‌లైన్ బెట్టింగ్స్‌కు బానిసలై ఎంతోమంది యువ త ప్రాణాలు కోల్పోతున్నారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్ నిషేధించాలని బిఆర్‌ఎస్ పార్టీ యువజన విభాగం ఆధ్వ ర్యంలో అవగాహన కల్పిస్తూ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని ఆవిష్కరించి ఆదివారం సిద్దిపేట జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో మాట్లాడారు. గతంలోనే కెసిఆర్ రాష్ట్రంలో ఆన్‌లైన్ బెట్టింగ్స్‌ను నిషేధించారని తెలిపారు. కాంగ్రెస్ సర్కారు పట్టించుకోకపోవడంతో ఎంతో మంది యువత, విద్యార్థులు, ఉద్యోగస్తులు బెట్టింగ్ యాప్స్ బారినపడి చివరికి ప్రాణాలు కోల్పోతున్నారని తెలిపారు. ఆన్‌లైన్ బెట్టింగ్‌కు యువత దూరంగా ఉండాలని బానిసలై విలువైన జీవితాలను బలి చేసుకొవద్దన్నారు. ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్స్ నిర్వహించే వారి పట్ల ప్రభుత్వం కఠినంగా వ్యవహారించాలన్నారు. పీడీ యాక్టు పెట్టి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బిఆర్‌ఎస్ యువజన విభాగం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

**ఇది రైతు వ్యతిరేక ప్రభుత్వం : హరీశ్‌రావు**

కాంగ్రెస్ ప్రభుత్వం రైతు వ్యతిరేక ప్రభుత్వామని మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. ఆదివారం సిద్దిపేట జిల్లా చిన్నకోడూరులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కెసిఆర్ హయాంలో రైతు పండించిన ప్రతి పంటను పూర్తి స్థాయిలో మద్దతు ధరకు కొనుగోలు చేసి రైతు లను కంటికి రెప్పాల కాపాడున్న ప్రభుత్వం బిఆర్‌ఎస్ ప్రభుత్వామన్నారు. రైతులు పండించిన ప్రతి పంటను ప్రభుత్వం పూర్తిస్థాయిలో కొనుగోలు చేసి మద్దతు ధర చెల్లించాలన్నారు. పొద్దు తిరుగుడు పంటను మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేసి మద్దతు ధర చెల్లించాలన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు కాముని శ్రీనివాస్, రాధా కృష్ణశర్మ, ఉమేష్‌చంద్ర తదితరులు పాల్గొన్నారు.

# హైదరాబాద్‌లో పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్ల జాతీయ సదస్సు

## సాంకేతికతో పారదర్శకతను పెంపొందించుకోవచ్చు

## నేషనల్ వర్క్‌షాపులో టిజిపిఎస్‌సి ఛైర్మన్ బుర్రా వెంకటేశం



**హైదరాబాద్, మార్చి 23, ప్రభాతవార్త:** రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో ఈ యేడాది డిసెంబర్‌లో .. పబ్లిక్ సర్వీస్ కమిషన్(పిఎస్‌సి) చైర్మన్ల జాతీయ స్థాయి సదస్సును నిర్వహించ నున్నట్టు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్ బుర్రా వెంకటేశం తెలిపారు. కేరళలోని తిరువనంతపురంలో .. కేరళ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించిన నేషనల్ వర్క్ షాప్ ఆన్ టెక్నాలజీలో ఆయన పాల్గొ న్నారు. ఛైర్మన్‌తో పాటు కమిషన్ సభ్యులు ప్రొఫెసర్ ఎన్.యాద య్య, పాల్వాయి రజినీకుమారి కూడా పాల్గొన్నారు. పబ్లిక్ సర్వీస్ కమిషన్‌లు నిర్వహించే రిక్రూట్ మెంట్‌లలో సామర్థ్యం, పారదర్శకత, విశ్వసనీయతను పెంచ డంలో సాంకేతికత (టెక్నాలజీ) పాత్ర ముఖ్యమైందన్నారు. నియామక ప్రక్రియలలో అధునాతన సాంకేతిక పరిష్కా రాలను ఉపయోగించుకోవాలని సూచిం చారు. కంప్యూటర్ ఆధారిత పరీక్ష (సిబిటి) లను నిర్వహించే క్రమంలో ఎటువంటి సమస్యలు రాకుండా నిరోధించడానికి బయోమెట్రిక్ హాజరును ప్రామాణీకంగా తీసుకోవాలన్నారు. ప్రాసెసింగ్ వేగవంతంగా సాగడానికి ఆఫీస్ ఆటోమేషన్, డిజిటల్ మూల్యాంకనాన్ని ఉపయోగించాలన్నారు. పబ్లిక్ సర్వీస్ కమిషన్‌లు నిర్వ హించే రిక్రూట మెంట్‌లలో తలెత్తే చట్టపరమైన సవాళ్లను సమర్థవంతంగా పరిష్క రించడానికి, నల్సార్ సహకారంతో టిజిపిఎస్‌సి జూన్ 2025లో హైదరాబాద్‌లో వర్క్‌షాప్‌ను నిర్వహిస్తున్నట్లు బుర్రా వెంకటేశం తెలిపారు.

ఈ వర్క్‌షాప్‌లో పిఎస్‌సిలు ఎదుర్కొంటున్న చట్టపరమైన కేసులతోపాటు ఇతర న్యాయపరమైన విషయాలపై నిపుణులు మార్గదర్శకత్వాన్ని అందించనుందన్నారు. దాంతోపాటు ఈ యేడాది డిసెంబర్‌లో హైద రాబాద్‌లో ప్రతిష్టాత్మకమైన 'రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్‌పర్సన్‌ల జాతీయ స్థాయి సమావేశం'ను నిర్వహిస్తున్నట్టు ప్రకటించారు.


# వెంకన్న దర్శనానికి సిఫార్సు లేఖల ఒప్పుకోలు అభినందనీయం: ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్

**హైదరాబాద్, మార్చి 23, ప్రభాతవార్త:** తిరుమల శ్రీవారి దర్శనానికి తెలంగాణ ప్రజాప్రతినిధుల సిఫారసు లేఖలను అనుమతించేందుకు చొరవ తీసుకున్న తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, సిఫారసు లేఖలను అనుమతిస్తున్న ఆంధ్రప్రదేశ్ సిఎం చంద్రబాబు నాయుడుకి ఎమ్మెల్సీ డాక్టర్ బల్మూర్ వెంకట్ ధన్యవాదములు తెలిపారు. టిటిడి చైర్మన్ బీఆర్ నాయుడుకి కూడా ప్రత్యేక ధన్యవాదములు తెలిపారు.

# ప్రముఖ గాంధేయవాది పసల కృష్ణభారతి కన్నుమూత

## దళిత విద్యార్థుల అభివృద్ధికి అవిరళ కృషి

**హైదరాబాద్ (ఎల్.బి.నగర్), మార్చి 23, ప్రభాతవార్త:** స్వతంత్ర సమరయోధుల కుటుంబానికి చెందిన పసల కృష్ణభారతి ఆదివారం తెల్లవారుజామున కన్ను మూశారు. ఎల్బీనగర్ నియోజకవర్గం కొత్తపేట డివిజన్ స్నేహపురి కాలనీలోని ఆమె నివాసంలో కన్నుమూశారు. ఆంధ్రప్రదేశ్ పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన ప్రముఖ స్వతంత్ర సమర యోధులు పసల కృష్ణమూర్తి అంజలక్ష్మి దంపతుల రెండోకుమార్తె కృష్ణ భారతి. జీవితాంతం గాంధేయవాదిగా ఉంటూ గాంధీజీ ప్రవ చించిన విలువలతోనే జీవించిన ఆమె పలు విద్యా సంస్థలకు నిధులు అందించడంతోపాటు దళితుల్లో విద్యావ్యాప్తికి కృషి చేశారు. గోశాలకు విరాళాలు సమ కూర్చారు. 2022 జూలైలో భీమవరంలో జరిగిన అల్లూరి సీతారామరాజు విగ్ర హావిష్కరణ కార్యక్రమంలో కృష్ణభారతిని ప్రధానమంత్రి నరేంద్రమోడీ సత్క రించడంతోపాటు ఆమెకు పాదాభివందనం చేసి ఆశీస్సులు పొందారు. కృష్ణభారతికి నలుగురు అన్నదమ్ములు, ముగ్గురు అక్కచెల్లెలు. బ్రిటిష్ ప్రభుత్వం పెట్టిన ఆంక్షలు ధిక్కరించి భీమవరం సబ్‌కలెక్టర్ కార్యాలయం పై జెండా ఎగరవేసిన ఘటనలో కృష్ణమూర్తి దంపతులకు 1932లో కఠిన కారాగారం విధించారు. జైలుశిక్ష విధించిన సమయంలో అంజలక్ష్మి ఆరు నెలల గర్భవతి అయినప్పటికీ బ్రిటిష్ ప్రభుత్వం కనికరించలేదు. శిక్ష అనుభవిస్తున్న సమ యంలోనే జైలులో కృష్ణభారతి జన్మించారు. జైలులో జన్మించిన ఆమెకు కృష్ణ భారతి అని తల్లిదండ్రులు పేరు పెట్టారు. పశ్చిమగోదావరి జిల్లాలో గాంధీజీ పర్యటన సమయంలో కృష్ణమూర్తి ఆయనకు వ్యక్తిగత కార్యదర్శిగా కూడా పని చేశారు. సక్రమంలో దళితులకు ఇళ్ల పట్టాలు ఇప్పించడంతోపాటు జీవితాంతం కుష్టు రోగులకు అభాగ్యులకు సేవచేస్తూ గాంధీ విలువలతో జీవించారు. కృష్ణభారతి మరణం పట్ల పలువురు సంతాపం ప్రకటించారు.



గతంలో జరిగిన ఓ కార్యక్రమంలో కృష్ణభారతికి పాదాభివందనం చేస్తున్న ప్రధాని మోడీ (ఫైల్) ఇన్‌సెట్- కృష్ణభారతి

## ఇంగ్లండ్ మహిళా జట్టు కెప్టెన్ గుడ్‌బై



**న్యూఢిల్లీ:** ఇంగ్లండ్ మహిళల జట్టు కెప్టెన్ హీథర్ నైట్ సంచలన నిర్ణయం తీసుకుంది. కెప్టెన్సీ నుంచి హీథర్ నైట్ తప్పుకుంది. ఈ విషయాన్ని ఇంగ్లండ్ వేల్స్ క్రికెట్ బోర్డు (ఈసీబీ) ధ్రువీకరించింది. ఇంగ్లండ్ మహిళల జట్టు కెప్టెన్సీలో అద్భుతమైన విజయాలను అందించిందిన హీథర్ నైట్ పదవి నుంచి వైదొలిగింది. 9 ఏళ్ల పాటు కెప్టెన్‌గా సేవలు అందించినందుకు థాంక్యూ నైట్ అని ఈ సందర్భంగా ఇంగ్లండ్ క్రికెట్ బోర్డు పేర్కొంది. కాగా 2016లో కెప్టెన్‌గా ఎంపికైన హీథర్ నైట్ 199 మ్యాచ్‌ల్లో ఇంగ్లండ్ ఉమెన్స్ టీమ్‌ను ముందుండి నడిపించింది. ఆమె సారథ్యంలోనే 2017 వన్డే ప్రపంచ కప్‌ను ఇంగ్లండ్ గెలుచుకుంది. అంతే కాకుండా ఇంగ్లండ్ జట్టును ఐసీసీ టోర్నమెంట్లలో ఫైనల్‌కు కూడా నైట్ చేర్చింది. ఆమె వరుసగా రికార్డు స్థాయిలో ఎనిమిది వన్డే సిరీస్‌లను ఇంగ్లండ్‌కు అందించింది. అయితే ఇటీవల కాలంలో మాత్రం నైట్ సారథ్యంలోని ఇంగ్లండ్ జట్టు దారుణ ప్రదర్శన కనబరిచింది. గత ఏడాది యూఏఈ వేదికగా జరిగిన టీ20 ప్రపంచ కప్‌లో గ్రూపు స్టేజిలోనే ఇంగ్లీష్ జట్టు ఇంటి ముఖం పట్టింది. ఆ తర్వాత యాషెస్ సిరీస్‌లో కూడా అదే తీరును ఇంగ్లండ్ జట్టు కనబరిచింది. ఈ క్రమంలోనే ఇంగ్లండ్ జట్టు పగ్గాల నుంచి ఆమె తప్పుకుంది. ఇక ఇంగ్లండ్ కొత్త కెప్టెన్‌గా నాట్ స్కీవర్ బ్రంట్ ఎంపికయ్యే ఛాన్స్ ఉంది.

## వరల్డ్ కప్ ఫైనల్‌కు ప్రణతి



**న్యూఢిల్లీ:** ఇంటర్నేషనల్ జిమ్నాస్టిక్ ఫెడరేషన్ (ఎఫ్ఐజీ) వరల్డ్ కప్ వాల్ట్ ఫైనల్‌కు ఇండియా జిమ్నాస్ట్ ప్రణతి నాయక్ అర్హత సాధించింది. తాజాగా జరిగిన వాల్ట్ క్వాలిఫికేషన్ రౌండ్‌లో ప్రణతి 13.317 పాయింట్లతో మూడో ప్లేస్‌లో నిలిచింది. అమెరికా జోడీ జైలా హంగ్ (13.783), క్లైరీ పీస్ (13.584) వరుసగా తొలి రెండు స్థానాల్లో నిలిచారు. క్వాలిఫికేషన్‌లో ప్రణతి బాగా రాణించింది. అనుకున్న ప్లాన్‌ను వ్యూహాత్మకంగా, సమర్థంగా అమలు చేసింది. ఫైనల్లో మెడల్ గెలిచే పట్టుదలతో ముందుకు దూసుకువెళుతోంది. కాగా పారిస్ ఒలింపిక్స్‌కు ముందు కైరోలో జరిగిన వరల్డ్ కప్ టోర్నమెంట్ విమెన్స్ వాల్ట్ ఈవెంట్‌లో ప్రణతి కాంస్యం మెడల్‌తో మెరిసింది. 2019లో ఉలెన్బార్, 2022 దోహా ఆసియా చాంపియన్‌షిప్‌లోనూ ఆమె కాంస్యాలు సాధించింది.

# విదేశీ లీగ్స్‌లో భారత్‌కు నో ఎంట్రీ




### రిటైర్ అయిన తరువాతే ఎన్‌ఒసి

### ఐపిఎల్‌లో ఇతర కంట్రీ ప్లేయర్లు

### క్రికెట్ బోర్డు నిబంధనలు అడ్డు

**న్యూఢిల్లీ:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)-2025, సీజను 18 ప్రారంభమై అప్పుడే మూడు మ్యాచ్‌లు పూర్తయ్యాయి. ఈ సీజన్‌లో 10 జట్లు పాల్గొంటుండగా వీటిల్లో వివిధ దేశాలకు చెందిన ప్లేయర్లు ఆడుతున్నారు. ఐపీఎల్‌లో ఆడేందుకు పలువురు విదేశీ ప్లేయర్లు క్యూ కడతారు. అయితే విదేశీ క్రికెట్ లీగ్ లలో భారత ప్లేయర్లు మాత్రం ఆడరు. దానికి ప్రధాన కారణం భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) నో అంటోంది. భారత క్రికెటర్లు విదేశీ క్రికెట్ లీగ్‌లలో ఆడకూడదని బీసీసీఐ స్పష్టమైన కొన్ని రూల్స్‌ను అమలు చేస్తోంది. ఐపీఎల్ లాగే వివిధ దేశాలు క్రికెట్ లీగ్ లను నిర్వహిస్తున్నాయి. వాటిలో బిగ్ బాష్ లీగ్ (బీబీఎల్), ది హండ్రెడ్, కరేబియన్ ప్రీమియర్ లీగ్ (సీపీఎల్), ఎస్ఏ 20 వంటి చాలా క్రికెట్ లీగ్స్ ఉన్నాయి. వీటిలో ఐపీఎల్ ఆడుతున్న భారత క్రికెటర్లు ఆడరు. ఎందుకంటే భారత క్రికెటర్లు విదేశీలీగ్‌లలో ఆడితే ఐపీఎల్‌ను చూసేవారు తగ్గిపోతారు. దీంతో ఐపీఎల్ బ్రాండ్ వాల్యూ కూడా పడిపోతుంది. ఫలితంగా బీసీసీఐకి నష్టాలు వస్తాయి. ఇలాంటి చాలా కారణాలను దృష్టిలో పెట్టుకుని బీసీసీఐ ఐపీఎల్ ఆడే భారత ప్లేయర్ల కోసం రూల్స్ తీసుకువచ్చింది. విదేశీ క్రికెట్ లీగ్ లలో భారత ప్లేయర్లు ఆడాలంటే బీసీసీఐ నుంచి విధిగా అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. అయితే, యాక్టివ్ ఇండియన్ క్రికెటర్లు అంటే అంటే, అంతర్జాతీయ లేదా దేశవాళీ క్రికెట్ ఆడుతున్నవారికి విదేశీ లీగ్ లలో ఆడేందుకు బీసీసీఐ నో అబ్యక్షన్ సర్టిఫికెట్ (ఎన్‌ఒసి) ఇవ్వదు. అయితే, భారత క్రికెటర్లు ఐపీఎల్, దేశవాళీ క్రికెట్, అంతర్జాతీయ క్రికెట్ నుండి రిటైర్ అయిన తర్వాత మాత్రమే ఇతర దేశాల క్రికెట్ లీగ్స్‌లో ఆడేందుకు అనుమతి ఉంటుంది. ఈ విధంగానే రోబిన్ ఊతప్ప రిటైర్మెంట్ తర్వాత ఇంటర్నేషనల్ లీగ్ టీ20 (ఐఎల్‌టీ20)లో ఆడాడు. సురేశ్ రైనా ఐపీఎల్ నుంచి రిటైర్మెంట్ తీసుకున్న తర్వాత అరబ్ ఎమిరేట్స్‌కు చెందిన అబుధాబి టీ10 లీగ్‌లో పాల్గొన్నాడు. అలాగే, దినేష్ కార్తీక్ గత సీజన్ తర్వాత ఐపీఎల్ కు రిటైర్మెంట్ ప్రకటించి సౌత్ ఆఫ్రికా ప్రీమియర్ టీ20 లీగ్ (ఎస్ఏ20 లీగ్)లో ఆడాడు. బీసీసీఐ ఇలా ఇతర లీగ్ లలో భారత ప్లేయర్లను ఆడకుండా రూల్ పెట్టడం వెనుక ఐపీఎల్ ప్రత్యేకతను కాపాడే ఉద్దేశం ఉంది. భారత ఆటగాళ్లు ఇతర లీగ్స్‌లో ఆడితే ఐపీఎల్ ప్రత్యేకత తగ్గిపోతుంది. భారత ఆటగాళ్లు కేవలం ఐపీఎల్‌లో మాత్రమే ఆడితే ఆర్థికంగా ఐపీఎల్ విలువ పెరుగుతుంది. అలాగే, టీమిండియా ప్లేయర్లు ఇప్పటికే బిజీ షెడ్యూల్ గడుపుతున్నారు. కొత్త లీగ్స్‌లో ఆడితే గాయాల ప్రమాదం ఎక్కువ అవుతుంది. అందుకే బీసీసీఐ ఇతర లీగ్ లను ఆడేందుకు భారత ఆటగాళ్లను అనుమతించదు.



### జాతీయ మహిళల చాలెంజర్ ట్రోఫీ..

# నాలుగు జట్లు ఖరారు

### కెప్టెన్లుగా మిన్ను, హర్లీన్, జెమీమా, స్నేహ్

### తెలంగాణ అల్ రౌండర్ త్రిషకు చోటు

### 25 నుండి ఏప్రిల్ 8 వరకూ టోర్నీ

**న్యూఢిల్లీ:** జాతీయ సీనియర్ మహిళల చాలెంజర్ ట్రోఫీ-2025 కోసం జట్ల ఎంపిక ఖరారైంది. ఈ మేరకు భారత క్రికెట్ నియంత్రణ మండలి (బిసిసిఐ) జట్లను ప్రకటించింది. డెహ్రాడూన్ వేదికగా ఈ నెల 25 నుంచి ఏప్రిల్ 8 వరకు ఈ టోర్నీ నిర్వహించనున్నారు. మూడు రోజుల ఫార్మాట్‌లో ఈ మ్యాచ్‌లను నిర్వహిస్తుండగా, ఇందులో 4 జట్లు పాల్గొంటున్నాయి. స్టార్ ప్లేయర్లు హర్మన్‌ప్రీత్ కౌర్, స్మృతి మంధాన ఈ టోర్నీనికి దూరం కాగా, యంగ్ ప్లేయర్లకు అవకాశం దక్కింది. ఈ సీనియర్ మహిళల మల్టీ డే చాలెంజర్ ట్రోఫీ కోసం మహిళల సెలెక్షన్ కమిటీ 4 జట్లను ఎంపిక చేసింది. ఎర్రబంతితో జరగనున్న ఈ టోర్నీని డెహ్రాడూన్‌లోని రెండు వేదికల్లో నిర్వహిస్తోంది. మిన్ను మణి, హర్లీన్ డియోల్, జెమీమా రోడ్రిగ్స్, స్నేహ్ రాణా నాలుగు జట్లకు సారథ్యం వహించ నున్నారు. అలాగే భారత మహిళల అండర్-19 జట్టుకు రెండో సారి ప్రపంచ కప్ అందించడంలో కీలక పాత్ర పోషించిన తెలంగాణ ఆల్‌రౌండర్ గొంగడి త్రిషకు టీమ్ డిలో చోటు దక్కింది. ఖరారైన జట్లలో టీమ్ ఎలో మిన్ను మణి (కెప్టెన్), రిచా ఘోష్, శిప్రా గిరి, సుభ సతీశ్, శ్వేతా షెహ్రావత్, వృందా దినేశ్, ముక్తా మగ్రే, హెన్రిట్టా పెరీరా, తనూజ కన్వర్, వాసవి పావని, ప్రియా మిశ్రా, అరుం ధతి, సయాలీ సత్‌ఘరే, అనాడీ తగ్డే, ప్రగతి సింగ్‌లు ఉన్నారు. అలాగే టీమ్ బి లో హర్లీన్ డియోల్ (కెప్టెన్), యస్తిక భాటియా, మమత, ప్రతీక రావల్, ఆయుశ్ సోని, ఆరుశీ గోయల్, కనిక అహూజ, మితా పాల్, శ్రీ చరణి, మమత పాస్వాన్, ప్రేమ రావత్, నందిని శర్మ, క్రాంతిగౌడ్, అక్షర, టిటాస్ సాధు, టీమ్ సి లో జెమీమా రోడ్రిగ్స్ (కెప్టెన్), ఉమా ఛెత్రి, రియా చౌదరి, షఫాలీ వర్మ, త్రిప్తి సింగ్, తనుశ్రీ సర్కార్, తేజల్ హసబ్నిస్, సుశ్రీ దివ్యదర్శిని, సుచి ఉపాధ్యాయ, రాజేశ్వరి గైక్వాడ్, శరణ్య గద్వాల్, జోషిత, శబ్నమ్, సైమా ఠాకూర్, గరిమా యాదవ్, టీమ్ డి లో స్నేహ్ రాణా (కెప్టెన్), నందిని కశ్యప్, శివంగి యాదవ్, గొంగడి త్రిష, జిన్సీ జార్జ్, రాఘవి, ధార గుజ్జర్, సంస్కృతి గుప్తా, యమున రాణా, వైష్ణవి శర్మ, కీర్తన, అమన్‌జ్యోత్ కౌర్, కాశ్వీ గౌతమ్, మనాలీ దక్షి ణి, మోనిక పటేల్‌ను ఎంపిక చేసింది.

# ఐపిఎల్‌లో సన్‌రైజర్స్ ఘన విజయం

### ఊచకోతతో బద్దలైన పవర్ ప్లే రికార్డు

### పోరాడి 44 పరుగుల తేడాతో ఓడిన రాజస్థాన్



**న్యూఢిల్లీ:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 18వ సీజనులో రెండో రోజు రాజస్థాన్ రాయల్స్‌పై సన్ రైజర్స్ హైదరాబాద్ 44 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. ఉప్పల్ వేదికగా ఆదివారం జరిగిన ఈ మ్యాచ్‌లో రాజస్థాన్ రాయల్స్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 241 పరుగులు చేయగా, తొలుత బ్యాటింగ్ చేసిన సన్ రైజర్స్ హైదరాబాద్ 6 వికెట్ల నష్టానికి 286 పరుగులు చేసింది. ఇక ఈ మ్యాచ్‌లో సన్ రైజర్స్ దుమ్ము దులిపేసింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన సన్ రైజర్స్ ఆకాశమే హద్దుగా చెలరేగింది. సన్ రైజర్స్ బ్యాటర్లు బౌండరీల వర్షం కురిపించారు. సన్ రైజర్స్ 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 286 పరుగుల భారీ స్కోర్ చేసింది. ఇషాన్ కిషన్ (106 పరుగులు 41బంతుల్లో 11 ఫోర్లు,6 సిక్స్‌లు) సెంచరీతో చెలరేగగా, ట్రావిస్ హెడ్ (67) హాఫ్ సెంచరీతో అదరగొట్టాడు. చివర్లో హెన్రీచ్ క్లాసెన్ (34) మెరిపించాడు. రాజస్థాన్ బౌలర్లలో దేశ్ పాండే 3, తీక్షణ 2, సందీప్ శర్మ 1 వికెట్ పడగొట్టారు. సన్ రైజర్స్ బ్యాటర్ల బీభత్సానికి ప్రేక్షకులు బౌండరీల వర్షంలో తడిసి ముద్దయ్యారు. ట్రావిస్ హెడ్ (67), అభిషేక్ శర్మ (24) శుభారంభం ఇచ్చారు. 3 ఓవర్లలోకు స్కోర్ 45 పరుగులు వచ్చాయి. అయితే 3.1 ఓవర్ వద్ద తీక్షణ బౌలింగ్‌లో అభిషేక్ (24 పరుగులు, 11 బంతుల్లో) క్యాచౌట్ అయ్యాడు. వన్ డౌన్‌లో వచ్చిన ఇషాన్‌తో కలిసి స్కోర్ బోర్డును జెట్ స్పీడ్‌తో పరుగులు పెట్టించాడు. పవర్ ప్లే ముగిసేసరికి స్కోర్ 94/1కి చేరింది. ఈ క్రమంలోనే ఈ జంట 19 బంతుల్లోనే 50 పరుగులు భాగస్వామ్యం పూర్తి చేసింది. ఎడాపెడా బౌండరీలు బాదుతూ బౌలర్లను బెంబేలెత్తించారు. హెడ్ 21 బంతుల్లోనే హాఫ్ సెంచరీ పూర్తి చేశాడు. తర్వాత హెడ్ ఔటైనా ఇషాన్ మాత్రం ఎక్కడా తగ్గలేదు. నితీశ్ రెడ్డి (30 పరుగులు)తో కలిసి ఎడాపెడా బౌండరీలు బాదుతూ స్కోర్ బోర్డును పరుగులు పెట్టించాడు. తీక్షణ బౌలింగ్‌లో నితీశ్ ఔటయ్యాక, క్లాసెన్ (34) మెరుపులు మెరిపించాడు. ఈ ఇద్దరిలో ఒక్కరు క్రీజులో ఉన్నా జట్టు స్కోర్ 300 దాటేదే! చివర్లో ఇషాన్ సెంచరీ మార్క్ అందుకున్నాడు. ఐపీఎల్‌లో అతడికి ఇదే తొలి శతకం కావడం విశేషం. ఫలితంగా 6 వికెట్లు కోల్పోయి 286 పరుగులు చేసింది. ఈ లక్ష్య ఛేదనలో బ్యాటింగ్‌కు దిగిన రాజస్థాన్ పోరాడి ఓడింది. 20 ఓవర్లలో 242/6 పరుగులు మాత్రమే చేయగలిగింది. రాజస్థాన్ రాయల్స్ బ్యాటర్లలో యశస్వి జైస్వాల్ 1, సంజూ శాంసన్ 66, రియాన్ పరాగ్ 4, నితీశ్ రాణా 11, ధ్రువ్ జురెల్ 70, షిమ్రాన్ హెట్మెయర్ 42 పరుగులు, శుభం దుబే 34 పరుగులు తీశారు.

# దలాల్ స్ట్రీట్‌కు ఐపిఒల వెల్లువ..

**ముంబై, మార్చి 23:** దలాల్ స్ట్రీట్‌లో ఐపిఒల సందడి మళ్లీ మొదలైంది. ఈవారంలో ఏకంగా 4 కంపెనీలు పబ్లిక్ ఇష్యూకి రానున్నాయి. అయితే ఈ అన్ని సంస్థలు ఎస్ఎంఇ విభాగం నుంచే రావడం విశేషం. ప్రధాన బోర్డు నుంచి ఒక్కటంటే ఒక్కటి కూడా ఐపిఒ లేదు. దీంతో పాటు ఇప్పటికే మార్కెట్ నుంచి నిధులు సమీకరణ పూర్తి చేసుకున్న ఐదు సంస్థలు, స్టాక్ మార్కెట్లో లిస్ట్ కానున్నాయి. శ్రీ అహింస నేచరల్స్ పబ్లిక్ ఇష్యూ మార్చి 25న ప్రారంభమై 27తో ముగుస్తుంది. మొత్తం రూ.73.81 కోట్లు సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకుంది.




ఐపిఒలో భాగంగా 42.04 లక్షల తాజా షేర్లు జారీ చేయనున్నారు. 19.99 లక్షల షేర్లను ఆఫర్ ఫర్ సేల్ ద్వారా విక్రయించనున్నారు. ఏప్రిల్ 1న దలాల్ స్ట్రీట్‌లో లిస్ట్‌కానుంది. సమీకరించిన నిధుల్ని వ్యాపార విస్తరణకు ఉపయోగించనుంది. గ్రీన్ కాఫీ బీన్స్, గ్రీన్ టీ వంటి ఉత్పత్తులను దేశీయ, అంతర్జాతీయ మార్కెట్లకు సరఫరా చేస్తుందీ కంపెనీ. ఎస్ఎంఇ విభాగం నుంచి వస్తున్న మరో కంపెనీ ఎటిసి ఎనర్జీ సిస్టమ్. పబ్లిక్ ఇష్యూ ద్వారా రూ.63.76 కోట్లు సమీకరించనుంది. 43.24 లక్షల తాజా షేర్లు, ఆఫర్ ఫర్ సేల్ ద్వారా 10.80 లక్షల షేర్లు జారీ చేయ నుంది. సబ్‌స్క్రిప్షన్ మార్చి 25న ప్రారంభమైన 27తో ముగుస్తుంది. ధరల శ్రేణిని రూ.112-118గా కంపెనీ ప్రకటించింది. ఇంధన రంగం లోని ప్రముఖ కంపెనీలలో ఒకటైన ఎటిసి ఎనర్జీస్ సిస్టమ్, లిథియం-అయాన్ బ్యాటరీలను ఉత్పత్తి చేస్తోంది. ఎస్ఎంఇ విభాగం నుంచి డెస్కో ఇన్ఫ్రాటెక్ లిమిటెడ్ ఐపిఒకు వస్తోంది. సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్, రెన్యూవబుల్ ఎనర్జీ, వాటర్‌అండ్ పవర్ వంటి వివిధ రంగాలలో ఇంజినీరింగ్, ప్లానింగ్, కన్‌స్ట్రక్షన్ వంటి సర్వీసులని అంది స్తోంది. సబ్‌స్క్రిప్షన్ మార్చి 24న ప్రారంభమవుతుంది. ఐపిఒ ద్వారా రూ.30.75 కోట్లు సమీకరిం చనుంది. ఈ ఇష్యూను తాజా షేర్ల జారీ ద్వారా నిర్వహిం చనున్నారు. ఇందులో భాగంగా 20.50 లక్షల తాజా వాటాలను జారీ చేయనున్నారు. ధరల శ్రేణి రూ.147-150గా కంపెనీ నిర్ణయించింది. దీని సబ్‌స్క్రిప్షన్ మార్చి 26తో ముగుస్తుంది. ఏప్రిల్ 1న షేర్లు స్టాక్ మార్కెట్లో లిస్ట్‌కానున్నాయి. రూ.16.63 కోట్లు సమీ కరించాలనే లక్ష్యంతో ఐడింటిక్స్ వెబ్ ఐపిఒకు వస్తోంది. ధరల శ్రేణి రూ.51-54గా కంపెనీ ప్రకటించింది. సబ్‌స్క్రిప్షన్ మార్చి 26న మొదలై 28తో ముగుస్తుంది. పబ్లిక్ ఇష్యూలో భాగంగా 30.80 లక్షల షేర్లు జారీ చేయ నుంది.

## యుపిఐతో చిరు వ్యాపారులకు మరిన్ని ప్రోత్సాహకాలు

**ముంబై, మార్చి 23:** వీధి చివర బడ్డీ కొట్టు నుంచి పెద్ద పెద్ద షాపింగ్ మాల్స్ వరకూ అంతా యూపీఐని వాడుతున్నారు. ప్రజలు కూడా ఆ విధంగా అప్ డేట్ అయ్యారు. దీనిని మరింత ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసు కుంటోంది. ముఖ్యంగా చిరు వ్యాపారులకు ఇబ్బందులు లేకుండా.. తక్కువ మొత్తాలలో లావాదేవీలు చేసే వారికి ప్రోత్సాహకాలను ఇవ్వాలని నిర్ణయించింది. రూ.2000కన్నా తక్కువ ఉండే యూపీఐ లావాదేవీలపై ఈ ప్రోత్సాహకాలు ఉంటాయని పేర్కొంది. అదే సమయంలో వినియోగదారులకు ఎలా ఫీజులు ఉండవని ప్రకటించింది. చిన్న వ్యాపారులే లక్ష్యంగా కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. వీరి వద్ద తక్కువ మొత్తాలలో జరిగే యూపీఐ లావాదేవీలను ప్రోత్స హించే ఉద్దేశం తో ప్రోత్సా హకాలను ప్రకటించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో చిరు వ్యాపారులపై భారాన్ని తగ్గించే లక్ష్యం తో తక్కువ మొత్తంలో యూపీఐ లావాదేవీలు చేసే వారి కోసం రూ.1500కోట్లను కేటా యించింది. రూ.2,000 వరకూ పర్సన్ టు మర్చంట్(పీ2ఎం) యూపీఐ లావా దేవీలపై వీటిని అందించనుంది. అంటే ఒక్కో లావాదేవీకి 0.15శాతం చొప్పున చిరు వ్యాపారులు ప్రోత్సాహకం పొందుతారు. 2024 ఏప్రిల్ 1 నుంచి 2025 మార్చి మధ్య జరిగిన లావాదేవీలకు ఇది వర్తిస్తుంది. రూ.2,000 పైన జరిగిన లావాదేవీలకు ఈ పథకం వర్తించదు. నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ప్రకారం నెలకు రూ.50,000 కన్నా తక్కువ బిజినెస్ చేసే వ్యాపారులకు మాత్రమే ఈ పథకం వర్తిస్తుంది. అయితే చిరు వ్యాపారులు దీనిని కోసం క్లయిమ్ చేసుకోవాల్సి ఉంటుంది. బ్యాంకులు కూడా ఈ క్లెయిమ్‌లను ఎలాంటి అభ్యంతరాలు లేకుండా ఆమోదించాలని కేంద్రం సూచించింది. 80శాతం క్లెయిమ్‌లు ఎలాంటి అభ్యంతరాలు, షరతులు లేకుండా ఆమెదించాలని పేర్కొంది. కేంద్రం తీసుకున్న ఈ నిర్ణయం వల్ల చిరు వ్యాపారులకు మంచి ప్రయోజనం చేకూరు తుంది. అంతేకాక వారిని యూపీఐ వైపు ప్రోత్సహించినట్లు అవుతుంది. అదే సమయంలో సాధారణ పౌరులకు కూడా ఎలాంటి చార్జీలు లేకుండా సజావుగా చెల్లింపు చేయడానికి అవకాశం ఏర్పడు తుంది. ఎందుకంటే ఎండీఆర్ రేటు కూడా ఏం ఉండదని కేంద్రం ప్రకటించింది. 0




# వాణిజ్యం

## ఫండ్స్ ద్వారా రుణపరపతి

**ముంబై, మార్చి 23:** ఇటీవల కాలంలో మ్యూచువల్ ఫండ్లలో పెట్టుబడి పెట్టడం ద్వారా చాలా మంది అధిక రాబడిని ఆర్జిస్తున్నారు. అయితే మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడితో ఇతర ప్రయోజనాలు కూడా ఉన్నాయని నిపుణులు వివరిస్తున్నారు. పెట్టుబడిదారులు అనుకోని సందర్భంలో సొమ్ము అవసరం పడినప్పుడు ఎస్ఐపీను రీడీమ్ చేసుకుంటారు. అయితే మ్యూచువల్ ఫండ్స్ పెట్టుబడిదారులు వాటిని అమ్మకుండా తనఖా పెట్టడం ద్వారా రుణం పొందవచ్చని పేర్కొంటున్నారు. భారతీయ మ్యూచువల్ ఫండ్ యూనిట్లలో పెట్టుబడి పెట్టిన ఏ భారతీయ నివాసి అయినా మ్యూచువల్ ఫండ్‌పై రుణం పొందవచ్చు. మ్యూచువల్ ఫండ్లను తనఖా పెట్టి రుణం తీసుకోవడం సురక్షితమైనదిగా పరిగణిస్తారు. మ్యూచువల్ ఫండ్స్ తనఖా పెట్టి తీసుకునే రుణాలపై వడ్డీ రేట్లు ఇతర రుణ ఉత్పత్తుల కంటే చౌకగా ఉంటాయి. అయితే రుణం తీసుకునే ముందు మీ పెట్టుబడి లక్ష్యం, కాలపరిమితి ని అర్థం చేసుకోవాలని సూచిస్తున్నారు. అలాగే మీ ఆదాయం నుంచి ప్రతి నెలా ఈఎంఐ లేదా వడ్డీ మొత్తాన్ని చెల్లించగలరా? అనే విషయాన్ని పరిగణలోకి తీసుకోవాలని పేర్కొంటున్నారు. మీ మ్యూచువల్ ఫండ్ పెట్టుబడులు ఇప్పటివరకు ఎలా ఉన్నాయి? వంటి విషయాలను పాటు మీరు తీసుకునే రుణం మీ స్వల్ప లేదా మధ్యకాలిక ఆర్థిక అవసరాలను తీర్చడంలో సహాయపడుతుందా? అనే విషయాన్ని పరిశీలించాలని పేర్కొంటున్నారు. మ్యూచువల్ ఫండ్స్ ద్వారా రుణం తీసుకునే ముందు వడ్డీ రేటు, రుణ కాలపరిమితి, పునరుద్ధరణ ఎంపిక, షార్ట్‌ఫాల్ మార్జిన్ వంటి విషయాలను పరిశీలించాలని నిపుణులు చెబుతున్నారు. మ్యూచువల్ ఫండ్స్ ద్వారా తీసుకునే రుణాలపై వడ్డీ తక్కువగా ఉంటుంది. సాధారణంగా వ్యక్తిగత రుణాలపై వడ్డీరేటు 14 నుంచి 22 శాతం మధ్య ఉంటుంది. కానీ మ్యూచువల్ ఫండ్ల పేరుతో పొందిన




రుణాలపై వడ్డీ రేటు 10.5 శాతం నుంచి 12 శాతం వరకు ఉంటుంది. అయితే ఇలా తీసుకున్న రుణాన్ని ముందుగా చెల్లిస్తే ప్రీ క్లోజర్ జరిమానా ఉండదు. అలాగే కస్టమర్ డబ్బు అందుకున్న తర్వాత, అతను ఎప్పుడైనా రుణాన్ని తిరిగి చెల్లించవచ్చు. ఈ కాలంలో మ్యూచువల్ ఫండ్ యూనిట్ల విలువ పెరుగుతూనే ఉంటుంది. ఈ రుణాలు లోన్‌టువాల్యూ (ఎల్‌టీవీ) నిష్పత్తి ఆధారంగా ఇస్తారు. ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్ అయితే ఎన్ఏవీలో 50శాతం నుంచి 70శాతం వరకు రుణం పొందవచ్చు. డెట్ మ్యూచువల్ ఫండ్ అయితే ఎన్ఏవీలో 80శాతం వరకు రుణం పొందవచ్చు.

## బ్యాటరీలపైనే విద్యుత్ స్కూటర్ల లైఫ్


**న్యూఢిల్లీ, మార్చి 23:** సాధారణంగా 'ఇవి' స్కూటర్స్‌లో లిథియం అయాన్ బ్యాటరీలను ఎలక్ట్రిక్ స్కూటర్లలో ఉపయోగిస్తారు. ఇవి ఎక్కువగా 3 నుంచి 5 సంవత్సరాల వరకు ఉంటాయి. అయితే, బ్యాటరీ జీవితం అనేక అంశాలపై ఆధారపడి ఉంటుంది. ఎలక్ట్రిక్ స్కూటర్ బ్యాటరీలను ఛార్జింగ్ సైకిల్స్ ఆధారంగా కొలుస్తారు. మంచి నాణ్యత ఉన్న లిథియంఅయాన్ బ్యాటరీ 800 నుండి 1,500 ఛార్జింగ్ సైకిల్స్ వరకు ఉంటుంది. ఒక వ్యక్తి రోజూ 3040కి.మీ. స్కూటర్ నడిపి బ్యాటరీని సరిగ్గా ఛార్జ్ చేస్తే, అది



దాదాపు 45 సంవత్సరాలు పనిచేస్తుంది. పదే పదే పూర్తిగా ఛార్జ్ చేయడం, బ్యాటరీని సున్నా శాతానికి డిశ్చార్జ్ చేయడం వల్ల దాని జీవితకాలం తగ్గుతుంది. ఛార్జ్‌ను 20 శాతం నుంచి 80 శాతం మధ్య ఉంచడం ఎల్లప్పుడూ మంచిది. అలాగే అధిక వేడి లేదా చలి బ్యాటరీ పనితీరును ప్రభావితం చేస్తుంది. స్కూటర్‌పై అధిక లోడ్ పెట్టడం వల్ల బ్యాటరీ త్వరగా దెబ్బతింటుంది. తరచుగా వేగంగా స్కూటర్ నడపడం, ఆకస్మిక బ్రేకింగ్ బ్యాటరీపై అదనపు భారాన్ని మోపుతాయి. ఎలక్ట్రిక్ స్కూటర్ బ్యాటరీ వేగంగా డిశ్చార్జ్ కావడం ప్రారంభం కావడంతో ఛార్జ్ కావడానికి ఎక్కువ సమయం తీసుకుంటే, లేదా దాని పనితీరు తగ్గితే, అది బ్యాటరీని మార్చాల్సిన సమయం వచ్చిందని అర్థం చేసుకోవాలి.

## సియెట్ నుంచి కొత్త టైర్లు..

**ముంబై, మార్చి 23:** సాధారణంగా ఏ వాహన వేగమైన దాని ఇంజిన్‌తో పాటు వాహనానికి వాడిన టైర్లపై ఆధారపడి ఉంటుందన్న విషయం అందరికి తెలిసిందే. ఏ వాహనానికి అయినా టైర్లు అనేవి కీలక పాత్ర పోషిస్తాయి. అయితే సియట్ తాజాగా ఆవిష్క రించిన టైర్లు ఏకంగా గంటకు 300 కి.మీ.ల వేగాన్ని తట్టుకుని సామర్థ్యంతో ఉన్నాయి. భారత్‌లో దిగ్గజటైర్ల తయారీ సంస్థ సియట్ తాజాగా తమ స్పోర్ట్‌డ్రైవ్ శ్రేణిలో మూడు అధునాతన ఉత్పత్తులను ఆవిష్కరిం చింది. అల్ట్రాహై పెర్ఫార్మెన్స్, లగ్జరీ ఫోర్‌వీలర్ సెగ్మెంట్లో కంపెనీ తన స్థానాన్ని మరింత పటిష్టం చేసుకుంది. జర్మనీలోని అంతర్జాతీయ ఆటోమోటివ్ ప్లాంట్లలో ఎన్నో కఠినమైన పరీక్షలను నిర్వహించి అందుబాటులోకి తీసుకువచ్చింది కంపెనీ. రన్‌ఫ్లాట్ టైర్ల ఆవిష్కరణతో ప్రీమియం, టెక్నాలజీ ఆధారిత బ్రాండ్‌గా సియట్ తన స్థానాన్ని మరింత పటిష్టం చేసుకోనుంది. ఫోర్ వీలర్ టైర్ల సెగ్మెంట్లో మా అగ్రస్థానాన్ని నిలబెట్టుకునేలా రన్ ఫ్లాట్ టైర్లను ప్రవేశపెట్టిన తొలి భారతీయ కంపెనీగా నిలవడం గర్వకారణం అని సియట్ ఎండీ, సీఈవో అర్ణబ్ బెనర్జీ తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా లగ్జరీ వాహనాల యజమానులు కోరుకునే ప్రమాణాలతో టైర్లను అందించాలనే నిబద్ధతకు అనుగుణంగా రన్ ఫ్లాట్ టైర్లు, రేటెడ్ టైర్లతో స్పోర్ట్‌డ్రైవ్ సరికొత్త టైర్లను అందుబాటులోకి తీసుకు వచ్చామన్నారు. జర్మనీలోని ప్లాంట్‌లో అనేక పరీక్షలు జరిపిన తరువాతే మార్కెట్లోకి విడుదల చేస్తున్నామని సియట్ సీఎంవో లక్ష్మీ నారాయణన్ అన్నారు. సరికొత్త ప్రీమియం టైర్ల శ్రేణి ఏప్రిల్ నుంచి ఢిల్లీ ఎన్‌సీఆర్, ముంబై, కోల్‌కతా, పుణె, చండీగఢ్, ఉత్తర్ ప్రదేశ్, బెంగళూరు, తమిళనాడు, కోయంబత్తూరు, మధురై, కేరళ, హైదరాబాద్, గువాహటి, అహ్మదాబాద్ లాంటి కీలక మార్కెట్లలో అందుబాటులో ఉంటాయన్నారు. రన్‌ఫ్లాట్ టైర్ల ధర రూ.15,000 నుంచి రూ.20,000 వరకు ఉంటాయని, అలాగే, 21 అంగుళాల జెడ్‌ఆర్ రేటెడ్ అల్ట్రా హైపెర్ఫార్మెన్స్ సిఎఎల్‌జి టెక్నాలజీ టైర్ల ధర రూ.25,000 నుంచి రూ.30,000 వరకు ఉంటుంది.




Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., and printed at Sy No.658/A , NH-5, Ankireddy Palem, Guntur Dist-522005. Ph:2355939, 2512322(0863), 9848812526. RNI No. 64861/96 , Editor : *Damerla Sai Baba, Postal Licence/AP/Vj/GTR/57/08-10 *Responsible for selection of News under the PRBAct. Regd.: No.H/SD/337/12-14